ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల. 40. శ్రీ

నరేంద్రగుప్తుఁడు.

([illegible])

వాసుదేవరావుగారిచే
ఆంధ్రీకరింపఁబడినది.

[illegible]

[illegible] ౧౯౨౧

వేంకటపార్వతీశ్వరకవులు.

ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయము [illegible]

[illegible]

Printed by
K. Subbarayudu Brothers,
at Scape & Co.,
Cocanada.

ప్రధానపోషకులు.

మ. రా. శ్రీ [illegible] బ్రహ్మానందరావు పంతులుగారు, ప్రొప్రయిటరు, సుజనరంజనీ ముద్రాక్షరశాల, కాకినాడ.

శ్రీ రాజపోషకులు.

మ. రా. శ్రీ శ్రీమంతు శ్రీరాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దరు బి. ఏ. గారు, చల్లపల్లి రాజాగారు, చల్లపల్లి.

" శ్రీరాజా ఇనుగంటి వేంకట సూర్య ప్రకాశ రావుగారు, [illegible]

" శ్రీ [illegible] వేంకటరామ రాజాగారు, [illegible].

" శ్రీ కొవ్వూరి సూర్యనారాయణ రెడ్డిగారు, జమీందారు, కాకినాడ.

" శ్రీ శ్రీ చిన వేంకట రెడ్డిగారు, [illegible], కాకినాడ.

" శ్రీ కోనాల చిన వేంకట రెడ్డిగారు, [illegible]పల్లి.

" శ్రీ ముక్కాల సుబ్రహ్మణ్యముగారు, రంగూను.

" శ్రీ [illegible] సత్తెయ్యగారు, రంగూను.

" శ్రీ బత్తుల [illegible]య్యగారు, రాజమండ్రి.

" [illegible] సూర్యనారాయణరావు పంతులుగారు, ప్లీడరు, విశాఖపట్టణము.

" శ్రీ [illegible] వేంకన్నగారు, [illegible]

" శ్రీ [illegible] గారు, [illegible]

" శ్రీ [illegible] గారు,

[illegible]

రాజపోషకులు

మ. రా. శ్రీ శ్రీరాజా వత్సవాయి వేంకట సుభద్రయ్యమ్మ జగపతి బహద్దరు జమీందారిణీవారు, తుని.

పోషకులు

మ. రా. రా. శ్రీ దివాన్‌బహద్దరు కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తి నాయుడుగారు, కాకినాడ.

,, శ్రీ వాడ్రేవు వేంకటరత్నము పంతులుగారు, పిఠాపురము.

,, శ్రీ ద్వారంపూడి రామారెడ్డిగారు, అనపర్తి.

,, శ్రీ ద్రోణంరాజు వేంకటరమణారావు పంతులుగారు, కొయిఖాసాదారు. తణుకు.

శ్రీ సారంగు సోమసుందరరావు పంతులుగారు, బి, ఎ, ప్లీడరు, నరసాపురము.

,, శ్రీ మల్లెల శివరామకృష్ణయ్యగారు, ప్రొప్రయిటరు, రాయపూడి.

,, శ్రీ బందా సూర్యనారాయణ పంతులుగారు బి. ఏ. యల్. టి తణుకు.

,, శ్రీ పండ్రాజు వీర్రాజుగారు, కాకినాడ.

,, శ్రీ కొవ్వూరి వేంకటరెడ్డి సోదరులు, పిట్టలవేమవరం.

,, శ్రీ కర్రి పల్లారెడ్డిగారు, మూరుటేరు.

,, శ్రీ సేతల గంగిరెడ్డిసోదరులు, పెనుగొండ.

పోషకులు.

మ. రా. ౘ్ర దివాన్ బహద్దర్ పి. పరాంకుశంనాయుడుగారు,
రిటైర్డు స్పెషల్ పోలీసుకమీషనరువారు. చెన్నపురి.
,, శ్రీ అడ్జి వెంటయ్యగారు, నరసాపురం.
,, శ్రీ టి. యల్. నరసింహారావుగారు, మూరుటేరు.
,, శ్రీ రామదేవు ఆదినారాయణగారు, మూరుటేరు.
,, శ్రీ చిక్ల అమ్మిరెడ్డిగారు, రంగూన్.
,, శ్రీ పులగం వెంకన్నగారు, మూరుటేరు.

సహాయులు.

మ. రా. రా. శ్రీఉదయరాజా వేంకటరంగారావు పంతులుగారు, దేశ
ముఖ్ నర్ దేశపాండ్యా మతేవాడ, ఒరంగల్లు (దక్కన్)
,, శ్రీనేరెళ్ళ నరసింహారాములుగారు, కలపవర్తకులు,
ఒరంగల్లు, (దక్కన్)
,, శ్రీయాదగిరీశ అండు కంపెనీవారు, పుస్తకములవర్తకులు,
ఒరంగల్లు, (దక్కన్)
,, శ్రీగుండా పుల్లయ్యగారు, వర్తకులు, ఒరంగల్లు, (దక్కన్)
,, శ్రీద్వారంపూడి వేంకటరెడ్డిగారు, అనపర్తి.
,, శ్రీపాళ్యపు వేంకటాచలపండితులుగారు, ప్రొప్రయిటరు,
శ్రీ సీతారాఘవ వైద్యశాల, మైసూరు.
,, శ్రీపింజల సుబ్రహ్మణ్యంచెట్టిగారు, వర్తకులు, నె 91.
అన్నపిళ్ళేవీథి, జి. టి. మదరాసు.

నుండియు స్వధర్మమును నిర్వహించుకొనుచున్న యీగ్రంథనిలయమునకు సత్క్రియాఫలదాయకుఁ డగు సర్వేశ్వరుఁడు సుస్థిరం బగు సదాశ్రీయమును బ్రసాదించుఁగాక.

ఈగ్రంథనిలయమును గాకినాడనుండి యిక్కడకు మార్చుట కారణంబుగా నీగ్రంథమును సకాలమునకుఁ బ్రకటించి మా చందాదారుల కందింపఁజాలకపోయితిమి. కాని యింతటినుండి యిట్టి వ్యత్యాసములు గలుగకుండఁ గ్రమముగా గ్రంథప్రకటనము జరుగునట్టి యేర్పాటులను జేసికొని యున్నారము. ఈనవల విశేషించి చరిత్రాత్మకమైనది. దీని ప్రాశస్త్యముంగూర్చి యువతారికలో విపులముగాఁ జర్చింపఁబడినది. ఇది చాలఁ బెద్దదియగుటచే రెండు సంపుటములుగా విడఁదీసి యీ ప్రథమసంపుటము నిప్పుడు ప్రకటించితిమి. దీనివెనుకనే రెండుమాసములలో రెండవసంపుటమునుగూడ మా చందాదారులకుఁ బంపఁగలము. మాగ్రంథనిలయమందును మాయందును గలయభిమానముచే మాకీగ్రంథమును మహారాష్ట్రభాషనుండి యాంధ్రీకరించి సర్వస్వాతంత్ర్యములతో నొసంగిన మ. రా. రా. శ్రీ హసబ్నీసు వాసుదేవరావుగారికి మా కృతజ్ఞతాభివందనముల నర్పించుచున్నాము.

ఉదారహృదయులును భాషాపోషకులు నగు ప్రభువులును మా మహారాజ రాజపోషకులును, పోషకులును, సహాయులును, చందాదారులును, దేశభాషాభిమానులగు నాంధ్రమహాజనులెల్లరును మా భాషాసేవను మన్నించి యెల్లవిధముల మాకితోధిక సాహాయ్యప్రోత్సాహములం గూర్పవలయునని వేడుకొనుచున్నాము.

వేంకట పార్వతీశ్వరకవులు.

మకొనుచున్న యీగ్రంథనిలయ
సర్వేశ్వరుఁ డనుస్థిరం బగుసదా

డనుండి యిక్కడకు మార్పుల
మునకుఁ బ్రకటించి మాచందా
గాని యింతటినుండి యిట్టివ్యత్యా
గ్రంథప్రకటనము జరగునట్టి యే
ఈనవల విశేషించి చరిత్రాత్మక
వతారికలో విపులముగాఁ జర్చిం
ంచే రెండుసంపుటములుగా పిడఁ
ప్రకటించితిమి. దీనివెనుక చే
యనుకూడ మాచందాదారులకుఁ
కుకు మాయందును గలయభి
రాష్ట్రభాషనుండి యాంధ్రీకరిం
మ. రా. రా. శ్రీహనబ్నీసు
వందనముల నర్పించుచున్నాము.
పాపోషకులు గుప్రభువులును
షకులును, సహాయులును, జం
నాంధ్రమహా జనులెల్లరును
ముల మాకితోధికసాహాయ్యప్రో
మకొనుచున్నాము.
కట పార్వతీశ్వరకవులు.

అవతారిక.

శ్రీయుతులగు రఖాలదాసబెనర్జి యమ్. యే గారు మాఆంధ్రపాఠకులకు నూతనపరిచితులు. ఈతని కావ్యములలోఁ బ్రకృతాంధ్రీకృతగ్రంథమిదియే. ఈతఁడు పురాణేతిహాసపరిశోధకులలో నగ్రగణ్యుఁడని చెప్పవచ్చును. మహారాష్ట్రదేశమున డాక్టర్. సర్. రామకృష్ణభాండార్కరుగారును, వంగదేశమున శ్రీయుత మహామహోపాధ్యాయహరశాస్త్రిగారునుదక్క నీకవిపుంగవునకు సమానులింకొకరు లేరనుట యతిశయోక్తి గాదు. ఇక్కడి యాంధ్రలోకమునకు నూతనుఁడేయైనను వంగదేశము మహావిద్వాంసుఁడనియుఁ బండితశిరోమణియనియుఁ బ్రఖ్యాతిం గాంచినవాఁడే. ఈవిఖ్యాతలేఖకుఁడు వంగభాషలో "పాషాణకథ" "వంగేతిహాసము" మున్నగు నితిహాసములను రచించియున్నారు. అవి యీవిద్వాంసునిసామర్థ్యమును వేనోళ్ళఁ జాటుచున్నవి.

తరువాతఁ గొంతకాలమున కీతఁడు "శశాంకము" అను చరిత్రాత్మకం బగు నవలను రచించెను. దీనిఁ బ్రచురించినప్పుడు గొందఱువిమర్శకు లీనవలను నిందించియుండిరి—ఈతనిగ్రంథము లన్నియు నితిహాసములే. తామ్రశిలాశాసనాదులే వాని కాధారములు. ఈతఁడు నిరంతరమును శాసనసంశోధనమునందు నిమగ్నుఁడై నూతనవిషయములను గ్రహించి ప్రాచీనదేశచరిత్రములను, దత్సంబంధవిషయములను బుస్తకరూపమునను, మాసపత్రికారూపమునను బ్రకటించుచుండెను.

ఈతఁడు దుర్గమంబును, సంకటమయంబును, సంతాపదాయకంబును నగు పురాణేతిహాసారణ్యాంధకారమార్గమును వీడి సుకరం

బును, సుఖకరంబును, సుందరంబును, సుమనోజ్ఞంబును నగుకథాలేఖనోద్యానమునం బ్రవేశించుటచేతనే విమర్శకులీతని నధిక్షేపించిరి.

వారికిః ప్రత్యుత్తరముగా నిక్కవిచంద్రుఁడు "నేను భారతీయ ప్రాచీనేతిహాసములను, వానితో సంబంధించిన యైతిహాసికసత్యములను జనసామాన్యమునఁ బ్రచారము గావింపవలయుననుకుతూహలముతో "పాషాణకథ" మున్నగునితిహాసములను బ్రకటించి యుంటిని. పండితులు వాని నభినందించినను సామాన్యజనసమాజమున కవి దుర్గ్రాహ్యంబు లగుటం జేసి నాయుద్దేశము విఫలమైపోయెను. కావునఁ జరిత్రవిషయములను కథారూపమున రచించి ప్రకటించినచో సామాన్యజనసుబోధకంబులు గాఁగలవని తలంచి "శశాంకము" అను నీగ్రంథమును రచించి ప్రకటించితిని. ఇదిగాక యీచరిత్రమును గథారూపమునఁ బ్రకటించుటకు నాకింకొకయుద్దేశముగూడ నున్నది. చరిత్రసంబంధము లెంతమాత్రమును జెడకుండ మఱికొన్నివిషయములను గల్పించి కథాలేఖనముం గావించుట సులభసాధ్యమగునా కాదా యని నన్ను నేను పరీక్షించుకొనుటకే యీగ్రంథమును వ్రాసియుంటిని" అని వ్రాసియుండెను.

నిజమే! ఐతిహాసికవిషయములకు భంగము గలుగకుండఁ గథారచనముం గావించుట సులభసాధ్యమా? అయ్యసాధ్యకార్యము నిమ్మహాకవి సాధించిన ట్లీగ్రంథము వేయినోళ్ళఁ జాటుచున్నది. చరిత్రవిషయములంగూర్చి నవలలను రచించువారి కీగ్రంథ మాదర్శముగా నుండఁగలదని నాదృఢవిశ్వాసము. ఐతిహాసికంబు లగునవలల నెన్నిటినో నేననేకభాషలయందుఁ జదివి యున్నాఁడను. కాని, దీనింబోలినది యింకొకటి లేదనియే నేను ఘంటాపథముగాఁ జెప్పఁగలను.

అనుభవైకవేద్యం బగునిక్కవిచంద్రుని ప్రత్యుత్తరమును లలితవాఙ్మయంబునకు వంకలుదిద్దఁజాలుచుండు లబ్ధప్రతిష్ఠులు నిరంతరము

న క్షత్రియుం డుండుకొందురుగాక! ఈసందర్భమున "సర్ వాల్టర్ బెశాంటు" దొరగారు నుడివినవాక్యముల క్రిందఁ బొందుపఱచుట యప్రస్తుతము కాదనుకొని యెదను.

"Between Russia in the East and California in the west, it is the novelist who teaches. He is the fount of inspiration; he gives the world ideas; he makes them intelligently. Sometimes, in rare cases, he so touches the very depths of his people, that his words reverberate and echo as from rock to rock and from valley to valley, far beyond the ear of him who listens. In these cases he makes his song, because he makes History to be read."

ఈనవలయందలి ముఖ్యసంఘటనము లన్నియు నైతిహాసికములే. ఇందలి శశాంకుఁడు, అనంతవర్మ, భాస్కరవర్మ, ప్రభాకరవర్ధనుఁడు, రాజ్యవర్ధనుఁడు, హర్షవర్ధనుఁడు మున్నగువా రైతిహాసికపురుషులు. ఆకాలమున బౌద్ధమత మీదేశమునుండి పొత్తుగాఁ దొలఁగి పోకున్నను పాటలీపుత్రము మొదలగు నగరములలో మాత్రము దాని ప్రచార మంతగా లేదు. ఆపరిస్థితిం గాంచి కొందఱుబౌద్ధనేతలు స్వధర్మము నెల్లెడల వ్యాపింపఁ జేయు నుద్దేశముతో ధర్మోద్ధారంబును సరళంబు నగునీతిమార్గమును ద్యజించి, కుటిలమును ధూర్తమార్గముల నవలంబించి మతవిరుద్ధం బగుమగధరాజ్యము నెట్లయిన విధ్వస్తముం గావించుటకై యెడతెగనిప్రయత్నములం జేయఁదొడంగిరి. ఇట్టిదురవస్థలో సామ్రాజ్యహితచింతకు లగునమాత్యసామంతాదు లెట్లు పరాక్రమించి స్వార్థత్యాగముం గావించిరో యీనవలయందు సుందరంబుగను, మనోహరంబుగను, స్పష్టంబుగను శ్రీరఖాలబాబు రచించి యున్నాఁడు.

యువరాజశశాంకుఁ డైతిహాసికపురుషుఁడు. ఈతఁడు క్రీస్తుశక మేడవశతాబ్దియందు గౌడమగధదేశములకు జక్రవర్తియై యుండెను. ప్రాచీనేతిహాసలేఖకు లీతనివిషయమున ననేకనిందావాక్యముల నుడ

రోపగించియున్నారు. సంస్కృతవాగ్వధూపంచబాణుఁడగు బాణభట్టు తనహర్ష చరితమున వ్రాసినవిషయములును, దత్కాలీనుఁడగుచీనా దేశ యాత్రికుఁడు హ్యూనత్సాంగువ్రాసిన ప్రవాసవృత్తాంతములును మాత్రమే ప్రాచీనచరిత్రకారుల కాధారము లైయున్నవి. బాణభట్టు హ్యూనత్సాంగు లేగాక ప్రాచీనేతిహాసలేఖకుఁడగు విన్సెంటుస్మిత్తు దొరగారుకూడ శశాంకచరిత్రము ననేకనిందాగర్భితవాక్యములచే నిండించియున్నారు. శశాంకుఁడు విశ్వాసఘాతుకుఁడై హర్షవర్ధనుని సోదరుఁడగు రాజ్యవర్ధనుని వధించెననియు, బుద్ధగయయందలి బోధి వృక్షము నున్మూలించె ననియు, పాటలీపుత్రమునందలి బుద్ధదేవుని పదచిహ్నములను నాశనము చేసెననియు, బౌద్ధమఠములను, సంఘారామములను ధ్వంసము చేసె ననియు, బౌద్ధభిక్షులను దేశవిదేశములకుఁ బాఱఁద్రోలె ననియు నిట్లు ప్రాచీనేతిహాసకు లాతనిపై ననేకనిందల నారోపించి యున్నారు. కాని శ్రీరఖాలబాబుమాత్రము బాగుగఁ బరిశీలించి శశాంకునిపై మోపిననిందల నన్నిటిని సహేతుకముగఁ దొలఁగించి ప్రాచీనులచేఁ గళంకితముగాఁ జేయఁబడిన యాతనిచరిత్రమును రమణీయముగ, సర్వాంగసుందరముగ, సకలజనాభిరామముగఁ బ్రదర్శించియున్నాఁడు!

ఇఁక నీవిషయమునఁ బ్రాచీనేతిహాసలేఖకుల వ్రాతలయందలి సత్యాసత్యముల సంభవాసంభవములంగూర్చి యాలోచింతము.

మహాకవి బాణభట్టు—ఇతఁ డాకాలపువాఁడే—కాని శశాంకుని పరమశత్రుఁడగు హర్షవర్ధను నాశ్రయించినకవి—అట్టివాఁడు తన కాశ్రయదాత యగు హర్షవర్ధనుని భూషించుటయు, నతనివైరి యగుశశాంకుని దూషించుటయు స్వభావమే కాదా? కావున, నీకవి శశాంకునిం గూర్చి కావించిననిందలన్నియు నెంతవఱకు సత్యము లైయుండునో చదువరులే యూహింపవచ్చును

హూయనుత్సాంగు — ఈతఁడు విదేశీయుఁడు; సరళస్వభావుఁడు; ధర్మనిష్ఠుఁడు — కాని, మగధరాజ్యమును మొట్టఁ గలుగవలయునని మహాప్రయత్నములం గావించుచున్న బౌద్ధభిక్షుల వాక్యములపై నితఁడు విశ్వాసముంచెను. ఆతని కేమి తెలియును? వారు చెప్పినదంతయు నిజమనియే యాతఁడు భావించెను. తనప్రవాసవృత్తాంతమునం దాతఁడు వారు చెప్పినమాటలనే లిఖియించెను. అవియే తరువాతియితిహాసలేఖకుల కాధారము లైనవి.

విన్సెంటుస్మిత్తు — ఈతఁడు సమకాలికుఁడు గాఁడు. కాఁ పురాణేతిహాసపరిశోధకుఁడే — విదేశీయుఁడు. ఈతఁడు బాణవిరచితంబగు "హర్షచరిత్రము" ను, హూయనుత్సాంగువ్రాసిన "ప్రవాసవృత్తాంతము" ను నాధారముచేసికొని వ్రాసినవాఁడు.

శ్రీ బాబు రఖాలదాసు బెనర్జి — ఇప్పటివాఁడు. పురాణేతిహాససంశోధకుఁడు. విన్సెంటుస్మిత్తుదొరగారి చరిత్రప్రకటనమునకుఁ దరువాతఁ బలుతావులం దొరకిన తామ్రశిలాశాసనాదుల నాధారముగాఁ జేసికొని వ్రాసినవాఁడు. మనోవాక్కాయకర్మంబులచేఁ బురాణేతిహాస సంశోధనకార్యంబున నిమగ్నుఁడు; తల్లీనుఁడు; తన్మయుఁడు; వంగదేశీయుఁడు — ప్రస్తుతకథాలేఖకుఁడు; ఈనవలారచనమునందుఁ దామ్రశిలాశాసనాదులే యాధారములుగాఁ గలవాఁడు.

కావున నిందలి సత్యాసత్యములను పాఠకులే నిర్ణయించుకొనందురుగాక! అయినను తామ్రశిలాశాసనాదిపరిశీలనముచేసి పూర్వులమార్గము ననుసరించి సత్యమునే యాధారముగఁ జేసికొని శ్రీ రఖాలబాబు వ్రాసినయంశములు సమంజసములు కాకపోవని మా పాఠకులకు సూచించుచున్నాను.

"ఇది నిరపేక్షబుద్ధితో వ్రాసినయితిహాసము గాదు." అని శ్రీ బాబుగారనియున్నారు. కాని, దీనిం జదువునప్పుడు ప్రాచీనగుప్త

వంశచరిత్రము నే— ఇతిహాసమునే చదువుచున్నట్లు పాఠకులకుఁ గోచరమగును. ఈనవలలో సప్తమశతాబ్దియందలి భారతరాజకీయ సాంఘిక ధార్మికస్థితుల చిత్రములు మిగులనిపుణముగా, స్పష్టముగా మనోహరముగాఁ బ్రదర్శింపఁబడినవి.

వంగభాషలో నీగ్రంథ మానేకులచేఁ గీర్తింపఁబడినది. అట్లే దీని మహారాష్ట్రభాషాంతరీకరణముగూడ నధికజనమనోరంజకమై విలసిల్లుచున్నది. శ్రీయుత విడల సీతారామగుర్జరుగారు దీనిని మహారాష్ట్రభాషకు దమయనర్గళసులభమధురశైలిచేఁ బరివర్తితము గావించియున్నారు. అక్కవిపుంగవుని మహారాష్ట్రగ్రంథము ననుసరించియే నేను దీని నాంధ్రీకరించియున్నాను.

నాయీయుద్యమ మాంధ్రమహాజనుల యాదరమునకుఁ బాత్ర మగుఁగాక! తన్మూలమున నిట్టింకను ననేకగ్రంథము లాంధ్రలోకమునకీయ నాకుఁ బ్రోత్సాహము గలుగుఁగాక!!

సత్తెనపల్లి
21-11-16

ఇట్లు
వాసుదేవరావు.

శ్రీరామచంద్ర

శశాంక

నరేంద్రగుప్తుడు

ప్రథమఖండము

మొదటిప్రకరణము

పదిహేండ్రెండువందలసంవత్సరములకుఁ బూర్వము పాటలీపుత్ర నగరమునకుఁ గ్రిందివైపున శోణనదీజలప్రవాహము భాగీరథీనదితోఁ గలిసి పోవుచుండెను. ఆశోణనదీసంగమతీరముపై నతివిస్తీర్ణంబును శిలావినిర్మితంబును నగునొక పురాతనభవన ముండెను. అనేకశత సంవత్సరములకుఁ బూర్వము శోణనదీప్రవాహగతి తిరిగిపోయినప్పు డాశిథిలభవనమున మిగిలియుండినకొంతభాగముకూడ గంగాజలములఁ గలిసిపోయెను.

అది వర్షాకాల ప్రారంభసమయము. సాయంకాలమునకుఁ గొంచెముపూర్వమున శోణనదీసమీపముననున్న రాజభవనము నందలి వాతాయనము చెంత నొక బాలుఁడు, నొకవృద్ధుఁడును నిలిచి యుండిరి. ఆబాలుఁడు గౌరవర్ణుఁడు. అతనికుంతలములు కేతకీమిశ్రి తారుణవర్ణము కలిగి యతిదీర్ఘములై యాతనివెన్నును ముద్దిడుకొను చుండెను. ఆసాయంశీతలమారుత మాబాలుని కేశకలాపముతోఁ గ్రీడించుచుండెను.

బాలుని చెంత నిలిచియున్న వృద్ధునిం గనిన నాతఁ డొక యోధుఁడై యుండఁబోలు నని సహజముగనే తోఁపక మానదు. ఆతనిశిరోజములు రౌప్యవర్ణములై దీర్ఘములై యుండెను. ఆతఁడు నీలిరంగు తలరుమాలును దలకుఁ జుట్టుకొనియుండెను. ఆజానుబాహుండును, సమున్నతదేహుండు నగునాతనిశరీరము మాంసలంబును, సుదృఢంబును, సుందరంబు నైయున్నను సాధారణముగా వస్త్రవిహీనంబై యుండెను. ఆతని కటిప్రదేశముమాత్ర మొక మలినవసనముచే నాచ్ఛాదితమై యుండెను. ఆవృద్ధుఁడు చేత నొక భల్లమును దాల్చి మౌనముతో నా బాలకుని చెంత నిలిచి యుండెను.

పాటలీపుత్రనగరమునకుఁ గ్రిందివైపున శోణనదీమిలితప్రవాహము గంగాప్రవాహమునఁ బడుచుండుటచే గెరలు తరంగముల నుండి తుషారములు పెల్లుగ నుదయించి నలుగెలంకుల నెగసిపడుచుండెను. వర్షజలసమ్మేళనమున ఫేనయుక్తమును నత్యగాధము నగు గంగాజలౌఘము త్వరితగమనమున సాగరమువంకకుఁ బరుగువాఱుచుండెను. రాజభవనవాతాయనముకడ నిలిచియున్న బాలకుఁ డేకాగ్రదృష్టితో నాజలప్రవాహమును గనుంగొనుచుండెను. పడమటిదెసనుండి బయలుదేఱిన నౌకలు మెల్లమెల్లఁగఁ దీరమునకే వచ్చుచుండెను. ఆశోణాసంగమస్థానమునఁ దీరద్వయమునందును నెన్నియో నౌకలు గుంపులుగుంపులుగఁ జేరియుండెను. కాని, సాయంకాలమగుచుండుటచే సంక్షుభితంబగుచున్న యాజలప్రవాహమునఁ దమదోడల నడపించుటకు నావికులకు సాహసము కలుగదయ్యెను. ఆ బాలకునికడ నిలిచియున్న వృద్ధునిదృష్టి తీరమునకుఁ జేరుకొనుచున్న యానౌకలవంకకే ప్రసరించుచుండెను.

అప్పుడు భాగీరథీప్రవాహసందర్శనము సేయుచున్న బాలకుఁడు మెల్లఁగా "దాదా!" అనిపిలిచెను.

వృద్ధు—ఏమి కుమారా!

బాల—ఈనావ లీదినయెడ నావలికిఁ బోవా?

వృద్ధు—పోవు కుమారా! అంధకారభీతిచే నావికులు నౌకలను దీరమునకే మరలించుచున్నారు.

బాలకుఁడు మెచ్చుపడియెను. అతఁడు తటాలునఁ గిటికీయొద్దనుండి వెనుదిరిగి కచేరిచావడిలోని కరిగెను. ఆవృద్ధసైనికుఁడుగూడ నాతని వెనువెంటనే మెల్లమెల్లగ నక్కడకే పోయెను.

ఆసమయమున నంధకారము నలుదెసల దట్టముగఁ గ్రమ్ముకొనుచుండెను. గోదాసంగమము ధూసరవర్ణపటముచే మూసివేయఁబడినట్లుండెను. దూరమున నదీతీరమున లంగరువేయఁబడిన నావలలో మినుకుమినుకుమనుచున్న చిన్నచిన్నదివ్వెలు మిణుఁగురుపురుగులవలె భాసిల్లుచుండెను.

కచేరిచావడిలో కాష్ఠస్తంభముపై నొకపెద్దదీపము వెలుఁగుచు నలువంకలఁ బ్రకాశమును, సుగంధమును వ్యాపింపఁజేయుచుండెను. ఆచావడిలో నున్న ప్రతివస్తువు నమూల్యమును నపూర్వమునై యుండెను. స్ఫటికశిలా వినిర్మితంబులును, హిమతుషారసమశ్వేతంబులు నగుచ్ఛటికుడ్యములయందు నానావిధంబు లగు శస్త్రాస్త్రములు వ్రేలాడుచుండెను. దీపము వెలుఁగుచున్న కాష్ఠస్తంభమున కిరువంకలను గజదంతవినిర్మితంబులగు రెండుమంచములు కలవు. వానిపైఁ దెల్లనివస్త్రములచేఁ బఱుపఁబడిన కోమలశయ్యలుండెను. ఆమంచములలో నొకదానిపై మధ్యమాకృతి గలసువర్ణదండ మొండుండెను. ఆరెండుమంచములకును నడుమఁగలనేల శుభ్రవసనముచే నాచ్ఛాదితమైయుండెను.

సభాభవనమున కరుదెంచినంతోడనే యాబాలకుఁడు నేలపై బఱచియున్న గద్దియపై నాసీనుఁడయ్యెను. ఆవృద్ధవీరుఁడు దూర

మున—ఆగద్దెకొకమూల వాసీనుఁడై యుండెను. గద్దెపైఁగూర్చుండియున్న యా బాలకుఁడు కొంతసేపటివఱకు నేమియు మాటాడలేదు. అనంతరము బాల్యోచితం బగుచాపల్యముతో నాతఁ డాసనమునుండి లేచి మంచమును సమీపించి యా సువర్ణదండమును దనహస్తముతో నెత్తుకొనియెను.

బాలుఁ డాస్వర్ణదండమును గేలం గీలించుట చూచినతోడనే వృద్ధునకుఁ గళవళ ముదయించెను. అతఁడు లేచి బాలుని సమీపించి "ఆఁ! ఆఁ! కుమారజీ! దానిని ముట్టవలదు. ఈసంగతి విన్నచో మహారాజుగా రాగ్రహించెదరు" అనియెను.

బాలు—(నవ్వుచు) నేనిప్పుడు సముద్రగుప్తులధ్వజము ననాయాసముగా నెత్తఁగలిగితిని. క్రిందఁ బడవైచెద నేమో యనుకొంటివా?

అనుచు నాతఁ డాయైదడుగులయెత్తుగలబరువైన సువర్ణదండమును నవలీలగాఁ బైకెత్తెను.

అది యంతయుం గాంచి యాముసలి మందహాసము సేయుచు 'కుమారా! అశ్వారూఢుఁడవై యీగరుడధ్వజమును గరమునం దాల్చి నీవు కదనరంగమున కరుగునట్టి దివసముకూడ ముందు రాఁగలదు" అనియెను.

కాని యీవాక్యము లా బాలకునివీనుల కందవయ్యెను. ఆతఁ డాస్వర్ణదండము నేకాగ్రదృష్టితోఁ దిలకించుచుండెను. ఆదండముపై నందం దనేకవిధము లగునగిషీపనులు చేయఁబడియుండెను. అనఘము నక్షరములుకూడఁ జెక్కఁబడియుండెను. ఆయక్షరములను జదువుటకై బాలుఁడు ప్రయత్నించుచుండెను. ఆదండశిరోభాగమున సుందరతరమును, మనోమోహనకరము నగునొకగరుడవిగ్రహము సమకూర్పఁబడి యుండెను. ఆమనోహరవిగ్రహ మాగోడలపై

వ్రేలాడుచున్న శస్త్రాస్త్రసమూహములో నానావిధాకృతులతోడను, వివిధవర్ణములతోడను బ్రతిబింబిత మగుచుం జూపులకెంతయు ముచ్చటగా నుండెను.

అప్పుడు బాలుఁడు వృద్ధునివంక దృష్టినిగుడించి "తాతా! నాకుం జక్కగాం జదువ వచ్చును. ఇటు చూడుము! ఈధ్వజముపై నెన్నియో నామములు వ్రాయఁబడి యున్నవి. ఇవి యన్నియు నార్యసముద్రగుప్తులే వ్రాసినారా?" అనియెను.

వృద్ధ—గరుడధ్వజముపై నేమైన వ్రాయఁబడి యున్నదని నే నెప్పుడును వినియుండ లేను.

అందుపై నాబాలకుఁ డేమియో పలుక నుద్యుక్తుఁ డయ్యెను గాని యాతనినోటినుండి మాట వెడలుటకు ముందుగనే యొకబాలిక తూనీఁగవలెఁ బరుగిడుచు వచ్చి యాబాలునికంఠమును గాఁగిలించుకొని నగవ్వుచు "కుమారజీ! మాధవుఁడు నన్నుం బెండ్లియాడెద ననుచున్నాఁడు. అందుచే నేనిక్కడకుఁ బరుగెత్తుకొని వచ్చితిని. అదిగో! చూడుము! నన్నుం బట్టుకొనుటకై యతఁ డిక్కడకే వచ్చుచున్నాఁడు." అని చెప్పుచు నాబాలిక కుమారుని దృఢాలింగన మొనర్చుకొని యాతని వక్షస్స్థలంబున డాఁగఁ బ్రయత్నించుచుండెను. అది గని యాకుమారుఁడును వృద్ధసైనికుఁడును, ముక్తకంఠములతో నవ్వఁజొచ్చిరి; వారిహాస మాపురాతనశిలాభవనముదండలి ప్రతిశబ్దమునందును బ్రతిధ్వనితమై యెల్లకడలఁ బరివ్యాప్తమైపోయెను.

అట్టిసమయమున రెండవబాలుఁ డతివేగముగఁ బరుగెత్తి వచ్చుచు వారిహాసధ్వని చెవి సోఁకుటయు నివ్వెఱపడి చిటాలున ద్వారముకడ నాశ్చర్యముతో నిలువఁబడిపోయెను. బాలిక "కుమారజీ!" అని సంబోధించిన మొదటిబాలకునిం గాంచి యాతఁడు తెల్లవడిపోయెను. ఆతనిరూపమువాడ మారిపోయెను. అది మొదటిబాలునకు గోచరము

జాకపోలేను. అందుచే వాతఁడు మరల నవ్వెను. రెండవబాలకుఁ డతిత్వరితముగ నాద్వారమువంకకుఁ బోవుచుండెను. బాలిక యప్పటికిని దనయుభయదాలివక్షోభాగమునఁ దనకరకమలములను దాచికొనియే యుండెను.

ఈద్వితీయబాలకుఁ డశక్తాంగుఁడును, వామనుఁడు నైయుండెను; చామనచాయమేనివాఁడు. అతని గాంచిన నైదేండ్లకంటె నెక్కుడు వయ సుండదనియే తోఁచును. కాని యాతఁడు పదియేండ్లకంటె నెక్కుడువయసుగలవాఁడే. ఆబాలికామూర్తి యత్యంతనిరతిశయసుందర మైనది. ఆమె కెనిమిదేండ్లవయసుకంటె నధికము లేదు. ఆమెను కుమారశరీరము సువర్ణమువలెఁ గాంతిమంతమైయుండెను; అవయవము లన్నియును బరిపుష్టములై సుందరములై యుండెను. అయినను నామెను గృశాంగియనియే చెప్పవలసియుండెను. ఆబాలికమస్తకము నలంకరించిన కుంతలకలాపము సుశ్యామలమై, సునిర్మలమై, సుదీర్ఘమైయుండెను.

అప్పుడు ప్రథమబాలకుఁడు ద్వితీయునిం గాంచి "మాధవా! నీవు చిత్రిను బెండ్లియాడెద నంటివా ? ఆమె తనపతిని జాలకాలము క్రిందటనే యేర్పఱచుకొని యున్నదిగదా!" అనియెను.

మాధ—(తలవంచుకొని యస్పష్టస్వరముతో) నేను నల్లనివాఁడ నని చిత్రి నన్నసహ్యించుకొనుచున్నది. ఎంతనల్లనివాఁడనైనను నేను రాజపుత్రుఁడనే గదా!

వృద్ధ—మాధవా! సుందరి యొకతె కన్నులఁ బడినంతనే యామెను బెండ్లియాడుటయే నిశ్చయమైనట్లు తోఁచుచున్నది.

ఈమాట విని ప్రథమబాలకుఁడు బిగ్గరగ నవ్వుట కారంభించెను. అది మాధవునిహృదయమర్మమును దాఁకినట్లుండెను. అంత నాతఁడు విషణ్ణహృదయుఁడై మెల్ల మెల్లగ నచ్చోటు వాసిపోయెను,

సప్తమశతాబ్దాంత్యభాగమున గుప్తవంశసంభవుండైన మహాసేనగుప్తుఁడు మగధదేశమును బరిపాలించుచుండెను. ఆసమయమునఁ బ్రాచీనగుప్తసామ్రాజ్యగౌరవసూర్యుఁ డస్తాచలమున కేఁగుచుండెను. సముద్రగుప్తునివంశజుఁ డగువిధిఁ దప్పుడు సార్వభౌమపదము నధిష్ఠించి మగధవంగదేశములను బరిపాలించుచుండుట నిజమే యైనను సామ్రాజ్యమునందలి పలుభాగము లాకాలమున నన్యాక్రాంతములై యుండెను. ఆర్యావర్తమునందలి మౌఖరిరాజులు తమరాజ్యమును నిష్కంటకముగఁ జేసికొని స్వతంత్రప్రభావమును స్థాపించుకొని యుండిరి. స్థానేశ్వరవైశ్యరాజవంశమువారు మెల్ల మెల్లగ బ్రహ్మావర్తపంచనద దేశములలోఁ దమయధికారమును విస్తరిల్లఁ జేసికొనుచుండిరి. కామరూపదేశ మంతకు బహుకాలముక్రిందటనే తనస్వాతంత్ర్యమును సుప్రతిష్ఠితముగఁ జేసికొని యుండెను. వంగదేశమును, సమతటదేశమును, నొక్కొక్కవేళ సామ్రాజ్యమున కధీనమై యున్నట్లుండుటయే గాని సమయమువచ్చినప్పుడించుకంతయు సందేహింపక కప్పము చెల్లించుటకుఁ దిరుగఁబడుచుండెను.

కడపటిచక్రవర్తి యగుమహాసేనగుప్తుఁడు కూడ సామ్రాజ్యమునకుఁ బురాతన రాజధాని యగుపాటలీపుత్రనగరముననే నివసించి యుండెను. భరతఖండమున సుప్రసిద్ధ మగుప్రాచీనరాజధానియు నాకాలమున నంత్యావస్థలో నుండెను అప్పటికప్పుడే యాసుందరనగరము నాశనమగుటకు బ్రారంభించి యుండెను. ఆసమయమునను సరిగఁ గన్యాకుబ్జగౌరవారుణమండలము క్రమక్రమముగ నుదయించుట కారంభించెను. అనంతరమున బూర్వపుమగధరాజధాని మఱి యెన్నటికిని భరతఖండమునకు రాజధాని కాదయ్యెను. మఱి జీర్ణమై పోవుటకు సంసిద్ధమైయున్న రాజధాని యగు నాపాటలీపుత్రనగరము నందే గుప్తవంశప్రభువులు నివసించియుండి రాజ్యాభినయమును నెఱపు

కొనుచుండిరి. అయినను సమీపస్థు లగు రాజులభయమువలన వారెల్ల కాలమును శంకాకులహృదయములతోనే యుండవలసి యుండెను. కుమారగుప్తుఁడును దామోదరగుప్తుఁడును దమశక్తి కొలఁది, ననేకప్రయత్నములం గావించి మౌఖరిరాజులకు వశము గాకుండ నాత్మరక్షణముం జేసికొని యుండిరి. పిమ్మట నతిస్వల్పకాలములోనే మహాసేనగుప్తుని భాగినేయుఁ డగు ప్రభాకరవర్ధనుఁడు మౌఖరిరాజవంశమును నిర్మూలనముం గావించియుఁ, బశ్చిమదేశమున హూణులను బరాజితులం గావించియు నుత్తరదేశమునకు రాజై మహాబలాఢ్యుఁడై, ప్రతాపశాలి యయ్యెను. కాని యిప్పటివఱకు నాతని మేనమామవంశమునందే సార్వభౌమబిరుదము విఖ్యాతివహించి యుండెను. పాటలీపుత్రసార్వభౌముఁ డగు మహాసేనగుప్తుఁడు తన మేనల్లుఁ డగు ప్రభాకరవర్ధనునివలనిభయముచే నెల్లవేళలఁ జింతాకులుఁడై యుండెను. ప్రభాకరుననంతరమునం దుత్తరదేశమునందలి గుప్తవంశాధికారము తప్పక నామమాత్రావశేషమై పోవు నని మహాసేనగుప్తుఁడు నిరంతరమును భావించుకొని చింతించుచుండెను.

మహాసేనగుప్తచక్రవర్తి కిరువురుపుత్రులుండిరి. ఈప్రకరణప్రారంభమున శోణనదీప్రవాహమునందలితరంగావళిని ముగ్ధనయనములతోఁ దిలకించుచు మఱకుం గానఁబడిన యాబాలకుఁడే మహాసేనగుప్తుని జ్యేష్ఠకుమారుఁడు. అతఁడే గుప్తసామ్రాజ్యమునకు భవిష్యచ్చక్రవర్తి. అతనిపేరు శశాంకనరేంద్రగుప్తుఁడు. బాలిక యగుచిత్ర వెనువెంటనే పరుగిడుచువచ్చినయతఁడు శశాంకునితమ్ముఁడు. ఈమాధవుఁడు శశాంకునకుఁ గేవలమును సోదరుఁడు గాఁడు. సవతితల్లి కొడుకుఁడు. వృద్ధుఁ డగుమహాసేనగుప్తున కీమాధవునిపై నిరతిశయప్రేమ కలదు. అందుచే నాతఁడు మాధవుని గడుగారాబముతోఁ బెంచుకొనుచుండెను. ఆకారణముననే మాధవుఁ డహంకారియు, నవిధేయుఁడు, నతినిష్ఠురస్వభావుఁడు నయ్యెను. కుమారశశాంకునిస్వభావ మతిధీరమై, ప్ర

శాంతమై, నిర్మలమై యుదారమై యుండెను. అట్లే బాలికకునుగూడ శరీరముగూడ నతిసుందరమై, బలిష్ఠమై, కాంతిమంతమై యుండెను. చిన్నతనమునుండియు యువరాజునకు శాంతకునకు సకలవైభవములకు నతి ప్రియుడై యుండెను. బాలిక యగుచిత్రమండలమునకు రాణి యగు తి శేషుండను నరసింహదత్తుని పుత్రిక. మఱియు శశాంకునకుఁ బ్రియమిత్రుఁడు నరసింహదత్తుని కనుఁగుఁ దెలియును; నరసింహదత్తుని మరణానంతరమున నారణ్యాకులు మండలమార్గములై నాడిపొడిచి మూకగ్రామమునకు నుబచే తిరుదత్తుని భార్యయనాథయై తన పుత్రికాపుత్రులతోఁ బాటలీపుత్రమునకు వచ్చి యుండెను. అప్పటనే వారు కాశ్రయము లభించెను. నరసింహదత్తుని పూర్వజుల మార్గమును, సంపత్తియు నితరులనాక్రమింగతములగుటం గాంచి సార్వభౌముఁడగు మహాసేనగుప్తుఁడు తన సేనానాయకుసిం బంపి మరల వారిమార్గమును దనవశము గావించుకొనియెను. ఆ కాలమున మండల, గౌడ, మగధ, వంగ దేశములలో నతిమహోద్యానములు మార్గమున్నర్గము లుండెడివి.

వృద్ధవిరుఁడును, కుమారుని శాంకుఁడును గూడ నాయున్నాగారమున నేమియో ముచ్చటించుకొనుచుఁ బాలసేకటివఱకు నప్పటనే కూర్చుండియుండిరి. అంతలో నాకస్మికముగాఁ దెంతమున్నమహాలలో ననేకులపాదధ్వనులు వినవచ్చెను. తోడనే వృద్ధుఁడులికిపడి తనచేత నున్నఖల్లమును సవరించుకొని లేచి వచ్చి ద్వారముకడ నిలిచి యుండెను. కుమారుఁడును సంభ్రమాశ్చర్యచకితుఁడై శయ్యపైనుండి తటాలున లేచెను.

ఆదివప్రకాశమునఁ బ్రత్యేకించి ముందుగ శ్వేతనిర్మలవసన ధారియైన వృద్ధభట్టుమూర్తి కనఁబడియెను. అతని వెనువెంటనే మాన్యలోని యనేకదాసదాసీజనులు వచ్చుచుండిరి. కుమారుఁడు కన్నులఁ బడినంతనే యాభట్టు హర్షభరితుఁడై జయధ్వని గావించెను. అరనిముసము

లో వాడలోని సేవకులందఱును సభాభవనమునకు వచ్చిచేరిరి. నేఁడు రెండుజాముల వేళ శశాంకకుమారుఁ డీయస్త్రాగారమునకు వచ్చి కూర్చుండెను. అప్పటినుండియు రాజనగరునందాతనిజాడ యగుపడుటలేదు. అందుచే నందఱును జింతాకులులై యంతట నాతని వెదకుచు మాధవగుప్తుఁడును, జిల్రియు వారితోఁ గుమారుఁడును, దుర్గసేనాని యగు లల్లాయును నస్త్రాగారమునఁ గూర్చుండియున్నట్లు విని శశాంకకుమార సందర్శనలాలసులై యటకొక్కుమ్మడిం జనుదెంచిరి. చాలసేపటినుండి కుమారుఁడు కానరాకుండుటచేఁ బట్టమహిషియుఁ జక్రవర్తియునుగూడఁ జింతాకులస్వాంతులై యుండిరి. "ఈదుడుకుబాలకుఁడు వర్షజలముచేఁ బూర్ణీభవించి యున్న శోణనదీ జలప్రవాహగర్భమునఁ జేరిపోయియుండఁడుగదా!" అని శంకించుచుఁ బట్టపుదేవి విచారాయత్తచిత్త యగుచుండెను.

కుమారుఁడు కన్నులఁబడినంతనే యొక్కపరుగునఁ బోయి భట్టాతని నెత్తుకొని వడివడిగనస్త్రాగారమునుండి యావలికివచ్చెను. కాని కుమారుఁ డటనుండి వచ్చుటకిష్టపడక వృద్ధభట్టుతోఁ బెనఁగులాడ నారంభించెను. భట్టుఁ డెన్నివిధముల బ్రతిమాలినను బుజ్జగించినను గుమారుఁడు తనపట్టు వదలక "నేను లల్లాయొద్ద నార్యసముద్రగుప్తుని కథను వినవలయును. నేనిప్పు డిక్కడనుండి రాను" అని యొక్కటేమాటగఁ బలుకుచుండెను.

లల్లాయును గుమారు నెటులైన మరలింపఁ బ్రయత్నించెను, గాని యందాతనికి విజయము కలుగలేదు. అప్పుడు భట్టు "రేపటియుదయమున నీకు నేను సముద్రగుప్తుని కథను వినిపించెదను" అనియొప్పుకొనెను. దానికిఁ గుమారుఁ డంగీకరించి యొకించుక శాంతమును వహించెను. అనంతరము కుమారు నెత్తుకొని భట్టును, సేవకజనులును వెడలిపోయిరి. వారివెంటనే వృద్ధయోధుఁడగు లల్లాయును మెల్ల మెల్లగ నటనుండి వెడలిపోయెను.

కుమారశశాంకునియొద్దఁ గిటికీచెంత నిలిచియున్న యావృద్ధుఁడు మగధసైన్యమునందలి యొకనాయకుఁడు. అడవిలోని కోయజాతిసేనాసమూహమున కాతఁడు ప్రముఖుఁడు. అతఁడు కోయజాతివాఁడే. అతనిపేరు లల్లా. ఈలల్లా యనేకసమయములం దనేకయుద్ధములలోఁ బ్రాచీనసామ్రాజ్యగౌరవమును రక్షించి యుండెను; సార్వభౌముఁ డగు మహాసేనగుప్తునకు వృద్ధత్వమునందుఁ బుత్రుఁ డుదయించినపిమ్మట నీలల్లా యాకుమారునకు సంరక్షకుఁడుగా నియమింపఁబడియెను. అప్పటినుండియు లల్లా యతిభక్తితోడను బ్రేమతోడను కుమారుని లాలించి పెంచుచుండెను. శశాంకునకు లల్లా యనిన నెంతయో ప్రేమ. ఆప్రేమమూలమున నాబాలకుఁ డావృద్ధుని "దాదా" యను భ్రాతృసంజ్ఞాపదమున సంబోధించుచుండును.

రెండవప్రకరణము.

సూర్యభగవానుని ప్రచండకిరణాతాపముచే సమస్తభువనములును దహింపఁబడుచున్నట్లుండెను. రాచనగరమునకుఁ గ్రిందివైపున నంధకారబంధుర మగునొకగదిలో వట్టినేలపైఁ బరుండి వృద్ధయమభట్టు భోజనానంతరవిశ్రాంతిం గాంచుచుండెను

యమభట్టు గుప్తవంశపుఁ బురాతనసంపూర్ణవైభవముం గూర్చినగాథలను జెప్పుచుండెను. శూన్యమును, శాంతమునైయున్న యాప్రదేశమునం దాతనిగంభీరస్వర మతిగంభీరముగఁ బ్రతిధ్వనించుచుండెను. పురాతనచక్రవర్తుల వైభవస్థిత్యంతరములతోఁ బాటుగ రాజభవనములకు స్థిత్యంతరములు గానవచ్చుచుండెను. అనేకసంవత్సరములకుఁ బూర్వము శోణాసంగమస్థానము చెంతఁ బాటలీపుత్రలిచ్ఛవిరా జొకచిన్నకోటను నిర్మించియుండెను. గుప్తరాజ్యప్రతిష్ఠాపనమైనపిమ్మట న

దివలఱకు నగరమధ్యభాగమున నున్న రాజభవనము ప్రథమచంద్రగుప్త నగరిమువరకుఁ గొననున్న కోఁటలో జేరియుండెను. అప్పుడే రాచవాడలోనియీభాగము నిర్మింపఁబడియెను. గొప్పగొప్ప ఱాళ్లచేఁ గట్టఁబడియున్న యీయప్పటిగదులన్ని యీఁజాలము వఱకు నెవ్వరివలనను నుపయోగింపఁబడనేలేదు. ఈయార్యావర్తమునకు మగధరాజ్యము కేంద్రస్థానముగాఁ జేయఁబడిన యనంతరము సముద్రగుప్త చంద్రగుప్తులయధికారమునందుధనవాహినిజలవాహినింబోలె వ్యయపఱుపఁబడి శోణనదీతీరమునందీ విశాలభవనము నిర్మింపఁబడియెను. ప్రథమకుమారగుప్తుఁడీవాడను విడిచి తనచిన్నరాణిముచ్చటనుదీర్చుటకై గంగాతీరమున శుభ్రస్ఫటికశిలాస్థగితంబగునొక మందిరమును నిర్మించెను. గుప్తవంశావనతిప్రారంభమైనప్పుడు కుమారగుప్తుని యీవాడలోనే చక్రవర్తి నివసించుచుండెను. వాడలోని యితరభాగములన్నియు నధికారుల కార్యాలయములుగా వినియోగింపఁబడుచుండెను. ఒకక్రోశము దూరము వఱకును వ్యాపించియున్నయీవాడ కోఁట, కటాంగణము మొదలగు వేర్వేఱుస్థలములకు వేర్వేఱు పేళ్లు పెట్టఁబడియుండెను, యదుభట్టుఁడున్న గది "ప్రథమచంద్రగుప్తాగారము" అనునామమున సుప్రసిద్ధమై యుండెను. ఈవిధముగనే "ధ్రువస్వామినీఆరామము, సముద్రగుప్తభవనము, గోవిందగుప్తవిలాసగృహము" అను ననేకనామములచే నారాచవాడలోని యనేకభాగములు నాగరికులచే వ్యవహరింపఁబడుచుండెను. గుప్తసామ్రాజ్యావనతికాలంబున నావిశాలరాజభవన మెంతటిదుర్దశలో నున్నను దానిని బాగుపఱచుటకుఁ గడపటిచక్రవర్తికిఁ దగినశక్తి లేకుండఁబోయెను. పర్యాభతరక మహాకాలప్రభావముచే గొప్పగొప్పగోడలును, బురుజులును శిథిలములై సభాభవనము, గదులును నేలకొఱఁగుటకు సిద్ధపడి యుండుటచే నివసించుట కయోగ్యములై పోయెను. అప్పుడు మగధరాజ్యమునందలి సేవకజనులును తక్కుంగల క్రింది తరగతుల యుద్ధకారులునువివిధ దగురీతి నుపయోగించుకొనుచుండిరి.

వాడలోనియుద్యానవము, పటాంగణము నిప్పుడు మహారణ్యము లై పోయినవి. పాటలీపుత్రనాగరికులకు రాత్రివేళలఁ గుమారగుప్తుని వాడకుఁదక్క నింక నెక్కడకుఁ బోవుటకును ధైర్యము కలుగుట లేదు. దీనింబట్టిచూడఁగాఁ గుమారగుప్తుని వాడ యిటీవలగట్టఁబడినదగుటచే నంతగాజీర్ణావస్థకు లోనుగా లేదని తోఁచుచున్నది. గంగాతీరమునం దలియీవిశాలభవనమునందే చక్రవర్తియుండెను. ఎత్తునిట్టాళ్లచే గట్టఁ బడినసముద్రగుప్తునిపురాతనప్రస్తరభవనములలోఁ జక్రవర్తియంగరక్ష కులుందురు. ప్రస్తుతకథాప్రారంభమునఁ గుమారశశాంకుఁడు సేనా పతియగుల్లాతోఁ గలసి ప్రియనాచరులకుఁ గానంబడినది యీవాడ లోని యొకభాగమున నే—

వృద్ధుఁడగుయదుభట్టు శశాంకకుమారున కీవిధముగాఁ జెప్పు చుండెను:—

"శకరాజీసుందరపాటలీపుత్రమునందే నివసించుచుండెను. ప్రాచీనమగధదేశ మాతనిపాదములకుఁ బ్రణమిల్లి యుండెను. తీరభుక్తి రాజులు పాటలీపుత్రమునకు వచ్చి భయభక్తులతో శకరాజుచరణము లపైఁ దమయుత్తమాంగములను వంచి ప్రతిసంవత్సరమును సామాన్యపాలికులంబోలి కప్పములను జెల్లించుచుండిరి. వైశాలీనగరపుఁ బ్రాచీనలచ్ఛవిరాజవంశజులు దుర్దశయును దారుణచక్రమునం జిక్కి పాటలీపుత్రమునాశ్రయించుటకు వచ్చియుండిరి. వారు సామాన్యవ్యవసాయకులంబోలి శకరాజులదాస్యము నంగీకరించి యెట్లో తమజీవితములను గడపుకొనుచుండిరి."

అంతవఱకు వినుటతోడనే కుమారశశాంకునివదనమండల మరుణమండలాయమానమైపోయెను. అప్పు డాతఁడు క్రోధగద్గదస్వరముతో "భట్టా! అప్పుడు దేశమునందు మనుష్యులనువారే లేరా? మగధులు, తీరభుక్తులు వంగరాజు లందఱునుగూడ నాశకరాజులయాధికారమునే యంగీకరించిరా?" అని ప్రశ్నించెను.

యమభట్టు గడువృద్ధుఁడు. ఇంతియకాక బధిరుఁడు. అట్లగుటం జేసి యాకుమారునివాక్యము లాతనికి వినఁబడలేదు. కావున వాఁడు తనకథనే సాగించుచుండెను.

"శకరాజులయత్యాచారములచే మగధదేశ మంతయు సంక్షుభితమగుచుండెను. దిక్కు లేకపోయెను. దేశమునందలి దేవబ్రాహ్మణులయవస్థ లతిశోచనీయము లయ్యెను. విలక్షణబలవంతులగుశకరాజులవలనిభయముచేఁ బ్రజలందఱును విదేశములపాలై పోయిరి. మగధతీరభుక్తుల బ్రాహ్మణులనాథులై నిరాశ్రయులై లిచ్ఛవిరాజులద్వారములకడకుఁ జేరిరి. ఆసమయమున విశాలవంశావతంసుఁ డగులిచ్ఛవిరాజు ఘోరదుర్దశలోఁ జిక్కియుండెను. అప్పు డాతఁడు శకులవేతనముచే జీవితముం గడపుకొను సేవకుఁడై యుండెను. అందుచే నాబ్రాహ్మణుల కాశ్రయ మొసంగుట కాతనికి సాహసము లేకపోయెను. అట్లాశ్రయ మిచ్చినచో నాతనికి శకరాజులతో బహిరంగముగ వైరము దెచ్చుకొనవలసివచ్చును. ఆతనికంతటిసాహసము కలుగదయ్యెనుగాని యాతని సామంతుఁ డగునొకసామాన్యరాజకుమారుని కావిషయమున విశేషధైర్యము కలిగెను—చంద్రగుప్తుఁడు ప్రసన్నవదనముతో నాబ్రాహ్మణబృందమున కాశ్రయ మిచ్చి తనసగరమునకుఁ బిలిచికొని పోయెను—"

అని చెప్పి యమభట్టు కొంచెముసేపాఁగి పిమ్మట వంశపరంపరగా వచ్చుచున్న యాకథ నస్ఖలితస్వరముతో నిట్లు చెప్పందొడంగెను.

"ఆబ్రాహ్మణబృందమున కీవిధముగా నాశ్రయము లభించిన పిమ్మట పాటలీపుత్రనగరమునం దింటింటను దేవద్రోహులగుబౌద్ధులయు, శకులయు నత్యాచారములంగూర్చినకథలు చెప్పుకొనుట యారంభమయ్యెను. అనంతరము శకరాజు ససైన్యుఁడై చంద్రగుప్తునిదుర్గమును ముట్టడించెను. నాగరికులు క్రోధవివశులై యుండుటచే ప్రభు

త్వము నంగీకరింపక తిరుగబడి శకరాజును సంహరించివైచిరి. వారందఱు నప్పుడు చంద్రగుప్తుని యాధిపత్యము నంగీకరించి క్రమముగా శకజనులను బవిత్రిమగధదేశమునుండి పాఱఁద్రోలిరి. ఈకలహప్రభావము పాటలీపుత్రనగరమునుండి మగధదేశపునలుదెసలను జాలదూరమువఱకును వ్యాపించెను. తీరభుక్తియు, మగధమును బౌద్ధులబలవంతపుబిడికిలినుండి విముక్తిం గాంచెను. అప్పుడు పాటలీపుత్రనగరసింహాసనమున గంగాజలముతో, మహాసంరంభముతోఁ జంద్రగుప్తున కభిషేకము గావించిరి. లిచ్ఛవి రాజునకుఁ బుత్రసంతతి లేదు. అతఁడు తనయేకపుత్రిక యగుకుమారదేవిని మహారాజాధిరాజగుచంద్రగుప్తున కొప్పగించి తీర్థాటనముం గావించెను. దేశమునం దంతటను శాంతిస్థాపనమయ్యెను. వాసుదేవమహాదేవులచక్రత్రిశూలధ్వజములతో విభూషితములైన మందిరములు మరల గగనమును జుంబింపసాగెను. శకులబలవంతములగు చేతులకుం బాల్పడి యోపక చెల్లాచెదరైన నాగరికులు మరల నగరమునకు వచ్చి చేరిరి. మగధతీరభుక్తరాజ్యములు ధనధాన్యవైభవంబులతోఁ బరిపూర్ణములు నగుచుండెను. భక్తిభావహృదయములతో సేవించుచున్న సకలసామంతమండలముం గూడి విరాజిల్లుచున్న మహారాజాధిరాజపరమభట్టారక ప్రథమచంద్రగుప్తుని బాహుబలంబు కలిమిం జేసి మగధరాజ్యలక్ష్మి యప్పుడు గుప్తవంశాశ్రయముం గాంచి నిశ్చలమైయుండెను."

యనుభట్టు సంగ్రామవృత్తాంతములను జెప్పుచున్నంతవఱకుఁ గుమారుఁ డేకాగ్రచిత్తముతో నాకర్ణించుచుండెను. అనంతరకథాశ్రవణమున వానికి నిద్దుర రాసాగెను. అప్పు డారాచవాడలోని యాచెమ్మనేలపై శయనించి మగధదేశపుయువరాజు క్రమముగా నిద్రించెను.

కుమారుఁడు చాలసేపటినుండి నిద్రపోవుచున్నాఁడను సంగతి నావృద్ధుఁడు గ్రహింపనేలేదు. అతఁడు తనకథానివేదనమును గావించు

చునే యుండెను "యుక్తకాలమున నాయుఃపరిపూర్ణుఁడైనపిమ్మటసార్వ భౌముఁ డగుచంద్రగుప్తునకు గంగాలాభము కలిగెను. అప్పుడు లిచ్ఛవిరాజకన్య మహారాజ్ఞికుమారదేవి కులాగతక్రమము ననుసరించి పతితో సతి చేసెను. అనంతరము గుప్తవంశమధ్యాహ్నమార్తాండుఁ డగుసముద్రగుప్తుఁడు పాటలీపుత్రసింహాసనము నధిరోహించెను—"

ప్రక్కనున్న మహాలునం దొకపురుషుఁ డటునిటు ప్రచారము సేయుచుండెను. ఆతఁ డప్పు డాకస్మికముగా యదుభట్టునొద్దకు వచ్చి నిలిచెను. యదుభట్టు వృద్ధావస్థమూలమున బధిరుఁ డగుటచే నీపురుషునిపదధ్వని వానికి వినరాదయ్యెను. లోని కరుదెంచినయాపురుషుఁ డొకయున్నతాధికారిం బోలియుండెను. కాని యాతఁ డప్పుడు సామాన్యవస్త్రాలంకారవిభూషితుఁడై దేహమున నొకసన్ననియుత్తరీయము దాల్చి యుండెను. ఆతనిచరణములయందలి చర్మపాదరక్షలపై మాత్రము మణిముక్తావళులు కూర్పఁబడియుండెను.

మహాలునఁ బ్రవేశించినయాపురుషుఁడు నేలపైఁ బరుండియున్న రాకుమారుని, మఱియొకవైపునఁ గూర్చుండియున్నయదుభట్టును గాంచియుచ్చైస్స్వరముతో "యదుభట్టా! వెఱ్ఱివానివలె నేమి చెప్పుచున్నావు!" అనియెను.

ఆపురుషునికంఠస్వరమును వినినంతనే యదుభట్టు తత్తరమున లేచి నిలువఁబడియెను. ఆతనిశుష్కరూప మంతలో మఱింతశుష్కించి నల్లనయ్యెను. అప్పు డేమిచేయవలయునో తోఁచక యాతఁడు కడుంగడు దడఁబడిపోవుచుండెను.

పురు—యదుభట్టా! ఇక్కుమారునిసమక్షమునఁ గుమారగుప్తచంద్రగుప్తులనామముల నెన్నఁడు నెత్తవలదని నీకెన్నియో సారులు చెప్పియున్నాను. శశాంకునకు నిప్పు డేమి చెప్పుచున్నావు? నీనోటినుండి కుమారగుప్తునినామము రెండుమూఁడుసారులు నాకు వినఁబడినదే!

యమభట్టునోట మాట వెలువడుటలేదు. వాఁడు భయవిహ్వలుఁడై నోట కానుకొనిపోయెను. అప్పు డాపురుషుఁడు తీవ్రస్వరముచే శశాంకునికి నిద్రాభంగ మయ్యెను. తోడనే యాబాలకుఁడు లేచి యాపురుషునింగాంచి తత్తరపడియెను. పురుషుఁ డాతనిం గాంచి “కుమారా! వాడలోని యీశిథిలభాగమునకు నీవేల వచ్చితివి?” అని ప్రశ్నించెను.

కుమారుఁ డేమియుఁ బ్రత్యుత్తరమీయక తలవంచి నేలకుఁ జూచుచు నిలువఁబడియుండెను.

పురుషుఁడు భట్టుం గాంచి “యమా! నీవు జరాపీడితుఁడవై యున్నావు. యుక్తాయుక్తవివేకము నీకు నశించిపోయినట్లున్నది. నన్నించుకంతయు లక్ష్యముసేయక నాయాజ్ఞకు వ్యతిరేకముగాఁ గుమారునకుఁ గుమార్గమును బోధించుచున్నావు. భట్టా! ఇఁకమీఁద నెప్పుడైన సముద్రగుప్తునినామమును నీవుచ్చరించినచో నీవీపుచర్మము నొలిపించి యీపాటలీపుత్రనగరమునుండి నిన్ను వెడలనడిపింతు నని గట్టిగా నమ్ముము—కుమారా! రాచవాడలోని యీశిథిలభాగమున నీవిఁక నెన్నఁడు నొంటిగాఁ దిరుగవలదు. ఈయమభట్టు గడువృద్ధుఁడు. సర్పవ్యాఘ్రభయంబులనుండి యీతఁడు నిన్ను రక్షింపఁగలఁడా?—

ఆకర్ణాంతవిశాలములైన యాకుమారునినేత్రము లశ్రుజలపూరితము లయ్యెను. అప్పు డాతఁ డవనతవదనుఁడై మందమందగమనంబుల నటనుండి వెడలిపోయెను. దవ్వుననున్న యొకగదిలో లల్లా యక్కుమారుని యాగమనముకొఱకు వేచియుండెను. ఆతఁడు పరుగెత్తుకొని వచ్చి యాకుమారునెత్తుకొని తీసికొని పోయెను. ఆవృద్ధవీరునివక్షోభాగమున మస్తకమునుంచి శశాంకుఁడేడువసాగెను.

ఏదియోదుర్వార్తనాకర్ణించుటవలన మహాసేనగుప్తచక్రవర్తి యస్వస్థుఁడై భవనప్రాంగణమున నిటునటుఁ దిరుగుచు నటనుండి య

ప్రయత్నముగా నీశిథిలభవనభాగమునకు మెల్లనఁ జనుదెంచెను. అచ్చట యసుభట్టుమాత్రమే యుండును. సార్వభౌముఁడుగాని, మఱియేయితరోన్నతోద్యోగిగాని యావైపున కెన్నఁడును వచ్చుట లేదు. అందుచేతనే యసుభట్టచ్చట నిశ్చింతతో నిషిద్ధకథను నివేదింప సాహసించెను.

• ఇచ్చటి కాకస్మికముగా వచ్చినయాపురుషుఁడు మహాసేనగుప్తచక్రవర్తియే యని చదువరులకు వేఱుగఁ జెప్పవలసినయావశ్యకము లేదు. అనేకదివసములకుఁ బూర్వము మధ్యదేశమునుండి వచ్చిన యొకజ్యోతిష్కునివలన శశాంకునిచేతులలో మగధరాజ్యము నాశనము కాఁగలదనియు, నాతని మేనయత్తవంశము పాటలీపుత్రమున నధికారము వహించుననియుఁ జక్రవర్తి వినియుండెను. సార్వభౌముఁడానాఁడు మొదలుగా భయభ్రాంతహృదయుఁడై గుప్తవంశపులుప్తగౌరవకథలనుగాని, చంద్రగుప్తసముద్రగుప్తులకథలనుగాని కుమారుని యెదుట నెన్నఁడును జెప్పవలదని చారణులను భట్టులను బలుసారులు శాసించియుండెను.

కుమారుఁడు వెడలిపోయినతరువాతఁ జక్రవర్తిహృదయమున విచారము మరలఁ బ్రారంభమయ్యెను. మెల్లమెల్లఁగా నాతఁడు యసుభట్టుని గదినుండి వెడలివచ్చి యటునిటుఁ దిరుగాఁడఁదొడఁగెను.

చక్రవర్తి వెడలిపోయినతరువాత యసుభట్టు వజ్రఘాతముం గాంచినవానింబోలి నేలపైఁ బడిపోయెను.

మూఁడవప్రకరణము.

రెండుజాములవఱకును ముసలధారాపాతంబగువర్షము వర్షించెను. ఇప్పుడు కొంచెము వెలిసినది గాని గగనమండల మింకను లీస్వచ్ఛమైయుండలేదు. పాటలీపుత్రనగరసమీపమున వారాణసీనిర్జన

మార్గమున నంధకారము తన మహత్తరాధికారమును బలవంతముగ వ్యాపింపఁజేయుచుండెను. అత్యున్నతంబులగు పర్వతశిఖరంబులందును, సమున్నతవృక్షాగ్రములందును నస్తంగతసూర్యుని నీలరక్తకిరణములు కొంచెముకొంచెముగాఁ బ్రసరించుచుండెను. అయినను గగనపూర్వభాగమున వినీలజలదము లతివేగముగ నేకీభూతము లగుటఁ గానవచ్చుచుండెను. మధ్యాహ్నప్రచండవృష్టివలన నావిశాలరాజమార్గ మప్పు డొకచిన్న యేరై ప్రవహించుచుండెను.

అప్పుడు నలువురువ్యక్తులు మెల్లమెల్లఁగ పాటలీపుత్రనగరాభిముఖులై నడచిపోవుచుండిరి. చేత నొకపెద్దకఱ్ఱను దాల్చియున్న వయోవృద్ధుఁ డొకఁ డందఱికంటెను ముందుగ నడచుచుండెను. అతనివెనుకఁ బండ్రెండేండ్లయీడుగల కోమలదేహయగు సుందరబాలికయును, నామెవెనుక నొకముసలిగాఁడిదవీఁపుపైఁగూర్చుండి యొక బాలకుఁడును బ్రయాణము సాగించుచుండిరి. ఆవృద్ధుఁడు గమనాయాసముచేఁ జాలఁ దూలిపోవుచుండెను. అయినను నాతఁడెట్టులో నడచుచునేయుండెను. కాని, యాతనివెంటనున్న బాలికమాత్రము కడుంగడు నలసి సొమ్మసిల్లిపోవుచుండెను. ప్రతిక్షణమును నాబాలిక విశ్రాంతిం గైకొనునిచ్ఛను బ్రకటించుచుండెను.

అట్లు నడచిపోవుచు వృద్ధుఁడు "మనమింకఁ గొంచెముదూరము పోఁగలిగితిమేని క్రమముగా నేగృహమునైనను, గుడిసెనైనను, కాక, యేగ్రామమునైనను జేరి యాశ్రయింపఁగలము. త్రోవలో మన మిట్లాయాసపడి యాలసించినచో నంధకారమున నెటుపోవుటకును మనకు శక్తియుండదు" అనియెను.

బాలిక క్షీణకంఠస్వరముతో "బాబా! నేను మిక్కిలి డస్సియున్నాను. ఇఁక నొక్కయడుగైన నడచుట నావల్లఁ గానేరదు. నా కాళ్ళెన్నిచోటుల గాయపడిపోయినవో నాకే తెలియుటలేదు. నేను కొంచెమునేపు కూర్చుండెదను" అనియెను.

కరుణరసపరిపూర్ణంబులగు నా బాలిక పలుకుల నాలకించి గార్దభవా
హనుఁడైన యా బాలకుఁడు "అక్కా! నీవింక నీగాడిదపైఁ గూరుచుం
డుము. నేను నడచివచ్చెదను" అనియెను.

బాలకుని యా మాటలను విని యట్టిస్థితిలో సైతము వృద్ధునకును
బాలికకును నవ్వు రాక మానదయ్యెను. వారినవ్వులం గాంచి బాల
కుఁడు తెల్లపోయి యూరకుండెను. బాలిక మఱికొంత దూర మెట్లో
నడచి యాయాసమును భరింపఁజాలక తటాలునఁ గూలఁబడి యంత
లోనే లేచి మార్గసమీపమునఁ దడిసియున్న యొకయున్నతస్థలమును
జేరి యొక్కనిట్టూర్పు విడిచి యటఁ గూర్చుండెను.

అది గని యా ముసలిఁడు "బిడ్డా! ఇఁకనడవఁజాలవా? కూర్చుం
టివా?" అని యామె ప్రత్యుత్తరమును నిరీక్షింపకయే తాను గూడ
నామెను సమీపించి కూర్చుండెను. వెనుకనుండి వచ్చుచున్న గార్దభ
రాజముకూడ బాలక సహితముగా వచ్చి వారిచెంత నిలువఁబడియెను.
ప్రతినిమిషమునకును జీకటి దళముగాఁ గ్రమ్ముకొనుచు వారి నాక్ర
మించుచుండెను.

ఈవిధముగాఁ గొంతసేపు గడచెను. అప్పుడు బాలకుఁడు
లక్ష్యపూర్వకముగా నాలకించుట నభినయించి "బాబా! గుఱ్ఱములు
పరుగెత్తి వచ్చుచున్న శబ్దము వినవచ్చుచున్నది" అనియెను.

ముసలి యా మాట విని చటాలున లేచి నిలువఁబడియెను.
ఆ రాజమార్గమునకు సమీపమునను్న పొలములోని యామ్రవృక్ష
చ్ఛాయ నంధకారము ఘనీభవించియుండెను. వృద్ధుఁడు తోడనే
యాయిరువురను వెంటఁబెట్టుకొని పోయి యావృక్షచ్ఛాయను
డాగి యుండెను. క్రమముగా నశ్వపదధ్వని సమీపముననే వినఁబడు
చుండెను. మఱికొంతసేపటిలోనే యనేకులగు నశ్వారోహకులా
యంధకారమధ్యమునం బడి పాటలీపుత్రనగరాభిముఖులై యతి వేగ

ముగఁ బోవుచుండిరి. ఉండియుండి యొకసారి మెఱపు మెఱసినప్పు డాయాశ్వికుల యాకృతి వారి కతిభయంకరముగఁ గానవచ్చు చుండెను.

ఇట్టియవస్థలో ప్రవాసి యగు మనదీనవృద్ధుఁ డాయిరువురు బిడ్డలను దనమేన హత్తించుకొని యాయామ్రవృక్షచ్ఛాయను డాగి యెట్లయిన నాయాశ్వికులకన్నులఁ బడకుండవలయు నని విశ్వప్రయత్నము గావించుచుండెను. ఒకగంటసేపటివఱకు నాగుంపు వరుసలుతీరి యావృక్షసమీపమునుండి నడచుచునేయుండెను.

అట్లాయశ్వారోహకసైన్య మతిదూరమువఱకుఁ బోయినను మార్గమునకువచ్చుటకు మనవృద్ధుఁడు సాహసింపఁజాలక పోయెను. అప్పుడు మరలఁ గొంచెముకొంచెముగా వాన కురియుటకారంభించెను. నభోమండలమునం దంతటను నీలమేఘము లావరించుకొని యుండెను. అప్పు డావృద్ధుఁడు బిడ్డల నిరువురను వృక్షచ్ఛాయను గూర్చుండఁబెట్టి తాను వానలోఁ దడియుచుండెను.

ఈవిధముగా నొకజామురాత్రి గడచిపోయెను. మరల నశ్వపదఘట్టనధ్వని వినవచ్చుచుండెను. అప్పుడు వృద్ధుఁడు కన్నులు తెఱచి బాటవైపునకుఁ బరికింపఁ దొడంగెను.

కొలఁదిసేపటిలోనే ధర్మకర్మసంయోగమున నలువు రేవు రశ్వారోహకు లావృక్షసమీపమునకే వచ్చి నిలిచిరి. వారిలో నొకఁడు "అబ్బా! వాన యింకను జోరుగఁ గురియుచునే యున్నది. నడువుఁడు. చెట్టుక్రిందికైనను బోయి కొంచెము సేపు నిలుచుందము" అనియెను. ఆతనిమాటల కందఱు నంగీకరించిరి. ఆక్షణమునందే వారందఱును మార్గమునుండి తొలఁగి సమీపముననున్న యాపొలమునఁ బ్రవేశించిరి. మనప్రయాణికులకు దురదృష్టముహూర్తము సమీపించెను. ఆసమయముననే విద్యుత్కామిని యొకసారి వికటహాసము

గావించెను. ఆమెఱుపుకాంతిలో నావృద్ధుని సమున్నతవిగ్రహ మా యాశ్వికుల కనాయాసముగా దృగ్గోచరం బయ్యెను.

ఆవృద్ధునిరూపు కన్నులఁబడినంతనే యాశ్వికుల కందఱకును ముందున్నవాఁడు బిగ్గరగా "శూలపాణియై యెవ్వఁడో యీ చెట్టుక్రింద నిలిచియున్నాఁడు. చూచితిరా?" అనియెను.

ఆమాట వినుటతోడనే యందఱు నావృక్షమును సమీపించిరి. ఆయవకాశమునందు వృద్ధుఁడును చెట్టుమఱుఁగునుండి వెడలి పొలము నడుమకు వచ్చి నిలిచెను. ఒకయాశ్వికుం డాతని గాంచి "పోకుపోకు" మని యదల్చెను, గాని యావాక్యము పూర్తి యగులోపలనే వెనుక నుండిరివ్వున నొకబల్లెము వచ్చి యావృద్ధుని వక్షస్స్థలమునుజీల్చి వెడలు టయుఁ బ్రాణశూన్యమగు నాతనియున్నత దేహము జలమయమైయున్న యాపొలమున గుభిల్లునఁ గూలఁబడిపోవుటయు జరగిపోయెను. తోడనే యావృక్షమూలమునాశ్రయించి యున్న బాలిక కెవ్వుమని కేక వైచెను. ఆకేకకు గార్దభము బెదరి దొరకినత్రోవనుబట్టి పరుగిడ నారంభించెను. ఖరవాహనుఁడైనయాబాలకుఁడుమాత్ర మెట్లో తన శక్తినంతను గేంద్రీకరించుకొని ప్రాణములను బిగబట్టుకొని యాగాడిద జూలును బట్టుకొని కూర్చుండియుండెను.

సైనికులు సమీపించి చూచిరి. వారికిఁ గనఁబడిన దేమి? ఆ మరణించినవాఁడు యోధుఁడు గాఁడు, వృద్ధుఁడు. ఆతనికడఁ బరభీకరంబుల గునస్త్రము లెవ్వియును లేవు. వానిచేతిలోనికఱ్ఱనే వారు శూలమని సందేహించిరి. ఇది యంతయుం గాంచి యావృద్ధునిపై బల్లెము విసరి నవరాక్రమశాలింగూర్చి వారందఱు నెగతాళి చేయసాగిరి. కాని వానికే యాబాలిక యస్ఫుటార్తనాదము వినబడియెను. వాఁడు తోడి వాండ్రపరిహాసవచనములను సహించి యావృక్షసమీపమునకుఁ బోవం దొడంగెను.

విద్యుత్ప్రకాశసాహాయ్యమున మానవీయన కావృక్షమూలమునఁ గూర్చుండి యున్నయా బాలిక కానంబడియెను. తోడనే యాతఁడు మహాహ్లాదభాసితవదనముతోఁ దనవెంటవచ్చినవారి నుద్దేశించి బిగ్గరగా "ఓరీ! మీరందఱు నన్నుఁ బరిహాసించుచుంటిరిగదా! ఈమనుజుని జంపి నేనేమి సంపాదించితినోచూచితిరే యెనఁ బొందు. ఈవాసంపాదనమునం దెవ్వరికిని భాగములభింపదుసుమా! మొట్టమొదటనే స్పష్టముగాఁ జెప్పివైచుచున్నాను" అనియెను.

అతిత్వరితముగా నందఱు నచ్చటికి వచ్చిరి. ఆబాలిక వారికిఁ గనఁబడినంతనే యందఱు నొక్కపెట్టున "వహ్వా! ఎంతసొగసు! చంద్రేశ్వరున కిది యొకరత్నమే లభించినది." అనిరి.

పాపమాబాలిక భయవిహ్వలయై శోకింపఁదొడఁగెను. బాలికపై స్వాతంత్ర్యముగలయావీరుఁ డశ్వారూఢుఁడైయామెను దటాలునఁ దనగుఱ్ఱముపై కెత్తుకొనియెను. వర్షావేగము కొంచెము తగ్గినది. సైనికు లందఱును మరలఁ దమమార్గము ననుసరించి పోవసాగిరి.

బాలకుని మూపున మోచికొని పరుగెత్తినఖరేంద్రమదేవనిగఁ జాలదూరము పోలేదు. అక్కడకొక యరక్రోసుదూరమునందున్న తాశవనమునం దది నిలిచిపోయెను. ఆకస్మికముగ సంభవించిన యీసంఘటన మంతయుం గని యాబాలకుఁడు మిక్కిలి భీతిల్లి చాలసేపటివఱకు నట రోదనము చేయుచునే యుండెను. కాని వాని యాయరణ్యరోదనమును వినుట కట నెవ్వ రున్నారు? పాప మాబాలుఁడట్లు కొంతసేపేడ్చి మిగుల నలసి యాగార్దభముమూపునఁ బడి నిదురించెను.

మఱునాఁ డరుణోదయసమయంబున నాపిల్లవానిరోదనధ్వని యొకతెలికునకు వినవచ్చెను. అచ్చటి కనతిదూరమునందున్న యొక చిన్నకాలిబాటను బట్టి యాతెలికుఁడు తనవిక్రయవస్తువులను విక్రయించుటకై మోచికొని నగరమువైపునకుఁ బోవుచుండెను. దిక్కులేక

దీనావస్థయందున్న యీబాలకునిం గాంచి యాతనికి మిగుల జాలి గలిగెను. అందుచే నాతైలికుఁడు గార్దభరాజముతోఁగూడ నాబాలకునిఁ దనవెంటఁబెట్టుకొని నగరమునకుఁ దీసికొనిపోయెను.

రెండుజాములు గడచెను. నగరతోరణద్వారమున మంగళవాద్యఘోషములు సెలంగుచుండఁ దైలికుఁడాబాలకునితోఁ బాటలీపుత్రపశ్చిమతోరణద్వారముకడకు వచ్చి చేరెను.

తోరణబహిర్ద్వారమును దెఱచివైచి ప్రతీహారులు ద్వితీయద్వారముచెంత నిద్రాసుఖము ననుభవించుచుండిరి. కావున వారిని మేల్కొల్పుట కాతైలికునకు సాహసము కలుగదయ్యెను. బాలునితో నాతఁడు కొంచెము దూరమునఁ గూర్చుండి వేచి యుండెను. రక్షకభటు లాతనివంకఁ గడకంటనైనఁ జూచుటలేదు. మూఁడవజాము గడచినవెనుక రథచక్రధ్వానముల నాలకించి యనేకులకు నిద్రాభంగమయ్యెను. అప్పుడు గలగలధ్వనులతో నొకరథము వచ్చి యంతర్ద్వారముకడ నిలిచెను. లోపలనున్న యొకవ్యక్తి తత్తరపడిన వాఁడునుంబోలెఁ గర్కశస్వరంబున ద్వారము తెఱచుట కాజ్ఞ యొసంగెను. ఆక్షణమునందే ద్వారపాలకు లందఱును శయ్యలనుండి లేచిరి. ఒక్కఁడు మాత్ర మింకను నిదురించుచునే యుండెను. మఱియొకఁడు వానిమూపునఁ గాలితోఁ దన్నెను. అందులకుఁ గోపించి మొదటివాఁడు రెండవవానిని గొట్టుట కుద్యుక్తుఁ డగుచుండ మూఁడవవాఁడు వచ్చి శయ్యతోఁ గూడ వాతని నీడ్చుకొనిపోయి తోరణద్వారసమీపమున నున్నయొక గదిలోనికిఁ ద్రోసివైచెను. ఒకఁడునిద్రమత్తు పూర్తిగ వదలిపోయినతరువాత వేపపుడుకతో దంతధావనము సేయుచు బిగ్గరగా గాండ్రించి యుమియుచు "ఎవరు వచ్చియున్నారురా!" అనియెను.

ఇంకొకకావలివాఁడు "వచ్చియున్నాఁడు నీయబ్బ!" అనియెను.

మొదటివాఁడు "నాయనా! నాయబ్బ యెన్నఁడో, యెక్కడకో వెడలిపోయినాఁడు" అని పలుకుచు దంతధావనకార్యక్రమము నుపక్ర

మించెను. అది గని వేఱొకఁడు గాని పలుదోముపుడకను జలకలశమును గండకములోనికిఁ బారవిసరెను. వాఁడా చెంబును దెచ్చుకొనుటకై కందకములో నుఱికెను. ఈగందరగోళములో ద్వారరక్షకులందఱును ద్వారణాంతర్భాగమునఁ బఱచియున్న తమతమశయ్యల నన్నిటి నెత్తివైచిరి.

నగరద్వారముకడనుండి ద్వారమును దెఱచుట కాజ్ఞ యొసంగినయాతఁ డధికక్రోధోద్దీప్తుఁడై ద్వారముపైఁ దన్నుట కారంభించెను. అప్పుడు ద్వారపాలకు లందఱును గలసి ద్వారమునందలి యర్గళములను నాల్గింటిని బహుప్రయాసముతోఁ దీసివైచిరి. దేవదారుపలకలచే నిర్మింపఁబడిన యాదృఢప్రచండద్వారములు తెఱవఁబడి తోరణపుగోడల కారెండుభాగములు నదికిలోనెను.

ప్రతీహారులును, ద్వారపాలకులును, భయభీతాంతఃకరణములతో మెల్లగ నావైపునకు దృష్టినిగుడించిరి. కృష్ణవర్ణుఁడును, కృశాంగుఁడును, వామనుఁడునైన యొకవృద్ధపురుషుఁ డట నిలిచియున్నట్లు వారికిఁ గనఁబడియెను; ఆతని గనినంతనే తలకుఁ బాగఁ జుట్టుకొనుటకైన నవకాశము చాలనియొకఁడు మరల వెనుదిరిగి చూడకయే పాఱిపోయెను. తక్కినవారు భయకంపితులగుచు మోకాళ్లు నేల కానించి కూర్చుండిరి. కాని వారిప్రార్థనాసూచకాభినయముల నించుకేనియు మన్నింపక యావృద్ధుఁడు వారినందఱను జబుకుదెబ్బల పాలుగావించెను. అనంతరము నాలుగు గుఱ్ఱములం బన్నిన యారథము గలగలధ్వనులు సేయుచుఁ దోరణద్వారమునుండి బయటికి వెడలిపోయెను.

అనంతరము మసతైలికుఁడు వృషభమును, గార్దభమును, బాలకుని వెంటఁబెట్టుకొని నగరమునఁ బ్రవేశించునుద్దేశముతో సంసిద్ధుఁడయ్యెను. వానిం గాంచినంతనే ద్వారపాలకుల శౌర్యమును ధైర్యమును మరల విజృంభించెను. అందుచే నందఱును గలసి పాపమా తైలికుని

పై దూకిరి. తుదకేయుపాయముం గానక తైలికుఁడు తనవస్తువులలోఁ గొన్నిటిని వారికి లంచ మిచ్చి వారిబారినుండి యెట్టకేలకుఁ దప్పించుకొనియెను.

తైలికుఁడు నగరమునఁ బ్రవేశించి చూచెను. అదేమి? రాజమార్గ మన్ని వైపులను జనశూన్యమైయుండెను. వర్తకస్థానము లన్నియు మూయఁబడి యుండెను. ఎవరోయొకరిద్దఱుమాత్రము మార్గమునందు శంకాకులస్వాంతులై నడచుచు సంధిపొసఁగినంతనే రాజమార్గమును త్యజించి సందుగొందులందూరి పోవుచుండిరి. అందందుఁ బరదేశసైనికకాయము మహాకోలాహలముతో వీథులవెంటఁ దిరుగుచుండెను. ఆసైనికులం గని పాటలీపుత్రనాగరికులు దవ్వుదవ్వులం దొలఁగిపోవుచుండిరి. ఆసైనికులు కన్నులఁబడుటయే తడవుగాఁ దెఱవఁబడియున్న గృహద్వారములును, వాతాయనద్వారములును దటాలున గొప్పధ్వని చేయుచు మూయఁబడిపోవుచుండెను; చిన్నచిన్నయంగళ్ళవారందఱును దమతమయంగళ్లను విడిచి పాఱిపోవుచుండిరి.

నగరమునం దోఁచినయీయద్భుతపరిణామస్థితిం గాంచి యాతైలికునిమనసు భయముచేఁ జెదరిపోయెను. ఆతఁడు వెంటనే రాజమార్గమును త్యజించి మాఱుత్రోవను నడవసాగెను. చిమ్మచీకటియైయున్న సందుత్రోవ నాతఁడు గొంతదూరమువఱకుఁ బోయి యొకప్రాఁతగుడిసెచెంత నిలువఁబడి తలుపుతట్టెను. అట్లెంతసేపు తట్టినను నెవ్వరును దలుపు తీయలేదు. అందుచే నాతఁడు తలుపును దన్నుటకారంభించెను.

ఇట్లించుమించుగా రెండుగడియలు గడచెను. పాపమా బాలకుఁ డతిశ్రాంతుఁడై యాగాడిదపై నట్టె నిదురించెను. నగరమున మెల్లమెల్లగ నిస్తబ్ధత ప్రసరింపసాగెను. మొట్టమొదటనే చిమ్మచీకటియైయున్నయాసందు సూర్యాస్తమయమైనంతనే క్రమముగా గభీరాంధకారబంధురము కాసాగెను. ఇఁక నుపాయాంతరముం గానక మన

మాటసారి మఱింతతీవ్రముగా వాతలుపులను దట్టఁదొడంగెను. వాని దెబ్బల కాఁగఁజాలక తలుపులు బద్దలై పోవు ననుభయముచేఁ గాఁ బోలు నాకుటీరమునుండి రోదనసూచకం బగు నొక స్త్రీకంఠస్వరము వినవచ్చెను. ఆ దుఃఖస్వరమును గూర్చియు నందలి భావమును గూర్చియు స్వభావానుగుణముగా వర్ణించుట యసాధ్యమే గాని, పాఠకుల సౌకర్యముకొఱకు దానిభావమును మాత్రము చెప్పుచున్నాము.

“అమ్మయ్యో! మాయింటిలో దొంగలు పడినారు. ఇరుగుపొరుగున నెవ్వరైన నున్నచోఁ బరుగెత్తి వచ్చి రక్షింపుఁడు రక్షింపుఁడు. రాజుగారి మేనల్లునితో వచ్చిన యాటవిక సైన్యము నేన నాథననియు, ననహాయ ననియు, నిరుపేద ననియు, విధవననియు నెంచి నాపై బలవంతము, నిర్బంధము సేయుచున్నట్లున్నది. మీరందఱును బరుగెత్తిరండు! ఆకఠినహృదయులను దరిమివేయుఁడు! లేకున్న నేను చచ్చిపోవుదును. చచ్చిపోవుదును. నాజాతి-నీతి—లజ్జ—అభిమానము-అన్నిటి నీపీనుఁగులు సర్వనాశనము చేయుచున్నారు. రండు! రండు! రక్షింపుఁడు!” అని యామె గోలపెట్టుచుండెను.

మొట్టమొదట నీస్త్రీశోకస్వరమును విని పొరుగింటిరెండవయంతస్తున నివసించి యున్న యొక పురుషుఁడు కిటికీతలు పోరగఁజేసి యిది యేమైయుండు నని పరికించెను. ఒకరిద్దఱు మాత్రముచ్చస్వరముతో నామెకు ధైర్యము చెప్పుచుండిరి. కాని యా సమీపగృహస్థుఁడొకఁ డాయింటిగుమ్మముకడ నున్న తైలికుని, వృషభమును, గాడిదను, బాలకుని జూచి తీవ్రస్వరముతో “ఓరీ నీవేమిచేయుచున్నావురా! స్థానేశ్వరసైనికులగుఱ్ఱపుదళములు గుంపులుగుంపులుగాఁ గూడి యిక్కడకే వచ్చుచున్నట్లున్నది.” అనియెను.

ఆతనినోటినుండి యీమాటలు వెలువడినంతనే పాటలీపుత్రపుర నాగరికులు తటాలునఁ దలుపులను మూసికొనిరి. కిటికీలనుగూడన

మూసికొని గృహాంతర్భాగములకుఁ బరుగెత్తిపోయిరి. ఆస్త్రీశోకస్వరముక్రమక్రమముగాఁ బ్రవర్ధమానమగుచుండెను. మార్గమువైపునకుఁ దిరిగిచూచుటకూడ నపాయకరమని యెంచి మనతైలికుఁడాద్వారమునందొక్కపెట్టునఁ బాదప్రహారముం గావించుచుండెను. ఇంతలోఁ బ్రాఁతగిలియున్న యాద్వారపుగడియలు విఱిగి పడిపోయెను. తోడనే యాతఁడాయింటిలోపలఁ బ్రవేశించెను. అప్పు డా స్త్రీయొనరించిన గందరగోళము వర్ణనాతీతమైనది. తుదకామె మూర్ఛిల్లెనో, యేమో యేసంగతియును దెలియలేదు. ఏమన___ తైలికమహాశయుఁడు కాలక గార్దభవృషభసహితుఁడై యాయింటిలోనికిఁ బోయి తలుపులు మూసివైచెను. అనంతర మాస్త్రీరోదనము చుఱియెవ్వరికిని వినఁబడలేదు. ఇంతవఱకు సత్యమని చెప్పఁగలము.

నాలుగవ ప్రకరణము.

సూర్యోదయసమయమునుండియును రాజప్రాసాదమునందలి సేవకజనులు రాజసభామండపమును బాగుచేసి యలంకరించుచుండిరి. నీలవర్ణంబు లగుబ్రహ్మశిలాఫలకంబులచే నిర్మింపఁబడిన యా విశాలసభామండపము చతుష్కోణాకృతియై నూటయెనిమిది స్తంభములచే విరాజిల్లుచుండెను. సభాప్రాంగణమునకు నలుదెసలను పచ్చని రంగుగల త్రాళ్ళచేఁ గట్టఁబడిన యొక్కపలావ్రును మిక్కిలినన్నమును గాని స్తంభములపై వెండిచేఁ జేయఁబడిన యరఁగులుండెను. ఆయరఁగులపై నతికౌశల్యముతో నిర్మింపఁబడిన శిలావిగ్రహములుండెను. ఆవిగ్రహములు రామాయణ భారతాదిగ్రంథములలోని వీరుల యాకారములు; ఆయరఁగులకు వెనుక సభామండపస్తంభము లుండెను. సభాభవనమునకును జతుష్పార్శ్వములశిలాతటము లుండె

ను. ప్రాచీనసార్వభౌములపరిపాలన కాలమున నాతటావరణమునందు దశసహస్రతురగారోహకులు శస్త్రాస్త్రధారులై బారులుతీరి నిలువఁబడునాచారము కలదనుప్రవాదము పాటలీపుత్రనగరమున వాడుకలో నుండెను. ఆసభామండపమునం దించుమించుగా సహస్రగజదంతాసనము లమర్పఁబడి యుండెను. కాని యవి యతిపురాతనములగుటచేతను వానిని బాగుపఱచుట కెవ్వరు నంతశ్రద్ధను వహింపకకుండుటచేతను, బరిశుభ్రంబు లగునాహస్తిదంతములతళుకు కంతయును బోయి యతిమలినమై యుండెను. ఈయాసనములపై రాజ్యమునందలి యధికారులును, మాననీయులగునాగరికులును గూర్చుండియుందురు. ఆకాలమున రాజసభయం దెల్లరును నిలిచియే యుండవలయు నను యవనులయాచారము వాడుకలో లేదు. సభాగృహంబునకుఁ బ్రభువు వచ్చినప్పుడుమాత్రము సకలజనులును దమతమయాసనములనుండి లేచి నిలిచి రాజునానతిం బడసి మరల నాసీను లగుచుండుట యాచారమై యుండెను. ఆసభామండపమధ్యమునందలి యరఁగుపై రెండు విధములగు సుఖాసనము లమర్పఁబడి యుండెను. ఆయాసనములపై రాజకులమువారును, యువరాజపాదీయులును(సామ్రాజ్యభావ్యధికారికి సములైనమంత్రులకును, రాజ్యమందలి యితరాధికారులకును "యువరాజపాదీయ" లనుబిరుదము కలదు.) కుమారపాదీయులును (యువరాజుగాక యితరరాజకుమారులకు సములగుమంత్రులు నధికారులును గుమారపాదీయులను సంజ్ఞగలవారు) కూర్చుండి యుందురు. అభిజాతవర్గమునకుఁ బ్రవేశము దొరకిననే గాని యితరు లెవ్వరికి నీయరఁగుపై నాసనములభించుట కష్టము.

మధ్యదేశమునుండి తేఁబడిన యమూల్యంబులగు స్ఫటికశిలాఫలకంబులచే నతినిపుణముగ నిర్మింపఁబడిన సమున్నతవేదికపై సార్వభౌముని సింహాసనమమర్పఁ బడి యుండెను. ఈవేదిక భూమికి రెండ

డుగుల యెత్తుననుండి దీని నలువంకలను సోపానము లుండును. వేదికపై సువర్ణమయంబులగు నాలుగుకంబములును, వానిపై వెండిచాందినీలును గలవు.

పరిచారకులా సభాభవనమును శుభ్రపఱచి స్ఫటికశిలావేదికను నిర్మలముగాఁ గడిగి వానిపై విదేశమునుండి తెచ్చిన యమూల్యాచ్ఛాదనవసనమును బఱచి యందు రెండు సువర్ణసింహాసనముల నమర్చుటకుఁ ద్వరపడుచుండిరి. మఱికొందఱు పై చాందినీకి ముత్తెపుజాలరులను గట్టుచుండిరి. కొందఱు సింహాసనములపై రాజ్యచ్ఛత్రములను గూర్చుచుండిరి. వేదికసమీపమున నొకసామాన్యాసనముపైఁ గూర్చుండి యొక యధికారి సేవకజనుల కాజ్ఞాపించుచు వారిచే నెల్లపనులను జేయించుచుండెను.

కొలఁదిదినములక్రిందట శోణగంగాసంగమముకడఁ బురాతనరాజప్రాసాదవాతాయనముచెంత నిలుచుండి గంగాతరంగములను గాంచుచు మనకుఁ గానంబడిన పింగళశిరోజుఁ డగు బాలకుఁ డీసమయమున నాసభామండపమునం దిటునటుఁ దిరుగుచుండెను. అతఁడు క్రమముగా నావేదికకడ కరుదెంచి నిలిచెను. అతనిం గాంచినతోడనే సేవకు లందఱును దమతమపనులను క్షణకాల మాపివైచి యాతని నమస్కారపూర్వకముగా గౌరవించిరి.

బాల — ఈద్వితీయసింహాసన మెవ్వరికొఱకుఁ బంపబడినది?

పరిచారకులు — స్థానేశ్వరచక్రవర్తికొఱకు.

ఈవాక్యము వినినంతనే యాబాలకునిరూపము మాఱెను. ఆతని సుందరవదనమండలముపైఁ దత్క్షణమే క్రోధారుణరేఖలు ప్రసరించెను. అతఁడప్పుడు చెంతనున్న యొకగజదంతాసనమును గట్టిగఁ బట్టుకొనియుండెను. క్రోధకంపితమూర్తి యగు నాబాలకుని దృఢముష్టిబంధమునం జిక్కియున్న యయ్యాసన మాభారమున కాఁగ

లక వళవళ విఱిగిపోవుటకు సిద్ధముగానుండెను. అది గని పరిచారకులు భయముతో రెండడుగులు వెనుక కొదిగిరి.

శశాంకుఁడు కోపారుణితలోచనుఁడై కంపితస్వరముతో "ఏమంటిరి?" అనియెను.

ఎవ్వరు నెట్టిప్రత్యుత్తరము నియఁజాలకపోయిరి. అప్పుడు పరిచారకులజనులపై నధికారము సేయుచున్న పురుషుఁడు సమీపించి యువరాజున కభివాదన మొనరించి వినయవినమితుఁడై నిలిచియుండెను.

యువరాజు కోపముతో నాతనింగాంచి "ఎవ్వరి యాజ్ఞచే నీసింహాసనము నీవేదికపై నలంకరించుచున్నారు?" అని ప్రశ్నించెను.

ఆమాట కేమని యుత్తర మీయవలయునో తోఁపక యాయధికారి కళవళపడి కొంతసేపటి కెట్లో యస్పష్టస్వరముతో "నేను వింటినిగదా—"—

ఆతనినోటినుండి మాట పూర్తిగ వెడలులోపలనే యువరాజొక్కయుదుటున వేదిక నారోహించి యానూతనసింహాసనము నొక్కయూఁపునఁ గాలితోఁ ద్రోసివైచెను. ఆయూఁపున కాసింహాసన మెగిరి పదియడుగులదూరమునఁ బడిపోయెను. తోడనే ప్రచండమగుచప్పుడుతో నాసింహాసనము నీలశిలాఫలకములకుఁ దగిలి విఱిగి తుత్తునియలై పోయెను.

ఈయద్భుతసంఘటనముం గాంచి సేవకు లందఱును భయభ్రాంతులై యటనుండి పలాయితులై పోయిరి. యువరాజట్లు నృసింహావతారముందాల్చుటఁజూచి యాయధికారియు నటనుండి తప్పించుకొనిపోవుట కుద్యుక్తుఁడయ్యెను. ఇంతలో సభామండపమున కావలనున్న తెర ప్రక్కకొనుగుటయు, నటనుండి వీరవేషధారి యగు నొక యున్నతపురుషుఁడును, స్థూలశరీరిణి యగునొకవృద్ధస్త్రీయును, విదేశ సైని

కులతో సభాగృహమునఁ బ్రవేశించిరి. వచ్చినతోడనే యావృద్ధస్త్రీ "ఇప్పు డేదియో పెద్దచప్పుడైన దెందుచేత?" అని ప్రశ్నించెను.

ఎవ్వరు నామెకుఁ బ్రత్యుత్తర మీయఁజాలకపోయిరి. కుమారపాదీయామాత్యుఁడును, యువరాజు శశాంకుఁడును దక్క నుత్తర మిచ్చుటకట నెవ్వరును లేకుండఁబోయిరి. క్రొత్తగ వచ్చినవారిం గని కుమారపాదీయామాత్యుఁడు దిగ్భ్రాంతుఁ డయ్యెను. ప్రత్యుత్తర మొసఁగుట కాతనికి ధైర్యము లేదు. శశాంకుఁడు మాత్రము నిశ్చలుఁడై యుండెను, అతఁడు మాత్ర మామెకు బదులు చెప్పఁదలఁచి యుండ లేదు. యువరాజా పురుషునకును వెన్నుచూపి నిలిచియుండెను.

అధికారి యేమియో చెప్పఁబ్రయత్నించెను గాని యాతనినోటినుండి యేవియో యస్పష్టవాక్యము లెంతయో కష్టమున వెలువడియెను.

అప్పుడు యువరాజు మొగము ద్రిప్పి యవజ్ఞాసూచకస్వరముతో "నాతండ్రిగారి స్వర్ణసింహాసనపార్శ్వమున స్థానేశ్వరరాజసింహాసనము నీసేవకులు చేర్చియుంచుటచే నేను దానిని గాలితోఁ ద్రోసివైచితిని. అది దూరమునఁ బడి విఱిగిపోయినది." అనియెను.

యువరాజునోటినుండి వెడలిన యావాక్యములు కఠినములగు గోడలుగూడ గడగడవడఁకునట్లు నలుదెసలఁ బ్రతిధ్వనితము లయ్యెను. ఆవాక్యములు వీనుల సోఁకినంతనే వృద్ధస్త్రీతోఁ గూడివచ్చిన యాప్రౌఢ వీరపురుషుని దేహ మాద్యంతమును గ్రోధారుణ మైపోయెను. ఆవెంటనే సమీపసైనికుల యొఱలనుండి వెలువఱిచిన కృపాణముకలకలధ్వని వినవయ్యెను. ఆధ్వని నాకర్ణించి శశాంకునితో నున్న యాయధికారి భయభ్రాంతుఁడై ప్రాణముల నఱచేతఁ బెట్టుకొని యటనుండి పాఱిపోయెను.

వృద్ధస్త్రీ మెల్లమెల్లఁగ వేదికకడ కేతెంచి శశాంకుని చేతులను బట్టుకొని యా వేదికనుండి క్రిందికీడ్చుకొని వచ్చెను. తోడనే యా మెతో వచ్చిన ప్రౌఢవీరుఁ డొఱనుండి కరవాలమును వెలికిఁ దీయుచుండెను. కాని, నగముతీయఁబడిన యాకృపాణ మట్లేయొఱలో నిలిచిపోయెను. ఇంతలోఁ దెల్లనివస్త్రములను ధరించియున్న యొకపురుషుఁడు, పాదరక్షలను ధరింపకుండఁగనే యతిత్వరితముగ నచ్చటికి విచ్చేసెను. ఆతనిం దిలకించి యాపరదేశసైనికులెల్లరును వంగి యభివాదనములం గావించిరి. ప్రియపాఠకులారా! మీ రీవృద్ధపురుషుని మున్నొక్కసారి వీక్షించియున్నారు. ఈతఁడే గుప్తవంశజుఁడగు ప్రస్తుతసార్వభౌముఁడు మహాసేనగుప్తుఁడు!

చక్రవర్తి వీక్షణమున నాస్త్రీ మందహాసమొనరించెను. ఆ ప్రౌఢవీరుని మస్తకముకూడ సంచుక వినమ్రమయ్యెను. కాని, యాసార్వభౌముఁడు జాలిగొలుపు దృష్టితోడను, కరుణనెఱపు వదనభంగితోడను నాస్త్రీవంకఁ గాంచుచుండెను. ఈనాకుమారుఁడగు శశాంకుని యపరాధమును సహింపవలయునను భావము సార్వభౌమునిచూపులలోఁ బ్రతిభాసిత మగుచుండెను. ఎన్నియో తరములనుండి పాదుకొనియున్న సామ్రాజ్యగర్వ మాతనినోటినుండి మాత్ర మీమాటల ననిపింపలేదు. ఇంతే—

ఆవృద్ధస్త్రీ సార్వభౌమునిం గాంచి "సోదరా! శశాంకునింగూర్చి నాకేమియుం జెప్పనక్కఱలేదు. ఈబాలకుని విశృంఖలవర్తనముంగాంచి నాప్రభాకరుఁడు మైమఱచునంతటి వెఱ్ఱివాఁడు కాఁడు" అనియెను.

ఆప్రౌఢవీరుఁ డప్పటికిని దలవంచి పటపట దంతములు కొఱుకుచు నిలిచియే యుండెను.

వృద్ధస్త్రీవేషముం గాంచిన యామె పంచనదదేశవాసినివలెఁ గానవచ్చుచుండెను. ఈకాలమునఁగూడఁ బంజాబుదేశపు యువతు లిట్టివస్త్రాలంకారములనే ధరించియుందురు. కపిశగాంధారదేశముల యందలి స్త్రీల యలంకారములందువలెనే యీయలంకారములందును స్త్రీసామాన్య మగు కోమలసౌందర్యాభావము దృగ్గోచర మగుచుండును. కొంచెము దూరమునం దున్నచో నీదుస్తులవలన స్త్రీపురుషులను గుర్తించుట చాలకష్టము. కాని, మహోన్నతపర్వతవేష్టితంబు లగు దేశములలో నుండు స్త్రీల కింతకంటెను యోగ్యములగు వస్త్రాలంకారములు లభించుట యసాధ్యమే. ఆస్త్రీశిరోజములు వెండితీఁగలవలెఁ దెల్లనై యుండెను; కపోలములపై ముడుతలు కనఁబడుచుండెను. ఆమె ముడుతలుపడిన పాయిజామాను, చొక్కాయిని, శిరస్సున శుభ్రవేష్టనమును దాల్చి యుండెను. ఆమె కేశపాశము వెన్నున విడివడియుండెను. ఆమె మృదుపాదములందుఁ బాదరక్షలుండెను.

ఈవృద్ధస్త్రీ సార్వభౌముఁడగు మహాసేనగుప్తునకు సోదరి; స్థానేశ్వరపుమహారాజును గీర్తిశేషుఁడు నగు నాదిత్యవర్ధనుని పత్ని; ఈమెనామము మహాసేన. ఈమెవెనుకనే వచ్చిన ప్రౌఢవీరుఁ డాదిత్యవర్ధనమహారాజునకు జ్యేష్ఠపుత్రుఁడు; స్థానేశ్వరవంశమందలి ప్రథమసార్వభౌముఁడగు ప్రభాకరవర్ధనుఁడు. ఆదిత్యవర్ధనుని జీవితకాలమందుఁగూడ మహాసేనయే తనపతిపేరున రాజ్యకార్యములను నిర్వర్తించుచుండెను. ప్రభాకరవర్ధనుఁ డీ స్థానేశ్వరసింహాసనము నధిరోహించిన పిమ్మటఁ గూడ నామె సింహాసనపురోభాగమునఁ దెరమఱుఁగున నుండి లోహదండపాణియై రాజకార్యపర్యాలోచనముం గావించుచుండెను. ఆమె కెనుబదియేండ్లప్రాయము వచ్చినను నామె యధికారము స్థానేశ్వరమున నప్రతిహతముగాఁ జరగుచుండెను. సింహాసనాధిష్ఠాతయైనను, సార్వభౌమబిరుదాంకితుఁడైనను, బంచనద

దేశోద్ధారకుఁడును, హూణాభీరఘూర్జర దేశములకుఁ బ్రత్యక్ష కృతాంతమూర్తియు నగు ప్రభాకరవర్ధనుఁడు మహాసేన యాడించు కీలుబొమ్మ యే యని యార్యావర్తమున సుప్రసిద్ధుఁడై యుండెను.

ఒకవంక మేనల్లుని హస్తమును, మఱియొకవంకఁ బుత్రునిహస్తమును బట్టుకొని యామహాసేన మందహాసముతో సభాగృహము నుండి వెడలిపోయెను. సార్వభౌముఁడును దలవంచికొని వారివెనుకనే పోయెను. అనంతరము పాఱిపోయిన సేవకజనులు మరల నచటికి వచ్చిరి. సభామండపము నలంకరించు కార్యములు మరలఁ బ్రారంభమయ్యెను. కాని, వేదికపై సామ్రాజ్యసింహాసనమే కాని మఱియెట్టి యాసనమును నమర్పఁబడలేదు.

ఐదవప్రకరణము.

నల్లనిమేనిఛాయ మిసమిసలాడుచుండ నించుక వయస్సుమించిన ట్లగపడుచున్న యొక స్త్రీ తనయంగడిలోఁ గూర్చుండి పప్పు, బియ్యము నూనె, ఉప్పు, నేయి మొదలగువస్తువులతోఁడఁ దన చిఱునవ్వులనుగూడ విక్రయించుచుండెను. పాటలీపుత్రనగరము నందలి యధికసంఖ్యాకు లగుజనులలో బియ్యము, పప్పు మొదలగువస్తువులే గాక యాబిడ చిఱునగవులనుగూడఁ గొనుట కెందఱో యుండక పోలేదు. ఆయంగడికి లోపలివైపున మనకిదివఱకుఁ బరిచితుఁడైన తైలికుఁడు కూర్చుండి యామె యెవ్వరెవ్వరి కెంతహాసమును విక్రయించుచున్నదో యోరకంటఁ జూచుచుండెను; ఆతైలికుఁడు తన వెంటఁ దీసికొని వచ్చిన బాలకుఁ డాయంగడికెదురుగా రాజవీథిలో ధూళిధూసరిత శరీరులును, కృష్ణవర్ణులు నగు ననేక బాలికా బాలకులతో నాడుకొనుచుండెను.

ఇంతలో నున్నతదేహుఁడును, స్థూలకాయుఁడును, గౌరవర్ణుఁడు నగు నొకపురుషుఁ డేవియో కొనుటకై యాయంగడియొద్దకు వచ్చెను. బియ్యము, నేయి మొదలగు ననేకవస్తువు లాయంగడియామె బలవంతముగ నాతని కంటఁగట్టెను. ఆతఁడన్నిటికిని వెలలిచ్చి వస్తువుల నన్నిటిని మూటఁ గట్టుకొనియెను; గాని యది మిక్కిలి బరువగుటచే నాతఁ డొక్కఁడు నెత్తఁజాలక పోయెను. అందుచే నాతఁడు చిక్కులఁ బడుచుండుటం గాంచి యాయంగడియామె కోమలహృదయమున దయ గలుగుటయు నాతనికి సహాయ మొనరించుటకై యామె తన చోటునుండి లేచెను.

మన తైలికమహాశయుఁ డదియంతయుం జూచుచు నూరకుండఁజాలక పోయెను. తోడనే యాతఁడు తటాలున లేచి వెలుపలికి వచ్చి యాక్రయికు నుద్దేశించి స్పష్టముగా "అయ్యా! నేను మీవస్తువులమూటను మీయింటికిఁ దీసికొని వచ్చెదను. అట్లు గాదేని మీతో మాబాలకు నైనఁ బంపెదను. అంతియకాని యెన్నఁడును మొగమైన నెఱుఁగని క్రొత్తవానితో నంతదూరము నాభార్యను బంపుట నాకిష్టము లేదు" అనియెను. అది కారణముగా నాయిరువురకును వాదప్రతివాదము లారంభ మయ్యెను. క్రమముగా నావాదము ముదిరి తుదకు మల్లయుద్ధముగాఁ బరిణమించున ట్లగపడియెను. కాని యంతలో నాయంగడియామె మధ్యవర్తినియై వారిపోరాటము నడగించివైచెను. ఆక్రయికునిమూట నాబాలకుఁడు మోసికొనిపోవునట్లుగా నొడంబడిక కుదిరెను.

పాపమాకుఱ్ఱవాఁ డాక్రయికుఁడందిచ్చిన యొకచిన్నమూటను దలపై నిడుకొని వానివెనువెంటనే నడచిపోవుచుండెను. ఆపురుషుఁడు ము కాలుపొడుగువాఁడగుటచే నతిత్వరితముగ నడచి ముందఱికిఁ బోవుచుండెను. కాని యాపిల్లవాఁ డెంతవఱకు వచ్చెనో యని నడుమనడు

మ నిలిచి వెనుదిరిగి చూచుచుండెను. ఒక్కొక్కప్పు డాబాలకుఁ డా తనికిఁ గనబడనంతటిదూరమున వెనుకఁబడిపోవుచుండెను. అప్పు డా బాలుని వెదకుటకై యాతనికి వెనుదిరిగి రావలసివచ్చుచుండెను.

ఆపురుషుఁడు నడచిపోవుచున్న బాట నగరబహిఃప్రదేశమునం దలి నదీతీరమునంటి పోవుచుఁగ్రమక్రమముగా నధికవిశాల మగుచుం డెను. ఆమార్గమునకిరువంకలను మహోన్నతంబులగువృక్షములుండు టచే వానిఛాయలవలన నామార్గమంతయు నాచ్ఛాదితమైయుండెను. దాని కొకవైపున గంగాసికతాతలమును, మఱియొకవైపున శ్యామల తృణాంకురములచే నాచ్ఛాదితమగు విశాలప్రదేశము నుండెను. ఆసి కతాతలమునకుఁ జాలదవ్వున నొకవైపున గంగాప్రవాహపునన్ని రేఖ కానవచ్చుచుండెను. ఆమార్గమున సాధారణముగాఁ బ్రాతస్సాయంకా లములయందుఁ దక్క నితరసమయములలో జనసంచార మంతగా నుండదు. కాని నేఁడొకవిశేషకారణ ముండుటవలన నాబాటయందు జనసముదాయము విశేషముగా నుండెను.

ఆజనసంఘమధ్యమునం దాబాలుఁడు కనఁబడకపోవుచుండు టచే నాపురుషుఁడు పలుసారు లతికష్టముతో నాతని వెదకుచుండవల సివచ్చెను. ఆబాటకుఁ గుడివైపునం దొక్కచో ననేకులు గుమిగూడి యుండిరి. వారందఱును సేనలోనివారని సహజముగనే బోధ యగు చుండెను. ఆసైకతప్రదేశమునందు సేనాశిబిరము లనేకము లమర్పఁ బడియుండెను. వానిముందఱిభాగమున సైనికు లందఱు నేవియోపను లను జేయుచుండిరి. కొందఱు వంటకములఁ జేయుచుండిరి. కొందఱువా రికిఁ దోడుపడుచుండిరి. మఱికొందఱు నిత్యకర్మములం దీర్చికొని వృక్ష చ్ఛాయలఁ బరుండి నిదురించుచుండిరి. బాట కెడమవైపునఁ జెట్లక్రింద గొప్పగొప్పగుఱ్ఱములు నిలిచి యుండెను. వానియొద్ద గుఱ్ఱములసామా నులును, భల్లములును, కరవాలములును, ధనుర్బాణాదులును రాసు

లు రాసులుగాఁ బడియుండెను. వానినిబట్టి సైనికు లెట్టిప్రయత్నమునం దున్నదియు బోధ యగుచుండెను. త్రోవ కిరువంకలను దవ్వులనుండి శస్త్రాస్త్రపాణు లగుపరదేశసైనికులు శాంతిరక్షణముం గావించుచుండిరి. గంగాస్నాన మాచరించి సైనికులు గుంపులుగుంపులై వచ్చుచుండిరి. కొందఱు సేవకులు గాడిదలపై నిండుగంగాళముల నుంచి సైనికులకుఁ గావలసినంత పానీయజలమును దెచ్చుకార్యమునఁ దత్పరులై యుండిరి. మార్గమునందంతటను రథములును, శకటములును నిలిచి యుండుటచేఁ బాదచారులు బాగుగా నడచిపోవుట కవకాశము తక్కువగా నుండెను. అశ్వికయోధులు నగరమునుండి బండ్లకొలఁది భోజనసామగ్రులను గొని తెచ్చుచుండిరి. సామానుల నొప్పగించి బండ్లు వెనుకకు మరలిపోవుచుండెను. నడుమనడుమ నశ్వారోహకులచేఁ బరివేష్టితము లగుశకటములు శిబిరములోపలికి వచ్చి సామగ్రులను దించివైచుచుండెను.

నగరమునకుఁ గ్రోసెడుదూరమునందున్న యొకవటవృక్షము క్రిందఁ గూర్చుండి కొందఱుసైనికులు వినోదకాలక్షేపము గావించుచుండిరి. వారిచెంత బల్లెములు రాశిగాఁ బడియుండెను. ప్రక్క నేలపై నొకబాలిక — బాలికగాదు - బాల్యతారుణ్యములకు నడిమివయసునం దున్నదనుటయే సమంజసముగానుండును. ఆమెహస్తద్వయమును జర్మఖండముతోఁ గట్టఁబడి నేలనాటఁబడియున్న యొకగుంజకు గట్టిగా నొకకొస గట్టివేయఁబడి యుండెను; ఒక్కొక్కప్పు డాబాలిక యించుక తలపైకెత్తి యాజనసముదాయమువంకఁ జూచుచు నాక్షణమునందే హతాశయై మరల నేలపై నొఱఁగుచుండెను. వృక్షచ్ఛాయలం గూర్చుండి యున్నవారిం గాంచినచో వారు పంజాబుదేశవాసులవలెఁ దోఁచుచుండిరి; వారిలో నొకఁడు చర్మపాత్రమున మద్యపానముం గావించుచు నాప్రసాదమును దోడివారికిఁ బంచిపెట్టుచుండెను; అట

నున్నవారిలో నొక్కఁడునుగూడ నాకన్నియవంకఁ గడకంటనైనఁ జూచుట లేదు;

మన తెలికునిచేఁ బారఁబడినబాలకుఁడు మూటనుస్ నెత్తిపైఁబెట్టుకొని యాపురుషునితో వచ్చుచుఁ గ్రమక్రమముగా నాచెట్టుకడకు వచ్చి గమనాయాసముచే వగర్చుచుఁ దలపైనున్నమూట నచ్చట దింపికొని యించుకసేపువిశ్రమించుతలంపునఁ గ్రిందఁ గూరుచుండెను; అనంతర మాతఁడు బాలోచితచాపల్యమున నిటునటు పరికింప నారంభించెను. ఆ బాలిక యేకాగ్రదృష్టితో నాతనివంకనే చూచుచుండెను. ఇంతలో వివిధవర్ణంబులగు వస్త్రాలంకారములం గైసేసియున్నమగధదేశపదాతిసైనికవర్గము వాద్యములగంభీరధ్వనులకు సరిగా నడుగులను బచరింపఁజేయుచు నామార్గముననే వచ్చుచుండెను.

బాలకునిమూట యెక్కడిదక్కడనే పడియుండెను. కొంతసేపటికా బాలుఁడు వేచియటునిటు పరిచారముచేయుచు నాబాలికం గాంచి యాశ్చర్యచకితుఁడై యొక్కపరుగున నామెను సమీపించి పెద్దయెలుంగున తొట్రుపడ "ఎవరు ? అక్కా ! నాఅక్కా !"అని యఱచెను.

ఆసంబోధనస్వరము నాలకించి యానవాలు పట్టి యాబాలికయు నాశ్చర్యచకితయై మొగముత్రిప్పిచూచి కెవ్వునఁ గేకవైచెను. అప్పు డాబాలకుఁడు చటాలునఁ బోయి యాబాలికకంఠమును బిగియారఁ గౌఁగిలించుకొనియెను. ఈస్థితిలో నాసోదరీసోదరులిరువురు నొక్కింతసేపు నిస్తబ్ధులై కన్నులనుండి యశ్రుధారల వెలార్చుచుండిరి.

ఇంతలో నావిదేశసైనికులదృష్టి యీవంకకు మఱలెను. తాము నిర్బంధించినయొక్కబాలిక కాక యట నిప్పు డిరువురుండుటం గాంచి వారాశ్చర్యపడిరి. అప్పుడు సురాపానమత్తుఁడైయున్నసైనికుఁ డాబాలికను సమీపించి కొంతసేపటివఱకు నేమియుం దోఁచక యాబాలికా

బాలకులను గాంచుచు నిర్వాంతపడి నిలిచి యనంతరము తీవ్రస్వరముతో "ఆఁ! ఇదేమి? వీఁడెక్కడనుండి యూడిపడినాఁడు" అనియెను.

బాలిక శోకగద్గదస్వరముతో "వీఁడు నాతమ్ముఁడు" అనియెను.

సైనికుఁడామెపై నెగసిపడి "లే! ఎక్కడితమ్ముఁడు? తమ్ముఁడు! ఇచ్చటఁ దమ్ముఁడును గిమ్ముఁడును బనికిరారు! తత్క్షణమే వీనినిటనుండి పొమ్మనుము!" అని యదలించెను.

ఆసైనికుని కర్ణకఠోరంబగు నాజ్ఞ నాకర్ణించి యాబాలిక రోదనము చేయుచు బిగ్గరగాఁ గేకలిడ నారంభించెను. ఆమె శోకధ్వనితోఁ దమ్ముని దుఃఖారావము లీనమయ్యెను. అది గని యావిదేశసైనికుఁ డత్యాగ్రహావేశవివశుఁడై యాబాలకుని చేయి పట్టుకొని బలవంతముగ నీడ్వనారంభించెను. బాలకుఁడు భయవిహ్వలుఁడై యత్యుచ్చస్వరంబున విలపింప నారంభించెను. "అక్కయ్యా! ఇఁక నిన్ను విడిచి పోలేనే! అక్కయ్యా! నేను—పో—లేనే! అక్కా! అక్కా!" అని యేడువఁదొడంగెను.

ఆశోకాకులనాదము నాలకించి నలుదెసలనుండియు జనులు గుంపులుగుంపులై వచ్చి యచ్చట మూఁగసాగిరి. వారిలో నొకఁడు "ఓరీ! ఏమిరా యిది?" అనియెను.

ఇంకొకఁడు—మీ రీ బాలికాబాలకుల నిట్లేల బాధించుచున్నారు?

మూఁడవవాఁడు—చూడుము! చూడుము! ఈపిల్లను వీరెట్లు బలవంతముగా బంధించినారో!

చాలమంది జను లచ్చట మూఁగి యుండుటం గాంచి యప్పుడొక శాంతిరక్షకభటుఁ డచ్చటి కరుదెంచి "ఏమి? ఏమి యీగందరగోళము!" అనియెను.

అప్పు డటనున్న పదిమందియును నొక్క టేమాటగా "సురాపానమత్తులై యున్నయీపరదేశీయు లీబాలిక నూరక కొట్టుచున్నారు. ఈమె సోదరుఁడగు నీబాలకుఁడు వచ్చి యీబాలికను విడిపించుకొనిపోవుటకుఁ బ్రయత్నించుచున్నాఁడు" అని చెప్పిరి.

సోదరీసంరక్షణమునకై ప్రయత్నించుచున్న యావీరసోదరు నాకారమునీక్షించి యాశాంతిరక్షకభటుఁడు కనుఁబుబ్బ నవ్వుకొనియెను. పిమ్మట శాంతిరక్షకుఁ డడుగుటయు నావిదేశసైనికుఁడు దృఢస్వరముతో 'ఈపిల్ల నాచే నిర్బంధింపఁబడియున్నది. మార్గమధ్యమునం దీమె నాకు దొరకినది. అప్పటినుండియు నీమె నాయొద్దనేయున్నది. ఈపిల్లవాఁ డెవ్వఁడో నేనెఱుఁగను. ఇందు నేనెవ్వరిని గొట్టను లేదు; తిట్టను లేదు." అనియెను.

అంతలో మనకుఁ బరిచితుఁడగు బియ్యము పప్పుకొన్న పురుషుఁడు చాలసేపటినుండి బాలకుని వెదకుకొనుచుఁ దుద కీవటవృక్షసమీపమున గుంపుండుటగాంచి యిచ్చటికి విచ్చేసెను. గుంపుమిక్కుటముగా నుండుటచే నాతఁ డాజనులచుట్టును రెండుమూఁడుసారులు తిరిగి చూచెనుగాని లోపల నేమిజరుగుచున్నదో యాతనికిఁ గనఁబడలేదు. అతఁడు మెల్లమెల్లగా నాగుంపు నొత్తిగించుకొని లోపలివైపునకుఁ బోయి చూచెను. అట నొకచోఁ బడియున్న సామానుల మూట ముందుగా నాతని కగపడియెను. అది గని యాతఁ డింకను సమీపించి చూచెను. వానిపిల్లవాఁ డొకసుందరబాలికపైఁ బడి యేడ్చుచుండెను.

అతఁడు బాలకునికడకుం బోయి "ఏమిరా యిది? నీవిక్కడఁ గూర్చుండి యేడ్చుచున్నావేమి?" అని యడిగెను.

ఆపురుషునిం గాంచినంతనే బాలకునిరోదనము మఱింతయధికముకాసాగెను. అప్పు డా బాలకుఁ డస్పష్టస్వరముతో "నేనీక నెప్పుడును నాయక్కను విడిచి యుండను" అని యేడువఁదొడంగెను.

అది గని యాపురుషుఁ డాశ్చర్యచకితుఁడై పోయెను. అప్పు డటనున్న వారందఱు నాతని ననేకప్రశ్నలు వైచుచు బాధింపఁ దొడంగిరి. తుద కాపురుషుడట నున్నవారందఱంగాంచి "నేనుస్థానేశ్వర సైనికులలో నొక్కఁడను. నిన్న రేయంతయు రాజభవనద్వారరక్షక కృత్యమును నిర్వహించి యీయుదయమున బియ్యము, పప్పు మొదలగుసామగ్రిలను గొనితెచ్చుకొనుటకై యంగడికిఁ బోయితిని. ఆ సామగ్రిల మూట పెద్దదై నాకొక్కనికిని బరువైనందున నంగడివాఁడు నాకుసాయముగా నీకుఱ్ఱవానిం బంపెను. ఈపిల్లనుమాత్రము నేన్నఁడును జూచియుండలేదు." అని చెప్పెను.

మార్గమధ్యమునం దా బాలికను బట్టుకొని తనవెంటఁ బెట్టుకొనివచ్చిన విదేశసైనికుఁ డప్పుడు యీ బాలిక యీపాటలీపుత్ర నగరమునకు సంబంధించినది కాదు" అని శపథపూర్వకముగా నెఱింగించెను.

చూచుచుండఁగనే జను లచ్చటికి గుంపులుగుంపులుగా వచ్చి చేరుచుండిరి. కుటీరములయందలి శాంతిరక్షకభటులుకూడ నచ్చటికి వచ్చిరి. కాని యెంతప్రత్నించినను వారచ్చటికలకలమును వారింపఁ జాలకపోయిరి. క్షణక్షణమునకును మూఁగి పోవుచున్న జనసమూహము నాఁపఁజాలకపోయిరి. నాగరికులసంఖ్య ప్రతినిమిషమునకును వర్ధిల్లి పోవుచుండెను. అందుచే నగరవాసుల పక్ష మధికబలవంతమయ్యెను.

చూచుచుండఁగనే యీయిరుతెగలవారికిని నతిగంభీర మగు పోరాటము పొసంగెను. మొట్టమొదట వాదవివాదములు, దూషణాధిక్కారములు, తర్జనభర్జనములును ప్రారంభమయ్యెను. మెల్ల

మెల్లఁగా నవి ముష్టాముష్టికివచ్చెను. పాప మాకొలఁదిమంది శాంతిర క్షకులు నేమిచేయఁగలరు? ఆపోరు మాన్పఁజాలక వారటనుండి పాఱి పోవలసినవారైరి.

అల్పకాలముననే యాయుభయపక్షముల హస్తాఘాతప్రత్యాఘాతములును నల్పయుద్ధముగాఁ బరిణమించెను. స్థానేశ్వర సైనికులు యుద్ధముకొఱకే వచ్చినవారు గావున వారియొద్ద శస్త్రాస్త్రములు సంసిద్ధముగనే యుండెను. కాని, పాటలీపుత్రపౌరులు యుద్ధమునకు వచ్చియుండలేదు. వారిలోఁ గొందఱు బండివాండ్రు, కొందఱు గాడిదలవాండ్రు; అందును గొందఱు కూలివాండ్రును, గొందఱు జలవాహకులును, గొందఱు మూటలను మోచికొని వచ్చినవారును—అయినను నచ్చటఁ జేరిన పాటలీపుత్రపౌర సంఖ్య స్థానేశ్వర సైన్య సంఖ్యకు మూఁడింత లధికముగా నుండెను.

స్థానేశ్వర సైనికులు మొట్టమొదట సిద్ధముగా లేకుండుటచేఁ దొలుతటి దెబ్బల కాఁగక మూఁడునాలు గడుగులు వెనుక కరిగిరి. కాని యావెంటనే వెలువడిన వారికఱకుకరవాలముల తళ తళలయెదుటఁ బాటలీపుత్రనాగరికులే వెనుకంజ వేయవలసినవారైరి. కొందఱితలలు పగిలెను. కొందఱికరపాదములు ఖండఖండములయ్యెను. కొందఱాజన్మాంధులుగఁ గావింపఁబడిరి. కొందఱుకుంటివారైరి. కాని యెవ్వరునుమాత్రము చావలేదు. రక్తపాత మారంభమైన వెంటనే నాగరికులు వెనుకకు మరల నారంభించిరి. కాని,పూర్తిగఁ బాఱిపోలేదు. చెట్లచాటునను, దిబ్బలమఱుఁగునను నిలిచి పరులపై శిలాఖండవృష్టిని గురియించుచుండిరి.

ఆసమయమున గంగాతీరసమీపమునఁ బోవుచుండు రాజమార్గమునఁ బాటలీపుత్రసైన్యములోని యొకభాగము నగరమునుండి శిబిరములకడకు వచ్చుచుండెను. కాని, యాసైనికులఁ గాంచినను మన

నాగరికుల కుత్సాహ మధికము కాదయ్యెను. సరిగదా యాసైనికు లం గాంచినంతనే యానాగరికు లొక్కరొక్కరుగా నటనుండి పాఱిపోవ నారంభించిరి. తమకు సాయము చేయకుండుటయే గాక తాముపోరాడుచున్నందుల కాసైనికులు తమ్ము శిక్షింతురేమోయని యా నాగరికులకు భయము దోఁచెను.

ఆసమయమునకు సరిగా నదీతీరమునందలి యామార్గమును బట్టి యొకరథ మతివేగముగ నగరాభిముఖమై పోవుచుండెను. అది యాసమీపమునకు వచ్చినంతనే యెచటనుండియో యొక పెద్దఱాయి రివ్వున నెగసి వచ్చి రథసారథితలపైఁ దగిలెను. ఆదెబ్బతో నాక్షణమునందే సారథిరథమునుండి క్రిందికిఁ బడిపోయెను తోడనే రథ్యములు రెండును బెదరి తమయిచ్చవచ్చినరీతిని విచ్చలవిడిగఁ బరుగువాఱసాగెను. ఈవిలక్షణవ్యాపారముం దిలకించి రథమునం దున్నవ్యక్తి తటాలునఁ గ్రిందికి దుమికెను. రథముమాత్ర మతివేగముగా నగరాభిముఖమై వెడలిపోయెను.

రథమునుండి యుఱికిన పురుషుఁడు ముందుగా సారథిని సమీపించి కొంతతడ వల్లెపరికించెను. వాఁడు మరణింపలేదు. కాని మస్తకముమాత్రము చీలి యుండెను. శోచనీయంబగు నాతని యవస్థం గాంచి యాపురుషుఁడు క్రోధావేశపరవశుఁడయ్యెను. ఆతని మొగ మెఱ్ఱఁబాఱెను. అప్పుడే సరిగ నాగరికుఁ డొకఁడు రువ్వినశిలాశకల మాతనివీనులందాఁకునట్లు రివ్వున ధ్వని సేయుచుఁబోయి యొకకుటీరమునకుఁ దగిలి క్రిందఁ బడిపోయెను? అది గని యావీరుఁ డాశ్చర్యవివశుఁడై యొఱనున్నకరవాలమును వెలువరించి ఱాళ్ళుపడుచున్నవైపున కతివేగముగ నభిముఖుఁడై పోయెను, వైరులపైని శిలావర్షము గురియించుచున్నవా రందఱును నొకచెట్టుచాటున నిలిచి మొగములను మాత్ర మావంకకుఁ ద్రిప్పియుండిరి. అప్పుడు శిలావర్షవేగము తగ్గుట

యు సైన్యము మెల్లగ నగర సమీపమునకు వచ్చుచుండెను. పౌరులు తమకు దొరకిన త్రోవను బట్టి పలాయితు లగు చుండిరి.

చెట్టునీడను నిలిచియున్న వారందఱును మనరక్షకునిం దిల కించి శక్తి కోల్పడిని బాఱిపోవుట కారంభించిరి. వారిలో నొక్కఁడు బాగుగఁ బరికించి "ఓరీ! వీరు మనయువరాజుగారురా" అనియెను.

ద్వితీయుఁడు—(పరిహాసముగా) నీకేమైనఁ బిచ్చిపట్టలేదుగద! మనయువరాజుగా రింతవారా? ఈసమయమునవారిక్కడ కేలవత్తురు?

మొదటి—ఏమి! యువరాజులకు వాహ్యాళిగా వచ్చుటయు నసంభవమేనా?

ద్వితీయుఁడు—ఛేమ్; యువరాజీరెండుజాముల నడియెండవేళ నీబయిటికి వాహ్యాళివచ్చుట యీనగరమునందు మఱి యెచ్చటను జోటు లేకయేనా?

మొదటి—సరిసరి! యువరాజునకొక్కొక్కప్పుడు మతి చ లించి పోవుచుండు ననుసంగతి నీకుఁ దెలియదు గాఁబోలును!

ద్వితీ—అట్లయిన నీవు పోయి మీయువరాజును దర్శించి రమ్ము. నేనేమో పాఱిపోవువాఁడనే.

మొదటివాఁడు చెట్టుచాటునుండి వెలువడి వచ్చి "యువరాజు నకు విజయ మగుఁగాక" అనియఱచుచు నావీరపురుషునకుఁ బ్రణా మముం గావించెను. ఆవీరుఁ డాతనివంక విస్మితనయనములతో వీక్షిం పసాగెను. ద్వితీయుఁడు పలాయితుం డగుట కుద్యుక్తుఁ డయ్యెను. వీరుఁ డాతని నాఁగుమని వారించెను. ఆకంఠస్వరము నాకర్ణించి వాఁడా శ్చర్యపడుచు నడుగు కదపకుండ నిలిచి యువరాజునకు జయమగుఁ గాక!" అనియెను.

అప్పు డందందు దాఁగియున్న నాగరికులందఱును ధైర్యము తెచ్చుకొని యొక్కొక్కరుగ వెడలివచ్చి యాపురుషునకభివాదనముం

గావింపఁదొడంగిరి. నిమిషములో హాభూరుహచ్ఛాయయంతయును జన సమూహముతో నిండిపోయెను. పాటలీపుత్రపౌరులు పాఱిపోవుటం గాంచి స్థానేశ్వరసైనికు లింతవఱకును నిశ్చింతులై యుండిరి. కాని మరల నావృతుచ్ఛాయను జనులు నిండియుండుటం జూచి వారును ఱాళ్లు రువ్వుట కారంభించిరి. ఒక్కయిటుకతునుక యువరాజు శిరస్త్రాణము నంటిదూసికొనిపోయెను. అది చూచి నాగరికులు మరలఁ జెలరేఁగిరి.

ఈసమయమునసే సైన్యభాగ మూపోరుచున్నచోటికి వచ్చి చేరెను. అచ్చటిజనసమూహముంగాంచి తమనాయకు నాజ్ఞచే నాసేన యాప్రదేశముననే యాఁగెను. మనవీరపురుషుఁ డాసేనను సమీపించి నాయకునిం గాంచి నన్ను గుర్తించితివా?" అనియెను.

నాయ-లేదు.

వెంటనే యావీరుఁడు తనశిరస్త్రాణమును దీసెను. అంతనాతని పింగళకేశకలాపము విడివడి మూపునను భుజములను వ్రేలాడఁదొడంగెను. సేనానాయకుఁ డప్పుడు లత్యపూర్వకముగాఁ దిలకించియాపురుషున కభివాదన మొనరించెను.

తోడనే మగధసైనికు లందఱును జయధ్వనులం గావించిరి. నాగరికులుంగూడ నాధ్వనులతోఁ దమజయధ్వనులను గలిపిరి. ఆపురుషుఁడు నిజముగా యువరాజుశశాంకుఁడే. దేహమున లోహకవచముండుట వలన నాపదునాలుగేండ్లకుమారుఁడు నొక బలశాలి యగువీరపురుషునివలెఁ గన్పట్టుచుండెను.

కుమారుఁడు——విశేషము లేమి?

నాగరికులు——ఈవిదేశసైనికు లొకబాలికను బట్టికొని పోవుచున్నారు. ఆపిల్లను వదలివేయుఁడని మేమందఱమును జెప్పితిమి. అందుపై వారందఱును జెలరేఁగి మాపై నొక్కుమ్మడిం బడి పోరాడఁదొడంగిరి.

గాయముతైనవారందఱును దమతమగాయములను యువరాజునకుం జూపిరి. శస్త్రవిహీనులై యున్న యానాగరికులకుం దగిలినశస్త్రాఘాతముల నుపలక్షించి మగధసైనికులు కోపావిష్టులైరి. మఱియును బడిపోయిన సారథిం గాంచిన యాసైనికులను శాంతింపఁ జేయుట యెంతో కష్టమయ్యెను.

యువరాజు నాజ్ఞానుసారము సేనానాయకుఁడు స్థానేశ్వరునిశిబిరమునకు బయలుదేఱెను. కాని వెనుకనుండి శిలావృష్టియగుచుండుట వలన నాతఁడు మరల వెనుకకు మరలవలసివచ్చెను. అనంతరము యువరాజునానతిం గైకొని మగధసేన యాసేనపైఁబడి చెల్లాచెదరు గావించెను. స్థానేశ్వరసైనికులు మద్యపానోన్మత్తులై యున్నందున నధికప్రయాస లేకుండఁగనే పరాభవింపఁబడిరి. మత్తులేనివా రొకరిద్దఱు మాత్రము పిక్కబలముచూపి పలాయితులై ప్రాణమును దక్కించుకొనిరి. తక్కినవారల్లే క్రిందఁబడిపోయిరి. ముగ్గురునలుగురు మాత్రము పట్టి తేఁబడిరి.

కుమారశశాంకు నాజ్ఞానుసారము మనకుఁ బరిచితులైన బాలికాబాలకులు బంధవిముక్తులై రాజమార్గమునకుఁ దేఁబడిరి. వారిని దనరథమునఁ గూర్చుండఁబెట్టుకొని కుమారశశాంకుఁడు నగరాభిముఖుండై వెడలిపోయెను. అనంతరము సైనికులును నిష్క్రమించిరి.

అప్పుడు సాయంకాల మగుచుండెను. ఇంతలోఁ బైనివివరించిన యుద్ధవ్యాపార మంతయు నగరమం దంతటను వ్యాపించెను. దుష్టులును, కలహప్రియులునగుజనులు గుంపులుగుంపులుగా వచ్చుటచే నాగరికులసంఖ్య యగణితమయ్యెను. సైనికులు వెడలినతరువాత నాగరికులు శత్రుశిబిరములఁ గొల్లగొనఁదొడంగిరి. వారిని వారించుట శాంతిరక్షకుల కసాధ్య మయ్యెను. తుదకు నాగరికులు వారినిగూడఁ గొట్టి పాఱఁదోలిరి. వారట్లు దోచుకొని శిబిరముల కగ్నిని ముట్టిం

చిరి, గగనపర్యంతమును వ్యాపించియున్న యగ్నిజ్వాలలం గాంచి స్థానేశ్వరసేనాపతి తమశిబిరములం దేదో యపాయము కలిగినదని యనుకొానెను. తోడనే యాతఁడు నగరమునందున్న పదివం డ్రెండువందలయుం గరక్షక సైనికులతో శిబిరములకడకు వచ్చిచూచెను. అప్పటికప్పుడే శిబిరము లన్నియు నగ్నిదగ్ధములై భస్మరాసులైపోయెను. అగ్నిజ్వాలలు చాలవఱకుఁ జల్లారిపోయెను. సురాపానప్రమత్తులైయున్న సైనికులతోఁ బోరు సలిపి నాగరికులు శిబిరముల నగ్నిముట్టించి ధ్వంసము చేసి రనుసంగతి యప్పు డాతనికిఁ దెలియవచ్చెను.

ఆఱవ ప్రకరణము.

రోహితాశ్వదుర్గ మతిప్రాచీన కాలమునుండియు నార్యావర్త దేశచరిత్రమునఁ బ్రఖ్యాతిగాంచి యున్నది. ఇది దక్షిణమగధకరూశ దేశముల దక్షిణసీమలో నున్నది. అరణ్యములచే నిండియుండు నా విశాలప్రదేశమున కీరోహితాశ్వదుర్గ మొక్కటియే ప్రవేశద్వారమైయుండెను. చరిత్రారంభము మొద లిప్పటివఱకు నీదుర్గాధిపతులే యాయరణ్యావాసులందఱకు నేలికలైయున్నట్లు తెలియవచ్చుచున్నది. మహమ్మదీయులవిజయానంతరము "రోహితాశ్వదుర్గము" అనుపేరు మారి దీనికి " రోహితా" యనుపేరు వచ్చెను. పఠానులయు, మొగలులయుఁబరిపాలనకాలములలో రోహితాశ్వదుర్గాధిపతులే సుబాబిహారునకు దక్షిణభాగసంరక్షకులై యుండిరి. శేర్షహా, మానసింహుఁడు, ఇస్లాంఖాను, శాయేస్తఖాను మొదలగు చరిత్రప్రసిద్ధపురుషులనామము లీరోహితాశ్వదుర్గమున కపరిచితములు కావు. వీరెల్లరు నీప్రాచీనదుర్గజీర్ణభాగములలోఁ దమతమస్మృతిచిహ్నముల నుంచియే పోయియున్నారు.

ఈదుర్గరాజ మతిప్రాచీనకాలమున — అనఁగాఁ జరిత్రములలో నుపలబ్ధములు గాని సంఘటనములు జరగియున్న యా కాలమున — నిర్మింపఁబడినది. నదీగర్భమువఱకును వ్యాపించియున్న పర్వతభాగము నందలి యత్యున్నతశృంగముపై నీదుర్గము నిర్మింపఁబడియెను. ఆయు త్తుంగశిఖరము గాంచిన నది శోణానదీగర్భము నుండియే యుత్పన్న మైనట్లు తోఁచును.

తదనంతరము పదుమూఁడువందలసంవత్సరముల యతిదీర్ఘ కాలము గడచిపోవుటచే నీవిశాలకాలగర్భమునందు శోణనది తన గమనమార్గమునే మార్చివైచినది. ఇప్పుడు శోణనది పాటలీపుత్ర నగరపార్శ్వమునుండి గాని, రోహితాశ్వదుర్గసమీపమునుండి గాని, ప్రవహించుట లేదు. వేలేండ్లక్రిందట శోణనదీజలము ప్రవహించు చున్న ప్రదేశములలో నిప్పుడు తృణాంకురాచ్ఛాదితంబు లగుక్షేత్ర భూములును, వృక్షావలీవేష్టితంబు లగుననేకగ్రామములును విలసిల్లుచుఁ గన్నులపండువు సేయుచున్నవి. వింధ్యాచలపాద మిప్పుడు తీరమునకు బహుదూరమునందున్నది.

ఆ పర్వతోత్తుంగశిఖరముపై నీ రోహితాశ్వదుర్గము కట్టఁ బడినది. దుర్గము రెండుభాగములుగా విభజింపఁబడియెను. ప్రచండ మును, విశాలమునైన యా పర్వతశిఖరప్రదేశమునకుఁ జుట్టును గఠినపాషాణములచే నభేద్యతటమును నిర్మించి యాక్రిందిభాగమునఁ గోట కట్టఁబడి యుండెను. ఈభాగమున దుర్గపువైశాల్య మెటు చూచినను నూఱడుగులకంటె నెక్కుడుగ లేదు. కాని, యాభాగ మువఱకు నధిరోహించి పోవుట దుస్సాధ్య మగుటచే నాదృఢదుర్గ మితరుల కజేయమనియే చెప్పవచ్చును. రోహితాశ్వదుర్గము నిర్మించిన తరువాత నది యొకటిరెండుసారులకంటె నధికముగా శత్రువులచేఁ జిక్కి యుండలేదు.

ఆదుర్గమున కుత్తరద్వారముచెంత స్థూలశరీరుఁడును, వృద్ధుఁడు నగునొకపురుషుఁడు కూర్చుండి దంతధావనము చేసికొనుచుండెను. ఆతఁడట్లే దంతధావనము సేయుచుఁ జాలసేపటివఱకును గూర్చుండి యుండెను. ఆతని ప్రాతర్విధి పూర్తియగులోపలనే దుర్గద్వారముకడ నెవ్వరిదో యడుగులచప్పుడు వినవచ్చెను.

చూచుచుండఁగనే యొకబాలిక యతిత్వరితముగా నచ్చటికి వచ్చెను. ఆబాలిక యసమానరూపవతి; ఉంగరములవలెఁ జుట్టుకొని యున్న యామె లంబకుంతలములు ముక్తములై మూఁపున వ్రేలాడుచుండెను. ఆకుమారిక వృద్ధునిం గాంచినంతనే తన గమనవేగము నొకింత మందగింపఁజేయుటకు యత్నించెను. ఆప్రయత్నమువలన నా జాఱునేలను గాలుజాఱుటచే నాబాలిక యొకపాషాణఫలకముపైఁ బడిపోయెను.

అది చూచి యావృద్ధుఁడును, నటనున్న సేవకుఁడును, గూడ నులికిపడిలేచి పోయి యాబాలికను లేవనెత్తిరి. అదృష్టవశమున నామె కెక్కడను దెబ్బలు తగులలేదు. బాలిక లేచి యుచ్ఛ్వాసముతో "తాతా! ఇంటఁ బిడికెడుపిండిగూడ లేదని నానియా యనుచున్నది! నేఁడు మనకుఁ దినుట కేమున్నది?" అనియెను.

ఆవృద్ధుఁడు పరమాదరముతో నాబాలికశిరమునఁ జేయుంచి మందహాసము చేయుచు "అమ్మా! నీవింత భయపడియెద వేల? ఇంట గోధుమ లున్నవిగదా! రఘువు వానిని విసరి మనకుఁ బిండి తెచ్చి యిచ్చును" అనెను.

బాలి—లేదు తాతా! లేదు. నానియా యొక్కపెట్టున నేడ్చుచుఁ గూర్చున్నది. ఇంట నొక్కగోధుమగింజకూడ లేదనుచున్నది.

బాలికవచనము నాకర్ణించి యావృద్ధునివదన మతిగంభీరమయ్యెను. కొంతవడి కాతఁడు "సరే! బిడ్డా! నేనిప్పుడు వేఁటకుఁ

బోయి యేమైనం దెచ్చెదను. ఓరీ! రఘూ! నాధనుర్బాణముల నిటు తెమ్ము!" అనియెను.

రఘువు కోటలోనికి వెడలిపోయెను. బాలిక పితామహునికంఠ మును బ్రిగాఢముగం గౌగిలించుకొని శోకస్వరముతో "తాతా! కాని—పక్షిమాంసమును, లేడిమాంసమును, నేనుదినలేను. నాకవి యేమో గాని దుర్వాసనగా నుండును "అనియెను.

వృద్ధుండు చింతాక్రాంతుండై మౌనముతో నుండెను. ఇంతలో రఘువు లోపలినుండి ధనుర్బాణములను దీసికొని వచ్చెను. వృద్ధునిదృష్టి యావైపున లేదు. బాలిక విస్మితయై పితామహునిరూపము నని మిషలోచనములతోం దిలకించుచుండెను.

కొంతసేపటి కావృద్ధుని పరధ్యానము వదలెను. ఆతనికన్నుల నుండి యొకటిరెండశ్రుబిందువులు వెడలి ముడతలుపడిన కపోలము మీఁదుగ నాతనిశ్వేతశ్మశ్రువులపైం బడియెను. అప్పు డాతండు తనసేవకునిం గాంచి "ఈధనుర్బాణములనెప్పటిచోట నుంచి నీవు నాతోం గూడ రమ్ము!" అనియెను.

పిమ్మట నావృద్ధుండు పౌత్రిని వెంటంబెట్టుకొని కోటలోని కరిగెను. తృణాంకురములతోడను, నరణ్యలతాదులతోడను నిండియున్న పటాంగణమును గడచి వారు బాలదుర్గప్రాంతముననున్న యొకచిన్న గదిలోం బ్రవేశించిరి. ఆగదికిం జేరియున్న యింకొకగదిలోనే యింటివృద్ధదాసి యగునానియా యింటనేమియు లేవని యేడ్చుచుం గూర్చుండి యుండెను. ఆమె యావృద్ధునిం గాంచినంతనే కన్నీరు తుడిచికొని భయముతో నూరకుండెను.

ఆగదిలో నొకమూలనున్న భూగృహమునం దొకచిన్న యినుపపెట్టెయుండెను. ఆవృద్ధుం డాపెట్టెను సేవకసహాయముచే నెట్లో వెలుపలికిం దీసి తెఱచి యందున్న గుండ్రనికరండము నొకదానిని బైకిం

దీసెను. ఆకరండము పాతగుడ్డపేలికలతోఁ జుట్టఁబడియుండెను. దా
నికి వాఁడినపూలమాలయొకటి చుట్టఁబడియెను. ఆవస్త్రమును దీసి
కరండమును దెఱచినంతనే యందుఁ దేజోమయంబు లగురత్నములచేఁ
గూర్పఁబడిన యొకసువర్ణవలయము గానవచ్చెను.

ఆతఁ డారత్నవలయమును సేవకునిచేతి కిచ్చి "ఓరీ! నీవు దీనిని
దీసికొని యూరిలోని కరిడి ధనసఖుఁ డనుకంసాలికి విక్రయించి యా
సొమ్ముతోఁ గొంచెము పిష్టమును, గోధుమలను గొనితెమ్ము!" అని
యాజ్ఞాపించెను.

ఆరత్నవలయము సేవకునిచేతి కిచ్చినపు డావృద్ధునికరము కరము
గంపించిపోయెను. అది యాస్వామిభక్తుఁ డగుసేవకునకుఁ గానఁబడకుం
డఁ బోవునా? వానినేత్రము లొక్కసారిగా నశ్రుపూరితములయ్యెను
గాని యాతఁడేమియు మాఱుమాటచెప్పక స్వామియాజ్ఞను నిర్వహిం
చుటకై యటనుండి యతిగభీరహృదయములో, మందగమనముతో వె
డలిపోయెను.

వృద్ధుఁడు నడుము విఱిగినవానిం బోలి తటాలున నేలఁ గూలం
బడియెను. ఆతనికన్నులనుండి యశ్రువులతివేగమునఁ బ్రవహించు
చుండెను. ఆబాలిక యాగదితలుపుచెంత నిలువఁబడి శోచనీయం బగు
తనపితామహునియవస్థం గాంచుచు నిశ్చేష్ట యైయుండెను.

మనచరిత్రకాలమునాఁటికిఁ బ్రాచీనగుప్తసామ్రాజ్య మాసన్న
మరణావస్థ యందుండెను. అంగ, మగధ, రాఢదేశములు తక్క తక్కి
నయితరప్రదేశము లన్నియు గుప్తసార్వభౌములవశమునుండి తొలఁగి
పోయినవి. తీరభుక్తి, వంగదేశములలో నిజముగనే స్వతంత్రరాజ్యములు
స్థాపింపఁబడిపోయెను. ఈప్రదేశాధికారులు సార్వభౌముని యధికా
రమును నామమాత్రముగమాత్రమే యంగీకరించుచుండిరి. కాని య

చ్చుట రాఁబడిలో నొకచిల్లిగవ్వ యైనను రాజధానికిఁ జేరుచుండుట లేదు. వారు తమస్వాతంత్ర్యమును బహిరంగముగా మాత్రము ప్రకటించుట లేదు ఇంతే. గుప్త సామ్రాజ్యస్థాపనారంభ కాలమున నూతనముగా నుత్పన్నములైన సామంతమండలదుర్గాధిపతులవర్గములలోఁ జాలమంది గౌడమగధ దేశవాసులే యుండిరి. గుప్తవంశపు సంపూర్ణవైభవకాలమున నూతనార్జితములగు ప్రదేశములలో గొప్పగొప్పభూవసతు లుపాయనములుగా వారికే విశేషము లభించియుండెను. అట్లు లభించిన భూవసతిని సంరక్షించుకొనుటకై వారిలో ననేకులు తమజన్మభూమిని వదలి పరదేశవాసులైరి. ఇట్టివారిలోఁ గొందఱు మగధముననే నివసించుట యావశ్యక మయ్యెను, సామ్రాజ్యమునందలి కొన్ని పెద్దయధికారములు వంశపారంపర్యముగ లభించుచుండుటచే వారికి సార్వభౌముని సాన్నిధ్యముననే యుండవలసివచ్చెను. గుప్తసామ్రాజ్యవినాశ కాలమున నీ సామంతాధికార వర్గములస్థితులు మిగుల శోచనీయము లైపోయెను. పరదేశములందలివారి యధికారములు క్రమక్రమముగాఁ దొలఁగిపోవఁ జొచ్చెను. గౌడవంగ దేశములపై నధికారము గలవారినిమాత్రము దరిద్రదేవతయధికముగాఁ బీడింపలేదు. తుదకు సార్వభౌమమహాసేనగుప్తుని తండ్రియగు దామోదరగుప్తుని పరిపాలనమునాఁటికే వారియధికారములు సంకుచితము లైపోయెను. ఆభిజాత్యవర్గమునందలి యభిమానులగు ప్రాచీనామాత్యవంశజులు రెండుపూటల నన్నమునకు గతిలేక క్రమముగా వచ్చి పాటలీపుత్రనగరమునను, మగధదేశమంతటను గూడ నిండిపోయిరి. మొదటనే జీర్ణావస్థయం దున్న మగధసామ్రాజ్యమట్టిహీనస్థితియం దున్న సామంతాదులచే నిండిపోవుటవలన మఱింత శోచనీయస్థితికిఁ బాల్పడిపోయెను. గుప్తసామ్రాజ్యపుఁ బూర్ణవైభవకాలమున నీరోహితాశ్వదుర్గస్వాము లధికపరాక్రమవంతులై యుండిరి. దక్షిణపుసరిహద్దులను సంరక్షించుటయందుఁ దమపరాక్రమములను బ్రక

టించి యుండుటవలన సార్వభౌమునికడ వీరి కధికసన్మానము లభించుచుండెను. విజయములమూలమున దేశముల వెంబడి దేశములు సామ్రాజ్యమునఁ జేరుచున్నకొలఁదిని రోహితాశ్వదుర్గాధిపతులకు మాళవవంగదేశములలో ననేకభూములు పారితోషికములమూలమున లభించుచుండెను. అవియన్నియును సామ్రాజ్యవినాశకాలమున వారికడనుండి తొలఁగిపోయెను. వంగదేశమునందలి భూవసతులు వారిస్వాధీనమునందున్నంతవఱకును వారు దరిద్రదేవతబాధలకుఁ బాల్పడియుండలేదు. దామోదరగుప్తచక్రవర్తికాలమునుండియే వంగదేశమునందలి రాజాధికారులు రాజ్యమునందు గ్రహించినపన్నులను సార్వభౌమున కర్పింపక కూడఁబెట్టుకొనుట కారంభించిరి. అటుపిమ్మటఁ గొంతకాలమువఱకు మాత్రమే రోహితాశ్వదుర్గాధినాథులకు వంగదేశభాగములు లభించుచుండెను. కాని, క్రమక్రమముగా నది కట్టువడిపోయెను. ఇఁక దుర్గపరిసరప్రదేశములుమాత్రమే దుర్గాధిపతులస్వాధీనములై యుండెను. అందు ఫలించినపంటలో నాఱవభాగమువలన దుర్గాధిపతి జీవనయాత్ర గడచుట యతికష్టముగా నుండెను.

నేఁటియుదయమునఁ గండకముకడఁ గూర్చుండి దంతధావనము చేసికొనుచున్నవృద్ధపురుషుఁడే ప్రస్తుతరోహితాశ్వదుర్గాధిపతి. ఆతని నామము యశోధవళుఁడు. ఆతఁడు ప్రాచీనదుర్గాధిపవంశమున జన్మించియుండెను. ఆతని పూర్వులకు మహానాయకబిరుదము వంశపారంపర్యముగా నెగడుచుండెను. గుప్తసామ్రాజ్యమునం దాబిరుదము రాజకుమారపదవితో సమానముగ గౌరవింపఁబడుచుండెను.

యశోధవళదేవునివయసు డెబ్బదియేండ్లకన్నను గొంచెమెక్కువయే. సార్వభౌమదామోదరగుప్తుని పరిపాలనకాలమునం దీతఁ డనేకసంగ్రామములలో విజయముఁగాంచి యనంతయశము నార్జించియుండె

ను. ఆతఁడీమహాసేనగుప్తుని కాలమునఁగూడ మౌఖరీవంశజు లగురాజులను బరాజితులఁ గావించి దక్షిణమగధదేశమునందలివిల్లివజ్యాలలను జల్లార్చివైచెను.

యశోధవళదేవున కొక్కఁడే పుత్రుఁడు. ఆతనిపేరు కీర్తిధవళుఁడు. ఆతఁడు తనతండ్రికిఁ దగినపుత్రుఁడై యనేక రణరంగములలో విశేషయశము సంపాదించెను. దరిద్రయాతన దుర్భరమైనందున నాతఁడు వంగదేశమునందలి తనపూర్వజుల యధికారములను దిరిగి స్వాధీనము చేసికొనుటకై తండ్రియానతిని బడయకుండఁగనే వెడలిపోయెను. అట్లు చని యాతఁ డనేక నదీనదవనపర్వతవేష్టితంబగు సమతట దేశమున రణరంగమున వీరవిహారముం గావించుచు రాజపుత్రులకుఁ బ్రశంసనీయం బగువీరమరణముంగాంచెను. పతిమరణవృత్తాంతము నాలకించి యాతని సతీమణియుఁ బతివ్రతలకనురూపంబగు చితారోహణముం గావించి స్వర్గపదలాభమును జూఱగొనియెను. అప్పటినుండియు యశోధవళదేవుఁడు పసికూనయగు పౌత్రితో భగ్నహృదయముతో నాదుర్గమునందే నివసించుచుండెను. పుత్రమరణానంతరమునుండియే యాతని దీనస్థితికిఁ బ్రారంభమయ్యెను. క్రమముగా నాతని ప్రజలు తమతమనియమముల ననుసరించి పన్నులను జెల్లించుట మానివైచిరి. అందువలన వేతనములు సరిగా నీయకుండుటచే దుర్గమునందలి యధికారులును సేవకజనులు నొక్కరొక్కరుగాఁ బనులను మానుకొనిపోయిరి. తుట్టతుదకింటిసేవకుఁడు వృద్ధరఘువును, దాసియగు నానియాయునుమాత్రమే యాయింట మిగిలియుండిరి. అప్పటికిని భూవసతులనుండి రావలసిన పన్నులో, అంకుఁ బండినధాన్యమో పూర్వమువలెనే సరిగావచ్చుచున్నచో దుర్గాధిపతి కంతటిదీనదశ సంప్రాప్తించి యుండదు. కాని, సేవకజను లెవ్వరును లేకపోవుటచే ధాన్యము సరిగా నింటికి రావయ్యెను. అడుగువా రెవ్వరును లేక రయితులు పన్నుల

ను జెల్లించుట మానివైచిరి. అందుచే యువరాజభట్టారక పాదీయ మహానాయక యశోధవళదేవునింట నొకయున్న పుమెతుకునకుఁగూడ గఱవైపోయెను. తుదకాతఁడు తన మృతపత్నికి గుఱుతుగాఁ జూచుకొనుచున్న యలంకారమునుగూడఁ బొట్టకొఱ కమ్ముకొనవలసినవాఁ డయ్యెను.

బాలిక చాలసేపటివఱకు నాఁగడివాకిటనే నిలువఁబడి తనతాతగారి యవస్థం గాంచుచుండెను. ఆమె విముగ్ధతరళనయనము లశ్రుజలపూరితములై యుండెను. ఇంతలో వానియా యచ్చటికి వచ్చి యాబాలికను జంకఁబెట్టుకొని తీసికొనిపోయెను.

మెల్లమెల్లగాఁ బగలు రెండుజాములు గడచిపోయెను. అప్పుడు రఘువొక పెద్దసంచిని బుజముపైఁ బెట్టుకొని యెగయూపిరి విడుచుచు నలసమందగమనములతో నచ్చటికిఁ జేరుకొనియెను. వాని సర్వాంగములును ఘర్మజలపూరితములై యుండెను. వానిం జూచినంతనే యశోధవళుఁ డించుక తెప్పరిల్లెను. అప్పుడాతఁ డొక్కనిట్టూర్పు విడిచి యావృద్ధసేవకునివంక దృష్టి సారించెను. రఘువు తన కొంగుముడి నుండి పదిసువర్ణముద్రలను బైకిఁ దీసి "స్వామి! ధనసఖుఁడు క్రియధనమంతయు నిప్పుడీయఁజాలనని చెప్పినాఁడు. సాయంకాలములోపలఁ దక్కినసువర్ణముద్రలను స్వయముగాఁదీసికొని ప్రభుసన్నిధానమునకు వచ్చి సమర్పించునఁట! ఆతఁడు మీకు నమస్కారములని చెప్పుమన్నాఁడు" అనియెను.

ఆనాఁడు యశోధవళదేవున కొక్క మెదుకైన నోటికిఁ బోలేదను సంగతి వానియారఘువులకుఁ దెలియక పోలేదు.

సంధ్యాకాలమునకుఁ గొంచెము ముందుగా శరీరమంతయు ముడుతలువడియున్న వృద్ధుఁడొకఁడు మెల్లమెల్లఁగాఁ గోటలోనికి వచ్చి చేరెను. ఆదుర్గదుస్థితిం గాంచినంతనే యావృద్ధుఁ డాశ్చర్యస్తంభితుఁ

నై పోయెను. తోరణద్వారముకడ నొకరక్షకభటుఁడైనను లేఁడు. ఆపెద్దదర్వాజాపలకలును, ద్వారబాధములును బొత్తుగఁ జెడిపోయి వానియినుపసంకెలయు, నర్గళములును దునియలై యాద్వారము నెదుట నేలపై నటునిటు బడియుండెను. దుర్గమునందలిబయలంతట ను బచ్చనిగరికయు, నరణ్యలతలును దట్టముగా నెదిగి యల్లుకొని యుండుటచే లోపలఁ బ్రవేశించుటకే మహాప్రయాసముగా నుండెను. గోడలపై వటాశ్వత్థాది మహోన్నతవృక్షములు కొన్నివత్సరములకుఁ బూర్వమే మొలచి క్రమముగా బలసి ప్రచండముగా విస్తరిల్లి యుండెను. దుర్గాధిపతివాసస్థలమంతయు సంపూర్ణముగా శిథిలమై నివసించుట కయోగ్యమై యుండెను. అందలియుపకరణములన్నియు నెవ్వరును సంస్కరింపకుండుటచేఁ గడు దుర్గంధయుతములై యుండెను. దుర్గాంతర్భాగమంతయు జనసంచారమే లేని మహారణ్యప్రదేశము వలెఁ గానవచ్చుచుండెను.

బాలదుర్గమున కడుగుననున్న యొకచిన్నభవనము నెదుట నమూల్యంబును, బురాతనంబు నగునొకశయ్యపై వృద్ధదుర్గాధిపతి యాసీనుఁడై యుండెను. ఆయాగంతుకవృద్ధుఁడు స్వర్ణకారుఁ డగుధనసఖుఁడే యని పాఠకు లూహించి యుందురు. ఆతఁడు దుర్గాధిపతిం గాంచి భూమివఱకును వంగి వినయముతోఁ బ్రణామముం గావించెను. యశోధవళుఁ డాతని గూర్చుండుమనియెను; గాని యాతఁ డట్లు కూర్చుండకయే తాను తెచ్చినసంచిలోనున్న కొన్నిసువర్ణముద్రికలను దీసి దుర్గాధిపతి సన్నిధినుంచి “అయ్యా! తమ రత్నవలయమునకు విలువ యింతయగునని నేనిప్పుడు చెప్పఁజాలకున్నాను. ఇప్పుడు నాయొద్ద సిద్ధముగనున్న వేయిమొహరీల నిచ్చుటకిఁ దెచ్చియున్నాను. తక్కినసొమ్ము కొలఁదిదినములలోనే పాటలీపుత్రమునుండి తెప్పించి సమర్పించెదను” అని చెప్పెను.

దుర్గా—ఏమి ? రత్నవలయమువిలువ యంత హెచ్చుగా నుండుననియా నీయుద్దేశము?

స్వర్ణ—ఈమిగా సేవకుని యల్పబుద్ధితోఁ బరీక్షించినను దీని మూల్యము పదివేలమొహారీల కెంతమాత్రము తగ్గియుండ దని తోఁచుచున్నది.

దుర్గా—ధనసఖా ! నీవంత మొత్తము నీయఁగలవా?

స్వర్ణ—చిత్తము. నేను నాపుత్రుని పాటలీపుత్రమునకుఁ బంపియున్నాను. వాఁడు వచ్చినవెంటనే సొమ్మంతయును దమ కొప్పగించెదను.

యశోధవళుఁడు నిశ్చింతుఁడై యున్నట్లు కానఁబడెను. కాని, ధనసఖుఁడుమాత్రము వెడలిపోక యెప్పటిచోట నట్లే నిలిచియుండెను. మఱికొంతసేపటికి దుర్గస్వామి యాతనిం గాంచి "ఓయీ! జాపిల గ్రామమున నా సేనాధిపతి మహేంద్రసింహుఁ డుండెనుగదా! ఆతఁ డింకను జీవించియుండునా?" అని యడిగెను.

ధన—ప్రభూ! మహేంద్రసింహుఁడు పరలోకమున కేఁగి చాలకాలమైనది. ఆతనికుమారుఁడు వీరేంద్రసింహుఁడు పొలములు దున్నుకొని బ్రదుకుచున్నాఁడు. కాని జాపిలగ్రామములోని మా పురాతనసేవకులగు సేనానాయకహరిదత్తుఁడును, అశ్వపటలికవిధుసేనుఁడును, పర్వతప్రదేశమందలి విధుసేనుఁడును నిప్పటికి సజీవులై యున్నారు,

వృద్ధయశోధవళదేవునిలోచనము లాకస్మికముగాఁ దేజఃపుంజము లయ్యెను. ఆతఁ డించుక కంపితస్వరముతో "ధనసఖా! నీవిప్పుడిచ్చటికి వచ్చుట చాల నుపకారమే యైనది. నేను పాటలీపుత్రమునకుఁ బోవఁదలఁచి యున్నాను. నీవు వీరినందఱనొక్కసారి నాయొద్దకుఁ బంపఁగలవా?" అనియెను.

ధనసఖుఁడు మోకరించి ముకుళితహస్తుఁడై "ఏలికా! మీ పురాతన సేవకులచేతఁ బ్రేరేపితుండ నగుటచేత నే నీదుర్గమంబగు పర్వతము నధిరోహించి తమసన్నిధి కేతెంచితిని. పదిసంవత్సరముల నుండి మీదర్శన మెవ్వారికిని లభించుట లేదు. వంగదేశరణాంగణము నుండి విజితులై మరలివచ్చినవారు తమకు మొగము చూపఁజాలక లజ్జాభరంబునఁ గ్రుంగి యున్నారు. కాని, తమ దర్శనభాగ్యము లేని లోపముచే నల్లాడుచున్నారు. సెలవైనచో వారెల్లరును రేపటియుదయముననే మీదర్శనము సేయఁగోరుచున్నారు" అనియెను.

యశోధవళునకుఁ గన్నులు నిండిపోయెను. అతఁడు గద్గదస్వరముతో "ధనసఖా! రాఁదలఁచినవారి నందఱను రానిమ్ము! వారిని గాంచిన నాకు నానందముగనే యుండును. కాని—వారితో ముందుగా నీమాటలు చెప్పివేయుము—నాలోఁ బూర్వపుసామర్థ్యము లేదు—ద్రవ్యబలము లేదు—జనబలము లేదు—వారికొక్కపట్టెఁడన్నము పెట్టుటకైనను నాకుశక్తి లేదు. ధనసఖా! నీకీసంగతి తెలియునుగదా! అట్లుకాకున్నఁ బరలోకవాసినియైన నాపత్నిరత్నవలయమును విక్రయించుటకు నీయొద్దకుఁ బంపియుందునా?" అనియెను.

దుర్గాధిపతి చెప్పినయీమాటలను వినుచు నాసాన్నారి మౌనముతోఁ గన్నీరు విడుచుచుండెను; అతని నోట మాట వెడలలేదు. అతఁ డింకొకసారి భూమివఱకును వినమ్రుఁడై దుర్గాధిపతికి నమస్కరించి సెలవుఁ గైకొని వెడలిపోయెను.

ఏడవప్రకరణము

సాయంకాలమై రెండుగడియ లైనది. పాటలీపుత్రపు ప్రాఁత రాచవాడలోని యంతర్భాగమునందలి యొకచిన్నిమహాలునం దిరువురు కూర్చుండియుండిరి.

ఆమహాలునకు నీలితెరలు వేయఁబడియుండెను. నేలపై నమూల్యము, నతిమృదులము నగు నావరణవస్త్రము పఱుపఁబడియుండెను. దానిపై నమర్పఁబడిన యొకగజదంతభద్రాసనముపై వృద్ధమహాదేవి కూర్చుండియుండెను. ఆమెసమీపమున నున్న స్వర్ణసింహాసనముపై సార్వభౌమప్రభాకరవర్ధనుఁ డాసీనుఁడై యుండెను. ఆతఁడు పసిమిబంగారువన్నెగల వస్త్రములను దాల్చి యుండెను. మహాలులో నొకమూలనున్న సుగంధతైలదీపము మినుకుమినుకు మని వెలుఁగుచుండుటచే దానికించిత్ప్రకాశము నీలపటమువెనుకనుండి మహాలులోనికిఁ బ్రసరించుచుండెను. అంధకారమునం దాసింహాసనాసీనులై యున్న యిరువురును స్పష్టముగా నగపడుచుండుట లేదు. తల్లియును గుమారుఁడు నప్పుడతిమృదుస్వరమున సంభాషించుకొనుచుండిరి.

మహాదేవి—ప్రభాకరా! నీవొక్క పెట్టున ననాలోచితముగా నింతతొందరపడి పోవుటకుఁ బసిపిల్లవాఁడవు గావుగదా! నీవిప్పుడు తారుణ్యమును గూడ నతిక్రమించినవయసువాఁడవైయున్నావు. మగధమంతయు నీమేనమామగారిరాజ్యము; ఈవాడ నీమాతామహావంశీయులది. నీవిప్పుడీపాటలీపుత్రమునకు బంధుఁడవై వచ్చియుంటివి. ఈ సంగతి యింతయును నీవు మఱచియేపోయితివా? నీమాతామహవంశము సర్వవిధములచేతను సమున్నతమును, ప్రాచీనమునై వన్నెగాంచియున్నది. ఈభారతభూమియం దీవంశమువా రతిమాననీయులై ప్రసిద్ధికెక్కియున్నారు ఇప్పటికినిగూడ నుత్తరదేశీయులలో నీపితామహవంశీయులకంటె మాతామహవంశజులకే యధికసన్మానము కలుగుచున్నది. కాలప్రభావముచే నిప్పుడు నాజనకవంశమునకు దుర్దశసంభవించినది. భాగ్యచక్రము తిరిగిపోవుటచే నీపితృవంశమునకు సంపూర్ణవైభవముకలిగినది. ఇట్టిస్థితిలో మేనమామయింటికిఁ జుట్టమవై వచ్చిననీకు—సార్వభౌమపదవిరాజితుఁడవై స్థానేశ్వరరాజ్యే

శ్వరుఁడవగు నీకు—మేనమామ నీవిధముగా నవమానించుట మరి యాదయా?

మహాదేవి మెల్లఁగ మాటాడుచుండెను. మహాలునకు వెనుక ప్రక్కనే నిలిచి యెవ్వరైన నతిజాగరూకతతో నాలకించినను వారామె మాటలు సరిగా వినఁబడునో వినఁబడవో సందేహమే!

ప్రభాకరుఁ డుత్తేజితస్వరముతో "అమ్మా! మొట్టమొదట మీరు నావాదమునైన—" అనునంతలో నామాటముగియకుండఁగనే మహాదేవి మెల్లఁగా "ప్రభాకరా! చాలును. నేను నీకుఁదల్లిని. కావున నీవిప్పుడేమి చెప్పఁదలఁచితివో నాకు ముందుగనే తెలిసిపోయినది. పాటలీపుత్రమున విశృంఖలులై యున్న నాగరికులు కేవలము నిర్దోషు లని నేను చెప్పుటలేదు. కాని మవస్థానేశ్వరసైనికుల యత్యాచారముల మూలముననే వారు రేఁగి మనశిబిరములపైఁ బడియున్నారు. ఇంతవఱకు సత్యమని నేను చెప్పఁగలను" అనియెను.

తనమాటలకు నడుమనే యంతరాయము కలిగించుటవలన స్థానేశ్వరచక్రవర్తి యగు ప్రభాకరునికర్ణము లత్యరుణము లయ్యెను. అతఁ డతికష్టముతోఁ దనమనోభావమును గోపనము గావించుకొని "అమ్మా! ఇన్నిమాటలెందుకు? మీయిష్టమువచ్చినరీతినే యున్నయును గానిండు" అనియెను.

మహా—(శాంతముగా) ప్రభాకరా! నిన్నజరిగినవిషయమును గూర్చి యావ్యాపారముతో సంబంధించిన ముఖ్యులగువారి నిచ్చటికిఁ బిలిపించి నీయెదుటనే విచారణ చేసెదను. నడుమనడుమ నీవేమియు ను మాటాడవలదు. అంతయావశ్యకమైనచో నీతెరచాటునకు నన్నుఁ బిలిచి నీవు చెప్పఁదలఁచుకొన్న దేదియో నాతోఁ జెప్పుము. సరే కాని నీయధికారు లీవిషయమున నీతో నేమని చెప్పిరి?

ప్రభా—మనసిపాయిలు మార్గమధ్యమునం దొకచో నొక సుందరబాలికను దాసిగా వెలకుఁ గొనియుండిరి! వారాబాలిక నీనగరమునకుఁ గొని తెచ్చినప్పు డీనాగరికులదృష్టి యామెపైఁ బడియెను. తోడనే వారీబాలిక యీనగరమునందలి యొకవర్తకునికూఁతురని వాదింప నారంభించిరి. అదికారణముగా నాగరికులకును మనసైనికులకును వాదప్రతివాదములు జరగుచుండెను. ఇంతలో శశాంకుఁ డచ్చటికిఁ బోయి మగధసైన్యములోని యొకభాగమును సహాయముగాఁ గొని శస్త్రవిహీను లైయున్నస్థానేశ్వరసైనికులను వధింపఁజేసి వారిశిబిరములనన్నిటిని గాల్చివేయించెను. నగరద్వితీయభాగమునుండి మనసేన లచ్చటికిఁ బోయి చేరులోపలనే యన్నిపనులును ముగిసిపోయినవి.

మహా—నీయధికారులు నీతోఁ జెప్పినసంగతు లన్నియును సత్యములు గావు. ఎవరిమాటలు సత్యములో నీకిప్పుడే స్పష్టముగాఁ దెలియునట్లు చేసెదను. కొంచెముసేపు శాంతముతో వినుము.

అని యామహాదేవి కరతాళధ్వనిం గావించెను. తోడనే యవనికమఱుఁగుననుండి యొకవృద్ధసేవకుఁ డట కరుదెంచుటయు నామె యాతనిం గాంచి మహాదేవి "నగరపాలకుఁడగువినయసేను నిటకుఁ దీసికొనిరమ్ము!" అని యాజ్ఞాపించెను.

వృద్ధసేవకుఁ డామెకు రెండుపర్యాయములు వంగి ప్రణామముం గావించి తెరమఱుఁగునకు వెడలిపోయెను. అంతలోనే యాతఁడు మరల వచ్చి యట నొకపార్శ్వమున కోసరిల్లి నిలిచియుండెను. రత్నకాంతులచేఁ బ్రకాశమానంబగు కవచముం దాల్చినపురుషుఁ డొకఁడు వచ్చి ద్వారముకడ నిలిచి యమ్మహాదేవికిఁ బ్రణామముంగావించెను. ఆతఁడే నగరపాలకాధ్యక్షుఁడగువినయసేనుఁడు.

మహా—వినయసేనా! పాటలీపుత్రరాజమార్గమునుండి వచ్చుచు నొకదాసిని వెలకుఁ గొని తెచ్చినస్థానేశ్వరసైనికుని పేరేమి?

విన — అమ్మా! అతనిపేరు చంద్రేశ్వరుఁడు. ఆతఁడు జాలంధ రాశ్వారోహక సైన్యములోనివాఁడు.

మహా — నీవు పోయి వెంటనే యాతని నిటకుఁ దీసికొని రమ్ము!

రెండుసారు లామెకు నమస్కరించి వినయసేనుఁ డటనుండి వెడలి యావెంటనే చంద్రేశ్వరసహితుఁడై మరల నటకువచ్చి నిలు వఁబడియెను.

మహాదేవి యాసైనికునిం గాంచి "నీపేరేమి?" అని ప్రశ్నిం చెను.

సైని — అమ్మా! నాపేరు చంద్రేశ్వరసింహుఁ డందురు.

మహా — నీ వెక్కడివాఁడవు?

సైని — జాలంధరనగరమునం దుండువాఁడను.

మహా — నీవు స్థానేశ్వరసైన్యమునకు సంబంధించినవాఁడవు కాఁబోలును!

చంద్రేశ్వరుఁడు వినమ్రుఁడై ప్రణమిల్లెను.

మహా — వారాణసినుండి పాటలీపుత్రమునకు వచ్చుమార్గ మున నీవొక దాసిని వెలకుఁ గొని తెచ్చితివా?

చంద్రే — ఔను. ఆదాసి నిచ్చటఁ బాటలీపుత్రనాగరికు లెత్తుకొనిపోయినారు.

మహా — నీవా బాలిక నెవ్వరియొద్దఁ గొంటివి?

చంద్రే — మార్గమధ్యమునం దొకవర్తకునియొద్దఁ గొంటిని.

మహా — నీ వాతని కెంతక్రయధనము నిచ్చితివి?

చంద్రే — పదిదీనారములను (గుప్తసామ్రాజ్యమునందలి సు వర్ణముద్రికలకు దీనారములనియే వాడుక)

మహా — ఇఁక నీవు పోవచ్చును. వినయసేనా! నాగరికులు వెంటఁ బెట్టుకొని వచ్చినబాలిక నిటకుఁ దీసికొని రమ్ము!

వినయసేనచంద్రేశ్వరులు దేవి కిరుమాటలు ప్రణమిల్లి వెడలి పోయిరి. ఇంతలోఁ దెరలోనుండి సేవకుఁడరుదెంచి దేవి కభివాదన మొనర్చి " అమ్మా! ద్వారము నొద్ద సార్వభౌములు వేచియున్నారు!" అని మనవిచేసెను.

ఆమాట వినియును ప్రభాకరవర్ధనుఁడు మౌనముతో నట్లే కూర్చుండియుండెను. ఆతనింగని మహాదేవి కోపముతో "ప్రభాకరా! నేఁడు నీకింతమతిభ్రంశ మైనదేమి? మామయ్య ద్వారముకడ నిలిచియున్నాఁడని వినియు మొద్దువలె నిచ్చటనే కూర్చుంటివేమి? లెమ్ము, వేగముగఁ బోయి మామను సన్మానముతోఁ దోడ్కొని రమ్ము!" అని హెచ్చరించెను.

జననిపలుకులవలనఁ బ్రభాకరవర్ధనున కప్పు డొడలంతటను నూతనచైతన్యముదయించిన ట్లయ్యెను. ఆతఁడు చటాలున సింహాసనమునుండి లేచి మహాలువాకిలికడకుఁ బోయి మామను సందర్శించి వినయముతో లోనికి దయచేయుఁడని విన్నవించెను. ఆయవకాశములో సేవకుఁ డొకయాసనము నచ్చట సిద్ధపఱిచెను. ఇరువురును లోపలి కేతెంచి తమతమపీఠముల నలంకరించిరి.

మహా—(సోదరునుద్దేశించి) సోదరా! నీవిప్పు డిచ్చటి కేయుద్దేశముతో వచ్చినను, ప్రస్తుత మేమియును మాటాడవలదు. నేనిప్పుడు న్యాయవిమర్శనము సేయఁ గూర్చుండియున్నాను. ఇచ్చట జరుగున దంతయును మౌనముతో వినుచుండుము;

ఇంతలో నగరపాలకుఁ డగువినయసేనుఁడు పౌరకులకుఁ బరిచితమైయున్న బాలిక నటకుఁ దీసికొనివచ్చెను. ఆతనియానతి ననుసరించి యాబాలిక యామువ్వురకును బ్రణామము గావించెను.

మహా—బిడ్డా! నీపేరేమి?

బాలి—గంగ.

మహా—నీవేజాతిపిల్లవమ్మా!
బాలి—క్షత్రియను.
మహా—నీతండ్రిపేరేమి ?

ఆప్రశ్న విన్నంతనే యాబాలికకన్నులశ్రువులచే నిండిపో యెను. ఆమె యధోవదనయై గద్గదస్వరముతో "అమ్మా! నాతండ్రి పేరు యజ్ఞవర్మ" అని చెప్పెను.

తనప్రశ్నమూలమున నాబాలికకుఁ గలిగినదుఃఖస్థితిం గని మహాదేవి కాబిడ్డపై మిగుల జాలికలిగెను. ఆమె కూరట గలిగించు నుద్దేశముతో నప్పుడు మహాదేవి కరుణార్ద్రస్వరమున "బిడ్డా! నీవెంత మాత్రమును భయపడవలదు, ఇచ్చట నిన్నెవ్వరు నేమియు ననరు. నేనడిగిన మాటకుఁ బ్రత్యుత్తరము చెప్పుము, మీనివాసస్థల మెక్క డ? " అనియెను.

బాలికకన్నుల నిండియున్న యశ్రుజలము మెల్లమెల్లగఁ గపో లములపైఁ బ్రవహించి క్రమముగాఁ గ్రిందికి దిగజాఱుచుండెను. ఆమె శోకకంపితస్వరముతో" మేము చరణాద్రి దుర్గమున నివసించు వారము" అనియెను.

ఈమహాలునఁ బ్రవేశించినదిమొదలుగ నిప్పటివఱకును మహా సేనగుప్తచక్రవర్తి మౌనముతో నొకపాషాణవిగ్రహమువలె నిశ్చ లుఁడై సింహాసనమునఁ గూర్చుండి యుండెను. అక్కడ జరుగుచున్న సంభాషణలోఁ జాలభాగఁ మాతనివీనులవఱకును బోవుటయే లేదని చెప్పవచ్చును. కాని యప్పు డాబాలికనోటినుండి "యజ్ఞవర్మ" "చర ణాద్రిదుర్గము" అను నీపదద్వయము వెలువడుట నాలకించి చక్రి వర్తి యాశ్చర్యాన్వితహృదయుఁడై యాక్షణముననే బాలికనుద్దేశిం చి ' ఏమంటివిబిడ్డా? చరణాద్రిదుర్గమా? నీతండ్రిపేరు యజ్ఞవర్మ

యా? ఏయజ్ఞవర్మ? మౌఖరీనాయకుఁడగు శార్దూలవర్మ తనయుఁడు యజ్ఞవర్మ యేనా నీతండ్రి?" అని ప్రశ్నించెను.

బాలిక యేడ్చుచునే "ఔను" అనియెను.

సార్వభౌముఁ డందుపై నింకను నేమియో భాషింప నుద్యుక్తుఁ డయ్యెను. ఆసంగతి తెలిసికొని మహాదేవి యాతని వారించి యంతఃపురముఖ్యరక్షకుని బిలిచుకొని రమ్మని వినయసేనున కాజ్ఞాపించెను. వినయసేనుఁడు పోయి నిమిషములో నాతనిం దోడ్కొని వచ్చెను. మహాదేవి "యప్పు డంతఃపురమునకుఁ దీసికొనిపోయి మంచి మాటలచే నూరడించి శాంతపఱచి మరలఁ దీసికొనిరమ్ము!" అని చెప్పెను. అంతఃపురరక్షకుఁ డాబాలికను వెంటఁబెట్టుకొనిపోయెను.

మహాదేవి సార్వభౌమునిం గాంచి "సోదరా! యజ్ఞవర్మవిషయమున నీవేమియో చెప్పఁదలఁచియున్నట్లు నాకుఁ దోఁచుచున్నది. ఆతని నీవెఱుఁగుదువా?" అని ప్రశ్నించెను.

చక్రవర్తి నిట్టూర్పు నిగుడించి "దేవి! నేనిప్పుడు చెప్పఁబోవుసంగతి యనేకవత్సరములకుఁ బూర్వవిషయము. ఆకాలమునం దీసామ్రాజ్యము మహోన్నతస్థితి యందుండెను, నాబాహువు లిప్పటివలె నప్పు డింతటిదుర్బలములై యుండలేదు. ఆకాలమునందా యజ్ఞవర్మపేరు విన్నంతమాత్రముననే యుత్తరదేశము లన్నియును గడగడ వడఁకిపోవుచుండెడివి. మనస్మృతికిఁగూడ నందకుండఁబోయిన యతిప్రాచీనకాలమునుండియును మౌఖరివంశమునందలి యొకశాఖవారిపైఁ జరణాద్రిదుర్గసంరక్షణభారము వంశపారంపర్యముగ మోపఁబడియుండెను. మహారాజాధిరాజసముద్రగుప్తచక్రవర్తియే వారికా చరణాద్రిదుర్గాధిపత్యము నొసంగినట్లు నేను భట్టచారణులవలన వినియున్నాను. ప్రథమకుమారగుప్తరత్నగుప్తుల కాలమున హూణసైన్యము మహాప్రవాహమువలె నుత్తరదేశమందంతటను వ్యాపించెను. అప్పుడీసామ్రా

జ్యమునకు సంభవించిన ఘోరవిపత్తునుండి మౌఖరీవంశీయులగు దుర్గాధిపతు లీరాజ్యము నెట్లుద్ధరించిరో యాచరిత్రను సూచించు గీతములను గానము సేయుచు మననగర రాజమార్గములందుఁ జారణు లిప్పటికిని దిరుగుచున్నారు. సోదరీ! బాల్యస్మృతి నీయంతఃకరణమునుండి తొలఁగిపోయినదా? నీకువిస్మృతి కలిగినదా? వృద్ధుఁడగుయదుభట్టింకను జీవములతోనే యున్నాఁడే! నీవివాహమునకుఁబూర్వము మనము గంగాసైకతప్రదేశములఁ గూరుచుండి యదుభట్టుపాడెడిగీతములఁ నాలకించుచు నొడలు మఱచిపోవుచుండెడివారము. సోదరీ! అదియును నీవు మఱచిపోయితివా? " అని హెచ్చరించెను.

సార్వభౌముఁ డంతటితో నాఁగక సింహాసనమునుండి లేచి నిలువఁబడి "సోదరీ! మౌఖరి నరవర్మ దుర్గరక్షణభారము నెట్లునిర్వహించెనో నీవు మఱచిపోయితివా? యదుభట్టునిగీతస్వన మిప్పటికిని నావీనులఁ బ్రతిధ్వనించుచునే యున్నది. అన్నపానములకుఁగూడ నాధారము లేకపోయినయాసమయమున సర్వసైన్యమును నిరాశచే సొలసిపోయిన సమయమునఁగూడ వీరనరవర్మ యించుకేనియు భయపడలేదు. ఆతనికనిష్ఠపుత్రుఁడు నీరునీరని నోరాడించుచుఁ బ్రాణములను వదలివైచెను. అప్పుడైనను నమ్మహావీరనరవర్మహృదయమున లవమాత్రమైనను జాంచల్యముదయింపలేదు. ఆమౌఖరీవీరుఁ డప్పు డేమనియెనో వింటివా? ఆతఁడు సేనలం గాంచి 'వీరులారా! సముద్రగుప్తచక్రవర్తి మౌఖరీవంశజులను సంస్థాపించి యున్నాఁడు. ఈదుర్గమున సముద్రగుప్తవంశజులకుఁ దక్క నితరులెవ్వరికిని బ్రవేశించునధికారము లేదు. మౌఖరీ వంశజులలో నొక్కవీరుఁడైననుజీవించియున్నంతవఱకు సార్వభౌముఁడుదక్క నొరులెవ్వరును దమ సేనలతో నీదుర్గమునఁ బ్రవేశింపఁజాలరు." అని ప్రబోధించి యున్నాఁడు. ఆమౌఖరీవీరుఁడు గావించినమహావీరోపన్యాసమార్యావర్తమునకు నూతనము గాదు.

అనేకదుర్గములలో, ననేకరణరంగములలోఁ బరదేశసైనికనికాయము విస్మయహృదయముతో నిదియే వినుచుండెను. చూడుఁడు! చూడుఁడు! మౌఖరీవంశోద్భవలగు కులాంగనల వెచ్చని నెత్తురుధారలచే దుర్గమునందలిబయలంతయు లోహితమైపోయినది. తరులతాదులనుండి కోయంబడిన మృదుకుసుమములంబోలి మస్తకవిహీనంబులగు సుకుమారదేహంబులు కఠినపాషాణతలంబులఁ బడిపోయినవి. మౌఖరీవీరు లెచ్చటనున్నారు? వారు తమభార్యలకొఱకు—సోదరీమణులకొఱకు—తల్లులకొఱకు—విలపించుచున్నారా? కనుఁడు! కనుఁడు—దుర్గతటమున గరుడచిహ్నాంకితమగుధ్వజమెత్తుగా నగపడుచున్నది, కంఠమునం దెఱ్ఱనిజపాకుసుమమాలికం దాల్చి రక్తచందనచర్చితశరీరుఁడై వీరశ్రేష్ఠుఁడగు నరవర్మ గరుడధ్వజపాణియై సేనలను వ్యూహముగనే నడపించుచున్నాఁడు. ఆతని ప్రచండజయధ్వన్యాకర్ణనమాత్రముననే క్రింద వేయడుగుల దూరమునందున్న హూణులు గడగడలాడిపోవుచున్నారు. భయంకరమగు నారణకోలాహలము నాలకించి పశుపక్ష్యాదులా పర్వతప్రదేశమును వీడి పాఱిపోవుచున్నవి. వీరాగ్రణి యగు నరవర్మ యిప్పుడు నిశ్చింతుఁడై యుండెను. భార్యాపుత్త్రులంగూర్చినచింత లాతని హృదయమునుండి శాశ్వతముగనే వదలిపోయినవి. వీరనరవర్మ మానవశక్తికతీతంబులగు మహత్తరకార్యములను నిర్వహించియున్నాఁడు. కాని విధివిధానమును గడచుటమాత్ర మాతనికి దుస్తరమయ్యెను. చూచుచుండఁగనే హూణసైన్యము దుర్గతటమున కెక్కివచ్చెను. కాని మౌఖరీవీరు లొక్కఁడు జీవించియున్నంతవఱకు హూణసైన్యము దుర్గమునఁ బ్రవేశింపఁజాలకపోయెను. వీరపుంగవుఁడగు నరవర్మయు, నాతని వీరసహచరులును, దుర్గతలమునఁ జిరనిద్రానిమగ్నులైన తరువాతనే యీదుర్గము హూణసైన్యమునకు హస్తగతమయ్యెను.

దేవీ! నీవు శార్దూలవర్మను మఱచిపోయితివా? తండ్రిగారి సింహాసనము చెంతఁ బరశుపాణియై నిలిచియుండునాయోధుని ప్రచండోన్నతవిగ్రహము నీకు జ్ఞప్తికి వచ్చుట లేదా? ఆతనికుమారుఁడగు యజ్ఞవర్మను నేనెట్లుమఱవఁగలను? ఆతనిచేతికరవాలమే లేకయున్నచో నేనానాఁడు బ్రహ్మపుత్రాతీరమున సుస్థిరవర్మచేతులలో మరణించియే యుందును. ఆహా! ఆయజ్ఞవర్మపుత్రిక—"

అని పలుకుచు సార్వభౌముఁడు ప్రబలప్రభంజనాహతిం దూలు సాలవృక్షముంబోలి మూర్ఛితుఁడై పడిపోయెను.

అంతలోనే ప్రభాకరవర్మ యతినిపుణతతో నాతని గ్రిందఁబడకుండఁ బట్టుకొనియెను. లేకున్న నాతని కధికముగనే దెబ్బతగిలియుండును. అప్పుడు మహాదేవియొనరించిన గంధరగోళమునాలకించి యొక్కపరుగున సేవకులు వచ్చి సార్వభౌమున కుపచారములుచేయఁ దొడంగిరి.

కొలఁదిసేపటిలోఁ మహాసేనగుప్తుఁడు తేరుకొనియెను. ఆతఁడు మహాదేవిం దిలకించి" దేవీ! నీవిచారణలో నెట్టివ్యత్యాసమును గానవచ్చుట లేదు. నేను వృద్ధుఁడనైపోయినాను. నాతలయంతయు నరసిపోయినది. నాశరీరమున శక్తి లేదు. అట్లే నామనశ్శక్తియును లోపించినది నాయపరాధమును సైచి క్షమింపుము" అనియెను.

మహాదేవి స్నేహార్ద్రస్వరముతో" సోదరా! నీశరీర మస్వస్థముగా నున్నది. ఇట్టమున్నచో నీవు నీశయనమందిరమున కరిగి విశ్రమింపవచ్చును. ఈవిమర్శనకార్యమును నేనొక్కతెనే నిర్వహించెదను" అనియెను.

చక్రవర్తి—దేవీ! మౌఖరీవీరులు సామ్రాజ్యముకొఱకనేకయుద్ధములలోఁ బ్రాణముల నర్పించి యున్నారు. యజ్ఞవర్మ స్వయముగా నెన్నియో సంగ్రామములలో సామ్రాజ్యమును సంరక్షించి

యున్నాఁడు. అనేక యుద్ధయాత్రలలో మేమిరువురము నొక్కచోటనే కరవాలములు తలక్రిందనిడుకొని యనేక రాత్రులను గడపియుంటిమి. అట్టిమహామాన్యుఁడగుమాఖరీవీరనాయకునితనూజాత యొకసామాన్య సైనికునకు దాసియెట్లయ్యెనో యా దైవదుర్విలాసము నాలకింపవలయు నని నామనసు తహతహపడుచున్నది.

మహాదేవి సోదరున కేమియుఁ బ్రత్యుత్తర మీయ లేదు. ఆమె యొకసారి సోదరునివంకఁ జూచి పిమ్మట నగరపాలకాధ్యక్షునిం గాంచి " వినయా! పృథూదక పాదసైనికుఁడగు రత్నసింహునిటకుఁ దీసికొని రమ్ము. ఆతనితోఁ గూడ నా బాలిక సోదరునిఁ గూడఁ దోడ్కొని రమ్ము" అని యాజ్ఞాపించెను. మహాప్రసాద మని వినయసేనుఁడు సెలవంది పోయి కొలఁదిసేపటిలో బాలక, రత్నసింహులను వెంటఁబెట్టుకొని వచ్చెను.

మహాదేవి సైనికునిం గాంచి "నీ పేరు రత్నసింహుఁడా?" అని ప్రశ్నించెను.

రత్న—ఔను మహాదేవీ!

మహా—నీ వేమి పని చేయుచుందువు?

రత్న—అమ్మా! నేను పృథూదక సైన్యమునం దొక నాయకుఁడనై యున్నాను.

మహా—నీవు నిన్నటియుదయమున భోజనసామగ్రిం గొనుటకై నగరమునందలి యంగడికిఁ బోయియుంటివా?

రత్న—పోయితిని. నా చేతిక్రింది సైనికులకు వలయు భోజనసామగ్రినంతను దెచ్చుకొన్న పిమ్మట నొక గౌల్మికునాజ్ఞననుసరించి (నూఱు రెండువందలు, అంతకంటె నధికులునగు సైనికులగుంపునకు గుల్మమని పేరు. దానికధినాయకుఁడు గౌల్మికుఁడు) యాబాలకునితండ్రియంగడిలోనికి బియ్యము, పప్పు మొదలగువానిని గొనుటకై పోయితిని.

మహా—ఆయంగడివాఁడా బాలునకుఁ దండ్రియని నీకెట్లు తెలిసినది ?

రత్న—ఆసంగతి నాకంత బాగుగాఁ దెలియదు. అంగడిలో నేను గొన్న సామగ్రిమూట చాలఁ బెద్దదై నేను మోయఁజాలకపోయితిని. అప్పు డాయంగడివాఁ డీపిల్లవానిచేఁ గొంతసామానును మోయించుకొని పొండని యీతని నాతోఁ బంపెను.

మహా—ఆయంగడివాని యింటికి నీవిదివఱ కెప్పుడైనఁ బోయితివా? నీకాయింటివారితోఁ బరిచయమున్నదా?

రత్న—లేదు మహాదేవి!

మహా—ఇఁక నీవు పోయి యావ్రక్కను నిలిచియుండుము—వినయసేనా ! ఆవర్తకుఁ డున్నాఁడా?

రత్న—లేఁడు మహాదేవి ! అంగడిసామగ్రులను గొని తెచ్చుకొనుటకై యాతఁ డంగదేశమునకుఁ బోయియున్నాఁడు.

మహా—ఆతనియంగడిలో నెవ్వరున్నారు ?

రత్న—వానియుపపత్ని.

మహా—సరే. ఆమెను దీసికొని రమ్ము.

వినయసేనుఁడు వెడలి పోయినతరువాత మహాదేవి బాలకునిం జూచి “అబ్బాయీ! నీపేరేమి?” అని ప్రశ్నించెను.

బాల—అనంతవర్మ.

మహా—వత్సాఖరీవంశజుఁడగుయజ్ఞవర్మ నీతండ్రియేనా?

బాల—ఔను.

మహా—మీనివాసము చరణాద్రిదుర్గమునందేనా?

బాల—ఔను—కాని కొంతకాలముక్రిందట మాపినతండ్రి కుమారుఁ డవంతివర్మ యటనుండి మమ్ములను బాఱఁదోలినాఁడు.

చక్రవర్తి యింతవఱకును శాంతముతో నాలకించుచుండెను.

బాలకుని యాతుదివాక్య మాలకించి యాతఁడు తత్తరముతో "ఆదుర్గమునందలి సైనికు లందఱును నీతండ్రిపైఁ దిరుగఁబడిరా?" అని ప్రశ్నించెను.

బాల — లేదు. అవంతివర్మకు రహస్యముగా స్థానేశ్వరరాజు తోడుపడకయే యుండినచో నాతఁడు మనలను దుర్గమునుండి వెడలఁ గొట్టఁగలఁడా? అని మాతండ్రిగా రనుచుండెడివారు. అప్పుడు మాతండ్రిగారు తమకు సహాయము చేయుటకొఱకుఁ బాటలీపుత్రమున కొకదూతనుగూడఁ బంపియున్నారు. కాని చక్రవర్తి మాకెట్టిసహాయమును జేసియుండలేదు.

ఆమాటలు వినుటతోడనే ప్రభాకరవర్ధనునిమొగ మెఱ్ఱనైపోయెను. చక్రవర్తి సిగ్గుచే నధోవదనుఁడైపోయెను.

మహా — బాలకా! అవంతివర్మ మీకోట నాక్రమించుకొన్న తరువాత మీ రేమి చేసితిరి?

బాలకునినోటినుండి మాట వెలువడినది కాదు. ఆతనికంఠము రుద్ధమైపోయెను. ఆతనివిశాలనీలనయనము లశ్రుపూరితములైపోయెను, అది చూచి మహాదేవిహృదయము కరుణారసపరిపూర్ణమైపోయెను. అప్పు డామె యాబాలకునిచేయిపట్టుకొని దగ్గఱకుఁ దీసికొని యాతనిఁ దనతొడపైఁ గూర్చుండఁ జేసికొనియెను. బాలకుఁ డమ్మహాదేవివక్షమున మొగముంచి మౌనముతో నామెపయ్యెద నశ్రుధారలచే నింపివైచుచుండెను.

ఇంతలో వినయసేనుఁడు మాపాఠకులకుఁ బరిచితురాలైనయుంగడియామె నటకుఁ దీసికొని వచ్చెను. ఆమె యామహాలునం దడుగువెట్టుటకును భ్రమరికవలెఁ దనలో నేమేమియో గొణుగుకొనుచునే యుండెను. కాని యటఁ బ్రవేశించినతోడనే యామె కొక్కసారిగా దుఃఖము పొంగిపోయెను. ఆమె ముక్తకంఠమై శోకింపఁదొడంగెను.

అంత వెనుకనుండి యొకప్రతీహారి వచ్చి చర్మశలాకచే నామె నొక దెబ్బ కొట్టెను. అందుచే నామె నష్టమస్వర మించుక మంద మయ్యెను. ఆమె లోపలఁ బ్రవేశించినది మొదలుగా "నేనేమియపరాధము చేసితిని ? ఏయపరాధము లేనిదే నన్నిచ్చటి కేల తెచ్చితిరి?" అను మాటయే పల్లవిగా శోకగానము నాలాపించుచుండెను. ఆమెశోకావేగ ముత్తరోత్తరమందమగుటకు మాఱుగ నధికాధికము గాఁజొచ్చెను. వినయసేనుఁ డామె నూరకుండు మని బెదరించెను.

మహాదేవి యామెం గాంచి మృదుస్వరముతో "నీపేరేమమ్మా?" అని ప్రశ్నించెను.

స్త్రీ—నాపేరు మల్లిక; నాతల్లి పేరు—

విన—(అర్ధోక్తియందే) చాలును! నిన్నడిగినప్రశ్న కుమాత్రమే యుత్తర మిమ్ము!

మల్లిక నిరుపాయయై యూరకుండెను. అప్పుడు ప్రభాకరుఁ డామెం గాంచి "ఈబాలుకుఁడు నీకొడుకేనా?" అని ప్రశ్నించెను.

తన కిప్పుడు నంతు దొరకినది గదా యని యనుకొనుచు మల్లిక బిగ్గఱగా నేడ్చుచు "బాబూ! మావంశమున సప్తపురుషాంతరములలో నెవ్వరికినిగూడ నీతఁడు పుత్రుఁడు గాఁడు. పదునాలుగుతరములనుండి మావంశములో నెవ్వరికిని బుత్రసంతానమే లేదు. అందఱు నాఁడుపడుచులే. ఆపాడుభద్రుఁ డెవ్వరిపిల్లవానినో—"అనియెను.

అంతలోనే ప్రతీహారి యామె నొకదెబ్బ కొట్టెను. దానితో నామె కిక్కురుమనక యూరకుండెను. మల్లిక తనచరిత్రమును జెప్పుచున్నంతవఱకును మహాదేవి నవ్వుచునే యుండెను. అప్పుడు దేవి యామెం జూచి "నీవిప్పుడు పాడుభద్రుఁ డంటివే—అతఁ డెవ్వఁడు? నీమగఁడా యేమి?" అని యడిగెను.

మల్లిక—(ఆవేశముతో) అయ్యో దేవుడా! అయ్యో! నా కొక్కడిమగఁడు! నామగఁడుచచ్చి యెన్నియో యేండ్లు గడచిపోయినవి. అమ్మా! ఆయఃభద్రునకును నాకును చిరకాలపరిచయము కలదు. అంతే. అతఁడు పొరుగూళ్లనుండి నాకుఁ గావలసినసామగ్రిని దెచ్చిపెట్టుచుండును. నగరమున కెప్పుడైన వచ్చినచో నాతఁడు నాయింటనే విడియుచుండును.

మహాదేవి—సరే. నాకంతయుఁ దెలిసినది. నీవిఁకఁ బోవచ్చును.

ఆజ్ఞయైనంతనే మల్లిక మరల వెనుకకుఁ దిరిగి చూడకయే యతిత్వరితముగ వెడలిపోయెను.

అప్పుడు మహాదేవి తనతొడపైఁ గూర్చుండియున్న బాలకునుద్దేశించి "అబ్బాయీ! మీరు చరణాద్రిదుర్గమునుండి పాటలీపుత్రమునకుఁ గాలినడకనే బయలుదేఱితిరా?

బాలు—ఔను. అంతకంటె మాకాధారమేమున్నది? అవంతివర్మ మాసర్వస్వము నపహరించివైచెను. మాతండ్రిగారి వృద్ధసేవకుఁడుమాత్రము మాకొకగాడిద నిచ్చెను. అవంతివర్మకు భయపడి మేము రహస్యముగా బయలుదేఱితిమి. నేను గాడిదపై నెక్కి వచ్చుచుంటిని. మాయక్కయు, నాన్నయు నడచి వచ్చుచుండిరి.

మహా—పిమ్మట నేమిజరిగినది బిడ్డా?

బాలు—ఆగుప్తపురాతులు మార్గమునందే మాయక్కయ్యను బట్టి తీసికొనిపోయిరి. నాగాడిద బెదరి నన్నువేఱొకచోటికి దూరముగఁ దీసికొనిపోయినది. మఱునాఁడొకవర్తకుఁడగపడి నన్నీనగరమునకుఁ దీసికొని వచ్చెను. ఇప్పుడిటనుండి పోయినసైనికుఁడు నేనున్న యంగడికిఁ బప్పుబియ్యము మొదలగువానిని గొనవచ్చెను. ఆతనిమూటను నెత్తిపైఁ బెట్టుకొని నేనాతనితో శిబిరముకడకుఁ బోవుచుంటిని. త్రోవలో నొకచోట మాయక్కయ్య నాకగపడియెను. చటాలునఁ

బోయి నేనామెను గౌఁగిలించుకొంటిని. తరువాత నెంతయో గందరగోళ మైనది. తుదకొకమహాత్ముఁడు మమ్ములకుఁ దీసికొని వచ్చెను.

అప్పుడు చక్రవర్తి సింహాసనమునుండి లేచి 'దేవీ! ఈబాలుఁడు యజ్ఞవర్మతనయుఁడు. ఈతని నెల్లవిధముల లాలించి పాలించువారు నాకంటె నెవ్వరున్నారు? అనంతా! నీవిఁక నెంతమాత్రమును భయపడవలదు. తెలిసినదా? నేను నిన్నుఁ బోషించుటకు సంసిద్ధుఁడనై యున్నాను'' అనియెను.

అనంతవర్మ యాసార్వభౌమునిం దిలకించుచు "మాతండ్రిగారెప్పుడును నాకొకవిషయము నుపదేశించుచుండెడివారు. అనంతా! నేనొకవేళ మరణించినచో నీవుపోయి మహాసేనగుప్తసార్వభౌము నాశ్రయించి బ్రదుకుము! ఇఁక నెవ్వరియొద్దకును బోకుము." అని నాకు బోధించుచుండెడివారు. మీరెవ్వరో నేనెఱుఁగను. మాతండ్రిగారియాజ్ఞను నిర్వహించుటకై నేను మాసార్వభౌమునికడకే పోయెదను." అనియెను.

సరళహృదయుఁడగు నాబాలకునినోటినుండి వెడలినయా మాటలను విని మహాసేనగుప్తునిహృదయము కరఁగిపోయెను. ఆతనికపోలములపై నొకటిరెండశ్రుబిందువులుకూడ దృగ్గోచరము లయ్యెను. కొంతసేపటివఱకు నాతఁ డేమియు మాటాడఁజాలక యొక్కింతతడవునకుఁ గంపితస్వరముతో "బిడ్డా! ఎప్పఁడెన్నియోసారులు నాప్రాణములను గాపాడెనో యట్టిజీవనదాతను నేను మఱచియేపోయితిని. కాని యాయజ్ఞవర్మమాత్రము నన్ను మఱువలేదు. కుమారా! మీ తండ్రిచే రక్షింపఁబడినమహాసేనగుప్తుఁడను నేనేయని తెలిసికొనుము!" అనియెను.

రెప్పపాటుకాలములో నాబాలకుఁడు లేచి వచ్చి సార్వభౌముని పాదములపై వ్రాలెను. తత్క్షణమే మహాసేనగుప్తుఁ డాబాలకు నెత్తికొని యటనుండి వెడలిపోయెను.

మహా—ప్రభాకరా! ఇఁక నావిమర్శనము పూర్తియైనది. నీవేమైనఁ జెప్పవలసియున్నచోఁ జెప్పుము!

సార్వభౌమప్రభాకరవర్ధనుఁడు లజ్జితుఁడై తలవంచి యస్ఫుటస్వరముతో "జననీ! ఈయపరాధ మంతయు నాదే! నన్ను క్షమింపుము! ఇప్పుడే పోయి చంద్రేశ్వరుని శిక్షించెదను.

ఎనిమిదవప్రకరణము

రోహితాశ్వదుర్గజీర్ణతటముపైఁ గూర్చుండి కాకులు కావు కావుమని యఱచుచుండెను. కోటలోని వారందఱు నింకను నిద్రించుచునే యుండిరి. కాని యాకాకములభయంకరధ్వనిచేఁ దుదకు రఘువునకు నిద్రాభంగ మయ్యెను.

రఘువు లేచి చూచెనుగదా, నానియా యింకను నిద్రించుచునే పడియుండెను. అప్పు డాతఁ డామె నిటు నటు పొరలించుచు "ఈ కాకుల కేకలవలన మనయజమానున కప్పుడే మెలఁకువ కలిగియుండు నని తలఁచెదను, నీకేమైన బుద్ధి యున్నదా లేదా? క్రమముగాఁ బ్రొద్దెక్కిపోవుచున్నది! ఇంకను నిద్రయేనా?" అనియెను.

తుద కెట్లో నిద్రాభంగ మగుటయు వృద్ధ యగునానియా కన్నులు తుడిచికొనుచు లేచి కూర్చుండి రఘువుం గాంచి తనబోసినోటిని దెఱచి నవ్వుచు "రఘూ! ముసలితనము హెచ్చుచున్నకొలఁదిని నీవు పరిహాసప్రియుఁడ వగుచున్నావే! పీనుఁగా! ఇంతటివేదాంతమును నాకు బోధించెదు నీవు మాత్ర మిప్పుడేగాదా లేచితివి? యజమానునకు నిద్రాభంగము కాకుండ నీకాకులను దోలివేయ లేకపోయితివా?" అనియెను.

రఘు—సెబాస్ ! ముసలిదాన వగుసీకింకను నిద్రిపోవలయు ననియే యున్నదికాఁబోలును ! అట్లయినఁ బరుండుము. నేనే పోయి కాకులను దోలి వచ్చెదను.

అని యావృద్ధుఁ డటనుండి యతిత్వరితముగ బయలుదేఱెను; గాని మార్గములో నొకపెద్దగోనెసంచి కాలికిఁ దగులుటచే నాతఁడు తటాలునఁ గ్రిందఁబడిపోయెను. అది చూచి నానియా భయముతో "ఆఁ ! ఆఁ ! అదేమి !" అని కేకలు వైచెను. రఘువు భూమినుండి లేచులోపల నాసంచి యాగదిమూల భద్రముగానుంచిన కుండలదొంతరపైఁ బడుటచే నామృణ్మయపాత్రిలన్నియు గలగలధ్వనితో దొరలి యాతనితలపైఁ బడియెను. "అయ్యో ! అయ్యో !" అనివృద్ధనానియా మఱింతబిగ్గఱగా నఱవసాగెను.

రఘువునకు గట్టిదెబ్బలే తగిలెను. వార్ధకమునం దేమాత్రపు దెబ్బ తగిలినను నది యధికముగ బాధించు ననియెల్లరకుఁ దెలిసినవిషయమే. పగిలినకుండలనడుమఁగూర్చుండి రఘువు చేతులతోఁ దలయును, మూపును దడవుకొనుచుండెను.

నాని—ఏమోయి ! దెబ్బ గట్టిగాఁ దగిలినది కాఁబోలు నేమి?

వృద్ధుఁ డేమియు మాఱుపలుక లేదు. సానుభూతిని బ్రకటించుటకై నానియా మరల నాప్రశ్ననే వైచెను. తుదకు రఘువు బాధ నభినయించుచు "వట్టిప్రేమ చూపుటవలన నేమిలాభము ? అబ్బబ్బ ! నాతల బ్రద్దలైపోయినట్లున్నది ! నీవు ముసలిదాన వైపోయినావు. నీకుఁ గన్నులు బాగుగాఁ గనఁబడకపోవుట నరిగదా, యెక్కడ నేవస్తువుంచితివో యాసంగతికూడ నీకు జ్ఞాపక ముండదు !" అనియెను.

నాని—(ఆశ్చర్యముతో) చాలుఁ జాలు ! అంతగా నోరు చేసికొందువేల ? క్రొత్తకుండల నీగదిలో నుంచుట నాకేమిపని ? అట్టివాని నన్నిటిని నాగదిలోనే యుంచుకొందును. ఇన్నికుండలును, సం

చులును నీగదిలోని కెట్లువచ్చెనా యనియే నేను నాలోచించుచున్నాను.

రఘు—(బాధపడుచు) ఏమో! చక్కని చుక్క వగునిన్నుఁ జూచి మోహించి రాక్షసరాజీసామానంతయును రాత్రికిరాత్రియే నీకుఁ బంపినాఁడు కాఁబోలును! ఈసణుఁగులకేమిగాని త్వరగాఁ బోయి కొంచెము నీళ్ళు తెచ్చిపెట్టుము. చూడుము! నావీఁపునుండి రక్తము కాఱుచున్నట్లున్నది! అయ్యయ్యో! నాదోవతి యంతయు రక్తముచే దడిసిముద్దయైపోయినది—చూడు!

నానియా దగ్గఱకు వచ్చి పరిశీలించెను. రఘునితలనుండి యొక విధమగు తెల్లనిద్రవపదార్థము వీఁపుక్రిందికి జాఱుచుండెను. దానిచే నాతనివస్త్రము దడిసిపోయెను. నానియా యాప్రదేశమును బాగుగఁ బరిశీలించెను. కుండలదొంతి యంతయును మొదలంటఁ గూలిపోలేదు. నాలుగైదుపాత్రలవరుస యింకను నట్టే నిలిచి యుండెను. పగిలిన పై కుండనుండి యాద్రవపదార్థ మింకను రఘునితలనుండి ధారగాఁ బడుచుండెను. నానియా యింకను ముందటికిఁ బోయి బాగుగఁ బరీక్షించెను. పగిలిపడిపోయినకుండలనుండి లడ్డు మిఠాయిలు మొదలగు వస్తువు లాగదియందుఁ జెదరిపడియుండెను. ఒకకుండనుండి పంచదారపాకముతోఁ జేయఁబడిన భక్ష్యపదార్థ మాతనితలపైఁ బడి క్రిందికి జాఱి యాయిల్లంతయు బురదగా నుండెను.

ఈయద్భుతదృశ్యముఁ గాంచి యావృద్ధురాలు నవ్వాపఁ జాలక పోయెను. ఒక్కదంతమైనను మిగులకుండఁ బోయినతనబోసినోటిని దెఱచి యామె బిగ్గఱగా నవ్వ నారంభించెను. ఆప్రచండహాసధ్వనిచే నా పురాతనమందిర మంతయు గడగడలాడుచున్నట్లుండెను. ఆహాసముచే రఘునకుఁ గోపము రేఁగి యామెను నోటికి వచ్చినట్లెల్లఁ దిట్టుట కారంభించెను.

నానియూ తనహాస వేగము నొక్కించుక తగ్గించి "రఘూ! నీ దేహమునకును, దలకును నేమి యంటుకొన్నదో యొక్కసారి లేచి బాగుగాఁ జూచికొనుము! నీతల పగిలిన దనియు, నందుండి రక్తము ప్రవహించుచున్నదనియు మాత్రమే నీవు గ్రహింపఁగలిగితివి. తక్కిన సంగతి నీకుఁ దెలియనే తెలియదు.

రఘు—(భయముతో) ఆలాగా? నాయొడలినిండ నేమి యంటుకొన్నది!

నాని—(పకపకనవ్వుచు) ఏమున్నది? లడ్డులు, మిఠాయి, శర్కరపాకము!

రఘువు తనసర్వాంగకములను బరిశీలించుకొని భయభ్రాంతుఁడై కంపితస్వరముతో "ఓహో! ఇవి యన్నియు నెక్కడనుండి వచ్చినవి? ఓ దైత్యరాజా! ఇంతకుముందు నిన్నుఁ బరిహాసించితిని. అపరాధము చేసితిని; మహాపరాధము! దేవా! నన్ను క్షమింపుము. రేపటియుదయమున నీకా చెట్టుక్రింద నొకకోడిపిట్టను బలిపెట్టెదను— ఓసీ! నానియూ! ఇవియన్నియు భూతచేష్టలుగనే తోఁచుచున్నవి. మధురభోజ్యములను, బక్వాన్నములను గాంచి నేఁటికిఁ బదియేండ్లయ్యెను. ఇప్పు డాకస్మికముగా నీమధురపదార్థవర్షమును గురియించినవా రెవ్వరై యుందురు?" అనియెను.

నాని—(పెదవుల జప్పరించుచు)ఔను. నీవనినమాటయే నిజమై యుండవచ్చును.

ఇంతలో ద్వారమునకడ నెవ్వరిదో చాయ కనఁబడెను. కంసాలి ధనసఖుఁ డవ్వల నిలువఁబడి "రఘువు లేచినాఁడా?" అని ప్రశ్నించెను. ధనసఖుఁ డాలోపల జరగుచున్న సంగతుల నన్నిటిం గాంచి యాశ్చర్య చంచలుఁడై సంతోషసూచకస్వరముతో "అయ్యయ్యో! ఈ కుండల నన్నిటిని బగులఁగొట్టితి రేమి? జమిలగ్రామమునందలి మిఠాయియంగ

డివారు ఢిల్లీపదార్థముల నన్నిటిని బ్రభువునకుఁ బంపియున్నారు.' అనియెను.

రఘు.—వహావా ! అట్లయిన నివి భూతచేష్టలు కావు. మొదటనే నాకీసంగతి తెలిసినచో నెంతబాగుగా నుండును! ఆహా!

అని యాతఁడు క్రిందనున్న యొకలడ్డును దీసి నోటఁ గుక్కుకొని నములుచు నస్పష్టస్వరముతో " ఆహా ! నానియా ! ఇట్టిమిఠాయిలు తిని యెన్నాళ్లయినది? చూడు ! చూడు ! నీవుకూడఁ గొంచెము తిని చూడుము !" అని చెప్పుచు నొక్కటొక్కటిగా నామధురభక్ష్యములను నోట వైచికొనసాగెను. క్రమముగా నాతఁడు తనయొడలి కంటుకొనియున్న శర్కరపాకమును జేతులతోఁ జేదికొని దానికి యోగ్యమగుస్థలంబునకుఁ జేర్చి వైచుచుండెను.

ఆతనిం జూచి నానియా మొగముపై ముసుఁగు వైచికొని నవ్వుచుండెను. ధనసఖుఁడు ద్వారముకడ నిలిచి యంతయును గాంచుచుండెను. చుట్టుప్రక్కలనున్న భక్ష్యము లైపోయినతరువాత రఘువు నానియాను జూచి "పైకుండలలో నేమున్నదో చూడుము! " అనియెను.

నాని.—(నవ్వుచు) ఇంకను నీదృష్టి నీకుండలమీఁదికిఁ బోనీయకుము ! ఇవి యన్నియు మనప్రభువుకొఱకు వచ్చినవి. ఇంతవఱకుఁ దిన్నది చాలదా? ఇంక న దేవనిగాఁ దినుచున్నచోఁ గడుపుపగిలి చచ్చిపోయెదవు లే! ఇఁక నటనుండి లేచి రమ్ము!

ధనసఖుఁడు తనలో నవ్వుకొనుచు "రఘూ! ప్రభుదర్శనార్థము కోటబయట ననేకులు వేచియున్నారు. ఈవార్త ప్రభువున కెఱిఁగింపుము!" అనియెను. రఘువు మెల్లగ లేచి యొడలు కడిగికొని ప్రాఁత గుడ్డ నొకదానిని దలకుఁ జుట్టుకొని దుర్గాధిపుని శయనగృహామునకుఁ బోయెను.

నాని.—ధనసఖా ! ఈపదార్థము లన్నియు నెచ్చటినుండి వచ్చినవి ?

ధన — రోహితాశ్వమార్గ ప్రజలు తెచ్చియున్నారు. ఇంకను నెన్ని యోపదార్థములు బయటఁ బడియున్నవి. మీయుగ్రాణమెచ్చటనున్న దియో మాకుఁ దెలియక పోవుటచేఁ గొన్ని పదార్థములను మాత్ర మీగదిలోనికిఁ దెచ్చి పెట్టితిమి. తక్కినవన్నియు బయటనే యున్నవి.

నాని — ఆలాగా! అట్లయినఁ గొంచెము సేపుండుము. ముందుగా నీక్రిందిభాగమంతయు నూడ్చి శుభ్రపఱిచెదను.

అని చెప్పి నానియా చీపురు చేతఁబట్టుకొని పగిలినకుండపెంకుల నన్నిటిని దీసివైచి నేలయంతయు శుభ్రముగ నూడ్చివైచుచుండెను. ధనసఖుఁ డటనుండి వెడలిపోయెను. నానియా వెలుపలికి వచ్చి చూచెను. ఆవిశాలమైనబయలంతయు జనులచే నిండి యుండెను. అచ్చటనున్న జనులు వేయికన్న నెక్కువమంది యుండవచ్చునని యామెకుఁ దోఁచెను. వారిసమక్షమున భోజ్యపదార్థములు రాసులుగాఁ బడి యుండెను. పిష్టము, తైలము, ఘృతము, తండులములు శర్కర మున్నగువానినెంచులును పాత్రలును ననేకముగ నొక్కచోఁ జేరి యచ్చట గోడపెట్టినట్లుండెను. వారిలో నానియా నెఱుంగనికొందఱామెయే గృహిణియనుకొని లేచి యామెకు నమస్కరింప నారంభించిరి. ఎఱిఁగిన మఱికొందఱు వారిని వారించుచుండిరి. అచ్చటనున్న వస్తువుల నన్నిటి నుగ్రాణమునఁ జేర్చుట తనకొక్కదానికి నశక్యమని యెంచి నానియా లోపలికి వెడలిపోయెను.

దుర్గాధిపతి యగుయశోధవళదేవుఁ డప్పుడే లేచి మంచముపై గూర్చుండి యుండెను. రఘు వాతనివస్త్రములు మొదలగువానిఁ జేతఁ బట్టుకొని దుర్గాధిపతియెదుట నిలిచియుండెను. ఇంతలో ముక్తకుంతలములు మూఁపున జీరాడ మారుతవేగమున నెగురుచు బాలిక యటకు వచ్చి పితామహునికంఠమును గౌఁగిలించుకొని "తాతా! ఇఁక లెండు;

ఖీలో ఆకెందఱో జనులువచ్చి బయటఁ గూర్చుండి యున్నారు." అనియెను. యశోధవళుఁడు నవ్వుచు " ఇదే లేచుచున్నానుతల్లీ !" అనియెను.

రఘువు తనస్వామికి వస్త్రముల నిచ్చి వెడలిపోయెను. కోట లోనిమైదానములో మత్స్యదేశమునుండి తేఁబడిన శ్వేతస్ఫటికశిలలచేఁ గట్టఁబడినయొకయరుఁగుండెను. అదికట్టి చాలకాలమైనందునను, ఈనడుమ నెవ్వఁడును బాగుచేయింపక పోవుటచేతను, ఆయరుఁగచ్చుటచ్చుట చెడిపోవుచుండెను, దానిచాందని యొకవైపున కొంతఁగిపోయెను. అట నొకయశ్వత్థవృక్షము మొలిచి విశాలముగ వ్యాపించియుండెను. ఈయరుఁగుపై నింకొక యరుఁగును దానిపై బ్రహ్మశిలానిర్మిత మగు ద్వాదశకోణసింహాసనము నుండెను. ఈసింహాసనము రోహితాశ్వదుర్గము నిర్మించినకాలమునందే ప్రతిష్ఠింపఁబడినది. దుర్గాధిపతి యీసింహాసనమునందే కూర్చుండి తనప్రజలయభియోగములను దీర్చుచుండును. ధవళవంశమహానాయకు లీయరుఁగునకుఁ జుట్టును నమూల్యములగు శ్వేతకృష్ణశిలాఫలకములచే నతినిపుణముగ గోడలను, స్తంభములను నిర్మింపఁజేసి యుండిరి. దుర్గాధిపతి సింహాసనాసీనుఁడై ప్రజలఁ బరామర్శించుచున్నసమయమున దుర్గరక్షకసైన్యము బారులుతీరి తత్ప్రాంగణమున నిలిచి యుండును, మహానాయకునకు లోఁబడినసేనానాయకులకును, జిన్నచిన్నజమీందారులకును, దుర్గాధిపతిసమక్షమున నాసనములు లభించుచుండును. ఇతరులందఱు నటనిలిచియే యుండవలయును. ఆనల్లనిరాతియరుఁగుపై బంగారుసింహాసనముండును. దానిపై స్వర్ణరత్నమౌక్తికాదులచే నందం దలంకరింపఁబడినయొకయమూల్యాచ్ఛాదనవస్త్రము పఱుపఁబడును. రోహితాశ్వదుర్గాధిపతి దానిపైఁ గూర్చుండును. దుర్గనాయకునిభాగ్యలక్ష్మితోఁ బాటుగ నాతనిపూర్వోచ్చదశాచిహ్నము లన్నియునుగూడ నశించి చాలకాల మైపోయెను.

ఈ రెండుసింహాసనములుమాత్ర మింకను మిగిలియుండెను. ఈస్వర్ణ సింహాసన మత్యమూల్యమైనది. ఎంతదుర్దశకుఁ బాల్పడినను, నన్న వస్త్రములకుఁ గూడ నాధారము లేక యెట్టియిబ్బంది కలిగినను నభిమానము చేతను, లజ్జచేతను మహానాయకుఁ డీపీఠమును విక్రయింపఁజాలకపోయెను. అది యతిప్రయత్నమున నొకశిలా వేదికపై నెప్పటి యట్లైయుంపఁబడి యుండెను.

యశోధవళ దేవుఁడు తనకుమారుఁడు మరణించుటకుఁ బూర్వము తఱచుగాఁ దన ప్రజలకు దర్శన మొసంగుచుండెడివాఁడు. ఆవశ్యక కార్యము లున్నప్పు డాతఁడు తనకుమారుఁ డగు కీర్తిధవళునిఁగూడఁ దనచెంత రెండవ సింహాసనముపైఁ గూర్చుండఁ బెట్టుకొనుచుండును. కీర్తిధవళునిమరణానంతర మాయరుఁగుపై నెవ్వరును గూర్చుండ లేదు. అచ్చట నొకరావిచెట్టు మొలిచి వ్యాపించి యుండెను.

రఘువు ధనపఖునితోఁ జెప్పి కొందఱుమనుష్యులను సాయముగాఁ దీసికొని యాయరుఁగుపై నున్నవస్త్రములను దొలఁగించి కనకసింహాసనమునుదీసి యరుఁగుపైనున్నసల్లసియాసనముపై దానిని భద్రముగా నుంచెను. ఆసింహాసనమువాఁది చిత్రకళాకౌశల మప్రతిమానమైనది. దానిం దిలకించుటకై యచ్చటివారందఱును గుమిగూడి వచ్చిరి. అందున్న వయోవృద్ధులుగాక తరుణవయస్కులెవ్వరు నాసింహాసనము నిదివఱ కెన్నఁడును జూచియుండలేదు. అది కనక సింహచతుష్టయముపై వికసితకనకకమలపుష్పములపై నతినిపుణముగ నమర్పఁబడి రత్నమాణిక్యవిరాజితం బగు నమూల్యవస్త్రముచే నాచ్ఛాదింపఁబడి విరాజిల్లుచుండెను. బహుకాలమునుండి దాని నెవ్వరు నుపయోగింపకయే యుండుటచే నావస్త్రము ప్రాఁతగిలి జీర్ణమై యయ్యాసనమునుండి యూడి యుండలిదూది వెలికిఁ గానవచ్చు చుం

డెను. ఆబంగారుసింహాసనమున కందంపుఁ జిలుముపట్టియుండెను. అట్టిస్థితిలోఁ గూడ నాపీఠ మతిసుందరమై మనోహరమై యుండెను.

సింహాసనసందర్శన కుతూహలురై ప్రజలందఱును జుట్టును మూఁగి గందరగోళము చేయుచుండిరి. ఇంతలో రఘువు గంభీరస్వరముతో బిగ్గఱగా “దుర్గాధిపతిమహానాయకయువరాజభట్టారకపాదులు యశోధవళదేవులవారే తెంచుచున్నారు.” అని కేకవైచెను. ఆమాట విన్నతోడనే తత్తరముతో నెల్లరును వెనుక కోసరిల్లిరి. అంత యోధవేషధారులగు కొందఱు వృద్ధులాజనుల కెదురుగా వచ్చి నిలిచిరి.

అంత శుభ్రోత్తరీయపరిధానుఁడై తన ధవళకేశసముదాయమును గేవలవస్త్రశిరస్త్రాణముచే నాచ్ఛాదితముగఁ జేసికొని కృపాణపాణియై యశోధవళదేవుఁ డేతెంచి జయధ్వానములతో సింహాసనాసీనుఁడయ్యెను. ఎక్కడనుండియో యొకయెఱ్ఱని పాతవస్త్రమును సంపాదించి తెచ్చి తలకుఁ జుట్టుకొని సింహాసనమున కెదురుగ ననతిదూరమున రఘువు నిలువఁబడియుండెను.

అప్పు డందఱికంటె ముందుగా నోట నొక్కదంతమైనను మిగిలియుండని ధవళకేశశిరస్కుండగు నొకవృద్ధుఁడు దుర్గాధిపతిచెంత కరుదెంచి తనయొఱనుండి కరవాలముం దీసి దానియగ్రభాగము చేఁదన శిరస్త్రాణమును స్పృశించుచు వినయవినమితుఁ డయ్యెను. ఆక్షణము నందే రఘువు “సేనానాయకహరిదత్తుఁడు!” అని బిగ్గఱగఁ గేకవైచెను.

హరిదత్తు యశోధవళదేవునిచరణసమీపమునఁ దనకరవాలము ను వైచి దానిపై నొకసువర్ణముద్రిక నుంచెను. దుర్గాధిపతి వెంటనే యంతరవారి నందుకొని మరల హరిదత్తునకుఁ బ్రసాదించెను. అప్పుడు

హారిదత్తు దుర్గాధిపతికి మరల నమస్కరించి వెనుకకు నడచుచు వెడలిపోయెను.

అనంతరమ మాజానుబాహుఁడును, శస్త్రాస్త్రధారియు నగు నొకవృద్ధపురుషుఁ డాజనసమూహము నొత్తిగించుకొని దుర్గాధినాథుని సమక్షమున కేతెంచి ప్రణామముం గావించెను. రఘువు యథాప్రకారము బిగ్గఱగా "సేనానాయకసింహదత్తుఁడు" అని యఱచెను.

హారిదత్తునివలెనే సింహదత్తుఁడును దనకరవాలమును, సువర్ణ ముద్రయును యశోధవళదేవునెదుట నివేదించెను. మహానాయకుఁ డాతరవారి నెత్తి యు తనికి మరల నిచ్చివైచెను.

సింహదత్తుఁడు వెనుక కరిగినపిమ్మట నతివృద్ధుఁ డగునొక పురుషుఁ డిరువురుతరుణవయస్కులసాయముచే నాగుంపునుండి వెలువడి దుర్గాధ్యక్షునెదుట నిలువఁబడియెను. ఆవృద్ధుఁడు కన్నులఁ బడినంతనే దుర్గాధిపతి లేటాలున లేచి "ఎవరు? విధుసేనుఁడా?" అనియెను.

దుర్గాధిపతి మొగమునుండి యీమాటలు వెలువడిన క్షణమందే యావృద్ధుఁ డాతని చరణములకడఁ దటాలున వ్రాలి ముక్త కంఠుఁడై రోదనము చేయఁదొడంగెను. యశోధవళదేవుఁ డాతని లేవనెత్తెను. ఆతనినేత్రములుకూడ నశ్రుజలంబులచే నిండి యుండెను. అట్టిభావముతోనే దుర్గాధిపతి తనస్వరము కంపించుచుండ "విధుసేనా! కీర్తిధవళుఁడు మరణించియే చాల కాలమైపోయినది. ఇంత కాలమునుండియు నీవీదుర్గమున కొక్కసారియైన రాలేదేమి?" అని ప్రశ్నించెను.

విధుసేనుఁడు వెక్కుచు "ప్రభూ! ఎవ్వరినిదీసికొని మీయెదుటికి వత్తును? ఏమొగము పెట్టుకొని వత్తును? మేఘనాదపు టావలితీర

మున నాసర్వస్వమును బాఱవైచికొని వచ్చియుంటిని. కేవలముఁ గీర్తిధవళు నొక్కనినే యచ్చట విడిచి రాలేదు. నాయిరువురుపుత్త్రుల నుగూడ నచ్చటనే డించి వచ్చితిని. ఆపర్వతప్రాంతములలో నెందఱు పుత్త్రుల, నెందఱుపితరుల, నెందఱుసోదరులఁ గోల్పోయి వచ్చితినో లెక్కయున్నదా? ప్రభూ! లెక్కలేదు. లేదు! నాకిప్పుడీయిరువురుబాలకులకంటె నాయనిపించుకొనుట కిఁక నెవ్వరును లేరు. జయసేనుని మరణవార్త నాలకించి యాతనిపత్ని యీ శిశుద్వయమును నా యొడిలోఁ బడవైచి యగ్నిప్రవేశముం గావించినది. ఆనాఁటఁగోలె రాజకార్యములను, యుద్ధవ్యవసాయములను ద్యజించి వీరిలాలన పాలనములతో నీ యెనిమిదేండ్లును గాలక్షేపము గావించుకొంటిని. అని "యశఃపటలికుఁ" డగు (రాజోత్పన్నవిభాగముపైవధకోరి) విధుసేనుఁడు బాలకునివలె వెక్కివెక్కి యేడువనారంభించెను.

యశోధవళదేవుఁ డతికష్టముతో విధుసేను నించుక యూఱడించి "విధుసేనా! మీరొక్కసారి యీదుర్గమునకు వచ్చినచోఁ బొట్టకూటికిఁగూడఁ గష్టపడవలసిన దుర్గతి కలుగకయే యుండును. అట్లు జరగినచో నాపత్నిరత్నవలయమును విక్రయింపవలసిన యావశ్యకమే లేకపోవునుగదా!" అనియెను.

ఈమాటలు వినినంతనే విధుసేనుఁడు నురల దుర్గాధిపతిపాదములపై వ్రాలి దుఃఖించుచుఁ గంపితస్వరముతో "ప్రభూ! ధనసఖుని వలన నేసీవార్త నిప్పుడే వినియుంటిని. నేను రాకుండుటవలన స్వామికిట్టిశోచనీయావస్థ కలుగునని కలనైన నెఱుంగనైతిని" అని మఱింత బిగ్గఱగా నేడువఁదొడంగెను. యశోధవళుఁ డాతని శాంతపఱచి యరుఁగుపైఁ గూర్చుండఁబెట్టెను. ఒక్కింతసేపటికి దుఃఖావేగము శాంతించుటయు నావృద్ధుఁడు తన యిరువురుమనుమలతోడను దుర్గాధిపతియెదుట నిలువఁబడియెను. అప్పుడు మువ్వురును దమయాయాధ

ములతో సువర్ణముద్రిలను దుర్గాధిపతికి సమర్పించి యభివాదనములం గావించిరి.

అనంతరము నూఱు, నూటయేఁబదిమంది సైనికులు, తమ పుత్రులతోడను, పౌత్రులతోడను, వచ్చి దుర్గాపతికిఁ బ్రణామములం గావించుటకుఁ గ్రమక్రమముగఁ జేరుచు వారికప్రకారముఁ దమతమ యాయుధములతో శక్తికొలఁది వెండి, రాగి నాణెములను సమర్పించి యధిపతికిఁబ్రణమిల్లుచుండిరి. దుర్గాధిపతియు, వారిప్రణామముల యథోచితముగ స్వీకరించి వారివారికరవాలములను దీసి మరల వారి కిచ్చుచుండెను. అనంతరము చిన్నచిన్న జమీందారులును, వ్యవసాయకులును దమతమస్థితుల ననుసరించి బంగారు, వెండి, రాగి నాణెములను సమర్పించి యధిపతికిఁ బ్రణమిల్లిరి. చూచుచుండఁగనే సింహాసనమునెదుట స్వర్ణరౌప్యముద్రికలరాసు తేర్పడియెను

తుట్టతుది తరుణవయస్కుఁడును, బలవంతుఁడును యోధవేష ధారియునగు నొకపురుషుని వెంటఁబెట్టుకొని ధనసఖుఁడు ప్రభుస మక్షమున కేతెంచెను. తోడనే తరుణుఁ డుచితవిధానమున దుర్గాధి పతి కభివాదన మొనర్చుటయు ధనసఖుఁడు "ప్రభూ! ఈతఁడు మీపు రాతనసేవకుఁడగు మహేంద్రసింహునితనయుఁడు; వీనిపేరు వీరేంద్ర సింహుఁడు" అని విన్నపము గావించెను.

యశోధవళుఁడు వీరేంద్రసింహునిం గాంచి ప్రేమార్ద్రస్వర ముతో "వత్సా! నీజనకుఁడు భుజము భుజము రాఁకునట్లు నాతోఁ గూడి యనేకరణరంగములలోఁ దనప్రచండపరాక్రమమును బ్రద ర్శించి యున్నాఁడు. అట్టినీజనకుని కరవాలమునే యిప్పుడు నీకిచ్చుచు న్నాను. నీవు దీనిగౌరవమును రక్షింతువుగాకయని విశ్వసించుచున్నా ను." అని చెప్పుచు నొక కృపాణము నాతని కొసంగెను వీరేంద్రుఁడు

దానిం గైకొని నేలవఱకును వంగి ప్రభువునకుఁ బ్రణామముం గావించెను. వృద్ధుఁడగు నతఁ డటలితుఁ డింకను నరుఁగుమీఁదనే కూర్చుండియుండెను. అందఱియభివాదనములను ముగిసిన పిమ్మట వాతఁడు లేచి "ప్రభూ! వంగదేశసంగ్రామానంతరమున మీ ప్రజలు మాకిచ్చు పన్నులను నియమానుసారముగాఁ జెల్లించుట మానుకొనిరి. ఈనడుమ వీరేంద్రుఁడును, ధనసఖుఁడును, నేనును గలసి యూరూరునకును గొందఱుజనులను బంపి బోధించి మొప్పటియట్ల పన్నులఁ జెల్లించునట్లందఱి నంగీకరింపఁజేసి యున్నాము. వారందఱు నిచ్చుటనే యున్నారు. ఆజ్ఞయైనచో వారి నెల్లరను మీ సముఖమునకు రావించెదను" అని మనవి చేసెను.

దుర్గాధిపతి యందుల కంగీకరించుటయు విధుసేనుఁ డొక్కొక్కరినే పిలువ నారంభించెను. వారు వచ్చి సింహాసనమున కెదుట నిలిచి వీరేంద్రసింహుఁడు చెప్పిన తెఱంగునఁ దమతమ పన్నుల నాతని యెదుటఁ జెల్లించి వెడలఁదొడంగిరి. బంగారు, వెండి రాగి నాణెములను వేఱువఱచి ధనసఖుఁడు వానిని లెక్కింప నారంభించెను.

ఈవిధముగా నాదినము రెండుజాములవఱకును గడచిపోయెను. నాణెముల నన్నిటిని లెక్కించి వేయిరెండువందల పదునెనిమిది సువర్ణముద్రికలును, ఆఱువందలయేఁబది వెండిముద్రికలును, నూటికిఁ గొంచెమెక్కువగ రాగినాణెములు నున్నవని ధనసఖుఁడు ప్రకటించెను.

తరువాత ధనసఖుఁడు సింహాసనమునెదుట మోకరించి తన యుత్తరీయాంచలమునుండి రత్నవలయమును బైకిఁ దీసి సింహాసనము నెదుట నుంచి ముకుళితకరయుగుఁడై "స్వామీ! ఈయమూల్యరత్నవలయమును విక్రయించుట నాతరముగాదయ్యెను. నిశ్చయముగా నేఁబది వేలసువర్ణముద్రికలకంటెను దీనిమూల్య మధికమే!" అనియెను.

యశోధవళుఁడు చటాలున లేచి ధనసఖుని కౌఁగిలించుకొని కంపితస్వరముతో "ధనసఖా! నీవు కావించినపనులన్నియు నాకిప్పుడు తెలియవచ్చినవి. మీయందలిదయవలననే నాపత్నివలయము విక్రయము కాకుండ నిలిచినది. నిజమే—కాని, దీనిని సంరక్షించుటకుఁ దగినపాత్రత నాయెడ లేదు. రోహితాశ్వమర్గకోశాధ్యక్షపదవి చాలకాలమునుండి నామమాత్రావశిష్టమై యున్నది. ధనసఖా! నీవే కోశాధ్యక్షుఁడవై దుర్గేశ్వరి యీవలయమును, ఈధనమును గాపాడుచుండుము. నీకు రావలసినధనమును దీనినుండియే తీసికొనుము. "నామనుమలకుఁగాని, నామనుమరాలికిఁ గాని వివాహమయినప్పుడు నాజ్ఞాపకచిహ్నముగా నీవలయము నొసంగవలయును" అని నాపత్ని మరణకాలమునందు నాతోఁ జెప్పియున్నది. ఎన్నఁడైనను కీర్తిధవళుని తనయకు వివాహము తటస్థించునేని మాజ్ఞాపక చిహ్నముగా నీవలయము నప్పుడామెకు నీవొసంగుము" అని చెప్పుచు యశోధవళుఁడు కంఠస్వరము రుద్ధమగుటయు నిఁక మాటాడఁ జాలకపోయెను. అనంతర మొకింత సేపటికి కాతఁడు విధుసేనుం గాంచి "విధుసేనా! ఈవచ్చిన వారందఱకును భోజన వ్యవస్థ జరుగుటకవకాశ మేమున్నది? ఈయడవిలో నెంతధనము వచ్చినను గావలసినపదార్థములు దొరకవే!" అనియెను.

అప్పుడు ధనసఖుఁడు "స్వామీ! అతిపటలికుఁ డగునీవిధుసేనుఁడును, వీరేంద్రసింహుఁడును గూడ నిడివఱకే యన్నియేర్పాటులును గావించి యున్నారు." అనియెను.

* * * * *

అందఱి భోజనములును నైనపిమ్మట యశోధవళదేవుఁడు విధుసేన సింహదత్త వీరేంద్రసింహ ధనసఖాదిప్రముఖులను దనశయన మందిరమునకుఁ బిలిపించెను. అందఱును వచ్చి యాసీనులైన పిమ్మ

ట వాఁడు వారింగాంచి “సోదరులారా! ఏకపుత్రుఁ డగుకీర్తిధవళుని మృత్యువార్త నాలకించిన దినము మొదలుకొని నిన్నటివఱకును నే నొకయున్మత్తునింబోలి కాలము గడపితిని. నిన్న నాకస్మికముగా నా కన్నులు తెఱవఁబడియెను. నేను మేలుకొంటిని. ఈదుర్గపరిసరమునం దలి నాభూములకొఱ కాసించి కులశీలవయోరూప గుణవంతుండగు సుక్షత్రియకుమారుం డెవ్వఁడైన వచ్చి నామనుమరాలిని పెండ్లియా డఁగోరు నను నమ్మకము నాకెంతమాత్రమును లేదు. అట్టివాఁ డీపర్వ తారణ్య ప్రదేశమునుగాని, పేదవాఁడనై యున్న నామనుమరాలిని గాని, కోరి వచ్చుట యసంభవము. కాని నామేనఁ బ్రాణములుండఁగా నాపౌత్రి నొకసామాన్యునిచేతి కొప్పగించుటకు నేనొడంబడఁజాలను. ఏయుపాయముచే నైనను సరియే వంగదేశమునందలి మనసంపత్తిని మనము మరల సంపాదించి తీరవలయును. ఆవిషయమున నేను స్వయ ముగాఁ బాటలీపుత్రమునకుఁ బోయి సార్వభౌముని సందర్శింప నిశ్చ యించియుంటిని. మీరందఱు నేకమైఁ దీనికిఁ దగినసాహాయ్య ప్రయ త్నములం గావింపవలయును.” అనియెను.

తుదకు విధుసేనుఁడు దుర్గమునందుండి యచ్చటి వ్యవహారము లను జూచుచుండవలయు ననియు, ధనసఖుఁడు కోశాధ్యక్షోద్యోగము ను నిర్వహింపవలయు ననియు, వీరేంద్రసింహుఁడు దుర్గాధిపతితోఁ బాటలీ పుత్రమునకు బయలుదేఱవలయు ననియు నిశ్చయింపఁ బడియెను.

సాయంకాలమునకుఁ బూర్వ మస్తాద్రికిఁ బయనమగుచున్న సూర్యుని యారక్తకిరణములు దుర్గోన్నతభాగమునకు మెఱుఁగువెట్టు చున్న సమయమునఁ బ్రజలందఱును యశోధవళదేవుని యనుమతిం గాంచి తమతమగృహాభిముఖులై వెడలిపోయిరి. అందఱును బోయిన తరువాత రఘువు వానియాను జూచి “ఈరాకాసిపటాలమంతయు

నిక్కడకు వచ్చి మనసర్వస్వమును మ్రింగివైచినది. తుద కేమిజరగినట్లు? ఇన్నిపదార్థములను బంపినవారు కష్టములకోర్చి తాముకూడ నింతదూరము రావలసినపని యేమున్నది? తమతమ నివాసములయందే యుండి వీనినన్నిటిని తమయాశలు తీఱునట్లుగా మ్రింగలేకపోయిరా? పట్టి గడబిడమాత్రము జరిగినది.” అనియెను.

తొమ్మిదవ ప్రకరణము.

వైశాఖమాసము పగలు మొదటిజాము గడచునప్పటికే సూర్యకిరణ ప్రతాపము దుస్సహమగుచుండెను. భాగీరథీ విశాలవక్షోభాగము శుభ్రసికతాతలంబులచేఁ బరిపూర్ణమై యుండెను. అందం దనేక మేఘశకలములు సూర్యకిరణములచేఁ బ్రతిబింబితములగుచుండెను. హిమగిరికన్యయగు నాగంగాదేవి సికతాతలంబున కొకయోరనుండి సాగరాభిముఖంబుగఁ బోవుచుండెను. అందలి ప్రవాహ మతిక్షుద్రమును, జల మతిస్వచ్ఛము నై యుండెను. ఆప్రవాహమున కిరువంకలను దడిసియున్న యిసుకనేల నల్లని రంగుగలిగి తెల్లని వస్త్రముపై నొలికిన మషీరసరేఖంబోలి కన్పట్టుచుండెను.

ఆమిడిమెండలోఁగూడ నిరువురు బాలకులును, నొక బాలికయు నదీప్రవాహముపొంతఁ దడిసిన యిసుకనేలపైఁ గూర్చుండి యేమేమియో యాటలాడుకొనుచుండిరి. ఆబాలకులలోఁ బెద్దవాఁడు తనతడిసిన దుస్తులతోడనె జలప్రవాహమునఁ గాలుసేతులు ముంచి కూర్చుండి తీరమునందుఁ దడిసినయిసుకతో నొకభవనమును నిర్మించుచుండెను. రెండవబాలుఁడు గూడ నాతనిచెంతనే కూర్చుండి తాను నొక భవననిర్మాణకృత్యమునందు నిమగ్నుఁడై యుండెను. పెద్దవాఁడు త్వరలోనే

యొకకోట, తటము, బురుజు, కందకము మొదలగువానిని నిర్మించెను. బాలిక యాయిరువురి నడుమను గూరుచుండి వారిపనులను గనుఁగొనుచుండెను. ఆబాలుఁ డిటఁ గోటలోని రాజభవనమును సృష్టించుటయందు విలీనుఁడై తడిసినయిసుకతో భవనశిఖరము నతిత్వరితముగఁ గట్టుచుండెను. అతని వ్రేళ్ల సందులనుండి తడియిసుక జాఱి మందిరము పైఁబడి శిఖరము పెద్దదగుచుండుటచేఁ దనంతనే క్రిందఁ బడిపోవుచుండెను. బాలిక యేకాగ్రదృష్టితో నంతయును గాంచుచుండెను. ఒక్కొక్కప్పుడు పెద్దవానిశిఖర మెత్తగుచుండెను. మఱియొకప్పుడు చిన్నవానిశిఖర మున్నత మగుచుండెను. ఎవ్వనిశిఖర మున్నత మగునో యాతఁ డా బాలికను బిలిచి తనకౌశలమును మహాభిమానముతోడను, మహాకౌతుకముతోడను జెప్పి చూపించుచుండెను.

క్రమముగా సూర్యతాప మధికమగుచుండెను, కాని యీయువ్వురిలో నెవ్వరును దానిని లక్ష్యముచేయుటలేదు. వారు మనఃపూర్వకముగాఁ గ్రీడానిమగ్నులై యుండిరి. అప్పుడు జీర్ణములైనమలినవస్త్రములను ధరించియున్న యొకవృద్ధపురుషుఁ డాప్రవాహతీరము ననుసరించి వారియొద్దకే వచ్చుచుండెను. కాని వారాతనివంకఁ జూడనేలేదు. ఆవృద్ధుఁడు వారిని సమీపించినప్పు డాతని నీడం గాంచి బాలిక యులికిపడి లేచి తత్తరముతోఁ బెద్దబాలునికడకుఁ జేరి నిలువఁబడియెను. ఆమె యట్లుతడఁబాటుగఁ బరుగెత్తివచ్చుటచే భూమియుదరి యా బాలునిమందిరమును, గోటయును గూలి నేలఁ బడిపోయెను. రెండవబాలకుఁ డదియంతయుంగాంచి విజయానందభరంబున బిగ్గఱగా నవ్వనారంభించెను.

ఆగంతకుఁ డగువృద్ధుఁడు పెద్దబాలకునిం గాంచి "కుమారా! ఇంతమాత్రమున నిరాశుఁడవు కావలదు. ఈజీవితమున నీవు హతాశఁ జెందుట కవకాశమేలేదు. దారుణమగుకాలవజ్రాఘాతముచే గగన

చుంబితము లగునాశాప్రేమమందిరము లెన్నెన్నియో చూర్ణవిచూర్ణము లైపోవుచుండును !" అనియెను.

ఆమువ్వురునుగూడ నతివిస్మితులై యావృద్ధుని మొగమువంకఁ జూచుచుండిరి. ఆముదుసలి తనచినిఁగినగుడ్డ నాయిసుకనేలను బఱచుకొని కూరుచుండెను. కొంతసేపటికి నాపెద్దబాలకుఁడు "మీరు నన్నెట్లు గుర్తించితిరి ?" అనిఁ బ్రశ్నించెను.

వృద్ధుఁడు మందహాసము చేయుచు "శశాంకకుమారా ! నిన్నెవ్వరు గుర్తింపలేకుందురు ? నీయీపింగళకేశకలాపమే నీమోహనమూర్తిని బ్రకటించుచుండును. ఉత్తరప్రదేశమందలిప్రజలు దీనినిబట్టియే నిన్నానవాలు పట్టఁగలరు రణాంగణమున శత్రువీరులుకూడ దీనిని బట్టియే నిన్ను గుర్తింతురు. నిన్ను గుర్తించుట యంతకష్టమా? " అనియెను.

ఇట్లుచెప్పి యావృద్ధుఁ డొకయున్మత్తునివలె నవ్వ నారంభించెను. అది గని యాబాలకు లత్యాశ్చర్యచకితులైరి. బాలిక యాబాలకుని గట్టిగఁ గౌఁగిలించుకొనియెను. వృద్ధుఁడు చటాలున లేచి తనవస్త్రమునుండి యొకమురళిని బైకిఁ దీసెను. అంతలోనే యాతని కేమితోఁచెనో గాని తీసినమురళిని మరల నట్లే దాఁచెను. అనంతర మాతఁడు "కుమారా ! నీతో నెన్నియోవిషయములనుగూర్చి మాటాడవలయునని యిక్కడకు వచ్చియుంటిని. కాని యిక్కడ మాటాడుట కవకాశము లేదు. నాతోఁగూడ రమ్ము! " అనియెను.

మంత్రౌషధమహిమచే ముగ్ధులైనవారుంబోలె యామువ్వురు నాతనివెంట బయలుదేఱిరి. నిప్పులగుండమువలె మండిపోవుచున్న యాయిసుకనేల యంతయును దాటిపోయి పురాతనరాజభవనప్రాంతమున నున్నఘట్టముకడ విఱిగిపోయిన మెట్లమీఁద నావృద్ధుఁడు కూరుచుండెను. ఆబాలకులును బాలికయును క్రిందిమెట్లపై నాసీనులైరి.

అప్పుడు వృద్ధుఁడు తనమురళిని మరల బైకిఁ దీసి హాయిగ మ్రోయింప నారంభించెను. ఆవైశాఖమాసమునఁ బ్రచండకరకిరణపరితప్తం బగు మధ్యాహ్న కాలమునఁ గరుణారసపూరితంబగు నామురళీమధురస్వరము వెలువడి శాంతభాగీరథీప్రవాహము నుత్తరించియవ్వలతీరమును బ్రకంపితముగఁ జేసివైచుచుండెను. ఆవేణుగానశ్రవణంబున సూర్యతాపజ్వలితం బగునాసైకతప్రదేశముగూడ నింపుగ శీతలమై యుండవచ్చును. బాలికాబాలకులుమువ్వురు నావేణుగానానందపరవశులై కరుణారసామృతపానోన్మత్తులై చిత్రప్రతిమలవలెఁ గూర్చుండి యుండిరి. అంతలో నాకస్మికముగా వేణుగాన మాఁగిపోయెను. తత్క్షణమే జగచ్ఛాంతికి భంగము కలిగెనేమోయని యెల్లరకును బొడకట్టెను.

అప్పుడు వృద్ధుఁడు లేచి నిలువఁబడి "కుమారా! మూఁడువందల సంవత్సరములకుఁ బూర్వమున మీగుప్తవంశమునందు నీవలెనే పింగళకేశకలాపుఁ డగునొకరాజపుత్త్రుఁ డుదయించి యుండెను. నీకువలె నాతనికినిగూడఁ బుట్టినప్పటినుండియు దౌర్భాగ్యము వెంటనంటి యుండెను. ఆతఁడును నీవలెనే యుదారహృదయుఁడు; దయాశీలుఁడు; మహావీర్యసంపన్నుఁడు; గుప్తవంశలుప్తగౌరవమును బునరుద్ధారణము గావించుటకై నీవలెనే యాతఁడును తనప్రాణమనోధనంబుల నర్పించుటకు సంసిద్ధుఁడై యుండెను. ఆతనిపేరు స్కందగుప్తుఁడు. ఉత్తరప్రదేశములలో నాతనిపేరుకూడ నిప్పుడు చాలమందికి విస్మృతమైపోయెను. ఇందాశ్చర్యమునకుఁ గారణములేదు. పాటలీపుత్రనాగరికులు కేవలమును గృతఘ్నులు! అందుచేతనే వారాతనినామమును విస్మరించి యున్నారు. కాని యొకప్పు డీస్కందగుప్తుఁడే పాటలీపుత్రమునకుఁ దనసర్వస్వమును ధారవోసి సకలకష్టములకును బాల్పడిపోయెను. కుమారశశాంకా! సముద్రగుప్తుఁడనునామమును నీవు విని యుంటివా? చతుస్సముద్రముద్రితం బగునీభూవలయమునంతను బరిపాలించిన యాతని దిగ్విజయచరిత్రమును నీవాకర్ణించితివా?

కుమారగుప్తుని భవ్యచరిత్ర మెన్నఁడైన నీశ్రవణపుటంబున కమృతరసాయనమైనదా? ఆకుమారగుప్తునితనయుఁడే స్కందగుప్తుఁడు. నీ జనకుని యీయల్పరాజ్యమునందుఁ బ్రజలెల్లరును బింగళకేశదామముం బట్టి యువరాజవగు నిన్నానవాలుపట్టినట్లె యాతనిపింగళకేశకలాపముంగాంచి యీసముద్రమునుండి యాసముద్రమువఱకును, హిమాచలమునుండి కన్యాకుమారివఱకును గల ప్రజలెల్లరును యువరాజకుమారుఁడగు స్కందగుప్తు నానవాలుపట్టుచుండిరి. కష్టములును విపత్తులును నొకదానినొకటిమించి యిప్పుడు నిన్నుఁ బరివేష్టింపఁ జూచుచున్నట్లె యప్పుడు స్కందగుప్తుని చుట్టును నింతకంటె బలవంతముగా దురవస్థాపరంపర లాక్రమించి యుండెను. వానిని దొలఁగించుటకై యాతఁ డెన్ని యో ప్రయత్నములం గావించెను. నీవుకూడ నొకప్పుడట్లె ప్రయత్నింపఁగలవు. దురదృష్టదేవత సర్వదా యాతని వెనువెంటనే తిరుగాడుచుండెను. ఆసంగతి నాతఁ డెఱుఁగనే యెఱుఁగఁడు. ఆతనిసోదరుఁడును, సేవకుఁడును జ్ఞాతులునుగూడ నాతనియెడల విశ్వాసఘాతుకులై పోయిరి. ఆవిశ్వాసహీనులమూలముననే యాతనిజీవితమునకు శాంతి లేకుండఁబోయినది. నీకుఁగూడ నట్లె కాఁగలదు. స్కందగుప్తునిదీర్ఘాయుష్కాలమంతయును యుద్ధవ్యవసాయమునందే వ్యయమైపోయెను. ఆతని యాశలన్నియును వినష్టములైపోవుటచే నాతఁడు భగ్నహృదయుఁడై యనవరతమును యుద్ధయాత్రలలోనే కాలక్షేపము చేయసాగెను. కుమారా! నీవు రాజవగుదువు. కాని నీమార్గ మెప్పుడును గంటకమయమే యైయుండును. నీ వెన్నటికిని సుఖజీవివి కాఁజాలవు. నీసోదరుఁడు, నిన్నుఁ బ్రేమించితి నని వాగ్దత్తము చేసిన నీపత్ని, అమాత్యులు, ప్రజలు, వీరందఱును నిన్నుఁ ద్యజింతురు. అందఱకును దూరమై నీవును స్కందగుప్తునివలెనే రణాంగణమున వీరమరణముంగాంచఁగలవు. కాని, నీస్వదేశమున మర

శింపవు. నీకుఁ బరదేశమునందే మరణము సంభవింపఁగలదు. స్కంద గుప్తుఁడు స్వదేశమునందే పరదేశీయులతోఁ బోరుచు నాహవభూమి యందుఁ దనదేహమును విసర్జించెను. కాని నీకుఁ బరదేశమున స్వ దేశీయులతో సుహారణము సంభవించుటయు నా సమరరంగమునందే మరణము కలుగుటయు జరగును. కుమారా! శశాంకా! నీవెంతమా త్రము విచారింపవలదు. నీవు సింహరాశియందు జన్మించితివి. కా వున నీవు సింహపరాక్రమవంతుఁడ వగుదువు. దైవము నెదుటఁగూడ నీవు తలవంపవలదు. బ్రదికియున్నంతవఱకు నదృష్టముతో జరుగఁగల సంగ్రామమునకై నీవు సిద్ధపడి యుండుము. ఈముసలివాని మాట లను విని యాఁడుదానివలె భీతిల్లకుము. పురుషయోగ్యంబులగు కా ర్యములను, నిర్వహించుటకై ముందంజవేయుము! పత్నీలాభముగాని, పుత్రలాభముగాని, నీ కెన్నటికిని నెదవఁబోదు. కారణ మేమని ప్రశ్నింపవలదు. నీనల్లనితమ్ముని నెన్నఁడును విశ్వసింపకుము! వీఁపున సుడి గలిగి గౌరవర్ణుఁడైయున్న కామరూపరాజపుత్రునిగూడ నీవెన్నఁ డును నమ్మియుండకుము. అట్లుంచితివేని—అదృష్టచక్రమధ్యమునుండి నీ వెన్నటికిని విముక్తుఁడవు కాఁజాలవు—కాని యిదియంతయును నీకుఁ దోఁచుట యసంభవము. ఈజగంబున నెల్లరకు నసాధ్యమగు కార్యము నీకుఁ గూడ నసాధ్యమే యగును. నీయనుజుఁడు నీసింహాసనము నాక్ర మించును: నీబాల్యసఖి నిన్నుఁ బెండ్లియాడుటకు నిశ్చయించుకొని యున్నను మోహమాయలకులొంగి యన్యునకుఁ దనతనువును విక్ర యింపఁగలదు. సామాన్యలాభలోభమునకుఁ బాల్పడి విశ్వాసు లగు నీసేవకులే నీయెడ నక్రమప్రవర్తకు లయ్యెదరు. స్వదేశీయులే నిన్ను నీదేశమునుండి పాఱఁద్రోలెదరు. పరదేశీయులు పరదేశమున నిన్ను మహాప్రీతితో నాదరింతురు. దుష్టగ్రహచారవశంబునఁ జిక్కి యున్న నీవు నీయుపకారులనుగూడ గుర్తింపఁజాలవు. అట్టివారినే నీవు

ప్రేమింతువు. నీకుపకారు లగువారిని నీవుపేక్షింతువు; బాధింతువు——అయినను వారు జన్మాంతరమునందుఁగూడ నిన్ను విడువక నీవెంటనంటియే యుందురు." అని బోధించెను.

విలక్షణచరిత్రుఁ డగునావృద్ధునిమాటల నాలకించి యాబాలిక యతిభయభ్రాంత యయ్యెను. ద్వితీయబాలకుఁడు భయప్రకంపితుఁ డయ్యెను. అతనినోటఁ దడియారిపోయెను. కాని శశాంకుఁడుమాత్ర మించుకంతయును భయపడలేదు. అతఁడు వృద్ధునిం గాంచి "మీ మాటలలో నొక్కటియును నాకు బోధపడలేదు. మీరెవ్వరు ?" అనియెను.

ఆప్రశ్నవిని వృద్ధుఁడు దెసలు మాఱుమ్రోగునట్లుగా నవ్వుట కారంభించెను. మఱియును వెఱ్ఱివానివలె నృత్యము చేయసాగెను. అది చూచి యాబాలికముక్తకంఠయై విలపింప నారంభించెను. మాధవుఁడుకూడ నేడువఁదొడంగెను. ఇప్పుడుమాత్రము శశాంకుఁడించుక సంకోచముతో రెండడుగులు వెనుకకు వైచెను.

వృద్ధుఁ డట్లె నవ్వుచు "నేనెవ్వఁడనా? ఎవ్వఁడనో లల్లా నడుగుము! వృద్ధయశోధవలు నడిగి తెలిసికొనుము! నీతండ్రినిగూడఁ బ్రశ్నించిచూడుము! శత్రుసేనుఁ డిట్లనెనని చెప్పుము! నేనిప్పు డాడిన మాటలు నీకెట్లు తెలియును? అట్లె తెలిసినచో నీవదృష్టమునుగూడ నేమఱించుటకుఁ బ్రయత్నము చేయఁగలవు. నామాటలయర్థము నీకెప్పటికి బోధపడునో యాసమయమునకు నేను మరల నీయొద్దకు వత్తును" అనిచెప్పి వృద్ధుఁడు మరల నృత్యము చేయఁదొడంగెను. కొంతసేపటి కాతఁడు తనవస్త్రములో దాఁచి తెచ్చిన తేజోమయం బగు తీవ్రశస్త్రమును బయటికిఁ దీసెను. దానిం గాంచి శశాంకుఁ డింకను రెండడుగులు వెనుకకు వైచెను.

అప్పుడు వృద్ధుఁడు వికృతస్వరముతో " శశాంకా! నీవు నాకు శత్రుఁడవు. నాధర్మమునకు శత్రుఁడవు. నీహృత్పిండమును ఛేదించి నీయురమునందలి వెచ్చనిశోణితమును బానము చేయవలయునని నాకొక్కటే యిచ్ఛయున్నది. కానియట్లుల చేయఁజాలక పోవుచుంటినో నీకుఁ దెలియునా? ఏభాగ్యచక్రమునను సరించి నీవు తిరుగుచున్నావో దానికే నేనును గట్టువడి యున్నాను. "అనియెను.

ఇంతలో నొకపడవ వచ్చి యాఘట్టమున కెదురుగా దూరమునందు నదీసైకతస్థలమునంటి నిలిచెను. ఆనౌకనుండి యిరువురువృద్ధులును నొకబాలికయును గ్రిందికి దిగిరి. శశాంకునకుఁగాని ద్వితీయబాలకునకుఁగాని వారగపడుటలేదు. వృద్ధునకుమాత్రమే యగపడుచుండిరి. క్రమముగా వారాసమీపమునకే వచ్చుచుండుటం గాంచి యావృద్ధుఁడు "కుమారా! నేనిప్పుడు పాఱిపోవలసియున్నది. ఇఁక నాకిక్కడ నిలుచుట కవకాశము లేదు. చాలమంది ప్రజలిక్కడకే వచ్చుచున్నారు. శశాంకా! మున్ముం దొకప్పుడు నీవు దారుణమర్మాంతికయాతనలచేఁ బరితపించుచుందువు. అప్పుడు నీకుఁ బునర్దర్శన మగుఁగాక !" అని చెప్పి యావృద్ధుఁ డప్పుడు రావికొమ్మనొకదానిని బెళుక్కున విఱిచి దానిపై గుఱ్ఱపుమూఁపునంబోలి కూర్చుండి యంతలో నామువ్వురికన్నులకును గానరాకుండఁబోయెను. చిత్రశశాంకమాధవగుప్తులాశ్చర్యభయస్తంభితులై కొయ్యబొమ్మలవలె నచ్చటనే నిలువఁబడి పోయిరి.

నౌకనుండి దిగినవారు క్రమముగా ఘట్టము కడకు వచ్చిరి. వారిలో వృద్ధుఁడు తరుణునిం గాంచి " ఇదియే రాచవాడకుఁ బోవుఘట్టమని తోఁచుచున్నది. ఈయిరువదియేండ్లనుండియు నేను పాటలీపుత్రమునకు వచ్చియుండలేదు. వీరేంద్రా! ఇచ్చట నెవ్వారైన నున్నచోఁ జూచి వారిని ద్రోవ యడిగి తెలిసికొనిరమ్ము" అనియెను.

వీరేంద్రుఁడు నలుదెసలఁ బరికించి “ ప్రభూ ! ఘట్టముకడ నెవ్వరును గనఁబడుటయే లేదు” అనియెను. వృద్ధుఁడు తనక్షీణదృష్టి తోఁ బైకి బరికించి “ వీరేంద్రా ! పైమెట్టుపై నెవ్వరో నిలిచియున్న ట్లున్నది ? నీకుఁ గనఁబడ లేదా ?” అనియెను.

వీరేంద్రుఁడు పైకి వచ్చి యాబాలికాబాలకులం గాంచి “ ఇది యేనా రాజగృహాఘట్టము ? ” అని ప్రశ్నించెను. ఉన్మత్తుఁడగువృద్ధుఁడు వెడలిపోయినవంకనే చూచుచు శశాంకుఁ డనన్యమనస్కుఁడై నిలిచియుండెను. వీరేంద్రునిప్రశ్న విని యాతఁడు తనదృష్టిని మరలించెనుగాని యాప్రశ్న సరిగా శశాంకునకు వినఁబడ లేదు. అందుచేత నాతఁడు “ ఏమంటిరి?” అని ప్రశ్నించెను.

వీరేంద్రుఁ డించుకవిసుఁగుతో “నీకుఁ జెవుడా యేమి ?. రాజగృహాఘట్ట మిదయే యని యడిగితిని!” అని ప్రశ్నించెను. కాని శశాంకుఁడు ప్రత్యుత్తర మీయకయే “ మీరెవ్వరు? ఎటనుండి వచ్చితిరి ?” అని యడిగెను.

వీరే—(కోపముతో) అబ్బాయీ ! నీప్రశ్నలకు త్తరము లిచ్చుచుండుటకు నాకవకాశము లేదు. రాజభవనమునకుఁ బోవుఘట్టమేదో తెలిపినఁ జాలును !

శశాం—ఇదియే రాచవాడఘట్టము. కాని సామాన్యజనులీత్రోవను బోరాదు.

వీరేం—సరే. పోవుటనుగూర్చిగాని, పోకుండుటనుగూర్చిగాని నిన్నేమైన నడిగితినా ?

అని వీరేంద్రుఁ డావృద్ధునియొద్దకుఁ బోయి “ప్రభూ ! ఇదియే రాజగృహాఘట్టమఁట. పైమెట్టుపైఁ గొందఱుపిల్లలున్నారు. వారిలో నొకఁడు కేవలరాజపుత్రునివలె మాటాడుచున్నాఁడు. సామాన్యజనులీత్రోవను బోరాదఁట !” అని చెప్పెను.

యశోధవళుఁడు నవ్వుచు "వీరేంద్రా! ఆబాలకుఁడు నీతో నిజమే చెప్పెను" అనియెను.

వీరేం—అట్లయినచో మనము మననౌకతో వెనుకకుఁ దిరుగ వలసినదేనా ?

యశో—అక్కఱలేదు. నేనీమార్గముననే పోవచ్చును. విశిష్టామాత్యులకును, రాజవంశీయులకును దక్క నన్యుల కీగంగామార్గమునఁ లోనికిఁ బోవునవకాశము లేదు. ఏమనిన—నగరవాసినులగునంతఃపురస్త్రీలీత్రోవనే గంగాస్నానమునకై వత్తురు. ఆబాలకుఁడీకారణముచేతనే నీతో నట్లు చెప్పియుండును అని తోఁచుచున్నది. నడువుము! ముందు నడువుము! నన్నెవ్వరు నడ్డగింపఁజాలరు.

అందఱును సోపానారోహణమొనర్చి ఘట్టములపైకి వచ్చి చేరిరి. ఒకబాలకుఁడు తమ్మడ్డగించుటకై మార్గమధ్యమున నిలిచియున్నట్లును రెండవబాలుఁడును, బాలికయు నచ్చటఁ గూర్చుండి యున్నట్లును యశోధవళుఁడు కనుఁగొనియెను.

బాల—మీరెవ్వరు?

యశో—నేను రోహితాశ్వదుర్గాధీశ్వరుఁడను. నాపేరు యశోధవళుఁడు.

బాల—మీరెక్కడకుఁ బోవుచున్నారు?

యశో—చక్రవర్తిని సందర్శించుటకై రాచవాడకుఁ బోఁదలఁచితిమి.

బాల—ఈమార్గమున సామాన్యజనులు పోఁ గూడదని మీకుఁ దెలియదా? మీరు తిరిగి దక్షిణతోరణముకడకుఁ బొండు! ఆత్రోవను రాచవాడకుఁ బోవచ్చును.

యశో—మేమీత్రోవనే పోఁదలఁచినచో నీవు మమ్మడ్డగించెదవా యేమి?

శశాం.—(నవ్వి) లేకున్నను మీ రెంతవఱకుఁ బోఁగలరు? గంగాద్వారముకడ నున్న ద్వారపాలకులు మిమ్ము వెనుకకు మరలించు వఱకు నూరకుండరు. అప్పుడు మీరు మరల నీమార్గముననే వెను కకు వచ్చి నౌకపై నెక్కి తిరిగిపోవలయును. ఇక్కడనుండి నగరము నకుఁ బోవుటకు నదీమార్గముకంటె వేఱొక్రొవ యేదియును లేదు.

యశో.—బాలకా! నేనీమగధరాజ్యమునందు సామాన్య మా నవుఁడనుగాను. సైన్యమునందు నాకు మహానాయకబిరుద మున్నది. రాజకీయసమావేశమునందు నేను యువరాజభట్టారక పాదీయుఁడను. ఒక్కయంతఃపురమునకుఁదక్క రాజభవనమునందు మఱియెచ్చటికిఁ బోవుటకును నా కాతంకము లేదు.

శశాంకుఁ డాశ్చర్యముతో "మీరు—మీరు—మహానాయ కులా?—యువరాజభట్టారకపాదీయులా?—" అనియెను.

యశో.—(నవ్వుచు) బాలకా! నీకిందాశ్చర్యపడుట కేమున్నది?

శశాం.—నేను పుట్టినది మొదలిప్పటివఱకును నే మహానాయ కుఁడుగాని, యే యువరాజభట్టారకపాదీయుఁడుగాని యీవిధముగా రాజగృహమునకు వచ్చుటను జూచియుండలేదు, అట్టివారు రాజ భవనమునకు వచ్చునప్పు డెందఱో పదాతిసైనికులును, నశ్వారోహ కులును వారిననుసరించి యుందురు. వారికి మార్గమును వదలి నాగ రికు లిటునటు పాఱిపోవుచుందురు. ఈసామ్రాజ్యమునం దేయువ రాజభట్టారకపాదీయుఁడైనను పాదచారియై తిరుగుచుండఁగా నే నెన్నఁడును జూచియుండలేదు.

యశో.—అబ్బాయీ: నీ వెవ్వరు?

శశాం.—నేను సార్వభౌముని జ్యేష్ఠపుత్రుఁడను. నాపేరు శశాంకుఁడు.

ఆమాట విన్నంతనే వృద్ధుఁడు తనకరవాలమును పైకిఁ దీసి దానియగ్రభాగముచేఁ దనపలితకేశములను స్పృశించెను. అదియే యాకాలమున వీరులయభివాదనపద్ధతి. యశోధవళుఁ డట్లభివాదనముం గావించి "యువరాజా! నేనీపాటలీపుత్రమునకు వచ్చి చాలకాలమైనది. అందుచేతనే నేను మిమ్ముఁ దెలిసికొనఁజాలనైతిని. నాయీయపరాధమును సైరింపుఁడు. నేను పూర్వము రాజసభలకు వచ్చుకాలమున మీరు పుట్టియుండలేదు. అప్పటికి మీపినతండ్రి యగుదేవగుప్తునే సామ్రాజ్యమునకు భవిష్యదధికారిగా భావించుచుంటిమి. యువరాజా! సామ్రాజ్యమునందలి యితరమహానాయకులకుఁ గల వైభవవిశేషములు నాకడ లేవు. కావున నేనిప్పుడు సార్వభౌమసందర్శనమునకీవిధముగఁ బోవుచున్నాను" అనియెను.

శశాంకుఁడు మౌనముతో యశోధవళుని స్థూలోన్నతశరీరమును, నందలి యసంఖ్యశస్త్రఘాతచిహ్నములను లక్ష్యపూర్వకముగాఁ బరిశీలించుచుండెను. యశోధవళునివాక్యములు పూర్తియైన పిమ్మట యువరాజాదరసంసూచకస్వరముతో "రండు! మీరు నాతోఁ గలసి రాజభవనమునకు రండు!" అనియెను.

పదియవప్రకరణము.

మనకథాకాలమునాఁటికిఁ బాటలీపుత్రబహిర్భాగమునందనేకవ్రజలు నివసించుచుండిరి. పురాతననగరమునకుఁ జుట్టును విశాలతటం బుండుటచేతను లోపలిప్రదేశము సంకుచితమైయుండుటచేతను గ్రొత్తగనివసించువారి కొక్కయడుగు నేలయైనను లేకుండఁబోయెను. అందుచే నగరమునందలి పేదవారనేకు లాతటమున కవ్వలివైపుననే చాలవఱకు నివసించుచుండిరి. అనేకసంవత్సరములకిందటనే గర

పూర్వదక్షిణసీమలఁ గొన్ని చిన్నగ్రామములు నిర్మింపఁబడియెను. పాటలీపుత్రపౌరులీజనపదములకు "ఉపనగర"మని పేరిడిరి. నగరమున కుత్తరపశ్చిమదిశల భాగీరథీశోణనదులు ప్రవహించుచుండెను. కాని నగరమున కావలితీరముననైత మనేకపౌరులు నివసించుచుండిరి. ఉదయముననే లేచి తమతమయుదరపోషణములకై వలయుకార్యములను గావించుకొనుటకు జనపదములవా రానగరమునకు వచ్చి సాయంకాలమునఁ దమతమస్థానములకుఁ బోవుచుందురు.

నగరమునకు దక్షిణభాగమునం దున్న యుపనగరమునందలి యొక ప్రాచీనజీర్ణమందిరపురోభాగమునఁ గొందఱు బౌద్ధభిక్షుకులు పొలములోని పచ్చికపైఁ గూర్చుండి సంభాషించుకొనుచుండిరి. ఆ మందిరమునకు వెలుపలిభాగమంతయు లతాతరుపరిపూరితమై యరణ్యమువలె నైపోయెను గాని యందం దున్నతములగుశిలాస్తంభములు మాత్ర మొకటిరెండు కానవచ్చుచుండెను. అతిప్రాచీనకాలమునం దీప్రదేశమునఁ బాషాణనిర్మితమగు బౌద్ధమందిరముండెను. కాలక్రమమున నదిశిథిలమై పోవుటయు భిక్షుకులు దానియెదుటనే యొక చిన్నమందిరమును నిర్మించి మూర్తిస్థాపనముం గావించిరి. ఆపొలమునఁ గూర్చుండియున్న భిక్షుకు లందఱును దరుణవయస్కులే యగుటచే వారు కొలఁదికాలము క్రిందటనే గృహస్థాశ్రమమును ద్యజించియుందురని తోఁచుచుండెను. సర్వసంగపరిత్యాగులగుభిక్షుకుల కుచితంబైనగంభీరభావ మింకను వారికిఁ బట్టువడలేదు.

ఆతరుణభిక్షుకులనడుమ నొకప్రౌఢభిక్షుకుఁ డాసీనుఁడైయుండెను. వయసునఁ గొంతయాధిక్యమున్నను నాతఁ డితరభిక్షుకులతో పరిహాసము లాడుటయందే నిమగ్నుఁడై యుండెను. వీరల కనతిదూరమునం దొకతరుణభిక్షుకుఁడు కూర్చుండియుండెను. ఆతఁ డేదియో దీర్ఘముగ నాలోచించుచున్న ట్లగపడుచుండెను; తోడి భిక్షువులహాస

ప్రచండధ్వను లాతని వీనులవఱకును జేరుటయే లేదు కాఁబోలును! ఆతనింగాంచి యాభిక్షుకు లప్పుడప్పుడు తమలో నేమేమియో యనుకొనుచుండిరి; ఆతని నుపహసించుచుండిరి; అంతలోనే హాసధ్వనులచే నాకాశమండలమును బరిపూరితముగఁ జేయుచుండిరి. కాని యెవ్వనింగూర్చి యీహాసోపహాసబాణవర్షము గురియుచుండెనో యాతని కీప్రచండహాసబాణవర్షధ్వని వినఁబడుటయే లేదు.

ఆభిక్షుకమండలి యిట్టికార్యక్రమమున నిమగ్నమై యుండఁగా నింతలో నొకతరుణి యామందిరముకడకు వచ్చెను. ఆయువతిం గాంచి నంతనే వారిహాసధ్వని మందమయ్యెను. అప్పుడొకఁడా ప్రౌఢభిక్షుని యొడలిపై మెల్లఁగ గోకుచు "ఆచార్యా! ఆమె మీకొఱకే వెదకుచున్నదని తోఁచుచున్నది." అనియెను.

ద్వితీ—(నవ్వుచు) ఓరీ! నీకు మతిపోయినదా యేమి? ఆచార్యులవారు వృద్ధులు. యౌవనస్త్రీలు స్వయముగా నొకవృద్ధపురుషుని వెదకికొనుచు వచ్చుట యెన్నఁడైన సంభవించునా?

ప్రథమభిక్షుకుని, పల్కులు విని వృద్ధున కానందము కలిగెను. ఆతనిమోమున హాసరేఖ యుదయించెను. కాని యింతలో ద్వితీయుని మాటవలన నాస్మితరేఖ మాయమైపోయెను. అప్పుడాతఁడు కోపావేశముచే మండిపడుచు "ఓరీ! నీవు నన్ను వృద్ధుఁ డనుచున్నావా? అయినను నొకయువతిసముఖమున నీవట్లనవచ్చునా ? చూచుకొనుము! ఇక్కడనే నిన్నుఁ జంపివైతును!" అనియెను.

ఈగర్జనము నాకర్ణించి ప్రథమభిక్షువు నవ్వుచు "ఆచార్యా! మాయీయల్పాపరాధమును క్షమింపుము. అయిననేమి? ఆనాఁడు సంఘస్థవిరుఁడనలేదా? ఆచార్యదేశానందుఁ డిప్పుడు వృద్ధుఁ డయ్యెను. తరుణభిక్షువులకు శిక్షణమొసంగుట కిట్టి వృద్ధులేగాదా యుపయోగింతురు! వృద్ధుఁడు—"

అనుచుండఁగనే వృద్ధుఁడు క్రోధతీవ్రస్వరముతో "ఏతండ్రి వృద్ధుఁడు - నీతాతవృద్ధుఁడు-ఏఁడొక పిచ్చివాఁడు. చేతికిఁ దొరకెనని నీకుఁ దోఁచుచున్నది. కాఁబోలును. జాగ్రత్త! మిమ్మందఱ నొక్కుమ్మడి నిక్కడనే నఱికివైచెదను" అని పలుకుచు దారుణోన్మాదగ్రస్తునివలె నావృద్ధబౌద్ధసన్యాసి లేచి వారిపైఁ దుముకఁబోయెను. అందఱును గలసి యాతనిం బట్టుకొని క్రిందఁ గూర్చుండఁబెట్టఁ బ్రయత్నించిరి. కాని యెంతకు నాతఁడు కూర్చుండఁడయ్యెను. కోపముచేఁ దలదిరిగి పోవుచుండుటచే నాతఁడు మరలమరల లేవఁ బ్రయత్నించుచుండెను. ఎట్టకేలకు మహాప్రయాసపడి వారాతని నెట్లో శాంతింపఁజేసిరి. అనంతర మాతరుణభిక్షువులందఱును గలసి యంజలిబద్ధులై మేమే వృద్ధుల మనియు, నాచార్యక్షేశానందులగు మీరే తరుణవయస్కులనియు నధ్యయనాధ్యాపనాదిప్రయాసముచే మీకేశము లించుక పలితము లయ్యెను గాని యంతకంటె వేఱేమియుఁ గాదనియు నొప్పుకొని లెంపలు వాయించుకొని తమయపరాధమును బరిమార్జితముగఁ జేసికొనిరి.

ఏయువతిమూలమున మనభిక్షులలో నీయకారణకలహము కలిగినదో యారమణీమణి నిశ్చయముగ నధికరూపవతియైయుండెను. ధరించిన వసనభూషణాదులంబట్టి యాతరుణియొక యున్నతవంశసంజాత యనియుఁ గాదేనొక ధనాఢ్యుఁడగు నాగరికునియింటి దాసియైయుండు ననియుఁ జూచినవారికిఁ దోఁచుచుండెను. భిక్షుమండలమున జరగుచున్న గందరగోళము నంతయుం గాంచుచు నామె దవ్వుననే నిలిచియుండెను. అనంతర మొకింతతడవునకు వారిలో శాంతి నెలకొనుటయు నామె యేమియో ప్రశ్నించుదానివలె వారిచెంతకు వచ్చెను. ఇంతలో నాచార్యుఁడే యామె నడ్డగించి "నీవు నన్నేగదా వెదకికొనుచువచ్చితివి?" అని ప్రశ్నించెను.

యువతి మందహాసము చేయుచు "కాదయ్యా! కాదు భిక్షుజినానానందులిచ్చటనే యుందురా?" అనియెను.

ఆమె ప్రత్యుత్తరము నాలకించి యాచార్యుని నడుము విఱిగిన ట్లయ్యెను. అతఁడు హతాశుఁడై పోయెను. ఆమె మరల మృదుస్వరముతో "భిక్షుజినానందు లిచ్చట నున్నారా?" అని యడిగెను.

ఆచార్యుఁ డేమియును బ్రత్యుత్తరము చెప్పలేదు. అప్పుడు సమీపమునందున్న భిక్షుఁడు "ఉన్నారు!" అనియెను. ఆమాట విని యాయువతి యానందించిన ట్లగపడియెను. అప్పుడామె యుత్కంఠతో స్వామీ! వారి నొకసారి యిటకుఁ బిలిచెదరా?" అనియెను.

భిక్షు—ఎందుకు?

యువ—(యించుక సంకోచించి) వారితో నాకత్యావశ్యక మగు పని యున్నది.

భిక్షు—ఆపని యేమో నాకుఁ దెలుపవచ్చునా?

యువ—ఆసంగతి మీకుఁ జెప్పఁజాలను. ఆవార్త యెవ్వరితోడను జెప్పఁగూడదని మాయజమానుని యాజ్ఞ యైనది.

భిక్షు—ఏతరుణియైనను వచ్చి యేకాంతముగ నేభిక్షునితోనైనను మాటాడఁగూడ దని మా సంఘారామము (బౌద్ధమఠము)న నొక నియమ మున్నది.

ఆరమణి యించుక సేపాలోచించి "అట్టి నియమ ముండవచ్చును. కాని నేనాయనతో రహస్యముగ మాటాడవలయునని వచ్చియుండలేదు" అనియెను.

భిక్షు—అట్లయినచో రహస్యముగఁ దెలుపవలసిన విషయమునుగూర్చి బహిరంగముగా నిచ్చాతని నెట్లు మాటాడఁగలవు?

యువ—నాయొద్ద నొకయుత్తర మున్నది. దానిని—

భిక్షు—దానిని నాకిమ్ము. నేనాతని కందించెదను.

యువ—(కొంచెము వెనుకకు జరగి) స్వామీ! క్షమింపుఁడు! జినానందభిక్షువునకుఁ దక్క నితరుల కెవ్వరికి నీయుత్తరము నీయవల దని నాయజమానుఁ డాజ్ఞాపించియున్నాఁడు.

భిక్షు—(చిఱునవ్వుతో) ఈసంఘారామమునందలి భిక్షువు లందఱిలోనను జినానందుని నీవెట్లు గుర్తింపఁగలవు!

యువ—ఆయన వచ్చినచో నేను బాగుగ నానవాలుపట్టఁగలను. నాయొద్ద నొకసాంకేతికచిహ్న మున్నది.

ఇంతలో నాయిరువురివెనుక నున్నయొకభిక్షుఁ డుచ్చైస్స్వరముతో "జినానందా! జినానందా! నీకేమియును వినఁబడుట లేదా? జినానందా! ఏమిది? నీవు సమాధి యైపోలేదుగద!" అని యఱచెను.

అందఱికును వేఱుగా దూరమునఁగూర్చుండి యున్న భిక్షుఁ డేకాగ్రచిత్తముతో నేమియో యాలోచించుచుండెను. అతఁ డిప్పుడొక్కించుక తలను పైకెత్తి చూచెను. రెండవ భిక్షుఁ డాతనిం గాంచి "ఈ యువతి యెవ్వరో నీతో మాటలాడఁ గోరుచున్నది. నీవీమాట లేమియు నాలకించుట లేదు కాఁబోలును! ఈమెమూలమున నిప్పు డిచ్చట నెంతయో గడబిడ జరగినది!" అనియెను.

జినానందుఁ డేమియును మాఱుమాట చెప్పలేదు, ఆయువతిం గాంచినంతనే యాతఁడు చటాలున లేచి యామెచెంతకుఁ బోయి యత్యాదరముతో "నీవిక్కడ కెప్పుడు వచ్చితివి? విశేషము లేమి? చెప్పుము!" అని యడిగెను.

ఆయువతి యించుక సేపటివఱకు ననిమిషనయనములతో జినానందుని మొగమువంకఁ దిలకించుచుఁ బిమ్మట నాతనికి వందనము చేసి "మహారాజా! ఈక్రొత్తవేషముతో నున్నమిమ్ములను నేనెంతమాత్రమును గుర్తింపఁజాలనైతిని. విశేషము లున్నవి—కాని—ఇచ్చట నున్నభిక్షులందఱును మహాక్రూరులు. దయయుంచి మీ రించుక యావలి

కి రావలయును" అని చెప్పి యామె యామందిరబహిర్భాగమునందలి వృక్షాంతరాళమునఁ బ్రవేశించెను. ఆభిక్షుఁడుకూడ నామె వెనువెంట నే పోవుచుండెను.

వృద్ధదేశానందుఁ డింతవఱకును స్తబ్ధుఁడై కూర్చుండియుండెను. ఆస్త్రీయును, జినానందుఁడును జెట్లచాటునకుఁబోయి కనుమఱుఁగై నంతనే యాతఁడొక్కయుదుటున లేచి దవ్వుదవ్వుల వారి ననుసరించి పోవసాగెను. ఆతని ప్రవర్తనముం గాంచి తక్కినభిక్షు లందఱును గడుపు లుబ్బ నవ్వనారంభించిరి. కాని దేశానందుఁడు వారివంకఁ దీవ్ర దృష్టిక్షేపముం గావించుచు "ఓరీ! మీరెటులైనను బసికుఱ్ఱలు! స్త్రీలచరిత్రమాహాత్మ్యములు పసిబిడ్డలగు మీకేమి తెలియును? కుమార్గగమనోన్ముఖుఁ డగునీతరుణభిక్షునకు బుద్ధి చెప్పుటకై నేనాతని వెంటఁ బోవుచున్నాను! ఇది మీకుఁ బరిహాసముగా నున్నదా?" అనియెను.

దేశానందుని విచిత్రకార్యకారణసమన్వయమును విని భిక్షుకు లందఱును మరల బిగ్గఱగా నవ్వఁదొడంగిరి. కాని యావృద్ధుఁడు వారి నవ్వులను లక్ష్యము చేయలేదు. ఆతఁడు క్రూరవ్యాఘ్రము వలెఁ బొంచుండి తరుమండములమాటున డాగుచు ముందఱికిఁ బోవుచున్న తరుణీతరుణుల వెనువెంటనే పోవఁదొడంగెను.

దేశానందుఁడు కన్నుల కగపడకుండఁ బోయినతరువాత నొక భిక్షుఁడు మృదుస్వరముతో "ఈజినానందుఁ డెవ్వఁడో మీరెవ్వరైన నెఱుఁగుదురా?" అని ప్రశ్నించెను.

ద్వితీయుఁడు— బాగుగ నాలోచింపఁగా నాతఁ డొకరాజపుత్రునివలె నగపడుచున్నాఁడు. ఏది యెట్లయినను నీతఁ డొకమహా శ్రీమంతునితనయుఁ డనుట కెంతమాత్రమును సందేహము లేదు.

ప్రథముఁడు—ఈజినానందుని చరిత్రవిషయమునం దేదియో రహస్య మున్నది. ఆవిషయమున నెట్టిసంశయమును లేదు. కాని యా రహస్య మేమియో యెంతప్రయత్నించినను నాకు బోధపడుటలేదు.

ద్వితీ—ఏమి ! ఎట్టిరహస్య మున్నది?

ప్రథ—అనఁగా—నీకేమియు సంశయము కలుగుట లేదా? మనసంఘస్థవిరుఁడు (మఠాధికారి) నీకేమియు నీవిషయమునఁ జెప్పి యుండలేదా?

ద్వితీ—లేదు. లేదు-ఎన్నఁడును నాతో నేమియును జెప్పలేదు.

ప్రథ—అలాగా? ఆనాఁడు నీవెక్కడికో పోయియుంటి వని తోఁచుచున్నది. ఈజినానందుఁడు మనసంఘారామమునకు వచ్చిన దినమున సంఘస్థవిరుఁడు మమ్మందఱ నొక్కచోటికిఁ బిలిచి మీరందఱు నెల్లప్పుడు నీజినానందునిపై నొకకన్నువైచి యుండుఁ డని చెప్పియున్నాఁడు. రాత్రి వేళల నాతనిగదివాకిట నిరువురుభిక్షులు కావలి యుండవలయునని కూడ నాతఁడు నియమించెను. ఎందఱో నవీనభిక్షు లీ సంఘారామమునఁ జేరుచుండుటను జూచితిమి గాని సంఘస్థవిరుఁ డెన్నఁడు నెవ్వరివిషయమునను గూడ నిట్టివిలక్షణ మగునాజ్ఞను గావించి యుండలేదు.

ద్వితీ—మనసంఘారామమున కిది యొకమంచివేఁటయే దొరకినది. ప్రస్తుతము మనసంఘమునకు దుర్దినములు సంప్రాప్తములై యున్నవి. కావుననే యిట్టివేఁటలకు విలువ హెచ్చిపోవుచున్నది. ఇందాశ్చర్య మేమున్నది?

ప్రథ—అది మనకందఱకును గానవచ్చుచునే యున్నది. కాని యింతమాత్రమున జినానందునిరహస్య మెట్లు బయలగును? ఈకొలఁదికాలములోనే యాతనికి రెండుమూఁడుజాబులు వచ్చినవి.

ఆసమయమున వారికిఁ గొంచెమోడముగా నొకచో నేలపైఁ

బండియున్న వృద్ధభిక్షువు చటాలున లేచి "సావధా—సావధాను లగుఁడు! అందఱును, జాగ్రత్తగ నుండుఁడు! దూరమున వజ్రాచార్యుల వారగపడుచున్నారు. అనియెను. వజ్రాచార్యుఁ డన సిద్ధభిక్షువు—ఈతని చేత నెప్పుడును వజ్రాయుధ ముండును.

ఆతనిమాట విని యెల్లరును లేచి నిలువఁబడిరి. కొలఁది సేపటిలోనే యొక చెట్టుకొమ్మ భుజముపై నిడుకొని, చినిఁగినగుడ్డల నొడలం దాల్చియున్న యొకవృద్ధభిక్షువు వచ్చి యామందిరమునెదుట నిలువఁబడియెను. ఆతనింగాంచి యందఱును భూపర్యంతమును వంగి యాతనికిఁ బ్రణమిల్లిరి. భాగీరథీతీరమునం దీవృద్ధుని మన మొకసారి చూచియున్నాము. యువరాజశశాంకుని భయంకరభవిష్యోదంతమును దెలిపిన విచిత్రదైవజ్ఞుఁడే యీవృద్ధుఁడు!

వజ్రాచార్యుఁడు—దేశానందుఁ డెక్కడ నున్నాఁడు?

భిక్షులు—ఈవనమున కేఁగియున్నాఁడు.

వజ్రా—సంఘస్థవిరుఁ డేఁడీ ?

భిక్షు— మందిరములో నున్నారు.

* * * *

వెనుకఁ బ్రస్తావించిన వనమునందలి శిథిలశిలాస్తంభముల వెనుక నిలిచి తరళా జినానందులు మెల్ల మెల్లఁగ నేమేమియో సంభాషించుకొనుచుండిరి.

తరళ—మీరీవిధముగా నెంతకాలము గడపెదరు?

జినా—తరళా! చెప్పుము! నేను చేయవలసినపని యేమున్నది? ఏమిచేయఁగలను; నేనిప్పుడనన్యగతికుఁడ నై యున్నాను. వీరు నన్నుఁ బ్రత్యక్షముగా బంధించి యుండలేదు. కాని యిట్లుంచుటకంటె బంధించివైచుటయే మేలని తోఁచుచున్నది. ఎల్లప్పుడును, రేయుంబవ లష్టప్రహరములును—నావెంట నెవ్వరో యొక రుండియేయుందురు. వీరు

నన్నుఁ దమదృష్టినుండితప్పించుకొననిచ్చుట లేదు. పాటలీపుత్రకైనను నాకేమార్గమును దొరకుట లేదు.

తర—ఆలాగా? ఇఁక మీరు మరలిరారా?

జినా—మరలి వచ్చుట నాకు సాధ్యమే యగునేని నేనొక్క నిమిషమైన నిచ్చట నిలిచి యుందునా తరళా?

తర—మిమ్ములను బలవంతముగా భిక్షువుం గావించుటవలన వారి కేట్టిలాభ మున్నదో నాకు బోధపడుట లేదు. మీతండ్రిగారికి మీరొక్కరే తనయులు-మిమ్మీవిధముగాఁ ద్యజించునప్పుడు మీతండ్రిగారికైనను విచారము కలుగలేదేమి? అదియే వింతగా నున్నది.

జినా—తరళా! ఎట్టిలాభలోభముచే వీరు నన్నిట్లు భిక్షునిం గావించిరో నీకుఁ దెలియ లేదా? జనకునిమరణానంతరమున నేనొక్కఁడనే యాతనియగణితసంపత్తి కధికారి నగుదును. ఒకవేళ నేను నా యెప్పటిజీవనక్రమమునం దుందునేని—హా—నాయొక్కడిదింక?—నేనాయూధికను బెండ్లియాడి సంసారి నగుదును. కాని నేనేదినమున నీసంఘమునఁ బ్రవేశించితినో—భిక్షువునైతినో—ఆనాఁటితోనే నాకా యధికారము వదలిపోయినది. ఆనాఁడే నేనీజగంబున నిశ్చయముగా మరణించితి నని చెప్పవచ్చును. ఈస్థితిలో నాతండ్రియనంతరమున నాతని విశాలసంపదకంతకును నేను పేరునకుమాత్రమే యధికారిన గుదును. కాని నిజముగా నాసర్వసంపదయు నీబౌద్ధసన్న్యాసులకుఁ జేరఁగలదు. తరళా! ఇందుకొఱకే వీరు నన్నిచ్చటికిఁ దెచ్చియున్నారు.- ఈకారణముననే యిప్పటివఱకు—నొక్కనిమిషమైన—నన్నెమరకుండఁ గాఁచుకొనుచున్నారు.

తర—కాని-మహారాజా! మీరావసుమిత్రులేనా?

జినా—(నిట్టూర్పు విడిచి) తరళా! నీనోటితో నానామము నిప్పు డుచ్చరింపవలదు. శ్రేష్ఠివసుమిత్రుఁడెన్నఁడో మరణించి యున్నాఁడు. నేనిప్పుడు జినానందుఁడను.—

తర — లేదు మహారాజా! లేదు. మీరు మరణింపలేదు. మీ రెప్పటికిని సజీవులే. ఈతరళ బ్రతికియున్నంతవరకు శ్రేష్ఠివసుమిత్రుఁ డెప్పటికిని మరణింపఁడు — మీరు మరల నెప్పటివలె నిశ్చయముగ నీజగత్సంసారమునఁ మెలంగఁగలరు — యూథికను బెండ్లియాడి. —

జినా — (దీర్ఘశ్వాసము విడిచి) ఇది కేవలము నడియాస! తరళా! దురాశయును గాదు! దుస్స్వప్నమును గాదు. ఇప్పుడు నేనట్టి కలగనుటకూడ మహాపాప మగును.

తర — మహారాజా! కేవలనాశాపిశాచగ్రస్తుఁ డగుటచే మీతండ్రి పేరైన నెత్తువారెవ్వరును నగరమున లేరు. మీతండ్రి యెందఱుగృహస్థులను బికారులుగాఁ జేయలేదు? పూర్వమొకప్పుడు నేను మీతండ్రిగారి కఠినచరిత్రముం గూర్చి మాటాడుచు నాతఁడు మనుజుఁడే కాఁడని యంటిని — పశువంటిని — కాని యిప్పటినాయనుభవమును బట్టి చూడఁగా నాతఁడు పశువును గాఁడు! కేవల పాషాణమే — ఏమనిన — పశువులకైనను దమకిశోరములపై మక్కువయుండును!

జినా — ఛీఛీ! తరళా! నీవు భ్రమపడుచున్నావు. నాన్నగారికి హృదయమే లేదని యనరాదు. వారికి ధనాశమిక్కుటమే గాని మనఃకోమలత్వము వారికి బొత్తుగాఁ లేకపోలేదు. తరళా! బౌద్ధసంఘోన్నతికై పుత్రుఁడ నగునన్నుఁగూడ బలియిచ్చినవారు వారేగదా! తనసంపదచే బౌద్ధసంఘ మున్నతిం గాంచునని వారివిశ్వాసము! రాజు బహిరంగముగా బౌద్ధమతమునకు శత్రువు గాఁడు. కాని యాతఁడు బౌద్ధమతానుయాయిమాత్రము గాఁడు. తనమరణానంతర మధికారమును వహించి నేనొకవేళ బౌద్ధసంఘముతోఁ గలహము పెట్టుకొందునేమో యనుసందేహముచే నాజనకుఁడు నన్నీవిధముగా జీవములతోనే చంపివైచెను — తనసర్వమును — అంత యేల? — ధర్మోన్నతికై తనయేకపుత్రుని బలియొసఁగి యాతఁడక్షయపుణ్యమును సంపాదించుకొనియెను.

తర — మహారాజా! ఇఁక మీరేమియును జెప్పనక్కఱలేదు—ఆహా!—మీతండ్రి!—ఇందుకొఱకే మీయెదుట నాతనిఁగూర్చి నే నేమియుఁ జెప్పఁదలఁచుకొనలేదు.

అని తరళ కోపముతో నూరకుండెను. ఇంతలో సమీపమున నెండుటాకులపై మనుజులు నడచుచున్న పదధ్వని వినవచ్చెను. జినానందుఁ డదరిపడి "ఇఁకఁ జాలును! ఎవ్వరో వచ్చుచున్నారు." అనియెను.

తరళ నిర్లక్ష్యముగా "రానిండు! ఇంతగా భయపడవలసిన యావశ్యక మేమున్నది? ఏమగునో చూత్తము!" అని యొకచెట్టునీడను నిలువఁబడి నలుదెసలఁ బరికించి మరల జినానందుని చెంతకుఁ జని "మహారాజా! భయమునకుఁ గారణ మేమియును లేదు, ఆవు సలియుండకొడుకు మనవెనువెంటనే వచ్చెను గాఁబోలును! నాకింక నిక్కడ నుండవలసినపని యేమియును లేదు. మహాప్రభూ! మీరు మరణింపలేదు—జీవించియే యున్నారు! ఈమాటమాత్రము మనసునం దుంచుకొనుఁడు! ఇటనుండి మిమ్ము విడిపించుకొని నావెంటఁ గొనిపోయిననే గాని నాపేరు తరళగాదని నమ్ముఁడు!" అని హెచ్చరించి యాక్షణమునందే యామె యాయడవిలోఁ బడి నిమిషములో నగపడకుండఁ బోయెను. జినానందుఁ డొకదీర్ఘనిశ్వాసమును విడిచిమెల్లగా వెనుకకు మరలెను. ఆచార్యదేశానందుఁడు రహస్యముగాఁ దరళను వెంబడించి పోవుచున్న ట్లాతఁడు కనుఁగొనియెను

పదునొకండవప్రకరణము

మందిరమంతయు నంధకారబంధురమై యుండెను. నేతిదివ్వె యొకటిమాత్రము మినుకుమినుకు మనుచుండెను. ఆదీపకాంతిలో

మందిరమునందలి దేవమూర్తిమాత్రి మించుక దృగ్గోచర మగు చుండెను. విగ్రహమునకుఁ బుష్పములు, చందనము, నైవేద్యము మొదలగు సామగ్రిలు సిద్ధపఱుపఁబడియుండెను. సామాన్యముగఁ జూచినచో నామందిరమునం దెవ్వరును లేనట్లే యగపడును. కాని యందొకమూల నొక పొడుగైన పురుషుఁడు కూర్చుండి యుండెను. వాఁడు నిస్తబ్ధుఁడై నిశ్చలుఁడై కూర్చుండుటను జూడ ధ్యాననిమగ్నుఁడై యున్నట్లు తోఁచుచుండెను.

ఇంతలో నొకవృద్ధుఁడు వచ్చి ద్వారముకడనిలిచి "ఏమోయీ! స్థవిరా! లోపలనున్నావా?" అని ప్రశ్నించెను.

స్థవి—ఎవరు మీరు?

వృద్ధు—శత్రుసేనుఁడను.

స్థవి—రమ్ము; లోనికి రమ్ము!

వృక్షశాఖ భుజముపై నిడికొనివచ్చి యిదివఱకు మనకుఁ బరిచితుఁడైన వృద్ధవజ్రాచార్యుఁ డప్పు డామందిరాంతర్భాగమునఁ బ్రవేశించెను. అతనిం గాంచినంతనే యున్నతపురుషుఁ డగు స్థవిరుఁడు "వజ్రాచార్యా! నీవీవృక్షశాఖ నెక్కడఁ దగ్రించి తెచ్చితివి?" అని యడిగెను.

వజ్రా—(చిఱునవ్వుతో) సరిసరి! ఇది వట్టికొమ్మగాదు. ఇది యే నావాయువేగతురంగము! దీనిసాహాయ్యముననే నే నాయశోధవళ దేవునిచేతులనుండి తప్పించుకొనఁ గలిగితిని! అట్లు గాకున్నచో వజ్రాచార్యునకు బలినిర్వాణ మైపోయినదని నీవీపాటి కాలకించి యే యుందువు! (బలినిర్వాణమనిన బౌద్ధసాంప్రదాయమునందు మోక్షమని యర్థము)

స్థవి—అయిన నేమిలే! కార్యసిద్ధియయ్యెనా లేదా?

వజ్రా—అయ్యెనో లేదో నాకుఁ దెలియదు. కాని శశాంకుఁ డింకను బ్రదికియే యున్నాఁడు.

స్థవి—అట్లయిన నీవచ్చటి కేల పోయితివి?

వజ్రా—బంధుగుప్తా! నేనేమి చేయుట కక్కడకుఁ బోయితినో సమస్తమును నీకుఁ దెలిసియే యున్నది. మరల నన్నేల యడిగెదవు? నానోటనే వినఁదలఁచితివేని వినుము! నేను శశాంకుని జంపఁ బోయితిని.

స్థవి—తుద కేమైనది?

గుసు? వజ్రా—ఏమ నేనాతని వధింపఁజాలక పోయితిని.

స్థవి—తగినయవకాశము దొరకలేదు కాఁబోలును.

వజ్రా—అవకాశము లభింపకేమి? శశాంకుఁడు, మాధవుఁడు, చిత్రి, ఈయిరువ్వురును భాగీరథీతీరమునఁ బ్రవాహసమీపమున నాడుకొనుచుండిరి. వారిలో నొక్క సేవకుఁడైనను లేఁడు!

స్థవి—ఇంకేమి? మంచియదనే దొరకినది!

వజ్రా—ఏమికావలయును? అంతయు ననుకూలముగనే యున్నది. కాని, నేనే మాత్రము జంపఁజాలక పోయితిని. బంధుగుప్తా! ఏమిచేయుదును? ఆబాలుని కోమలకంఠమును నఱకుటకు నాకృపాణహస్తమును బైకెత్తలేకపోయితిని. నీవిచ్చినవజ్రాయుధ మింకను నా చేతిలోనే యున్నది. ఇంకను దానినట్లే వస్త్రాభ్యంతరమున దాఁచి యున్నాను. కాని, నేనప్పుడు దానిని బైకిఁ దీయలేనైతిని. స్థవిరా! నరహత్యలు చేసి చేసి నీవు నల్లఱాతివైపోయితివి! నీమనంబునఁ గోమలత్వమే లేకుండఁ బోయినది అందుచేతనే నేను నిష్ఫలారంభుఁడనై యేలవచ్చితినో గ్రహింపఁజాలవైతివి. ఇఁక నెన్నటికిని గూడ గ్రహింపఁజాలవు. నీయుపదేశము ననుసరించి నేను శశాంకుని వధింపవలయు ననియే ప్రతిజ్ఞచేసి యింటనుండి బయలుదేఱి పోయితిని. కాని, దూరమున గంగాతీరమున సికతాతలమున నిస్సహాయుఁడై యున్న శశాంకునిం గాంచినప్పుడు మాత్రము నేను నాపూన్కినుండి

యొంతమాత్రమును జలింపలేదు. సమీపమున కేఁగి యాతని దర్శించి నప్పుడుమాత్ర మెవ్వరో నావెనుకనుండి వజ్రముష్టిచే నాచేతులను గట్టిగ బిగించి పట్టుకొన్నట్లయినది. నీయాదేశానుసార మాతని భవిష్యముం గూర్చి యాతనికిఁ దెలిపితిని. కాని, యాతని జంపుటకు మాత్రము నాచేతులు రావయ్యెను. స్థవిరా! సర్వమును భాగ్యచక్రబద్ధమై యుండును. విధివిధానము నతిక్రమించుట యసంభవము గదా! నీవంటి శతాధిక సంఘస్థవిరులును, నావంటి సహస్రాధిక వజ్రాచార్యులును నేకమైనను భాగ్యచక్రగమనము నణుమాత్రమైనను మరలింపఁజాలరు. గంగాసైకతప్రదేశమున నాసీనుఁడై యున్న యా బాలుని యదృష్ట తేజోమయంబగు ముఖకమలము నీక్షించినచో శత్రుసేనబంధుగుప్తులలో నెవ్వరికైనను నాతని యొక్కశిరోజమునకైన నపాయ మాపాదించుట యశక్యమేయని నాకుఁ దోఁచినది.

వజ్రాచార్యునిమాటలవలన బంధుగుప్తునిమనశ్శాంతి యంతేయును నశించిపోయెను. అతఁడు క్రోధోద్రేకముతో "పిఱికిపందా! నీవు పురుషుఁడవా? శుద్ధ—శుద్ధనపుంసకుఁడవు! ఆకుబ్జవానిసుందరరూపమును, గాంతిని గనుంగొని మోహపరవశుఁడవై పోయితివా? మారుని యాసురమాయ నిన్నుముంచివైచినది! అందుచేతనే కోమలశరీరుఁ డగునొక బాలుని వధించుకార్యముగూడ నీకశక్యమైపోయెను. వజ్రాచార్యా! నీవు మాగధసంఘమునకు నాయకుఁడవు. ఉత్తరపథపుటార్యసంఘము నీయంగుళీసంచాలనమున నడచుచున్నది. అట్టినీవు భాగ్యచక్రకల్పనాంధకారమధ్యమున దాఁగి కూర్చుండఁజూచుచుంటివా? శత్రుసేనా! అల్పవయస్కులు, అజ్ఞానులు, వృద్ధస్త్రీలు మొదలగువారుదక్క భాగ్యచక్రముపై విశ్వాసముంచి స్వస్థచిత్తులై యూరక కూర్చుండు వారీకాలమున నెవ్వరున్నారు? ఛీఛీ! సిగ్గు సిగ్గు! శశాంకసంహార మిఁక నీవలనఁ గానేరదు. ఆర్యసంఘోన్నతి

కొఱ కొకసామాన్యబాలకుని సంహరింపఁజాలకపోయితివి. వజ్రాచార్యా! నీకీర్తిం దాఁకిన యీదుష్కళంకమును నీవిఁక నెన్నటికిఁ దొలఁగించుకొనఁగలవు? యుగములవెంట యుగములు గడచిపోయినను నీ యీకళంకచరిత్రము బౌద్ధసంఘమునఁ జిరకాలమువఱకును బ్రతిధ్వనింపకమానదు. ఛీ ఛీ! నీకువచ్చినయేం దైన్యనికి వచ్చినవి? సిగ్గు లేదా? ఏమొగముపెట్టుకొని నీవిచ్చటికి మరల వచ్చితివి? అక్కడనే చావలేకపోయితివా?

వజ్ర—స్థవిరా! నీవును వృద్ధుఁడవేగాని బాలుఁడవు గావు గదా! నీవెండ్రుక లన్నియును సంఘసేవలోనే పలితము లైపోయినవి. ఏనవీనమార్గముచే నేనిప్పుడు నీకు బోధింతును? చక్కఁగాఁ గన్నులు తెఱచి చూచినచో సకలజీవచక్రమును భాగ్యచక్రముచే బంధింపఁబడియున్నట్లు నీకు గోచరించుట లేదా? అల్పవయస్కులు, నజ్ఞానులును, వయోవృద్ధులునుదక్క నీయుగమునం దితరు లెవ్వరును భాగ్యచక్రమును విశ్వసింపకుండుటయే నిజమగునేని నీవీవిధముగా నదృష్టగణనముం గావించుచు నంకెలకూడికలతోఁ జచ్చు టెందులకు? నీవిప్పుడుగూడ శశాంకునిజన్మపత్రికను జేతిలోఁ బెట్టుకొనియే కూర్చుండి యుంటివే! బంధుగుప్తా! నీవును నేను నొక్కనాఁడే భిక్షుదీక్షం గైకొంటిమి. ఇరువురము నేకీభవించియే సంఘసేవ గావించుచుంటిమి. సుఖదుఃఖములలో సంపద్విపత్తులలో భుజమును భుజమును సోఁకునట్లిరువురము నొక్కచోటనే నిలిచి యుంటిమి. అంత యొడలు మఱచిపోయితివా? బాలకులభయప్రకంపితకరుణాలాపములకుఁగాని, స్త్రీలసంతాపప్రతప్తాశ్రుజలములకుఁగాని నాహృదయము కరఁగిపోవుట నీ వెన్నఁడైనఁ గాంచితివా? బంధుగుప్తా! నీవు నన్ను నిష్కారణముగాఁ దిరస్కరించుచున్నావు. శశాంకుఁడు నాచేతులలోఁ జచ్చువాఁడు గాఁడని నాకు సంపూర్ణవిశ్వాస మున్నది. స్థవిరా! శశాంకుఁ

డింకను బాలుఁడే యనుకొనుచుంటివా ? ఆతనిజీవితప్రవాహ మప్పు డే తారుణ్యసీమ నడుగుపెట్టుచున్నది. ఆతనిముఖమండలమునందలి రాజోచితగాంభీర్యము నాకు దృగ్గోచర మైనది. భయమున నేమియో యాతఁ డెఱుంగఁడు. మగధసార్వభౌముఁ డగుట కాతఁడే సర్వవిధ ముల యోగ్యుఁడై యున్నాఁడు. స్థవిరా! నీవు వ్యర్థప్రయత్నములు సేయుచున్నావు. కాని, అంగవంగకళింగగౌడమగధదేశములలో శశాంకునప్రతిహతగతి కవరోధము గల్పింపఁజాలుమగవాఁ డొక్కఁడును లేఁడు! నిశ్చయముగా లేఁడు. ముమ్మాటికిని లేఁడు!

అని చెప్పి వజ్రాచార్యుఁడు కూర్చుండెను. స్థవిరుఁడును గొంత సేపటివఱకు నిస్తబ్ధుఁడై కూర్చుండి పిమ్మట హీనస్వరముతో "నరే— కాని—గణితమంతయు నసత్యమనియా నీయభిప్రాయము ?" అని యెను.

వజ్ర—గణిత మెన్నటికి నసత్యము కానేరదు. కాని యొకవేళ నీగణనమునం దేదియో తప్పుండనచ్చును.

స్థవి—(విచారసూచకస్వరముతో) అట్లయినచోఁ గొంచెము సే పాఁగుము. మరల నొకసారి గణితము చేసి చూచెదను.

అని సంఘస్థవిరుఁ డామందిరమునందొకమూల మినుకు మినుకు మనివెలుఁగుచున్నదీపము నొక్కింత యధికప్రకాశితముగఁ జేసి తాళపత్ర ముపై లేఖినీసహాయమున గణితము చేయ నారంభించెను. ఈస్థితిలో నొకగడియ గడచెను. ఇంతలో నెవ్వరో యామందిరము చెంతకు వచ్చి యర్గళమును జప్పుడు చేసిరి.

వజ్ర—ఎవరువారు ?

వ్యక్తి—నేను బుద్ధమిత్రుఁడను.

వజ్ర—వి శేషము లేమి ?

బుద్ధ—కపోతిక సంఘారామము (ఇది పాటలీపుత్రమునందలి ప్రాచీనమఠము, అశోకచక్రవర్తి దీనిని స్థాపించెను) నుండియేదో యావశ్యక మగుసందేశమును గొని తెచ్చినాఁడు. ఆతని లోనికిఁ దీసికొని వత్తువా ?

వజ్రా—వలదు. కొంచెముసే పాఁగుము.

కొంతసేపటికి బంధుగుప్తుఁడు తలపై కెత్తి "నాగణిత మెంతమాత్రమును దప్పిపోలేదు. నేఁడు రెండుజాములప్రొద్దువఱకును శశాంకునకు మృత్యుయోగ మున్నది. నక్షత్రము ప్రతికూలముగ నున్నదిగాని సూర్యుఁడుమాత్రము సహాయుఁడై యున్నాఁడు" అనియెను.

వజ్రా—ఔను నిజమే—నేను చెప్పమఱచితిని. మాసంభాషణమారంభమగుటకుఁ బూర్వమే యొకవిఘ్నము తటస్థించినది.

బంధు—అది యేమి ?

వజ్రా—విఘ్నమనఁగా యశోధవళదేవుఁ డాకస్మికముగఁ బ్రత్యక్షమగుటయే—

బంధు—(భయముతో) ఏమంటివి ?

వజ్రా—యువరాజభట్టారకపాదీయమహానాయక యశోధవళదేవుఁ డప్పుడచ్చటికి విచ్చేసెను. బంధుగుప్తా ! నీవే కాదా యాతనికుమారుని సంహరించితివి ? రోహితాశ్వదుర్గాధిపతి నప్పుడే మఱచి పోయితివా ?

ఆమాట విన్నంతనే యింతవఱకును గ్రిందఁ గూర్చుండియున్న బంధుగుప్తుఁడు చటాలున లేచి కంపితకంఠస్వరముతో "శత్రుసేనా! పరిహాసింపకుము! నిజము చెప్పుము! నిశ్చయముగా యశోధవళుఁడే నగరమునకు వచ్చెనా? ఇది సత్యమే యైనచో నిఁక ననర్థములకు మేరయే లేదు: ఇది కేవలము నాయొక్కనికే కష్టముగాదు. సకలసంఘములకును గష్టపరంపరలు సంభవింపనై యున్నవని నమ్ముము. వజ్రా

చార్యా! నిజము చెప్పుము! ఆతఁడు నిజముగ యశోధవళుఁడేనా?" అనియెను.

వజ్ర—బంధుగుప్తా! కేవలమిరువది సంవత్సరములలోనే నేను యశోధవళుని మఱచిపోయితి ననుకొంటివా? ఉండుముండుము. కపోతిక సంఘారామమునుండి వచ్చిన సందేశ మేమియో వినదము—బుద్ధమిత్రా! ఆదూతను లోనికిఁ దీసికొనిరమ్ము.

అంతలో నొకతరుణభిక్షుఁ డొకవృద్ధభిక్షునితో లోనఁబ్రవేశించెను. ఆయిరువురును యథోచితప్రణామములం గావించిన తరువాత వజ్రాచార్యుఁడు "విశేషము లేమి?" అని ప్రశ్నించెను.

వృద్ధ—రోహితాశ్వదుర్గాధిపతి మహానాయక యశోధవళదేవుఁ డిరువది సంవత్సరముల కిప్పుడు మరల నగరమున కేతెంచె నను నిశ్చయవార్త మహాస్థవిరులకుఁ దెలియవచ్చినది. కావున నాలోచన సభాసమావేశ మగుటకు మీయనుమతిని వేఁడుచున్నారు.

వజ్ర—యశోధవళుఁడు నగరమున కేతెంచిన సంగతి మాకును దెలిసినది. రేపటి యుదయమునఁ బురాతనదుర్గశిఖరమున సభాసమావేశము కాఁగలదు. కాని యాదుర్గశిఖరమున సూర్యకిరణ ప్రసారమగుటకు ముందుగనే సభాకార్యములు పూర్తి కావలయును.

వజ్రాచార్యుని యీయాజ్ఞను విని యాభిక్షులిద్దఱును బ్రణామములం గావించి యామందిరమునుండి వెడలిపోయిరి.

బంధుగుప్తుఁడు వ్యాకుల హృదయముతో "యశోధవళుఁడు నిజముగనే నగరమున కేతెంచి యున్నాఁడు. శత్రుసేనా! ఇఁక నెవ్వరికిని బ్రదుకు నాస యగపడుట లేదు. నేఁటివఱకును నిద్రించుచున్న సింహ మిప్పుడు మేల్కొన్నది. ఆతని పుత్రుని నేనే సంహరించితి నను వృత్తాంత మాతని కప్పుడే తెలిసియుండెను. నన్నొక్కని మాత్రము చంపుటతో యశోధవళుఁ డూరకుండునని తోఁచుట లేదు. ఆతఁడు

సకల బౌద్ధసంఘములను పాతాళమునఁ గలఁగఁ ద్రొక్కువఱకు నూర కుండువాఁడు గాఁడు.

వజ్ర—ఔను. అనర్థము సమీపించి నట్లే తోఁచుచున్నది.

బంధు—(తీవ్రదృష్టితో) వజ్రాచార్యా! నామాటలు నీకు సరిగా బోధపడుట లేదని తోఁచుచున్నది. యశోధవళుని చేతనే నాకు మరణము తటస్థించునట్లగపడుచున్నది. ఉండుము! ఒకసారి గణితము చేసి చూచెదను.

అని చెప్పి మఱియొక దీపమును వెలిఁగించి బంధుగుప్తుఁడు తాళపత్రముపై మరల గణితము చేయసాగెను. కొలఁది సేపటిలోనే యాతని మొగము వెలవెలఁబాఱెను. ఆతఁడు తాళపత్రమును, లేఖినిని దూరముగ విసరివైచి యుచ్చస్వరముతో "నిజము! నిశ్చయము; వజ్రాచార్యా! నిజముగా యశోధవళుఁడే నన్నుఁ జంపఁగలఁడు! గణిత మెన్నటికిని నసత్యము గాఁబోదు. శత్రుసేనా! నన్ను రక్షింపుము! రక్షింపుము! యశోధవళుని ప్రతీకార మతిభయంకరమైనది!" అని యఱచెను.

వజ్ర—(నవ్వుచు) స్థవిరా! ఊరక! యిట్లు భయపడి మొద వేల? యశోధవళుఁ డిప్పుడే నిన్నుఁ జంపరాలేదుగదా! భాగ్యచక్ర ప్రభావముపై నీకెంత మాత్రమును విశ్వాసమే లేదుగాదా?

బంధు—(విచారముతో) మిత్రా! శత్రుసేనా! క్షమింపుము. సత్యము నెఱుఁగక కటుశబ్దప్రయోగముచే నిన్ను నొప్పించితిని. యశోధవళుఁ డనిన నాకెంతయో భయమగుచున్నది. శస్త్రవిహీనుఁడును, శృంఖలాబద్ధుఁడు నగు నాతని తనయుని గుక్కను జంపినట్లుగా నేను చంపివైచితిని. ఈసంగతి యాతని కెంత కాలము క్రిందటనో తెలిసియే యుండును, అందుచే యశోధవళుఁడు న న్నెన్నటికిని క్షమింపఁజాలఁడు!

వజ్రి—(నవ్వుచు) నీవింకను మరణమునకై భయపడుచున్నావా!

బంధు—వజ్రాచార్యా! నీవు వెఱ్ఱివాఁడవు! నీకుఁ దెలియఁజెప్పుట యెట్లు? నేనప్పుడే మరణమునకు సంసిద్ధుఁడనై యుండలేను. ఇంకను నెన్నియో ఘనకార్యములు నాచే నిర్వహింపఁబడవలసి యున్నవి.

వజ్రి—బంధుగుప్తా! శాంతింపుము! ఊరడిల్లుము! భయవ్యాకులుఁడవై జ్ఞానబంధమును ద్రెంచివైచుకొన్నంతమాత్రమున నీవు మృత్యువును దప్పించుకొనఁ గలుగుదువా? సంఘస్థవిరుఁడవగు నీ వార్యసంఘనేతవుగదా! ఈవిధముగా భయవిహ్వలుఁడవై పోవుట నీవంటి వానికిఁ దగదు.

కాని యీయూఱడింపువలన సంఘస్థవిరుని భయము తొలఁగిపోవునా? అతఁడు వగచుచు "వజ్రాచార్యా! రక్షింపుము! నన్ను రక్షింపుము! ఎచ్చటనైన నన్నుం దాఁచి యుంచుము. పుత్రహత్యాసంజనితమహాక్రోధపరవశుఁడై ప్రతీకారముం గావింప నెత్తివచ్చుచున్న యశోధవళుని భయంకరాకారము నాకీమందిరమునందలి ప్రతిస్తంభము చాటునను గానవచ్చుచున్నది. ఈయంధకారగర్భమునందంతటను దారుణకృపాణపాణియైయున్న యశోధవళుని విశ్వమూర్తి నాకన్నుల యెదుటఁ దాండవ మాడుచున్నట్లున్నది!

వజ్రి—(మందహాసముతో) భయపడవలదు. ధైర్యమును వహింపుము. నడువుము. నిన్నొకరహస్యగృహమునం దుంచెదను.

బంధు—(కంపముతో) నడువుము! నడువుము! త్వరగా నడువుము!

వజ్రాచార్యుఁడు బంధుగుప్తు నాసనమునుండి లేవఁదీసి యొకగుప్తమందిరముకడకుఁ దీసికొనిపోయి కవాటమును దెఱచి దీపికాసహాయ

మున లోపలఁ బ్రవేశించి యొక్కొక్కమెట్టుగాఁ గ్రిందికి దిగి పోయి యాతని నాగృహమునఁ బ్రవేశపెట్టెను బంధుగుప్తుఁడు భయభ్రాంతుఁడై వెనుకకుఁ దిరిగి తిరిగి చూచుచు వెఱ్ఱివానివలెఁ బ్రవర్తించుచుండెను. అంతలో నామందిరమంతయు నంధకారబంధుర మైపోయెను.

పండ్రెండవ ప్రకరణము.

సాయంకాల మయ్యెను. తమ మతిగభీరముగ నలుముకొనుచుండెను. అట్టిసమయమున నుపనగరమునందలి విశాలరాజమార్గమునుండి యొకతరుణీమణి నగరాభిముఖంబుగఁ బోవుచుండెను. చీకటి పడుచుండుటచే నామె యతివేగముగ నడచుచుండెను. అప్పు డాబాటను జనసంచారము బొత్తుగా లేదనియే చెప్పవచ్చును. మార్గమధ్యమునం దొకరిద్దఱుమాత్ర మగపడిరి. కాని యామె వారి నతిక్రమించి చాల దూరము వఱకును ముందటికిఁ బోయెను. క్రమక్రమముగ గాఢాంధకార మధికమగుటచేఁ గన్నుమిన్నును గానరాకుండఁ బోయెను. అప్పు డేమిచేయుటకును దోఁచక యాయువతి మెల్లమెల్లన నడవఁదొడంగెను.

ఆసమయమున వెనుకనుండి యెవ్వరిదో యడుగులచప్పుడు వినవచ్చుటచే నామె చటాలున నిలిచినచోటనే నిలువఁబడిపోయెను. ఆశ్చర్యము! అంతలో నాపదధ్వనియు నాఁగిపోయెను. అప్పు డాయువతి యటునిటుఁ బరికించి కొంతసేపటికి మరల ముందటికి నడవసాగెను. ఎవ్వరో తన్ను వెంబడించి వచ్చుచున్నట్లును, వారు కొలఁదిదూరమునందే యున్నట్లును నామెకుఁ దోఁచుచుండెను. తనమనసు కుదురుపఱచుకొనుటకై యామె మరల నచ్చట నాఁగిపోయెను. అట్లు నిలిచినంతనే యాపదధ్వనియును నిలిచిపోయెను.

ఆస్త్రీ యించుకవిచారమునం బడి యొకక్షణకాలము వఱకును నడచినట్లే నడచి యిటు నటుఁ జూచి తటాలున నొకయింటివెనుకకుఁ బోయి నిలువఁబడెను. అంతలోనే యామార్గమునుండి యాపాదమస్తకమును వస్త్రాచ్ఛాదితమై యున్న యొకమనుష్యవిగ్రహము నడచిపోవుచున్నట్లామెకుఁ గానవచ్చెను. అంధకారమగుటచే నావ్యక్తి మొగ మామెకు బాగుగ నగపడలేదు. ఆవిగ్రహ మట్లే ముందఱికిఁ బోవుచుండెను. పిమ్మట నాయువతి యింటిచాటునుండి యీవలికి వచ్చి యావ్యక్తి వెనువెంటనే నడవ నారంభించెను.

సర్వాంగములను వస్త్రముచే మఱుఁగుపఱచుకొనియున్న యావ్యక్తి యట్లు కొంతదూరముపోయి తనలో "అయ్యో! ఆమె యీమార్గమునఁ బోలేదు కాఁబోలును! ఇఁకఁ ద్రోవ లేదు. వెనుకకు మరలవలసినదే" అని యనుకొనియెను.

ఆమాటలు స్పష్టముగా నాయువతికిఁ వినఁబడియెను. వెంటనే యామె చీకటిలో నింకొక యింటిచాటునకుఁబోయి దాఁగికొనియెను. ముందరుగుచున్న యావ్యక్తి యప్పుడు వెనుకకు మరలి మెల్లమెల్లగ వెడలిపోయెను. అంధకారమునం దావ్యక్తి యగపడకుండఁ బోయినతోడనే యామెమరల మార్గమునకు వచ్చి వేగముగా నడచి పోవఁదొడంగెను. కాని యొక్క యరగడియ యైనతరువాత మరల నామె కడుగులచప్పుడు వినవచ్చుచుండెను.

ఇప్పుడుమాత్ర మామెకుఁ జాలభయము కలిగెను. వెంటనే యామె యాత్రోవప్రక్క నున్నతరుషండమునఁ దూరి దాఁగికొనియెను. కొన్నినిమిషములకు మరల నావస్త్రాచ్ఛాదితమూర్తి యామెకామార్గమునఁగానవచ్చెను. ఆవ్యక్తి మునుపటివలెనే ముందఱికిఁ బోయెను; మరల వెనుకకు మరలెను. అట్లు మరలివచ్చుచు నావ్యక్తి "కానిమ్ము! ఈసారికూడ నామె పాఱిపోయినది. తరళ నన్ను నిశ్చయ

ముగా మోసగించినది!" అని యనుకొనుమాట లామెకుస్పష్టముగా వినవచ్చెను.

ఆవిగ్రహ మట్లు కొంతదూరము పోయినతరువాత నాయువతి చటాలునఁ జెట్లచాటునుండి వెలువడి మార్గమధ్యమున నిలిచి బిగ్గఱగా "ఓమహారాజా! ఆచార్యమహారాజా! మీరెక్కడకుఁ బోవుచున్నారు? రండు?" అనియెను.

వస్త్రావృతపురుషుఁ డాశ్చర్యస్తంభితుఁడై యచ్చటనే నిలువఁబడి పోయి కొంతసేపటికి వెనుకకుఁ దిరిగి చూడఁదొడంగెను. అప్పు డాయువతి పకపక నవ్వుచు "మహారాజా! అట్లు భయపడియెద రేమి? నేను మీతరళను!" అనియెను.

తోడనే యాపురుషుఁడు తనముసుఁగును దీసివైచి సమీపమునకుఁ బోయి తరళను బాగుగఁ బరిశీలించి యొకసారి నవ్వుకొని "ఔనౌను. అదియే యిది. అనుమానము లేదు. నిజముగా నీమె తరళయే" అని నిశ్చయించుకొని "సుందరీ! దయయుంచుము!" అనియెను.

తరళ మందహాసముతో "ఆచార్యస్వామీ! ఇంతటి గాఢాంధకారనిశాసమయమున నింతపూనికతో మీరు నన్ను వెంబడించి వచ్చుటకుఁ గారణ మేమి?" అని ప్రశ్నించెను.

దేశాచార్యుఁడు సంకోచముతో "అబ్బే! లేదు. లేదు. అట్టి కారణ మేదియును లేదు—మి—మిక్కుటముగఁ జలిపిచుచుండుటచే నెక్కడనైనఁ జలిమంట యగుపడునేమో యని వెదకికొనుచు నిక్కడకు వచ్చితిని" అనియెను.

తర.—(బిగ్గఱగా నవ్వుచు) ఆచార్యా! ఏమంటిరి. ఇట్టిభీకర గ్రీష్మసమయమున మీకుఁ జలిగా నున్నదా? సెబాస్. అయ్యో! మీకు వాతబాధ యేమైన నున్నదా యేమి?

దేశానందుఁడు ప్రత్యుత్తరము చెప్పఁ జాలకపోయెను.

తర—సరే, పోనిమ్ము! ఇంకొకమాటయడిగెదను. ఆపాదమ
స్తకమును ముసుఁగువైచికొని మీరేల నన్ను వెంబడించి వచ్చితిరి?

దేశా—ఇది రాత్రివేళగదా! ఎవ్వరైనఁజూచి నన్నానవాలు
పట్టెదరేమోయని—

తర—(నవ్వుచు)ఆలాగా? తెలిసినది! మీరిప్పుడు నీప్రియు
రాలిని సందర్శించుటకై సంకేతస్థలమున కరుగుచుంటిరి కాఁబోలు!

దేశా—(కళవళపాటుతో) లేదు. లేదు ఎంతమాట యంటివి
తరళా! సంసారము నంతను ద్యజించి భిక్షువులైనవారము మేము!
ఇట్టిమాకుఁ బ్రియురాండ్రెవ్వరుందురు? సంకేతస్థలములు సందర్శన
ములు నని యేమేమో యనుచున్నావే! మేలు మేలు!

తర—ఆచార్యా! ఈమాటల కేమి? మన మించుక వెలుఁగు
నకుఁ బోవుదము రండు!

దేశా—వెలుఁ గెందుకు తరళా? ఈప్రదేశముమాత్రము
బాగుగ లేదా?

తర—ఔను గాని యిట్టిచోట మనమిరువురమును గలసి యుం
డుట నెవ్వరైనఁ జూచినచో నీసంగతి యంతటను వ్యాపించి మన పేరు
నకుఁ గళంకము గలుగదా?

దేశా—(తలయూఁచుచు) ఔనుతరళా! నీవన్నమాట సత్యమే.

తర—కావున నేనిఁకఁ బోయెదను. మీరిచ్చటనే నిలిచి
యుండుఁడు!

దేశా—అనఁగా? నీవిప్పుడే పోయెదవా?

తర—నేను నగరమునకుఁ బోవలయును. ఇక్కడ నెట్లుందును?
చాల నాలస్యమైపోయినది. ఇంటికిఁ బోవలదా?

దేశా—వలదు తరళా! వలదు! నీవిప్పుడే పోవలదు! ఇంచు
కసేపైన నిచ్చట నుండుము! కన్నులార నొక్కింతసేపైన నీరూపము

గనుఁగొనుచు నాహృదయమును నిండించుకొందును. తరళా ! నేని రెండుక్రోశముల దూరమును గుక్కవలెఁ బరుగెత్తుకొని వచ్చుట యేలో ఆకేసుమా !

తర — సెబాస్! యిప్పటికాఱు వచ్చితి నని మీరిప్పుడేగదా చెప్పియుంటిరి? ఆచార్యా! ఇంతలోనే యిన్నిమాటలా?

దేశా — ఆఁ! దానికేమిలే! ఊరక యట్లంటిని.

తర — మఱి నిజముగా నిప్పు డేమందురు?

దేశా — తరళా! నాబుద్ధియంతయు స్థానభ్రష్టమైపోయినది.

తర — అలాగా? మీ కిట్టిగతి యెవ్వరిమూలమునఁ గలిగినదయ్యా?

దేశా — నీ —

తర — (అల్పకోపాభినయముతో) అమ్మయ్యా! ఈముసలితనములో మీముదిహృదయమునఁ బ్రేమరసము పరిపూర్ణముగ నిండిపోవుచున్నది కాఁబోలును!

దేశా — చాలుఁజాలు! తరళా! వెఱ్ఱిమాటలాడకుము! నిజముగా నీహృదయము ప్రేమపరిపూర్ణమైనదనియె నేను విశ్వసించి యుంటిని!

తర — సరే! ఇప్పు డేమైనది? ఆచార్యా! ఎందుకొఱకు మీ రిప్పు డింతగాఁ గోపపడియెదరు?

దేశా — ఏమియు లేదు! కేవల మరసికురాలివలె నీ పలుకులు —

తర — నేనే మంటిని?

దేశా — నేనామాట నానోట నుచ్చరింపనైన నుచ్చరింపను.

తర — మిమ్ము నేను "వృద్ధు"లని యంటిని, అంతేనా?

దేశా — (కోపముతో) వృద్ధుఁడు — వృద్ధుఁడు — మాటిమాటికిని వృద్ధుఁడు — ఇఁక నీవు నగరమునకుఁ బొమ్ము! మన — ఇఁక నెట్టి

ప్రియసంభాషణమును వలదు! నేనిఁక సంఘారామమునకుఁ బోయెదను

తర—ఆచార్యా! ఇట్లూరక కోపించెద రేల? మీవంటి సర్వజ్ఞు లగు ప్రేమమయుల కిట్టియల్పవిషయముల కై కోపించుట బాగుగ లేదు.

దేశా—(సంతోషముతో) ఆఁ! తరళా! ఆఁ! ఇప్పుడు నీకుఁ బ్రేమరసమూల్యము నిజముగా బోధపడినది. తారుణ్యముచే గలిగిన ప్రేమ—అది ప్రేమ గాదు—అది కేవలమును బ్రేమచ్ఛాయయే—వయసు ముదిరిననే గాని మనుజులకుఁ బ్రేమతత్త్వము బొత్తుగా బోధపడదు. ఉదాహరణముకొఱకు—

తర—పాలు కాఁగి కాఁగి పాయసమైనప్పు డవి పాలకంటె నధిక మధురము గాదా?

దేశా—(తల యూఁచుచు) ఔను తరళా! ఔను. నీవు నిజము చెప్పితివి. తరళా! ఏమని చెప్పుదును? నేనూరకయే నిన్నుఁ గాంచి పిచ్చివాఁడ నగుచుంటినా? ఒడలే మఱచిపోవుచుంటిని—ప్రేమ దగ్ధుఁడ నైపోవుచుంటిని—

ఆచార్యుని ప్రేమసమాధి క్రమక్రమాభివృద్ధి నందుచున్న దనియు, నాతని ప్రేమరసపూర్ణప్రవాహము నడ్డగించుట యెంత మాత్రము నశక్య మనియు భావించి తరళ మృదుస్వరముతో "ఆచార్యా! ఇది యేమి? ఏమనుచున్నారు? నేనొక సామాన్యస్త్రీని—క్షుద్రదాసిని—మీరా నన్నిట్లనవలసినవారు? మీరు మహాపూజ్యులు—ఆచార్యపాదభిక్షువులు—మీ యాయు వంతయును బుద్ధభగవానుని సేవలోఁ గడచి పోవుచున్నది. ఇట్టి యసహ్యాకరసంభాషణము మీవంటివారివాక్కున నెంతమాత్రమును శోభించుట లేదు" అనియెను.

దేశా—(కన్నులు మూసికొని) తరళా! ప్రేమభరముచే నే నడుగంటిపోవుచున్నాను. నే నెవ్వఁడనైననేమి? ఎంతవాఁడ నైననేమి?

నాజీవితములను నీచరణములపై నర్పించి యుంటిని. నీవాదరింపవేని నేనాతుచ్ఛప్రాణములను విసర్జించి వైచెదను.

తరళ తనలో నవ్వుకొనఁ దొడంగెను. ఆప్రాణియందుఁ గామరోగలక్షణము లస్పష్టముగా నిమిడి యున్నట్లామె గ్రహించెను. తరళ యేమియు మాటాడక చిత్రప్రతిమవలె నిలిచియుండుటం గాంచి దేశానందుఁడు తటాలున నేలపైఁ జాగిలఁబడి యామెచరణములను బట్టుకొని భావనాపరవశుఁడై "చెప్పుము తరళా! చెప్పుము! నన్ను స్పృశించుచు శపథపూర్వకముగాఁ జెప్పుము!" అని వేడుకొనఁ దొడంగెను.

తర—ఆచార్యా! ఇదియేమి? మీవంటివారిట్లు చేయవచ్చునా? ఎంత యపచారము! విడువుఁడు! నాపాదములను విడువుఁడు! అయ్యో! ఇది రాజమార్గముగదా!

అని పలుకుచు నామె మెల్లఁగాఁ దనచరణముల నాతని చేతి నుండి విడిపించుకొనియెను.

దేశా—(వస్త్రముపై ధూళిని దులుపుకొనుచు) చేయుము! శపథము చేయుము! శీఘ్రముగా—

తర—ఏమని శపథము చేయవలయును?

దేశా—మిమ్ము దూరము చేయనని శపథము చేయుము!

తర—ఆచార్యా! మీరిప్పుడు చెప్పినమాట యతి మహత్తరమైనది. ఆకస్మికముగ నొక్కసారిగా నేనెట్లు ప్రత్యుత్తరమీయఁగలను. నేను సంపూర్ణయౌవనవతినై యున్నాను. మఱియునిది వసంతకాలము! ఇట్టిసమయమున నేనొక్కనియొద్ద శపథపూర్వకముగా నెట్లు కట్టువడి యుండఁగలను?

దేశా—(తనలో) కాంతలందఱు నిట్టివారే. నేనిప్పు డధికముగాఁ దీవరించినయెడల సర్వనాశన మైపోవును. కొంతకాలము

వఱకు నోపిక పట్టి యుండుటవలన నష్టమేమున్నది? ఈమె నన్నుఁ దప్పించుకొని యెక్కడకుఁ బోఁగలదు? ఎక్కడకుఁ బాఱిపోయినను మరల నీమె జినానందునికడకు రావలసిన దేగదా!

తరలక్కాడఁ దనలో “ అసహాయులకు భగవంతుఁడే సహాయుఁడు. నేను మహాగర్వాంధనై నిన్ను విడిపింపనిచో నాపేరు తరళ గాదు” అని వసుమిత్రునితో శపథపూర్వకముగాఁ జెప్పి యుంటిని. ఏయుపాయముచే నాతని విడిపింపఁగలనో నాకేమియును దోఁచుట లేదు. నిరాశ్రయుల కాశ్రయుఁడగు పరమేశ్వరుఁడే నాకీమార్గమును జూపియున్నాఁడు. ఈవృద్ధకవీశ్వరుని సహాయసంపత్తిమూలముననే నేనావసుమిత్రుని బంధముక్తునిం గావింతును. ఈతని నెక్కింతతడ వాడించితినా నాకార్యమవలీలగా నెఱవేఱఁ గలదు. ఈతని లోఁబఱచుకొన్నచో నెట్టియాటంకమును లేకుండ సంఘారామమునకుఁ బోవుటకు నాకవకాశము కలుగును. ఆపిమ్మట నీతని నాసపెట్టి యేయుక్తిచేనైనను వసుమిత్రుని గారాగృహవిముక్తునిం గావింతును” అని యాలోచించుకొనుచుండెను.

తరళ యేమియు మాటాడకుండుటచే దేశానందుఁ డామెం గాంచి“ తరళా ! నీహృదయమునం దేదియో యాలోచనసభ జరగుచున్నట్లున్నది.” అనియెను.

తరళ—మీలోపల నేవిచారణ యగుచున్నది ?

దేశా—నీ విచారణయే—

తర—నేను నావిషయమే యాలోచించుచున్నాను.

దేశానందుఁడు తరళహస్తమును గట్టిగఁ బట్టుకొని యుత్కంఠతో“ నిజమేనా? తరళా ! నిజమే చెప్పితివా ? చెప్పుము! చెప్పుము! నావీనులు పవిత్రము లగుఁగాక !” అనియెను.

తర—ఇదేమియాచార్యా ! విడువుఁడు నాచేయి విడువుఁడు. తటాలున నీయవస్థలో నిక్కడ కెవ్వరైన వత్తురేమో !

దేశానందుఁ డదరిపడి హతాశుఁడై తరళహస్తమును వదలి వైచి“ తరళా ! సరేకాని—నామాటకు నీవెప్పుడు ప్రత్యుత్తర మిచ్చెదవు ?” అనియెను.

తర—చెప్పు.

దేశా—నిజమేనా ?

తర—నిజమే—

దేశా—సరే. ఇఁకఁ బొమ్ము! నిన్నింటివఱకును దీసికొనిపోయి విడిచి నేను మరలిపోయెదను.

తర—అట్లయినచో మీరు ముందునడువుఁడు.

దేశానందుఁడు ముందు నడచుచుండెను. కొలఁదిసేపటిలో దూరమున నగరమునందలిదీపప్రకాశము కానవచ్చెను. నగరమునఁ బ్రవేశించినంతనే తరళచింతలన్నియును వదలిపోయెను. మార్గమధ్యమునం దేయుక్తిచేతనో యాతని మరలించి పంపవలయు ననియు, నట్లు చేయకున్నచోఁ దననివాసమాతనికిఁ దెలిసిపోవు ననియు, నందువలనఁ దనప్రయత్నమున కెప్పుడైన భంగము కలుగకపోదనియుఁ దరళ భావించుకొనియెను.

అట్లు భావించుకొనుచు నామె కొంతదూర మరిగి“ఆచార్యా! ఇఁక మీరు రావలదు. వెనుకకుఁ దిరుగుఁడు ! మీవంటియావనపురుషునితో రాత్రివేళ నొంటిగా నేనుండుటఁ జూచినచో నెవ్వరికైన ననుమానము కలుగకుండునా ?” అనియెను.

తరళ తన్నుఁదరుణపురుషుఁ డనియే నిజముగ భావించుచున్నదని నిశ్చయముగాఁ దెలియుటచే దేశానందునకుఁ బట్టరానిసంతోషము కలిగెను. ఆతఁడాయానందావేశమున నొడలుమఱచియుండుటం గాంచి తరళ యాచీకటివేళ నంధకారములోఁ జటాలునఁ దప్పించుకొని యెక్కడనో దాఁగిపోయెను. ఎంతపరిశోధించినను దేశానందునకామెజాడయే యగపడదయ్యెను.

పదుమూఁడవ ప్రకరణము.

మధ్యాహ్నకాలము సార్వభౌముఁడు కొలువుదీర్చియుండెను. చక్రవర్తి యుచితవేషముతో సభాభవనమున భద్రాసనాసీనుఁడైయుండెను. నాగరికులు తమతమవిన్నపములు ప్రభువునకు విన్నవించుచుండిరి. ఆవిశాలసభామందిరమున నలుదెసలను ముఖ్యాధికారులు సమాత్యులును దమతమయాసనముల నలంకరించి యుండిరి. నాగరిక ప్రముఖులును, జమీందారులును వారిచెంతనే కూర్చుండి యుండిరి. అందఱకును వెనుకఁ బౌరులు గుమిగూడి యుండిరి.

చక్రవర్తివదనమండలమునం దెంతమాత్రమును బ్రసన్నభావ మగపడుటలేదు. మహాసేనగుప్తచక్రవర్తి స్వభావముచేతనే చింతాశీలుఁడు; మఱియు స్థానేశ్వరరాజసందర్శనమైనదాదిగా నాతని చింతాప్రభావము క్రమాభివృద్ధిం గాంచఁదొడంగెను. సింహాసనదక్షిణపార్శ్వమున వేదికక్రింద గుప్తసామ్రాజ్యముఖ్యామాత్యుఁడగు హృషీకేశవర్మ దర్భాసనాసీనుఁడై విరాజిల్లుచుండెను ఆతనివెనుక మహాధర్మాధ్యక్షుఁడగు నారాయణశర్మ యొకపీఠమునఁ గూర్చుండి యుండెను. ఆయిరువురకును వెనుక మహాదండనాయక రవిగుప్తుఁడును, మహాబలాధ్యక్షుఁడగుహరిగుప్తుఁడును కవచసేనాధికారియగుమహానాయక రామగుప్తుఁడును, మున్నగుసామ్రాజ్యప్రధానాధికారులాసీనులైయుండిరి. ఈయధికారులందఱును వయోధికులే—వారినిలకుంతలము లన్నియును రాజసేవలోనే పలితములైపోయినవి. వీరందఱును సార్వభౌమవంశీయులే. సింహాసనమునకు రెండవవైపున సామ్రాజ్యమందలి తరుణాధికారులుండిరి. పైయరుఁగుపై నున్నతప్రాచీనవంశసంభూతులగు సరదారులు, అమీరులు, ఉమ్రావులు మొదలగువారి కేర్పడియుండు పీఠములు

శూన్యములై యుండెను. ఏవిధోగోత్సవోత్సవసమయములందుఁ దక్క వారెల్లరును రాజసభ కేతెంచు నాచారము లేదు.

సభామండపచతుర్ద్వారములకడను సేనానాయకులు రక్షణ కృత్యములను నిర్వహించుచుండిరి. ఇంతలో యువరాజశశాంకునిభుజపైఁ జేయివైచి స్థూలోన్నతశరీరుఁడును, యోధవేషధారియు నగునొక వృద్ధుఁడు గంగాద్వారమార్గమున సభాభవనమునకు వచ్చుచుండుట నుత్తరద్వారముకడనున్న ప్రతీహారి కనుంగొనియెను, ఎనిమిది తొమ్మిది యేండ్లప్రాయంపుబాలిక యావృద్ధునికుడిచేతి వ్రేలిని బట్టుకొనియుండెను, ఆతనివెనుక నొకయువకుఁడుండెను. ఈదృశ్యముంగాంచి మహాప్రతీహారి యాశ్చర్యచకితుఁ డయ్యెను. ఔను ! ఆదృశ్య మాశ్చర్యకరమైనదే ! ఏమన—సామాన్యుల కీనదీతీరమార్గమునుండి సభాభవనమునఁ బ్రవేశించుట కవకాశము లేదు. రాజ్యమందలియున్నతాధికారులును*సార్వభౌముఁడును దక్క నితరు లీమార్గమున నడవరు. ఆగంగాద్వారమున వచ్చుట కన్యుల కధికారమే లేదు. అధికారము కలవారైన నెన్నఁడు నేకతమ పాదచారులై వచ్చుట జరగి యుండలేదు. అట్టివారు మహాడంబరముతో నేనుగులను గుఱ్ఱములను, వాహనములను నధిరోహించి వచ్చుచుండుట యాచారము. వారివెంట నంగరక్షకసైన్యముకూడ నుండును. కాని యట్టివారిలో నెవ్వరునుగూడ నిదివఱ కీవిధముగా నింతప్రేమతో—వాత్సల్యముతో—యువరాజశశాంకుని దేహమును స్పృశించి యుండుట యెవ్వరును జూచియుండలేదు. అదియే యాశ్చర్యకారణము !

అట్లు సభామందిరమున కేతెంచుచుండఁగా నావృద్ధుఁ డేమిమియో చెప్పుచుండెను. యువరాజశశాంకుఁ డేకాగ్రచిత్తముతో నామాటల నాలకించుచుండెను. ప్రతీహారిగాని, వారినాయకుఁడుగాని యాశ్చర్యముతోఁ దమ్ముఁ జూచుచున్నట్లు వారెంతమాత్రము నెఱుంగనే యెఱుంగరు.

అప్పుడు వృద్ధుఁడు" యువరాజా ! నేను కామరూపమునుండి మరలివచ్చినప్పు డీమార్గముననే సభామందిరమునఁ బ్రవేశించితిని. ఆహా ! ఆదిన మానాఁడే గతించిపోయినది. అప్పుడు నేను కామరూపప్రభుఁడగుసుస్థిరవర్మను శృంఖలాబద్ధునిం గావించి తీసికొని వచ్చితిని. ఆసమయమున నాగరికు లత్యంతోత్సాహముతో, గర్వముతో జయధ్వనులం గావించిరి. సంగ్రామమున గాయములు తగిలినమీతండ్రిగా రప్పుడు పల్లకి నధిరోహించి వచ్చుచుండిరి. యువరాజా! అప్పటికి మీ రుదయించియుండలేదు. అప్పటి కీసామ్రాజ్యమున కింతటి దుర్దశ సంభవించియుండలేదు ; ఇంతశిథిలమై యుండలేదు. అప్పుడు నేను నిశ్చయముగనే మహానాయకుఁడ నైయుంటిని. నేనప్పుడు పిడికెడు గోధుమగింజలకై రోహితాశ్వదుర్గప్రాంతమునందలి ప్రతియూరను భిక్షమడుగుకొనుచుండుట లేదు."

అని పలుకుచుండఁగా వృద్ధునికంఠము రుద్ధమైపోయెను. శశాంకుని వినీలవిశాలనయనము లశ్రుజలపూరితము లయ్యెను—వారు మెల్లమెల్లఁగా సభాభవనతోరణముకడ కేతెంచిరి. అప్పుడు ప్రతీహారనాయకుఁడు యువరాజునకుఁ బ్రణమిల్లి యధికసమ్రభావముతో "మహాప్రభూ ! ఈవృద్ధయోధవీరుఁ డెవ్వరో దయయుంచి యానతిచ్చెదరా?" అని ప్రార్థనాపూర్వకముగఁ బ్రశ్నించెను.

యోధు—(విన్నఁదనముతో నా పేరు యశోధవళుఁడు. యువరాజభట్టారకపాదీయమహానాయకుఁడను.

ఈమాట వినినంతనే ప్రతీహారనాయకుఁడు భయవిస్మయాకులుఁడై రెండడుగులు వెనుకకు జరగెను. త్రోవను నడచుచున్న పాంథున కాకస్మికముగా విషసర్పము కనఁబడినచో నెట్టివిలక్షణావస్థకలుగునో యానాయకున కప్పు డట్టియవస్థయే కలిగెను. వానియవస్థం గాంచి యశోధవళుఁడు మందహాసముగావించెను.

ఇంతలోఁ బ్రతీహారులలోనియొకవృద్ధుఁ డచ్చటికి వచ్చి యశో
ధవళునివంక బాగుగఁ బరికించి తోడనే తనయొఱనుండి కరవాలమును
జరాలునఁ దీసి యాఖడ్గాగ్రముతోఁ దనకపాలమును స్పృశించుచు
నుచ్చైస్స్వరమున "మహానాయకునకు విజయమగుఁగాక! మాళవకా
మరూపదేశములలో నేను మహానాయకు లగుమీాపక్కను నిలిచి
యుద్ధము చేసినవాఁడను!" అనియెను.

ఆతనిజయధ్వని నాలకించి యుత్తరతోరణముకడ నున్నవారం
దఱును జయధ్వనులం గావించిరి. యశోధవళదేవుఁడు ముందడికరిగి
యావృద్ధసైనికుని గాఁగిలించుకొనియెను. అప్పుడు మరల నొక్కసారి
జయధ్వని యయ్యెను. అనంతరము యువరాజును, యశోధవళదేవుఁ
డును సభాభవనమునకుఁ బోయిరి. ప్రతీహారసేనానాయకుఁడుమాత్ర
ము విస్మయస్తంభితుఁడై నిలిచినచోటనే నిలువఁబడిపోయెను.

సభాభవనతోరణమున కెదుట నిరువురుదండధారు లుండిరి.
వారు యువరాజుం గాంచినంతనే ప్రణమిల్లి మెల్లఁగా నావృద్ధునిం
గూర్చి ప్రశ్నించిరి.

తత్క్షణమే వారిలో నొకఁడు సభాభవనమధ్యభాగమునకుఁ
బోయి బిగ్గఱగా "పరమేశ్వర, పరమవైష్ణవయువరాజభట్టారకపాదీ
యమహానాయకయశోధవళదేవులవారు సార్వభౌమసందర్శనమునకు
దయచేసి యున్నారు" అని హెచ్చరించెను.

అప్పుడు సార్వభౌముఁడు సింహాసనమునం దొకయోరఁ గొత్త
గిల్లి కూర్చుండి యొకనాగరికునివిన్నపము నాలకించుచుండెను. సింహా
సనవేదికక్రింద నొకలేఖకుఁడు నిలిచి చక్రవర్తియాజ్ఞలను వ్రాయు
చుండెను. యశోధవళదేవునినామము చెవులఁ బడినంతనే సార్వభౌముఁ
డులికిపడి లేచి కూర్చుండెను. అట్లాకస్మికముగ లేచుటవలన లేఖకుఁడు
భయముచే నులికిపడుటయు, నాతనిచేతియందు లేఖినియుఁ దాలపత్ర

మును గ్రిందఁబడిపోయెను. అది గని మహాధర్మాధ్యక్షుఁడగు నారాయణవర్మ బొమలు ముడివైచెను. పాపహా లేఖకుఁడు పడఁబోయి యొకపీఠమును గట్టిగాఁ బట్టుకొనియెను. కావుననే యాతఁడు బ్రదికి పోయెను.

అప్పుడు చక్రవర్తి దండధరునింగాంచి "ఏమంటివి?" అని ప్రశ్నించెను.

దండ—పరమేశ్వరపరమవైష్ణవ—

చక్రి—వింటిమి—యువరాజుతో వచ్చినవా రెవ్వరు?

దండ—రోహితాశ్వదుర్గ మహానాయక యువరాజభట్టారక పాదీయ యశోధవళ—

చక్రి—ఎవరు? యశోధవళుఁడే!

దండ—చిత్తము.

అప్పుడు మహామంత్రి హృషీకేశవర్మ నారాయణవర్మంగాంచి "మహాధర్మాధ్యక్షా! ఆవచ్చినవా రెవ్వరు? సార్వభౌము లాకస్మికముగా నిట్లేల యులికిపడిరి?

నారాయణవర్మ యూర్ధ్వవదనుఁడై యున్నమాటలను వినుచుండెను. మహామంత్రిప్రశ్న యాతనికి వినఁబడనే లేదు.

చక్రి—చాలుఁ జాలు! ఇట్లగుట యెన్నటికిని దటస్థింపదు. రోహితాశ్వదుర్గాధిపతి యశోధవలదేవుఁ డెంతకాలముక్రిందటనో శాశ్వతవిశ్రాంతి నందియుండును. రామగుప్తా! మీరు పోయి జాగ్రత్తగఁ బరికించి రండు. నిశ్చయముగా నాతఁ డిప్పుడు రోహితాశ్వదుర్గము నాక్రమించియున్న కృత్రిమపురుషుఁడై యుండవచ్చును.

రామగుప్తుఁడు లేచి యుత్తరతోరణముకడకు బయలుదేఱెను. దండధరుఁ డాతని వెనువెంటనే పోయెను. కాని వారంతవఱకును బోవనక్కఱయే లేకపోయెను. యువరాజుభుజముపైఁ జేయివైచి యశోధ

వళుఁడు మెల్లఁగ వాఁకలికే వచ్చుచుండెను. అతనిఁగాంచి రామగుప్తుఁడు నిశ్చేష్టుఁడై నిలువఁబడి పోయెను. కేవల మొక్కక్షణకాలము మాత్రమే—అనంతరము సామ్రాజ్యసేనా కాసేనామహానాయకుఁ డగు రామగుప్తుఁడు చేఁగాలుసఁబోయి దీనహీనుఁ డగునావృద్ధునిచరణములఁ పై వ్రాలెను. అది గని తక్కినసంగతు లేమియు నెఱుంగకున్నను నాగరికులందఱు నొక్కపెట్టున నాకసము ప్రతిధ్వనించునట్లు జయధ్వనులం గావింపనారంభించిరి. ఎంతప్రయత్నించినను దండధరులు వారిని వారింపఁ జాలకుండిరి. ఆధ్వని విని సార్వభౌముఁ డావేశముతో లేచి నిలువఁబడియెను. అంత సభాసదులందఱు నొక్కసారిగా లేచి నిల్చిరి. అట నున్నతరుణరాజపుత్రుల కందఱకు నది యొకవిచిత్రదృశ్యముగాఁ దోఁచెను—స్థూలోన్నతశరీరుఁ డగు నొకవృద్ధుఁడు యువరాజుభుజముపైఁ జేయివైచుకొని కలసి వచ్చుచుండఁగా సర్వసేనాబలాధ్యక్షుఁ డగురామగుప్తుఁడు సామాన్యసైనికునింబోలి వారి ననుసరించి వచ్చుచుండెను. అది గని వారియాశ్చర్యమునకు మేరయే లేకపోయెను.

హృషీకేశవర్మ కచ్చటిసంగతు లేవియును దెలియకుండుటచే నాతఁ డత్యాతురుఁడై యావృద్ధునిం గాంచి కంపితపాదములతో వేదిక కడకు వచ్చి నిమిషములో నాశ్చర్యావిష్టుఁడై "యశోధవళుఁడు మరణించె నని యెవ్వరు చెప్పినారు?" అని కేకవైచెను.

యశోధవళదేవుఁడు వినమ్రుఁడై యాతనికి నమస్కరింపఁబోయెను. మహామంత్రియగు హృషీకేశవర్మ యాతని వారించి గాఢాలింగనముం గావించెను. అది చూచి నాగరికులందఱును మరల నత్యుచ్చస్వరముతో జయధ్వనులం గావించిరి.

అందఱు నాశ్చర్యనిమగ్నులై యుండిరి. ఆనందావేగప్రకంపితములగుపాదములతోఁ జక్రవర్తి వేదికనుండి క్రిందికి దిగియెను. జన

కుఁడు కన్నులఁ బడినంతనే యువరాజు సాష్టాంగప్రణామముం గావిం
చెను. సార్వభౌముఁడు చూడనైన లేదు —ఛత్రచామరధారు లాతని
వెంటనే దిగిరాసాగిరి. కాని మహాబలాధ్యక్షుఁడగు హరిగుప్తుఁడు
సంజ్ఞ చేయుటయు వారచ్చటనే యాఁగిపోయిరి.

సార్వభౌమాగమనముం గాంచి హృషీకేశరామగుప్తు లొకప్ర
క్క కొనదిల్లిరి. యశోధవళదేవుఁ డొఱనుండి కరవాలమును బైకిఁదీయు
చుండెను. ఇంతలోనే చక్రవర్తి యతిత్వరితముగ వచ్చి యతిదృఢం
బుగ నాతనిం గౌఁగిలించుకొనియెను. ఈయద్భుతదృశ్యముం గాంచి
రాజాధికారులు, సభాసదులు, నాగరికులు నెల్లరు నానందాతిరేక
ముచే నైకకంఠ్యముగ జయజయనినాదములం గావింపఁదొడంగిరి.

సార్వభౌముఁడు యశోధవళునిం గాంచి యానందగద్గదస్వరము
తో "మీరు నిజముగా యశోధవళదేవులేగద:" అనియెను.

యశోధవళుఁడు మౌనముతో నశ్రువులను వెలార్చుచుండెను.
అట్లె హృషీకేశవర్మయు, రామగుప్తుఁడును నశ్రుజలపూరితనయనులై
యుండిరి. హరిగుప్తుఁడు ముందటికి వచ్చి సార్వభౌముని వెనుక నిలిచెను.
యువరాజశశాంకుఁడు దవ్వుల నిలిచి కరుణరసాత్మకం బగునీయభిన
వాద్భుతదృశ్యమును స్థిరదృష్టితోఁ దిలకించుచుండెను.

సార్వభౌముఁడు యశోధవళునితోఁగలసి మెల్లమెల్లఁగ వేదికకడ
కేఁగెను. యువరాజు, హృషీకేశవర్మ, రామగుప్తుఁడు, నారాయణశర్మ
మొదలగుముఖ్యరాజాధికారులు వారిని వెంబడించిరి. సార్వభౌముఁడు
వేదికాసోపానముపై నడుగిడినంతనే యశోధవళదేవుఁడు చటాలున
నట నాఁగి "మహారాజాధిరాజా! సింహాసనము నధిరోహింపుఁడు!"
అనియెను.

యశోధవళదేవుఁడు వేదికపైఁదనప్రక్కను గూర్చుండవలయు
నని చక్రవర్తి కోరిక. కాని యెంతచెప్పినను నాతఁ డందులకంగీక

రింపఁ దమ్యెను. చక్రవర్తి సింహాసనాసీనుఁడైనపిమ్మట యశోధవళుఁడు యువరాజుచేయిపట్టుకొని యాతని వేదికపై నెక్కించెను. యువరాజు సింహాసనము నలంకరించెను. పిమ్మట యశోధవళుఁడు సింహాపీఠసమక్షమున నిలువఁబడి తనకరాసి నొఱనుండి పైకిఁదీసి తనకపాలమునకు సోఁకించి దానిని సార్వభౌమునిచరణసన్నిధిని నివేదించెను. మరల సభలో జయధ్వనులు చెలరేఁగెను; అప్పుడు చక్రవర్తి యాకృపాణముందీసి దానిని దనకపాలమునకుం దాఁకించి యశోధవళునకు మరల నిచ్చివేసెను.

పిమ్మట ఖడ్గపాణి యగుయశోధవళుఁడు యువరాజుం గాంచి "మహారాజకుమారా! పూర్వమీయశోధవళుఁడు సార్వభౌమసందర్శనముం గావించునప్పుడీసింహాసనము శూన్యమైయుండెడిది. నేఁటికిఁ జాలకాలమునుండియు నాకు యువరాజకుమారున కభివాదనముం గావించుభాగ్యము లభించుట లేదు. మీతండ్రిగారి చిన్నతనమున వారు యువరాజకుమారులై యుండి యీసింహాసనముమలంకరింపఁగా నేనొక్కసారిమాత్రము దర్శించియుంటిని. కుమారా! మరల నిప్పు డట్టి మహాభాగ్యముం గాంచఁగలిగిన యతివృద్ధసేవకుఁ డగు నీయశోధవళునిప్రణామమును స్వీకరింపుము" అనియెను.

ఇట్లు విన్నవించి యాతఁడు తనకరవాలమును గపాలమున కద్దుకొని శశాంకునిచరణసమీపమునం దుంచెను. యువరాజు దానినందుకొని సింహాసనమునుండియు, వేదికనుండియుఁ గ్రిందికి దిగి వచ్చి వినయవినమితుఁడై యశోధవళునకు నమస్కరించెను.

తత్క్షణమే నలుదెసలనుండియు సహస్రముఖముల జయధ్వనులు చెలరేఁగెను. సార్వభౌమునిచింతాపూర్ణముఖమండలముపైఁ బ్రఫుల్లభావము గోచరించెను. ఆతఁడు శిరఃకంపము చేయుచు "ధన్యుఁడనైతిని" అనియెను.

వృద్ధయశోధవళదేవుఁడు యువరాజు నెత్తి కౌఁగిలించుకొని పలుమాఱు లాతనిమస్తకమును జుంబించుచు మరల నాతని సింహాసనముపైఁ గూర్చుండఁ జేసెను. అనంతర మాతఁ డాసింహాసనమున కెదుట నిలిచి "మహారాజాధిరాజా! ఇంతకాలమునకుఁ దరువాత "బరమపూజ్యులగు సార్వభౌములకు నేను సందర్శింపవచ్చిన కారణమును విన్నవించెదను. నాయేకపుత్రుఁడగు కీర్తిధవళుఁడు మేఘనాదపరతీరమున సామ్రాజ్యకార్యమును సాధించుటకై తనప్రాణములను విసర్జించెను. ఆతని కొకతనయ యున్నది. ఆమెను బోషించుటకైనను నాకిప్పుడు శక్తి లేకుండఁబోయినది. ఏహస్తముచే సామ్రాజ్యచిహ్నమగు గరుడధ్వజమును ధరియించి నేననేకవిజయయాత్రలలోఁ బ్రముఖుఁడనై యుంటినో, యాహస్తముతో రోహితాశ్వదుర్గపర్వతవాసులగు ప్రజలయొద్ద భిక్షలను గొనుటగూడ నాకతికష్టమైపోవుచున్నది. ఏదేనొకనవీనోద్యోగనిర్వాహణమునకుం గడంగుద మనిన వయసుచెల్లిపోయిననే నందుల కెంతమాత్రము నర్హుఁడనుగాకుంటిని, నాకీర్తిధవళుఁడు సామ్రాజ్యసేవయందే తనదేహప్రాణముల నర్పించెను.

అట్టిరాజభక్తునిబిడ్డపోషణమునకై సార్వభౌముఁ డన్నపానాదులనొసంగు నేర్పాటు గావించినచో నీవృద్ధయశోధవళుఁడు నిశ్చింతుఁడు కాఁగలఁడు! సామ్రాజ్యమున కిప్పటికిని దరవారితో నావశ్యక మున్నది. ఈవృద్ధునిబాహువులలో నింకను సామర్థ్యమున్నది; కరమునఁ గరవాలముం దాల్చుటకు యోగ్యత యున్నది. ఈతనికి రెండు మెదుకులయన్నమునకుఁ గఱవు వచ్చునను భయము లేదు. అరణ్యమృగముల వేటాడి యామాంసముతో నీవృద్ధుఁ డెట్లో తనశేషజీవితమును గడుపుకొనఁగలఁడు. కాని—మహారాజా! కీర్తిధవళునిపుత్రిక పసిబాలిక. ఆబాలిక మాంసాహారము భుజింపదు.

ఆబిడ్డకొఱకు నేనిప్పుడు సార్వభౌముని నాలుగుగోదుమగింజలను భిక్షమడుగుచున్నాను. ఇంత యేల? తినుట కొక్కమెతుకైన నింట లేకుండుటచే నేను నామ్రాతపత్నిరత్నవలయమును విక్రయింపవలసినాఁడనైతిని. నాపురాతనసేవకు లిదియంతయుం గాంచి భిక్షావృత్తినవలంబించి కొంతధనము సేకరించి నాకిచ్చియున్నారు. ఆధనముతో నేనారత్నవలయమును విడిపించుకొని యిప్పు డీపాటలీపుత్రమునకు వచ్చియుంటిని.—మహా రాజాధిరాజా! ఒకమనవి. నాపౌత్రి యగు లతిక రాజగృహమునందొక దాసిగా నుండఁగలదు. ప్రతిదినమును ప్రాతస్సాయంకాలముల నామెకొక్కకడి యన్నము దొరకినఁ జాలును! కాని, మాంసము మాత్ర మామెకుఁ బనికిరాదు. ఇన్ని యేండ్లు గడపిన యీయశోధవళుఁ డీమెకొఱకిఁక భిక్షాటనము సేయఁజాలఁడు. మాళవములోనిసంపద మంటిపాలయిపోయినది. వంగమునందలి రాఁబడి వమ్మయిపోయినది. పుత్రవిహీనుఁ డగునీవృద్ధున కీబిడ్డకంటె నిక "నా" యనువా రెవ్వరును లేరు. ఈశానిపర్వతప్రాంతమునందలి ప్రజలకడ స్వామిభాగ మగుషష్ఠాంశమునుగూడ నడిగి తెచ్చువారు లేరు. పర్వతారణ్యప్రజల నదిమిపట్టి తెచ్చు సేవకు లొక్కరును లేరు. సార్వభౌమా! ధవళవంశము మహాశ్రీమంతమైనది కాని, యది యిప్పుడు నామమాత్రావశిష్టమైపోయినది. ఆయశోధవళుఁడు నిశ్చయముగా మరణించె ననియే చెప్పవచ్చును. రోహితాశ్వము శూన్యమైపోయినది. నేను యశోధవళుని ప్రేతమనుమాత్రమే—ఒక్కకడియన్నమునకైన గతి లేకుండ నీభూమిపై దినముల గడపుచున్నాను. నాకిప్పుడు దుర్గాధిపతిగా నుండుట కర్హత లేదు" అని మనవి చేసెను.

యశోధవళునికనతిదూరమున నాతని మనుమరాలిని జెంత నిడికొని వీరేంద్రసింహుఁడు నిలిచియుండెను. ఆతఁడప్పుడు యశోధవళునియింగితము నెఱింగి యాబిడ్డ నాతనియొద్దకుఁ దీసికొని వ

చ్చెను. యశోధవళుఁడు మనుమరాలిచేయి పట్టుకొని "అమ్మా! లతికా! మహారాజాధిరాజునకుఁ బ్రణమిల్లుము." అనిబోధించెను.

బాలిక సార్వభౌమునకు సాష్టాంగప్రణామముం గావించెను. నరేంద్రసింహుఁ డామెవెనుక నిలువఁబడి వీరోచితవిధానమున జక్రవర్తి కభివాదనముం గావించెను.

అనంతరము యశోధవళుఁడు మరల "మహారాజాధిరాజా! ఈబాలికయే నాకీర్తిధవళుని యేకపుత్త్రిక. ఈపసిపాపతండ్రి సామ్రాజ్యముకొఱకు వంగదేశసంగ్రామమునఁ బ్రాణత్యాగము గావించెను. ఈబిడ్డతల్లి వైధవ్యదుఃఖమును భరింపఁజాలక సతీజనోచితం బగుసహగమనము చేసినది నాకిప్పు డీబాలికను బోషించుసామర్థ్యము లేదు. ఈకుమారిపోషణభారమును సార్వభౌములే వహింపవలయును. అనాదికాలమునుండియు రాజ్యముకొఱకుఁ బ్రాణముల నర్పించినసైనికుల దారపుత్త్రాదులను సంరక్షించుభారమును సార్వభౌములే వహించుచుండిరి. నేనీవిశ్వాసముతో నే—ఈయాశతో నే— పితృమాతృవిహీనయగు నీయనాథబాలిక కొకకడియన్నము నిమ్మని మిమ్ము యాచించుచున్నాను!" అనియతికరుణముగ విన్నవించెను.

యశోధవళునిమాటలు వినుచున్నంతవఱకును జక్రవర్తి కన్నులనుండి యశ్రుధారలు ప్రవహించుచునే యుండెను. ఆయశ్రుధారలచే ముడుతలువడినయాతనికపోలములు తడిసిపోవుచుండెను. యశోధవళుని విన్నపము ముగియుటకు ముందుగనే సార్వభౌముఁడు సింహాసనమును విడిచి చటాలున లేచి నిలువఁబడి గద్గదస్వరముతో "నా—బా—ల్యప్రాణ—మిత్త్ర—" అని యింక మాటాడఁజాలకపోయెను. కంఠస్వరము రుద్ధమైపోయెను. అప్పు డాతఁడు శోకనిశ్చేతనప్రేతమువలెఁ దటాలున సింహాసనముపైఁ గూలఁబడిపోయెను. సభామందిరమునందలి సభ్యులందఱును నిస్తబ్ధులై నిలువఁబడిపోయిరి.

అప్పుడు నారాయణశర్మ వేదికకడ నిలిచి 'సార్వభౌమా! నేఁడు సభాకార్యములు సాగుట కష్టముగాఁ దోఁచుచున్నది. ఆజ్ఞయైనచో వ్యాయామార్థులై వచ్చిన నాగరికులను బంపివైచెదను" అని మనవి చేసెను.

చక్రవర్తి తన యంగీకారమును సూచించెను. యశోధవళుఁడింకను నేమియో మాటాడ నుపక్రమించుచుండ మహామంత్రి యగు హృషీకేశవర్మ యాతని వారించి తాను వేదికకడ కరిగెను.

సభామందిరము మెల్లమెల్లఁగ రిక్తము కాసాగెను. ఇఁక రాజకీయోద్యోగులుమాత్రమే యచ్చట మిగిలియుండిరి. అనుదినమును సభాకార్యములు ముగిసినతరువాత మంత్రిసభ సమావేశ మగుచుండు నాచార మున్నది. అందు ముఖ్యాధికారులుమాత్రమే కూడియుందురు.

అప్పుడు మంత్రి హృషీకేశవర్మ చక్రవర్తి నుద్దేశించి "నేఁడు మీరించుక యస్వస్థులైయున్నట్లగపడుచున్నారు. కావున నిదినమున నిఁక మంత్రిసభ సమావేశ మగుటకూడ నావశ్యకము లేదు" అనియెను.

చక్ర—నేఁడాలోచనాసభాసమావేశ మవశ్యముఁ గావలసియున్నది. సాయంకాలము సముద్రగృహమున సభ చేరవలయును. అత్యావశ్యకంబు లగు కార్యములు గలవు. ఇప్పుడిచ్చటికి రానియధికారులుకూడ సాయంకాలసభకు వచ్చునట్లు దూతలమూలమున వార్తల నందింపుము.

రామగుప్తుఁడు యశోధవళుని దనయింటికిఁ దోడ్కొనిపోవలయునని కుతూహలపడుచుండెను. యశోధవళుఁడుగూడ నాతనియాతిథ్యము నంగీకరించి చక్రవర్తియాజ్ఞను వేఁడుకొనియెను.

చక్రి—యశోధవళా ! ఇంతవఱకు నీప్రశ్నకు—నీవిన్నపమునకు నేనట్టిప్రత్యుత్తరమును జెప్పనేలేను. మీరు వాస్తో రంగు ! నేఁడు మీరు సామ్రాజ్యాతిథులైతిరి.

అనంతరము సార్వభౌముఁడును, యశోధవళుఁడును, శశాంకుఁడును సభాభవనమునుండి వెడలిపోయిరి.

పదునాల్గవ ప్రకరణము.

రాజభవనమునకు వెనుకభాగమునం దొక పుష్పవాటిక యున్నది. చాలకాలమునుండి యెవ్వరును శ్రద్ధతోఁ బరామర్శింపకుండుటచే నిప్పు డాయుద్యానమును రాజభవనాంగణమును నరణ్యప్రాయము లైపోయెను. కాని గంగాతీరమునందలి చిన్నతోఁటమాత్రము జాగ్రత్తగాఁ బోషింపఁబడుచుండుటవలన నిప్పటివఱకు నది యతిరమణీయముగానుండెను. ఈయారామమునం గుంబూలచెట్లును, దీగలును దక్క మఱియేమియును లేవు. పుష్పవాటికకు నలుదెసలనున్న యావరణములకడనున్న నానావిధంబు లగుపుష్పవల్లికలు విస్తరించి యాతోఁట యావరణమున దట్టముగా నల్లుకొని యుండెను. అందుఁ గొన్నిలతలు పుష్పవిలసితంబులును, గొన్నివల్లికలు నవకోమలసుందరపత్రపల్లవములచే వినమ్రములు నైయుండెను. చతురంబగు నాపుష్పవాటికామధ్యమున నందందు స్ఫటికశిలానిర్మితంబు లగు వేదికలు విరాజిల్లుచుండెను. వానినలువంకలను వివిధంబులగు పుష్పవృక్షము లుండెను. అవి యన్నియును గణనాతీతంబు లగురమణీయకుసుమగుచ్ఛంబులచేఁ బ్రఫుల్లములై యుండెను. ప్రభాతసమీరకుమారుఁడు గంగావక్షమునుండి లేచి మెల్లమెల్లఁగ నేతెంచి పుష్పతరుశాఖల నల్లలాడించుచు నయ్యారామప్రదేశమునంతను సురభిశీతలంబుగఁ జేయుచుండెను.

ఆమందానిలసంచాలనంబున నసంఖ్యాంబులగువివిధవర్ణకుసుమంబులు తరులతలనుండి క్రిందికి దిగజాఱుచు నాప్రదేశమునంతను సుందరప్రసూనశయ్యలచే నలంకరించుచున్నట్లుండెను. అంధకార మింకను బూర్తిగా నంతరించి పోలేదు. అది యుషఃప్రకాశమునకు భయపడి రాజభవనంబున మూలమూలలను, తరుమండముల నధ్యప్రదేశమునను నెట్టుటులో నింకను దాఁగియే యుండెను. సూర్యభగవానుఁడియసంఖ్యజ్వాలామయకిరణశరవర్షంబునం గాని యది పాతాళమువఱకు ననుగంటిపోవదు.

అప్పు డాకస్మికముగాఁ బుష్పవాటికాకవాటము తెఱవఁబడియెను. అందుచే ద్వారమునకుఁ బైభాగమున నలమియున్న మాధవీలత కంపింపఁ దొడంగెను. ఆద్వారమునుండి యొకబాలిక తోఁటలోఁ బ్రవేశించెను. అళివినీలంబులగు నామెకుటిలకుంతలములు వాయులహరీతరంగములపై నానందనృత్యము సేయుచుండెను. ఆమె యారామమునఁ బ్రవేశించి యందందు వెదకి చూచెను. ఎవ్వరును గనఁబడలేదు. అందుచే నామె వెనుకకు మరలి ద్వారముకడకు వచ్చి మూసినతలుపులను దెఱచుచుండ నింతలో ద్వారముకడకే తెంచి నిలిచియున్న మఱియొకబాలిక యుచ్చస్వరంబున నవ్వుచు" యువరాజా ! దొంగను బట్టుకొంటిని సుమా !" అనియెను.

ఆమాట వినఁబడినతోడనే ప్రథమబాలిక పరుగెత్తిపోవుటకుఁ బ్రయత్నించెను. కాని, నూతనబాలిక యామెను గట్టిగఁ బట్టుకొని పోనియదయ్యెను. ఇంతలో శశాంకమాధవగుప్తులు నవ్వుచుఁ బరుగుపరుగున నచ్చటికే వచ్చిరి.

శశాంకుఁడు మొదటిబాలికం గాంచి నవ్వుచు" చిత్రా! ఇట్టులొక్కపెట్టునఁ బరుగెత్తుకొని మాకంటె ముందుగా వచ్చితివేల ?" అనియెను.

చిత్రి యేమియు మాటాడలేదు. అప్పుడు రెండవబాలిక" చిత్రికు గోపము వచ్చినది !" అనియెను.

శశాం—(నవ్వుచు) చిత్రి యలిగినదా? ఎవ్వరిమీఁద ?

బాలి—మీమీఁదనే.

శశాం—నామీఁదనే ? ఏల ?

బాలి—మీరు నాకుఁ బూవులఁ గోసియిచ్చుటకొప్పుకొంటిరని—

శశాంకుఁడు పకపక నవ్వనారంభించెను. క్రోధలజ్జావివశయై యున్న చిత్రివదనమండలము కషాయిత మయ్యెను. ఆమె క్రోధముం గని రెండవబాలిక యించుక లజ్జించి" కుమారా! నడువుము; మనమావైపునకుఁ బోయి పూవులను గోసికొందము రండు !"అనియెను.

అరనిముసములో నాబాలికయు మాధవుఁడు నాపుష్పవాటికం బ్రవేశించి యదృశ్యులైరి. వారు వెడలిపోయినతరువాత శశాంకుఁడు "చిత్రా ! నీవు నాపై నేల కోపించితివి ?" అనిప్రశ్నించెను.

చిత్రి ప్రత్యుత్తర మీయకయే రెండడుగులు వెనుకకు జరిగెను. శశాంకుఁడు ముందటికిఁ బోయి యామెచేయి పట్టుకొనఁబోయెను. కాని యామె తటాలున నాతనిచేయి విడిలించికొనియెను. తుదకెట్లో శశాంకుఁడామెపాణిగ్రహణముం గావించెను.

శశాం—చిత్రా ! నేనేమిచేసితిని ? నాపైనింతకోపమేల?

చిత్రి యవ్వలిమొగమై యేడువ నారంభించెను. శశాంకుఁడామెనోదార్చి శాంతింపఁజేయుటకై చాలసేపటివఱకును బ్రయత్నించెను. ఎంతయో ప్రార్థించినపిమ్మటఁ జిత్రి మృదుస్వరముతో" మీరు—మీరు—లతికకుఁ— బూవులు గోసి యిచ్చెద నని యొప్పుకొంటిరఁట గాదా ?" అనియెను.

శశాం—వెఱ్ఱిదానా! ఇదియానీకోపకారణము? పాపము, లతిక మనయింట రెండుమూఁడుదినములుండుటకై వచ్చినయతిథిస్వరూపిణి.

ఆమెతో నాడుకొనవలదా? ఆమె నెల్లవిధముల సంతుష్టిపఱచుచుం డుమని యమ్మ నాకాజ్ఞాపించినది. అదిగాక లతిక మనయింటికి వచ్చి యున్న పరాయిబాలిక. మరియాదకొఱ కామెతో నాడుచుఁ బాడుచు నామెను గౌరవింపకున్నచో బాగుగ నుండునా? నీవే చెప్పుము!

చిత్రముఖమండల మతిగంభీర మయ్యెను. ఆమె విరక్తస్వర ముతో " సరే—మీరామెకు మరియాద చేయవలసినదే—కాని యామెకుఁ బూవులు గోసిపెట్టి యాడిగము సేయుటకు మీరేల యంగీకరింపవ లయును?

కుమారుఁ డీప్రశ్న కేమని యుత్తరమీయఁగలఁడు? ఆతఁడు చిత్రనూఱడించుట కెన్నియో ప్రయత్నములను గావించెను. కాని యామె కూఱడిల్లియుండుట కెంతమాత్రము విష్టము లేదు కాఁబో లును!

శశాంకుఁ డిఁక నిరుపాయుఁడై " సరే! అట్లయిన నేను నీకే పూవులను గోసియిచ్చెదను. లతిక కొక్కపూవైనను నీయను. ఇఁకను గోప మెందులకు?" అనియెను.

ఇప్పటికిఁ జిత్రహృదయ మొక్కింతుక శాంతించెను. ఆపుష్ప వాటికయందు వికసించినపూవు లన్నియును గోయవలయునని యాపి ల్లలందఱును ద్వరపడుచుండిరి. అందఱును దాముగోసినకుసుమముల నన్నిటిని దెచ్చి యారామమధ్యమునందున్న యొక వేదికపైఁ గుప్పవో యుచుండిరి. శశాంకుఁడుమాత్రము తాను గోసినపుష్పములను జిత్ర యొడిలోఁ బోయుచుండెను. మాధవుఁడు లతికయొడిలోఁ బోయు చుండెను.

ఇంతలోఁ బుష్పవాటికాద్వారముకడనుండి" ఓరీ! కుమారుఁ డిచ్చటనేఁ యున్నాఁడు! ఇటు రమ్ము!" అనుమాటలు వినవచ్చెను.

శశాం—ఎవరక్కడ?

"యువరాజా! నేను—అనంతుఁడను.—నరసింహుఁడు మీకొఱకు వెదకుకొనుచున్నాఁడు!"

అని యిరువురుబాలకు లాద్వారమును దెఱచుకొని లోపలఁ బ్రవేశించిరి. వీరిలో నొకఁడు మాప్రియపాఠకులకుఁ బరిచితుఁడే—అతఁడు చరణాద్రిదుర్గాధిపతి యగుయజ్ఞవర్మతనయుఁ డనంతవర్మ—రెండవవాఁడు చిత్రకు సోదరుఁ డగునరసింహదత్తుఁడు!

నర—యువరాజా! ఇక్కడ నేమి చేయుచున్నారు?

శశాం—(నవ్వుచు) నీసోదరికి దాస్యము చేయుచున్నాను. రోహితాశ్వదుర్గమునుండి రెండుమూఁడుదినములక్రిందట లతిక మాయింటికిఁ జుట్టమై వచ్చినది. కావున నేనామెకుఁ బూవులను గోసి యిచ్చి మరియాద చేయఁ దలఁచితిని. కాని యట్లు చేయుట నీసోదరి కిష్టము లేకపోయినది. అందుచే నేనిట్లు చేయవలసివచ్చినది. మాధవుఁ డిప్పుడు లతికకు దాసుఁడైనాఁడు.

ఈమాటవిని నరసింహుఁడు, ననంతుఁడును బిగ్గఱగా నవ్వ నారంభించిరి. చిత్ర లజ్జావనతవదన యయ్యెను. నరసింహుఁ డామెం గాంచి "చిత్రా! యువరాజు పెద్దవాఁడై పదిమందిని బెండ్లియాడిన ప్పుడు నీవేమి చేయుదువు?"

చిత్ర తల యూఁచుచు "నే నెన్నటికినిగూడ నట్లు చేయనీ యను!" అనియెను.

ఈమాట విని యందఱు నవ్వ నారంభించిరి.

నర—(నలువంకలఁజూచి) తోఁటలోనిపువ్వులన్నియుఁగూడ నైపోయిననే. ఇఁకఁ జెట్లయినను మిగులునో లేదో? పొద్దెక్కిపోవు చున్నది. ఇఁక నదికిఁ బోవుట మంచిదికాదా? ఒకజామువఱకు నెవ్వరి కిని స్నానమే తేలదు! మహాదేవియొద్దనుండి మూఁడునాలుగుకబు రులు వచ్చిననే గాని యెవ్వరికిని భోజనముమాటయే తోఁచదు!

ఈమాటలు విని శశాంకుఁడు నవ్వుచు "నరసింహా! మాలో నీవొక్కఁడవే పెద్దవాఁడవు! బుద్ధిశాలివి! గుణములదొంతివి! సమయము మించకుండ నీవన్ని పనులను జక్కఁజేసికొనఁగలవు. కావా?" అనియెను.

యువరాజిట్లు పలుకుచుండఁగనే యాతోఁటలోని యొకదాసి వచ్చి కుమారునకుఁ బ్రణామము చేసి "మహాదేవిగారుమిమ్ముందఱను వేగముగా స్నానము చేసి రమ్మన్నారు" అని మనవి చేసెను.

నరసిం—(బిగ్గఱగా నవ్వుచు) కుమారా! నేనన్నమాట సరి పోయినదా?

తత్క్షణమే యందఱును బయలుదేఱి రాజభవనమునకుఁ బోయిరి. భవనపటాంగణసమీపమునం దున్న యొకయరుఁగుపై నున్న తరాయుఁ డగునొకపురుషుఁడు ప్రచారము చేయుచుండెను. చూచి నంతనే లతిక పరుగెత్తుకొనిపోయి యాతనిపాదములను గౌఁగిలించుకొనియెను. శశాంకమాధవులుగూడ నామె వెంటనే పోయి యాపురుషునకు నమస్కరించిరి. తక్కిన బాలకులించుకదూరమున నిలిచియుండిరి. ఆపురుషుఁడు యశోధవళుఁడే!

యశోధవళుఁడు శశాంకుని పింగళకేశకలాపమును జేతితో నిమురుచు "యువరాజా! వారెవ్వరు?" అని ప్రశ్నించెను.

శశాంకుని కనుసన్న యెఱింగి యనంత నరసింహులు సమీపించి యశోధవళదేవునకుఁ బ్రణమిల్లిరి. శశాంకుఁడు యశోధవళునకు వారి పరిచయముం గావించెను. తోడనే యశోధవళుఁడు చిత్రానంతులను రెండుచేతులతో నెత్తుకొని స్తబ్ధభావముతో విమనస్కుఁడై నిలువఁబడి తనలో "సామ్రాజ్యమునందలి సరదారులును, ముఖ్యవంశజులగు ప్రకృతపురుషులును దమకెట్టియాధారమును లేకుండుటచే రాజధాని కేతెంచియున్నారు. సామ్రాజ్యమునం దందఱును బికారులే

మైపోవుటచే భిక్షమిడుటకెవ్వరును లేకుండ నున్నారు. వృద్ధ చక్రవర్తియే యిప్పుడందఱకు నాశ్రయదాత కావలసియున్నాఁడు. ఆతఁడును నావలెనే వృద్ధుఁడైపోయెను. ఆతని పుత్రులిరు వురు నింకను బాలకులే—రాజ్యరక్షణమునకసమర్థులు! ఈవృద్ధసార్వభౌముని మరణమునకై శత్రువులు నలుదెసలనుండియు నెదురుచూచుచున్నారు. ఇఁక నుపాయ మేమున్నది—"అని తలపోయుచుండఁగా దాసి యొకతె సమీపించి ప్రణామము గావించి "ప్రభూ! చాలప్రొద్దెక్కినది. మహాదేవిగారు బిడ్డలను స్నానము చేయించుటకై పిలుచుచున్నారు!" అని మనవి చేసెను.

యశోధవళుఁడు చటాలునఁ జిత్రాన్తులను గ్రిందికి దింపెను. తత్క్షణమే యందఱును నాతనికి నమస్కరించి మాడలోనికిఁ బరుగెత్తుకొని పోయిరి.

యశోధవళుఁడు మరల నాలోచనా నిమగ్నుఁడై తనలో "లతికంగూర్చిన విచారముచే నేనుగలఁతఁజెంది సార్వభౌముని సన్నిధికి వచ్చియుంటిని. కాని యిక్కడకు వచ్చి చూచుసరి కందఱియవస్థయు ను శోచనీయముగనే యగపడుచున్నది. ఎవ్వరికిని రాజకార్యదక్షత యే లేదు. వృద్ధుఁడైన సార్వభౌముఁ డధిక పరిశ్రమను సహింపఁజాలకుండెను. బహిశ్శత్రుభయముచే నాతఁ డహోరాత్రములును జింతాక్రాంతహృదయుఁడై యున్నాఁడు. ఎవ్వరెట్టి యల్పాపచారము గావించినను నాతఁడే సంచలింపవలసి యుండెను. రాజకార్యభారమును వహించుట కింకను రాజపుత్రు లర్హులై యుండలేదు. హృషీకేశవర్మయు నారాయణశర్మయుమాత్రమే సామ్రాజ్యమునకుఁ బ్రస్తుతము ప్రధానులై యున్నారు. వారుగూడ వృద్ధులే యగుటచే నధిక శ్రమను సహింపఁజాలకున్నారు. ఇఁక నీసామ్రాజ్యసంరక్షణమున కుపాయ మేమున్నది? ఈప్రాచీనసామ్రాజ్యము సుస్థిరమైయుండుట

కిఁక నాధార మేమున్నది? ” అని వితర్కించుచుండ నావృద్ధునివదన మండల మెఱ్ఱనై పోయెను.

అట్లాతఁ డతిదీర్ఘముగ నాలోచించి యాలోచించి యొక్క చో నిలువఁబడి తుట్టతుదను “నాయేకపుత్త్రుఁడు కీర్తిధవళుఁడు సామ్రాజ్యముకొఱకు సమరాంగణమునఁ దనదేహమును సమర్పించి యున్నాఁడు. రాజకార్యముకొఱకు నేనును నాజీవితమును బలిసేయ వలయును. సామ్రాజ్యముకొఱకే కర్మక్షేత్రమునఁ బ్రవేశించి యీ నాశేషజీవితమును గడపివైచెదను. మాపూర్వులగు పాటలీయమహా నాయకులు సామ్రాజ్యముకొఱకుఁ దమమానప్రాణధనంబులనర్పించుచు జిరకాలమునుండియుఁ గీర్తిశేషు లగుచున్నారు. ఆవంశమందలి కడప టివాఁడనగు నేనుగూడ నాపరమపూజ్యులచరిత్రము నాదర్శముగఁ జేసి కొని వారిమార్గమునే యనుసరించి పోయెదను” అని నిశ్చయించు కొనియెను.

యశోధవళుఁడు దృఢప్రతిజ్ఞుఁడు. తలఁచినపని నెఱవేర్చువఱకు నాతఁ డత్యాతురుఁడై యుండును. ఇప్పు డాతఁ డీవిధముగా నిశ్చయించుకొని యింక నిమిషమైన నూరకుండఁజాలక “ఎవరక్కడ?” అని కేక వైచెను.

తోడనే ప్రతీహారి యట కేతెంచి ప్రణమిల్లుటయు యశోధవళుఁ డాతనిం గాంచి “సార్వభౌము లిప్పుడెచ్చట నున్నారు? నేనిప్పు డేపోయి వారిని సందర్శింపవలయును. ” అనియెను.

ప్రతీ—మహాస్వామీ! మహారాజాధిరాజ సార్వభౌములవా రిప్పుడే గంగాద్వారముకడకుఁ బోయియున్నారు.

యశో—నీవిప్పుడే పోయి వారికి నామనవిని విన్నవించి రమ్ము.

“చిత్తము” అని ప్రతీహారి యాతనికిఁ బునఃప్రణామముం గావించి వెడలిపోయెను.

పదునేనవ ప్రకరణము

———:o:———

గంగాద్వారమునకు వెలుపల నున్న విశాలసోపానములపై భాగమున సార్వభౌముఁడు కూర్చుండి యుండెను. ఆతనియెదుట విశాల సైకతప్రదేశమున దూరముగా భాగీరథీజలప్రవాహరేఖ కానవచ్చుచుండెను. చక్రవర్తి యాఘట్టమునందుఁ గూర్చుండి బాలికాబాలకుల జలక్రీడల నాలోకించుచుండెను. ఆసమయమునఁ బ్రతీహారివచ్చి ప్రణామము చేసి " దేవా! మహానాయకయశోధవళదేవుఁడు మహారాజ సందర్శనము నపేక్షించుచున్నాఁడు" అని మనవి చేసెను. అది విని చక్రవర్తి " ఆతని నిచ్చటికిఁ దీసికొని రమ్ము! " అని సెలవిచ్చెను.

ప్రతీహారి పునరభివాదనము చేసి పోయి కొంతసేపటి కటకు యశోధవళదేవుని దీసికొని వచ్చెను. సార్వభౌముఁడు మందహాసముతో నాతనిం గాంచి " ఏమియశోధవళా! విశేషము లేమి? " అని ప్రశ్నించెను.

యశోధవళుఁడు చక్రవర్తికి నమస్కరింపఁబోయెనుగాని మహారాజాతని నట్లు చేయనీయక చేయిఁబట్టుకొని తనచెంతఁ గూర్చుండు మనియెను. కాని యశోధవళుఁ డట్లుచేయక యించుక దూరమునఁ గూర్చుండెను.

కొంతసేపైనతరువాత యశోధవళుఁడు ముకుళితకరయుగళుఁడై "మహారాజాధిరాజా! నాపౌత్రి యగులతిక నాయనంతరమున నిరాశ్రయయై కడగండ్ల పాలగు ననుభయముచే నామెకొఱకు నేను మిమ్ములను యాచింప వచ్చితిని. కాని, యిచ్చటిస్థితిగతులను బరిశీలింపఁగా నాకంతయు విలక్షణపరిణామ మగపడుచున్నది. అభిజాత సాంప్రదాయకులలో ననేకులు బికారులైయున్నట్లు నాకిప్పుడు స్పష్టము

గాఁ దెలియవచ్చినది. నిరాశ్రయులగు విధవలకు, అనాథలకు నిరాధారులగు బాలికాబాలకులకు నిప్పుడు మీరొక్కరే యాశ్రయస్థానమై యున్నారు. కాని, మీశిరోజములు పలితములై పోయినవి. మీరు కడుంగడు వృద్ధులైనారు. మనకిప్పుడు మహాప్రయాణకాల మాసన్నమై యున్నది. మీయనంతరమున సామ్రాజ్యస్థితియుఁ బ్రజాస్థితియు నెట్లుండునో యను విచారము నా హృదయమునకు దారుణయాతనం గల్పించుచున్నది. నేనిచ్చటికి వచ్చి సకలవ్యవహారములను, సకలసందర్భములను గాంచి యిప్పుడు నాలతికవిచారమునే మఱచిపోయితిని. మీకుమారులింకను బాల్యదశయందే యున్నారని చెప్పవచ్చును. వారి కింకను రాజకీయ వ్యవహారములను నేర్వవలసిన ప్రాయము రాలేదు. మీముఖ్యాధికారు లగుహృషీకేశ, నారాయణవర్మలు కూడ వృద్ధులై రాజకార్యపరిశ్రమను సహింపఁజాలనియవస్థలో నున్నారు. మీనవీనాధికారులకుఁ దమంతట స్వయముగా నేకార్యము చేయుటకును సాహసము కలుగుట లేదు. వారి కాశక్తియును లేదు. ఏవిషయమైనను మీకు విన్నవించుటకుఁ గూడ వారు భయపడుచున్నారు. ఈయన్నివిషయములను బాగుగ నాలోచించి చూడఁగా మీరు జీవించియుండఁగనే రాజకార్య వ్యవహారములయం దతిమాత్ర మగులోపము వ్యాపించియున్నట్లు తేటపడుచున్నది. ప్రస్తుతస్థితిలో నిజమాలోచింపఁగాఁ జరణాద్రిదుర్గము సామ్రాజ్యమునకు సింహద్వారము. కాని, యాదుర్గాధిపతియగు శార్దూలవర్మతనయుఁడు మహావీరయజ్ఞవర్మ నాతనితమ్ముఁడు దుర్గమునుండి పాఱఁద్రోలినవార్త యిప్పటికిని సార్వభౌముని చెవికిఁ జేరదయ్యెను. ఇదియు మండలమగు అంగవంగదేశములకుఁ బొలిమేర నున్నది. ఆదుర్గాధిపతి ప్రాచీనకాలమునుండియు నొక ముఖ్యామాత్యుఁడుగాఁ బరిగణింపఁబడుచుండెను. కాని, యాతఁడు దత్తుని దుర్గ

మితరు లపహరించుటచే నాతని పుత్రికాపుత్రికులు భిక్షాన్నజీవులై పోయినారు. మహారాజాధిరాజా! మనస్సంక్షోభము నూర్పుట కింతకంటె నిం కేమి కావలయును? మీజీవితకాలమునందే యీపాటలీపుత్రమున కెట్టిదురవస్థ తటస్థించినదో మీరణుమాత్రమైనను గ్రహించుట లేదు. తోరణద్వారములకుం గవాటములు లేవు. నగరతటము శిథిలమై యున్నను పడుటకు సిద్ధముగా నున్నది. దానిని బాగుపఱచువారెవ్వరును లేరు. రాజభవనశిలాపటాంగణ మిప్పుడు పచ్చికబీడై పాడువడియున్నది. ఇప్పటివఱకుం గోశమున ధనలవము లేదుగదా! వాడలోం బనివాండ్రుగూడ ననేకులున్నారు. కాని, యేపనియును బాగుగ జరుగుచుండుట లేదు. అది యేమని మీరైనం బరామర్శించుట లేదు. నలుదెసలయందును మనశత్రువులు శిథిలావస్థయందున్న మనసామ్రాజ్యముపైం గాకులవలె లుబ్ధదృష్టులై సమయమును వేచి పొంచుండి చూచుచున్నారు. వంగదేశము పేరునకు సామ్రాజ్యమునం జేరియున్నది గాని, దానిపై నధికారమెవ్వరికిని లేకుండం బోయినది. మహాదేవి యనుమహాసేన జీవించియున్నది గావున వారాణసీచరణాద్రిదుర్గములు బహిరంగముగా స్థానేశ్వరసామ్రాజ్యమునం జేరిపోకుండ నిలిచి యున్నవి. ఈసంగతి మీకును దెలిసియేయుండును. ఒకవేళ దురదృష్టవశమున మహాదేవి మరణించినప్పుడుగాని—ప్రభాకరుండు జననియాజ్ఞ నుల్లంఘించినప్పుడుగాని—నిశ్చయముగా మనకెంతటి సామర్థ్యమున్నను, యెంతసైన్యమున్నను, ఎంత దేహబలమున్నను మనసామ్రాజ్యమును సంరక్షించుకొనుట దుస్సాధ్యము కాకమానదు. ఇట్టిస్థితిలో మనరాజధాని శత్రువులు ముట్టడింపకుండంగనే యుద్ధముచేయవలసిన యావశ్యకము కలుగకుండంగనే శత్రువులకు హస్తంగతము కాంగలదు" అని చెప్పి యశోధవళుం డూరకుండెను.

కొంతసేపటివఱకు నిరువురును నిస్తబ్ధులై యుండిరి. అనంతరము చక్రవర్తి మెల్లఁగా "యశోధవళదేవా! నీవు చెప్పినసంగతు లన్నియును నిజమే. కాని నేనేమి చేయుదును! నేను వయోవృద్ధుఁడను. శశాంకుఁడు పసిబాలుఁడు. శశాంకుని కాలమున సామ్రాజ్యమునకు వినాశనము తటస్థింపఁగలదని జ్యోతిష్కులు చెప్పియున్నారు! విధివిధానమెట్లున్నదో యట్లు జరుగక మానదుగదా" అనియెను.

యశో—(తీవ్రస్వరముతో) మహారాజా! మీరిట్లు సంభాషించుట యుచితముగాదు. ఎవ్వఁడో యొక పిచ్చివాని—మోసగాని-మాటలను విశ్వసించి సామ్రాజ్యమునకు జలాంజలి విడిచి యూరకుండుట మీవంటివారికిఁ దగునా? జ్యోతిష్కులా? వారికిఁ దోఁచిన వన్నియును వాగుచుందురు; అనేకవిషయములను జెప్పుచుందురు. వారు చెప్పినట్లే ప్రవర్తింపవలయు నన్నచో మానవుఁడు సంసారమును బరిత్యజించి వానప్రస్థాశ్రమమును స్వీకరింపవలయును. యువరాజకుమారుఁడు బాలుఁడైన నేమి? తీవ్రబుద్ధికుశలుఁడు—సమరకళా కోవిదుఁడు—కాని, మీరాతనికిఁ దగిన శిక్షణము నొసంగుచుండుట లేదు. సామ్రాజ్యశకటమును నడపించుటకై శౌర్యవీర్యాదికముకన్నఁ గూటనీతియే యత్యావశ్యకమైనది. రాజకీయవ్యవహారము లెట్లు జరుగుచున్నవో యని చాలకాలమువఱకును సూక్ష్మావలోకనము చేయుచుండవలయును. ఈధర్మమును మీ రెట్లుమఱచితిరో వింతగానున్నది. కాలప్రవాహమునం దప్పుడప్పు డద్భుతకృత్యములం గావించు నొక్కొక్క బాలతరంగ ముదయించుచుండును. ఆబాలకులకృత్యములే యితిహాసము లగుచుండును. సముద్రగుప్తుఁడు కేవలమును బదునాలుగేండ్ల బాలుఁడే కాని, యాతఁ డుత్తరరాజసముద్రమునంతను మథించి యశ్వమేధముం గావించెను. స్కందగుప్తుఁడు పదునైదేండ్ల పసివాఁడు. ఆతఁడు శస్త్రహస్తుఁడై హూణులప్రథమకల్లోలమునంతను

నణగించివైచెను. ఇట్టిస్థితిలోఁ బదునాలుగేండ్ల వయసుగల మన శశాంకనరేంద్రగుప్తుఁడీప్రాచీనసామ్రాజ్యము నుద్ధరింపఁజాలువాఁడు గాఁడని మనమెట్లు నిర్ణయింపఁగలము? ఎవ్వరు చెప్పఁగలరు? మహారాజా! ఈసంశయము లన్నియును వీడుఁడు! ఇప్పటికైనను సామ్రాజ్యోద్ధరణాశ లేకపోలేదు. ఇంకను వేళ యున్నది. కాని యిట్లూరకున్నచో నిఁక మీఁదమాత్రము సాగదు.

చక్ర—యశోధవళా! ఈస్థితిలో నేనేమి చేయఁగలను? ఏమి చేయవలయునో నీవే చెప్పుము.

యశో—మీరు చేయవలసినపని యతిసామాన్యమైనదియే. ఒకప్పుడు మీదాసుఁడగు నితఁడు మహారాజాజ్ఞచే సామ్రాజ్యసర్వకార్యభారమును దనతలపైఁ బెట్టుకొని నిర్వహించి యున్నాఁడు. ఈ క్షీణబాహువులలో నప్పటితారుణ్యశక్తి యిప్పుడు లేకపోయినను నిజముగా నీహృదయమునందుమాత్ర మపారబలము లేకపోలేదు. మహారాజా! దేవరయాజ్ఞయైనచో మరల నీసేవకుఁడు మునుపటివలెనే రాజ్యకార్యభారమును వహించుటకు సంసిద్ధుఁడై యున్నాఁడు! సార్వభౌమా! రాజకార్యనిర్వహణమునందే నాకీర్తిధవళుఁడు ప్రాణముల నర్పించి యున్నాఁడు. ఆతనివృద్ధజనకుని కోరికకూడ నట్లు చేయవలయుననియే—మా లతికకు భిక్షాన్నమును సంపాదించి పెట్టుటకై నే నిచ్చటికి వచ్చియుంటిని. కాని, యిక్కడకు వచ్చినతరువాత నా యాశ్రయదాతయాశ్రయమే కూలిపోవుటకు సంసిద్ధమై యున్నట్లు నాకు గోచరమయ్యెను. ఇట్టిస్థితిలో నాబిడ్డ కాశ్రయ మిచ్చువారెవ్వరు? హృషీకేశనారాయణశర్మలిప్పుడు చేయుచున్న పనులను వారే నిర్వహించెదరుగాక! లోకుల కన్నులచాటునుండియే నేను సార్వభౌమునకును, సామ్రాజ్యమునకును సేవ సేయవలయు నని కోరుచున్నాను.

యశోధవళుఁ డిట్లు చెప్పుచుండఁగాఁ జక్రవర్తి దీర్ఘవిచారనిమగ్నుఁడై యధోవదనుఁడై యుండెను. కొంతసేపటికాతఁ డించుక మొగమెత్తి "యశోధవళా! రాజకీయకార్యభారమును వహించుటకు నీవు నిజముగా సిద్ధపడియుంటివా?" అని ప్రశ్నించెను.

యశో—ఈదాసానుదాసుఁ డెన్నఁడైన మహారాజాధిరాజసమక్షమున నసత్యములాడియుండెనా!

చక్ర—యశోధవళా! ఏమని చెప్పుదును! ఈవిచారముచేఁ గొన్ని సంవత్సరములనుండి నాకు నిద్రయే పట్టుట లేదు. భవిష్యత్కాలచింతలచే నేనున్మత్తుఁడనై పోవుచున్నాను. మిత్రమా! నీవీసకలకార్యభారమును వహించి యున్నచో నేనిఁక నిశ్చయముగా నిశ్చింతుఁడనై యుండఁగలను.

యశో—(వినయముతో) ప్రభూ! ఇప్పుడంతయును నాకుఁ దెలిసిపోయినది. భవిష్యత్కాలచింతలచే మీహృదయమున కొకనిమిషమైనను విశ్రాంతి కలుగుట లేదు. ఎవ్వరును జెప్పకుండఁగనే యీసంగతి తెలియుచున్నది. కేవలభయముచేతనే రాజకీయోద్యోగులు మీసమక్షమునకు రాసాహసించుట లేదు. పను లన్నియు దుమ్మునఁ గలసిపోవుచున్నను మీయెదుటికివచ్చి మనవిచేయుటకు మీయధికారులలో నెవ్వనికిని ధైర్యము గలుగుట లేదు. జీవితమంతయును రాజకార్యనిర్వహణమునందే గడపుచున్న హృషీకేశశర్మవంటివానికైన మిమ్మేదైన నడుగుటకు ధైర్యము లేకుండెనన్నచో నితరులమాట చెప్పుట యెందులకు? ఇంతకంటె నాశ్చర్య మేమైననున్నదా? స్థానేశ్వరరాజు వెడలిపోయినతరువాత సార్వభౌముఁడు మరల నెన్నఁడును నగుమొగముతో నగపడనే లేదని నాగరికులు బహిరంగముగాఁ జెప్పుకొనుచున్నారు.

యశోధవళుఁ డిట్లు చెప్పుచుండఁగాఁ జక్రవర్తి దీర్ఘవిచారని మగ్నుఁడై యధోవదనుఁడై యుండెను. కొంత సేపటికాతఁ డించుక మొగమెత్తి "యశోధవళా! రాజకీయ కార్యభారమును వహించుటకు నీవు నిజముగా సిద్ధపడియుంటివా?" అని ప్రశ్నించెను.

యశో—ఈదాసానుదాసుఁ డెన్నఁడైన మహారాజాధిరాజన మక్షమున నసత్యములాడియుండెనా!

చక్రి—యశోధవళా! ఏమని చెప్పుదును! ఈవిచారమఁ చేఁ గొన్ని సంవత్సములనుండి నాకు నిద్రయే పట్టుట లేదు. భవిష్యత్కాలచింతలచే నేనున్మత్తుఁడ నైపోవుచున్నాను. మిత్రమా! నీవీసకల కార్యభారమును వహించి యున్నచో నేనిఁక నిశ్చయముగా నిశ్చింతుఁడనై యుండఁగలను.

యశో—(వినయముతో) ప్రభూ! ఇప్పుడంతయును నాకుఁ దెలిసిపోయినది. భవిష్యత్కాలచింతలచే మీహృదయమున కొకనిమిషమైనను విశ్రాంతి కలుగుట లేదు. ఎవ్వరును జెప్పకుండఁగనే యీసంగతి తెలియుచున్నది. కేవలభయముచేతనే రాజకీయోద్యోగులు మీసమక్షమునకు రాసాహసించుట లేదు. పను లన్నియు దుమ్మునఁ గలసిపోవుచున్నను మీయెదుటికివచ్చి మనవిచేయుటకు మీయధికారులలో నెవ్వనికిని ధైర్యము గలుగుట లేదు, జీవితమంతయును రాజకార్యనిర్వాహణమునందే గడపుచున్నహృషీకేశశర్మ వంటివానికైన మిమ్మెదైన నడుగుటకు ధైర్యము లేకుండెనన్నచో నితరులమాట చెప్పుట యెందులకు? ఇంతకంటె నాశ్చర్య మేమైననున్నదా? స్థానేశ్వరరాజు వెడలిపోయినతరువాత సార్వభౌముఁడు మరల నెన్నఁడును నగుమొగముతో నగపడనే లేదని నాగరికులు బహిరంగముగాఁ జెప్పుకొనుచున్నారు.

చక్రి—యశోధవళా! అందలిప్రత్యుత్తరమును సత్యమే-ప్రభాకరుఁడు పాటలీపుత్రమునకు వచ్చుచున్నాఁడని వినినంతనే నాకుఁ బిచ్చిపట్టినట్లయ్యెను. ప్రభాకరుఁడు పాటలీపుత్రమునం దున్నంత కాలమును నేనాతనిచాయవలె వెన్నంటి తిరుగుచునేయుంటిని. దాసునివలె నేనాతని తిరస్కారములను సహించితిని. ఏమని చెప్పుదును! గుప్తసామ్రాజ్యచక్రవర్తి నగు నేను కేవల మొకనీచసేవకునివలె నాతనికి శుశ్రూషలొనర్చితిని. అప్పుడు నేను సముద్రగుప్తునివంశజుఁడ ననుమాటనుకూడ మఱచిపోయితిని. ప్రభాకరుఁడు నాభాగినేయుఁ డనుమాటను మఱచితిని. ప్రతినిమిషమునందును నాతనియనుచరులు నారాజ్యమందలియధికారుల నవమానించుచుండిరి. అల్పకారణమాత్రమున నాతనిసేనలు నాసేనలపై డీకొనినవి. సైనికులు నగరమునఁ బ్రవేశించి యంతటను దోచుకొనఁదొడంగిరి. నిరపరాధులగు నాప్రజలను వారు నిర్బంధములపాలుగావించి బాధించిరి. వారి యత్యాచారములు దుస్సహములగుటచేఁ దుట్టతుదకు నాప్రజలు వారిపైఁబడి వారిశిబిరముల నగ్నిముట్టించిరి. యశోధవళా! ఆలౌహిత్యతీరమున యజ్ఞవర్మ నాప్రాణములను సంరక్షించుట యిట్టి యసహ్యంబులగు నత్యాచారములను సహించుటకేనా?

యశో—దేవా! నేనెల్లవిషయములను వినియుంటిని. ఇక్కడకు వచ్చి నేనెట్టివిచారవార్తలను వినియుంటినో, యట్టికష్టసమాచారముల నికనెన్నఁడును వినఁబోను. నేనువిన్నవిషయములవలననే నాకొకనవీనజ్ఞానోదయ మైనది. మహారాజా! ఈదాసున కాజ్ఞ యొసంగుఁడు! మరల సామ్రాజ్యభారమును నాతలపైఁ బెట్టుకొందును.

చక్రి—మిత్రమా! ఈభారమును నీవు వహించుట కింకను నాయనుమతి యేల? నేనిప్పుడే మంత్రిసభను సమకూర్పించెదను

యశో—వలను మహారాజా! సభలో నావశ్యకము లేదు. హృషీకేశ, నారాయణశర్మలను బిలిపించి మాటాడినఁ జాలును.

చక్ర—మంచిది. అట్లే కానిమ్ము—ఎవరక్కడ? ప్రతీహారీ!

దూరమున నున్న ప్రతీహారి యాపిలుపు విన్నంతనే సమీపించి యభివాదనము గావించెను. చక్రవర్తి యాతనిం గాంచి "వినయసేనుని దీసికొని రమ్ము" అని యాజ్ఞాపించెను.

ప్రతీహారి నమస్కరించి వెడలిపోయెను. కొండొకసేపటిలో వినయసేనుఁడు వచ్చెను. సార్వభౌముఁ డాతనిం గని "వినయసేనా! హృషీకేశశర్మను, నారాయణశర్మను, హరిగుప్తుని రెండుజాములవేళకు రాజభవనమునకుఁ దీసికొని రమ్ము!" అని యుత్తరువు చేసెను.

వినయసేనుఁడు "చిత్తము" అని యభివాదనము చేసి వెడలి పోయెను. సార్వభౌమయశోధవళు లచ్చటినుండి నగరునకు వెడలి పోయిరి.

పదునాఱవప్రకరణము

పాటలీపుత్రపురాతనరాజభవనమునకుఁ జుట్టును నత్యగాధం బగు కందకము కలదు. అది యెల్లప్పుడు గంగాజలముచేఁ బూర్ణీభూతమై యుండును. చైత్రవైశాఖమాసములలోఁ గూడ దానియందు నీరు నిండియుండును. మనకథాకాలమున వర్షర్తువునందు మాత్రము దానిలో నీరుండి వేసవికాలమున దానియడుగుభాగము వనలతాదులచేఁ బరివ్యాప్తమగుచుండెను. ఆకందకములోనికి నీరువచ్చుకాలువ చాల కాలమునుండి బాగుచేయింపకుండుటచే నది యిసుకచేఁ గప్పఁబడి పోయెను. వర్షాకాలమున మాత్ర మాకాలువనుండి యెట్లో నీరు ప్రవహించి యాకందకమునఁ జేరుచుండును. కందకముపై నున్న తటము

గూడ బాగుచేయింపక పోవుటచే నందందు శిథిలమై కొన్నికొన్ని చోటులఁ బడిపోయి యుండెను. నగరుచెంగటితటము నీలశిలలచే నిర్మింపఁబడినది గాని, నగరతటముమాత్రము మ్రానిపలకలచేఁ గట్టఁబడుట వలన నొక్కొక్కచో నది బొత్తుగనే యగపడకుండఁ బోయెను. పైని మ్రానియావరణము కుళ్ళి లోపలిమన్నంతయును బయటికి వచ్చి యగడ్తలోఁబడుటచే నగడ్తయు నందందుఁ బూడిపోయియుండెను తటముపై నిబిడారణ్యము వ్యాపించి యుండెను. నగరమునందలి జనులు పట్టపగలుగూడ నచ్చటికిఁ బోవుటకు భయపడుచుండిరి.

ఏనాఁటియుదయమున యశోధవళుఁడు తాను రాజకార్యభారమును వహించెదనని చక్రవర్తికి మనవి చేసియుండెనో, యామఱునాఁటి యుషఃకాలమునకుఁ బూర్వము రాజభవనప్రాంతతటంబున మూవురుబౌద్ధభిక్షులేమియో సంభాషించుకొనుచుఁగూర్చుండిరి. ఇంకను బాగుగ వెలుఁగు రాలేదు. అప్పుడు వారికొకింతదూరమున వృక్షచ్ఛాయాంధకారమునం దొకభిక్షువు నిలిచియుండెను. ఆవనమునందచ్చటచ్చట ననేకభిక్షువులు నిలిచి ద్వారపాలకకృత్యమును నిర్వహించుచుండిరి.

కూర్చుండి మాటలాడుచున్న మూవురుభిక్షులలో నిరువురు మాప్రియపాఠకులకుఁ బరిచితులే. తృతీయభిక్షువు కపోతికసంఘారామమునకు మహాస్థవిరుఁడగుబుద్ధఘోషుఁడు. బంధుగుప్తుఁడు, శత్రుసేనుఁడు, బుద్ధఘోషుఁడు యీముగ్గురును నుత్తరప్రదేశములలోని బౌద్ధసంఘనేతలు.

బుద్ధఘోషుఁడు—మన మిన్నాళ్లవఱకును బుద్ధభగవానుని నామస్మరణము చేయుచు సంఘోన్నతికొఱకుఁ బాటుపడుచున్నారము. ఈప్రయత్నమునందు మనకింతవఱకు సామాన్యముగా నెట్టి విఘ్నములును గలుగుటలేదు. ఇప్పుడుమాత్ర మనేకవిఘ్నపరంపరలు

తటస్థింపనున్నట్లు పొడకట్టుచున్నది. రోహితాశ్వదుర్గాధిపతి యశోధవళదేవుఁ డిచ్చటికి వచ్చుచున్నాఁ డనుసంగతి యాతనిరాకకు ముందే మనకుఁ దెలియవలసినది. ఏమి యీమందవ్యాపారము! కరూశదేశమునందలిసంఘస్థవిరు లందఱును నిశ్చింతులై నిద్రించుచున్నారని తోఁచుచున్నది. యశోధవళునింబోలినమహాపరాక్రముఁడును, సుదక్షుఁడు నైనసంఘవైరియెడల వారింతనిర్లక్ష్యభావముతో నుండుట మహాశ్చర్యముగా నున్నది.

శత్రుసేనుఁడు బుద్ధఘోషునిమాటలను సావధానముగ నాలకించి “మహాస్థవిరా! ఈవిషయమునఁ గరూశదేశములోనిసంఘస్థవిరులయందు విశేషదోష మున్నదని నాకుఁ దోఁచుట లేదు. పుత్రిమరణానంతరమున యశోధవళుఁడు విచారోన్మాదగ్రస్తుఁడై యుండెను. ఆతఁడట్లే దుర్గమునఁ గాలక్షేపము సేయుచుండెను. ఎనుబదియేండ్లపండువంటిముదుసలి యీవిధముగా నొక్కసారి తరుణుఁడగుననియు, దారుణ్యమునందలియాతనిశౌర్యమును, సర్వశక్తులును నాకస్మికముగా నిట్లు విజృంభించు ననియు నెవ్వరికైనఁ గలనైనఁ దెలియుట యసంభవము గాదా? నిశ్చయముగా నట్లూహించుట యసంభవము. ఇట్టియుద్దేశముతోనే యీసంఘస్థవిరు లందఱును నిశ్చింతులై యుందురు.

బుద్ధఘోషున కీమాటలు సమంజసములుగాఁ దోఁచుట లేదు కాఁబోలును! ఆతఁడప్పుడు తీవ్రస్వరముతో “వజ్రాచార్యా! బౌద్ధసంఘమున ననేకసంవత్సరములనుండి వ్యాపించియున్నదుర్దినము లన్నియును దొలఁగిపోయి శుభదినోషఃకాలమైనప్పుడు జాగరూకతను, ఆలోచనను ద్యజించి యూరక నిద్రించుచుండుట మహామూర్ఖతయు, నదూరదర్శితయు, నపచారరము నని చెప్పుటకు సందేహ మేమున్నది? విశ్వకల్యాణకార్యభారమును నెత్తిపైఁ బెట్టుకొన్నవా రిట్లు

నిర్లక్ష్యభావముతో మెలంగుట యుచితము గాదు. ఇప్పట్టున నీకరూశదేశసంఘస్థవిరులు మహాపరాధ మొనర్చి రనియే నాయభిప్రాయము. వారియపరాధముం గూర్చి యెన్నటికైనను జర్చింపక విడుచువాఁడను గాను. కాని యిప్పుడు సమయముగాదు. ముందు రాఁబోవుకష్టముల నివారించు నుపాయమును శోధించుటయే మనకిప్పుడు ప్రధానకర్తవ్యమై యున్నది.

వజ్రి—మహాస్థవిరా! మీయాలోచన యుక్తియుక్తముగనే యున్నది.

బుద్ధ—యశోధవళుఁ డిప్పుడు తనదీర్ఘకాలమోహనిద్రనుండి జాగరితుఁడై పాటలీపుత్రమునకు వచ్చి రాజసభలోఁ బ్రవేశించి యున్నాఁడు. ఇప్పుడు చక్రవర్తియు నాతఁడు నొక్కచోటనే యున్నారు. ఆతఁడు వచ్చువార్త యొక్కించుక ముందుగనే మనకుఁ దెలిసి యున్నయెడల నెన్నియో యుపాయములను బన్ని యాతఁడు సార్వభౌముని఼ గలసికొనకుండునట్లు చేసి యుందుము. ఫలసిద్ధి యెట్లైనను బ్రయత్నములు చేసియే తీరుదుము. యశోధవళుఁడు మనకు సామాన్యశత్రుఁడు గాఁడు. ఈసంగతి నేను మీకుఁ జెప్పనక్కఱలేదు. ఆతని కార్యదక్షత మన మెఱుంగనిది గాదు. అతఁ డిప్పుడొక సామాన్యకారణమునఁ బాటలీపుత్రమునకు వచ్చియుండలేదు. ఈసంగతి బాగుగ జ్ఞప్తియందుంచుకొనుఁడు! రాజధానిలోఁ బ్రవేశించినతరువాతఁ బ్రస్తుతము సామ్రాజ్యము నావరించియున్న భయంకరవ్యవస్థలును, గల్లోలములును నాతనికి గోచరములు గాక మానవు. ఈసంగతులన్నియు గ్రహించినతరువాత నాతఁడు స్వస్థముగా నూరక కూర్చుండువాఁడు మాత్రము కాఁడని నాకు బాగుగాఁ దెలియును. ఇప్పుడు సార్వభౌమ, యశోధవళులేయేవిషయములం గూర్చి యేమేమి యాలోచనలఁ గావించుచుండిరో తెలిసికొనుటకు మనకెట్టిమార్గమును లేదు. వజ్రి

చార్యా! సంఘస్థవిరా! మీరింతటినుండి యతిజాగరూకులై మెలంగవ
లయును. లేకున్న మనకు సర్వనాశనము గలుగక మానదు. యశోధ
వళుఁ డీనగరమున కెట్లు వచ్చెనో యీవిషమై యెవ్వరైన నేమైన విని
యుంటిరా ?

శత్రు—కేవలము వినుటయే గాదు. ఆతఁ డీనగరమునఁ బ్రవే
శించుట నేను ప్రత్యక్షముగనే చూచియున్నాను.

బుద్ధ—(ఆశ్చర్యముతోఁ) నీవు ప్రత్యక్షముగనే చూచితివా ?
అది యెట్లు ?

శత్రు—నేను శశాంకు నెటులైనఁ జంపుటకై రాచనగరుచు
ట్టును దిరుగుచుంటిని. తుదకు శశాంకుఁడు నా కగపడియెను. నేను
గంగాద్వారముకడ నిలిచి శశాంకునకుభయము గల్పించుటకై యాతి
నిభవిష్యద్వృత్తాంతము నత్యావేశముతోఁ జెప్పుట కారంభించి
తిని. నేనట్లు చెప్పుచుండఁగా నదీతీరమునందలి యొకనౌకనుండి యొక
వృద్ధుఁడు నొకతరుణుఁడును దిగుచున్నట్లు నాకగపడియెను. వారట్లు
దిగి యించుక సమీపించినంతనే నేను యశోధవళుని గుర్తించితిని.
తోడనే నేనొకవృక్షశాఖ నాశ్రయించి యాకస్మికంబగునాపత్తు
నుండి నాప్రాణసంరక్షణము గావించుకొంటిని.

"అటుపిమ్మట నేమి జరగినదో మీరెవ్వరైనఁగను పెట్టితిరా ?"
అనిబుద్ధఘోషుఁడు చింతాక్రాంతహృదయముతోఁ బ్రశ్నించెను.

ఇంతవఱకును నిస్తబ్ధుఁడై కూర్చుండియున్న బంధుగుప్తుఁ డప్పు
డు" ఆఁ! కొన్నిసంగతులు తెలిసినవి. గంగాద్వారమునొద్దనే యాతఁడు
శశాంకుని సందర్శించెను. వారిరువురకును బరిచయ మయ్యెను.
అప్పుడు యువరాజు సభామందిరమున కాతని దీసికొనిపోయెను.
యశోధవళుఁ డింకను సజీవుఁడై యున్నాఁడను సంగతిని జక్రవర్తి మొ
దట విశ్వసింపలేదు. క్రమముగా యశోధవళునసభాసు మందిరమునం

బ్రవేశించుటఁ గాంచి తోడనే సార్వభౌముఁడు వేదికనుండిక్రిందికి దిగి యెదురుగఁ బోయి యాతనిం గౌఁగిలించుకొనియెను. అప్పుడు యశోధవళుఁ డందఱియెదుటను సభలో నిలువఁబడి నామనుమరాలిపోషణమునకై పిడికెడన్నమును మిమ్ము యాచింపవచ్చితి నని సార్వభౌమునకు మనవి చేసికొనియెను. ఈసంగతు లన్నియును వాడలోనున్నమన గూఢచారులవలనఁ దెలియవచ్చినవి.

ఆలోచనాధీనమానసుఁడై యాలకించుచున్న బుద్ధఘోషుఁ డప్పుడు " సరే, మంచిది. సార్వభౌమయశోధవళుల కింకను నెట్టిసంభాషణము జరిగినదో యెవ్వరికైనఁ దెలియునా ?" అని ప్రశ్నించెను.

శత్రు—లేదు. ఆవిషయమై యేమియుఁ దెలియ లేదు. యశోధవళుఁ డంతఃపురముననే నివసించి యుండె ననియు, నచ్చటనే యాతని భోజనాదికవ్యవస్థలు గావింపఁబడియెననియుమాత్రమే తెలియవచ్చినది. యశోధవళుఁడు మహాదేవియుండునంతఃపురమునం దుండుటచే నాతనికి విషప్రయోగముం గావించుట మనకసాధ్యమైనది. ఆతఁడు వచ్చినతరువాత మంత్రులయాలోచనసభగూడ జరిగినది. కాని యందేమేమియేర్పాటు లయ్యెనో యెవ్వరికిని దెలియ లేదు. ఏమనిన—ఆఘాతుకుఁడు—ఆదుష్టవినయసేనుఁడు —ఆవేళ సభాగృహద్వారమునొద్ద స్వయముగనె కావలియుండెను.

బుద్ధ—అట్లయినచో రాచవాడలో నిప్పుడున్నచారులకంటె రెట్టింపుమంది నుంచవలయును. ఇప్పుడున్న వారికంటెను నధికవిశ్వాసపాత్రులనే యికార్యమున నూతనముగ నియోగింపవలయును.

బంధు—సరే. ఇటుపిమ్మట మంత్ర్యాలోచనముల విషయమై యేమి చేయవలయును ? నేనిప్పుడు వంగదేశమునకుఁ బోవలసియున్నది.

బుద్ధ—వంగదేశమునకా ? ఏల ?

బంధు—(విషణ్ణుఁడై) ఆతనికుమారుని జంపినవాఁడను నేనే యని యశోధవళున కిదివఱకే తెలిసి యుండును. కీర్తిధవళుఁడు శస్త్రవిహీనుఁడై యున్న సమయమునఁ గుక్కనుం బోలె నేనతినిర్దయుండనై యాతనివధించినసంగతి యశోధవళుఁడు గ్రహించినప్పుడాతఁ డెట్టిప్రతీకారమును గావించుటకుఁ బ్రయత్నించునో యెవ్వరూహింపఁగలరు? ఆతనితీవ్రస్వభావము మీ రెఱుంగనిది గాదు. ఆతనిప్రతీకారేచ్ఛ యెంతభయంకరమైనదో మనకందఱకును బాగుగఁ దెలిసినవిషయమే. మహాస్థవిరా! నేనిప్పుడు డీపాటలీపుత్రమునం దుండుట క్షేమము గాదు. నేనిప్పుడే వంగదేశమునకుఁ బోయెదను; అచ్చట నిశ్చింతుఁడనై యుండి నాయావశ్యక కార్యములను నిర్వహించుచుండెదను.

బుద్ధ—(తీవ్రస్వరముతో) సంఘస్థవిరా! నీకిప్పుడు మతిచాంచల్యము గలుగలేదుగద! ఈఘోరసంకటసమయమున నీవీపాటలీపుత్రమును విడిచి పాఱిపోవుటయా? నీయొక్కని ప్రాణముల కాసించి సర్వసంఘకార్యములను ధూళిపాలు చేయ దలఁచితివా? చీచీ! సిగ్గు సిగ్గు! మృత్యువు తప్పనిదే యైనయెడల నీవీసంఘకార్యనిర్వాహణము నందే ప్రాణములను విసర్జించుట మేలైనపని. నీపూర్వులగు నెందఱో సంఘస్థవిరులును, మహాస్థవిరులును, భిక్షులును సంఘమునకై సంతోషపూర్వకముగాఁ దమతమప్రాణములను సమర్పించి యున్నారు. అట్లు సమర్పించుటవలననే సంఘమింతవఱకును సజీవమై యుండుట కవకాశము కలిగినది. బంధుగుప్తా! నీయం దింతటిమృత్యుభయవిహ్వలభావము నేనిదివఱకెన్నఁడును జూచియుండలేదు. ఇప్పుడు క్రొత్తగా నీకిట్టిమరణభయ మేల కలుగుచున్నది?

బంధు—(కంపితస్వరముతో) సామాన్యమైనమరణమునకు నేనింతగా సంచలించువాఁడను గానని మీకుఁ దెలిసినవిషయమే. కాని—ఆయశోధవళునిచేతిమరణము—అది యతిదారుణమైనది!

ఆమరణయాతన యతిఘోరమైనది. సహస్రకుఠారాఘాతములవలనం గలిగినమరణమైనను దానికంటెసుఖకరమే—మహాస్థవిరా ! అందుచేతనే నేనిప్పుడు వంగదేశమునకుఁబోవుట. అట కేఁగి నిశ్చింతుఁడనై యింతకంటె నధికముగా సంఘసేవ సేయుదును; దూతలవలనను, నుత్తరములవలనను నేనెల్లసంగతులను జాగరూకుఁడనై తెలిసికొనుచు, సంఘకార్యముల నుచితరీతిని నిర్వహించుచుండెదను.

బుద్ధ—(దృఢస్వరముతో) అట్లు చేయుట యసంభవము! అశక్యము ! బంధుగుప్తా! ఇట్టికష్టసమయమునఁ బ్రాణముల కాసించి సంఘమును త్యజింపఁ దలఁచితివేని నీయిచ్చవచ్చినచోటికిఁ బోయి బ్రదుకుము !

బంధుగుప్తుఁ డధోవదనుఁడై యించుక సేపూరకుండి "మహాస్థవిరా ! ఈవిషయమున మనలో నెవ్వరిదోషమును లేదు. మనమందఱము నదృష్టచక్రబద్ధులమై యున్నాము. నాయదృష్ట మెట్లున్నదో యట్లె యగుఁ గాక ! సరే. నేనిక్కడనుండి పోవలయు నను నుద్దేశమును మార్చుకొంటిని" అనియెను.

ఆసమయమునఁ బూర్వదిక్కున నారింజపండురంగుగల తేజఃపటలము వ్యాపించుచుండెను. క్షణకాలములో నొకభిక్షు వచ్చటికేతెంచి "దేవా ! ఇప్పు డీస్థలము మిగుల నపాయకరమైనది. సూర్యోదయమగువఱకు నిట నుండుట మనకవకాశము లేదు. అప్పుడే మార్గమున జనసంచారమున కారంభ మైనది" అని చెప్పెను.

తత్క్షణమే యామువ్వురును దత్తరముతో లేచి వేర్వేఱుత్రోవలననుసరించి వెడలిపోయిరి. అప్పుడు బుద్ధఘోషుఁడు వారియొద్ద సెలవు గైకొనుచు" బంధుగుప్తా ! నీవింతగా భయపడవలసినపని లేదు. యశోధవళునివలన నీకణుమాత్రమైన నరిష్టము కలుగకుండునట్లు నాశక్తికొలఁదిఁ బ్రయత్నములం గావించెదను. ఇఁకమీఁదట శిథి

ందేవాలయపాతాళగృహమునం దక్క నిఁక నచ్చటనుమనయాలోచన సభ చేరఁగూడదు" అని నిశ్చయించి బుద్ధఘోషుఁడు వెడలిపోయెను.

ఆతఁడు పోయినతరువాత శత్రుసేనుఁడు మందహాసముతో "బంధుగుప్తా! భాగ్యచక్రమునందు నీకు విశ్వాసము లేదు గాదా?" అనియెను.

బంధుగుప్తుఁ డేమియు నుత్తర మీయలేదు. ఆతఁ డధోవదనుఁడై మౌనముతో నడచుచుండెను.

పదునేడవ ప్రకరణము

"చెలీ! తరళా! నిన్నటిదినమంతయు నగపడలేదేమే? ఎక్కడకుఁ బోయితివి? నీకొఱ కెన్నియోసారులు మార్గమునఁ బ్రతీక్షించితిని. కాని నీజాడయేది? నిమిషనిమిషమునకు నీవువత్తువని యెదురు చూచి విసిఁగిపోయితినే! రాత్రియంతయుఁ గన్నులు మూఁతలుపడనే లేదు! నీకు దయ యేది? రాత్రి నిద్దురపట్టకుండుటచే శయ్యపై నిటునటుఁ బొరలుచుఁ దపించి మూఁడవజామున లేచి కిటికీయొద్దకుఁ బోయి యెంతయో సేపు నిలిచితిని. అమ్మకుఁగూడ రాత్రి నిద్రలేదు కాఁబోలును! నేనట్లు నిలిచియుండుట నామె చూచి 'అమ్మా! అచ్చటనిలిచియుంటివేమి? నిద్రపట్టుట లేదా?" అని ప్రశ్నించినది. "నేనిప్పుడే లేచితిని; ఉక్కగా నుండుటచేఁ గిటికీయొద్దకు వచ్చినిలిచితిని" అని నే నుత్తర మిచ్చితిని. తరళా! నీవు రాలేదేమి?"

అని యీవిధముగా నొక్కటేప్రశ్న నెన్నివిధములుగా నడిగి నయామె సంపూర్ణయౌవనవిలసిత యగు నొకరమణీమణి; ఆమెప్రాయ మిరువదియేండ్లకుఁ గొంచెము తక్కువగనే యుండును. ఆమె నెమ్మనికాంతి తప్తకాంచనముం బోలి యించుక పచ్చగా నుండెను.

ఆమెసర్వాంగకములును సుందరములై సంపూర్ణములై యుండెను. సంక్షేపముగఁ జెప్పవలయును ననిన నారమణీమణి యసమానసుందరీమణి యని చెప్పినఁ జాలును. ఆమెంబోలినసౌందర్యవతి యీలోకమున దుర్లభురాలని చెప్పుట యతిశయోక్తి కానేరదు.

తరళాదేశానందులను మన మేనాఁడు విడిచిపెట్టితిమో యామఱునాఁటిసంగతి యిది! జాముపొద్దెక్కినది. ఇంతలోఁ దరళ యామందిరమునకు వచ్చి తనయజమానునితనయను సందర్శించెను. తరళ తనకన్నులఁ బడినంతనే యాసుందరీమణి ప్రశ్నించినపలుకుల నింతకుమున్దే వినిపించియుంటిమి.

ఆకాంత యదేమాటగా నట్లు ప్రశ్నించుట నాలకించి తరళ నవ్వుచు "చెలీ! నిన్నటిదినమున నేను నాప్రియుని జూడఁబోయితిని. అక్కా! నేను నీదాసీత్వమును జేయుచు నాకుఁగూడ నొకప్రియతముని సంపాదించుకొంటిని" అనియెను.

ఆసుందరి వక్రదృష్టితోఁ దరళం గాంచి "అక్కయ్యా! చావు; పొమ్ము!—కార్యమేమిచేసి వచ్చితివే?" అనియెను.

తర—(నవ్వుచు) ఏమిచేసితిని? మనసునకు నచ్చినక్రొత్తప్రియుఁడు లభించినప్పు డందఱుయువతులు నేమి చేయుదురో నేను నదియే చేసితిని! రేయంతయును గుంజవనమునఁ గడపి యరమోడ్పుగన్నులతో నిప్పుడే యిక్కడకు వచ్చితిని. మీరు గొప్పవారు! ఇదేమి యన్యాయమో గాని నిజము చెప్పినచో విసిఁగి కొందురు. చెలీ! నేను నిన్నతిసరళముగా నడుగుచున్నాను. కోపగింపకుము! వినుము—మావంటినిరుపేదలశరీరములు మాంసాస్థులచే నిర్మింపఁబడినవి కావా యేమి? మా కెట్టికోరికలు నుండఁగూడదా యేమి? మే మెట్టి వినోదవిషయములను సంతోషముతోఁ జూడఁగూడదా? అక్కయ్యా! దేవుఁడు సృష్టించినప్రేమ యంతయును మీగొప్పవారికొఱకే కాఁబోలు

నేమి? మార్గమున వచ్చుచుండఁగా భాగ్యవశమున నామనసువచ్చిన శ్యామసుందరుఁ డొకఁడు నాకు లభించినపుడు నేనాతని ధిక్కరించి రావలసినదా? నావయసుమాత్ర మేమంత యధికమై పోయినది? ఇంచుమించుగా నీకంటె నొకటి రెండేండ్లు పెద్దదాననై యుందునే మో! ఇంతేగద! చూడుము! నాపన్నొక్కటైన నూడిపోయినదా? నాకుటిలకుంతలముల నీలకాంతు లించుకైనను బలుచఁబడినవా?

సుందరి—(కృత్రిమకోపముతో) చాలును! పాపాత్మురాలా! యమమందిరమునకుఁ బ్రయాణమై పొమ్ము! ఆపాడుమృత్యుదేవత నిన్ను మఱచియేపోయినదేమి? నీకొకవల్లభుఁడు గూడ దొరకినాఁడా? అట్లయినచో ఆభాగ్యము వదలుకొని మరల నిక్కడ కేల వచ్చితివే? ఆసంతోషవార్త నాకుఁ దెలుపవచ్చితివా?—తరళా! నీపరిహాసములు చాలును! ఇఁకవలదు. లేవే! చెలీ! నీవిక్కడ కెట్లు వచ్చితివే? ఏమి చేసికొని వచ్చితివో? చెప్పుము! ఇట్లాలసించినకొలఁది నాకేమియుఁ దోఁచుట లేదు.

తర—ఎట్లు వచ్చితినో నాకును దెలియదు. ఎందులకు వచ్చితినోమాత్రము తెలుపఁగలను. నీకొఱకే వచ్చితిని. అక్కా! నిజముగా నీకొఱకే—ఇంతయాత్రపడియెద వేల? కొంచెము లోపలికైనఁ బోవలదా?

సుందరి మాఱుమాటాడకుండఁ దరళ భుజముపైఁ దనుభారమును మోపి యామెను వెంటఁబెట్టుకొని లోనికిఁబోయెను తరళయు నామెతోఁ గలసి రెండవయంతస్తునం దొకగదిలోఁ బ్రవేశించి తలుపు మూసి గొళ్లెము పెట్టెను.

అప్పుడు సుందరి తరళకంఠమును గౌఁగిలించుకొని యత్యుత్కంఠతో " దర్శనము లభించినదఁటే? " అనియెను.

తర—ఆ! లభించినది.

ఇఁక నేమియు ననక సుందరి తరళను దనవక్షమునం జేర్చుకొని యామెమోమును ముద్దుపెట్టుకొనియెను.

తరళ—(నవ్వుచు) తుదకు నేఁజేసినయుపకారమునకుఁ బురస్కారమింతేనా?

సుంద—(మందహాసముతో) ఇంతకంటెను యోగ్యమగు బహుమానము నిన్ను దర్శించిన నీశ్యామసుందరుఁడు వచ్చి యీయఁగలఁడులే!

తర—అక్కయ్యా! నాశ్యామసుందరుఁడా? కాక నీలోకమోహనుఁడా?

సుంద—ఎంతవాచాటవే! నీశ్యాముఁడే—రాత్రి నీవెవ్వని దర్శించుటకుఁ బోయియుంటివో యాతఁడే.

తర—(పకపకనవ్వుచు) అలాగా? వాఁడు నాకేమిబహుమానమీయఁగలఁడక్కా! అబ్బే! వాఁడు ముసలికోఁతి! రాత్రి వానిమెడకొకగొలుసును దగిలించి వచ్చితిని. ఇంకొకనాఁడుపోయి నాకుఁగావలసినట్లు వానిచేత నైనమాటల నాడించివత్తును.

సుంద—ఎన్నిమాటలాడుచుంటివే తరళా! ఏమిజరిగినదో యొక్కమాటలోఁ జెప్పఁగూడదా? నిజముగా నీవక్కడకుఁ బోయి దర్శించితివా? నిజముగా—నిజముగా నేనా తరళా?

తర—(మెడద్రిప్పుచు) నిజముగాదక్కయ్యా! అసత్యము! తెలిసినదా? మావంటిసిరుపేదలకు నిజమాడు టెట్లు తెలియును? పరమేశ్వరుఁడానిజమును భాగ్యవంతులపాలు చేసివైచినాఁడు.

సుందరి తరళచేయి పట్టుకొని కిటికీవఱకును దీసికొనిపోయి యటనొకయాసనమునఁ గూర్చుండఁజేసి తాను నొకపీఠమునం దాసీనయయ్యెను. అప్పుడు తరళ తనలోఁ దానేమియో గొణుఁగుకొనుచుఁ

గూర్చుండెను. అందుచే సుందరి కోపించి తరళచెంపపై నొకపెట్టు పెట్టెను. ధూర్తయగుతరళ యాప్రహారణమును సేవించియు నోర్చి ముక్తకంఠయై నవ్వుచు నెక్కింతసేపైనతరువాత "సరేమఱి.—అక్కయ్యా! ఇంకను నేను చెప్పవలసినదేమున్నది?" అనియెను.

సుందరి కోపాభిమానపూరితహృదయముతోఁ దటాలున నవ్వలిమొగమై కూర్చుండెను. ఇప్పుడుమాత్రము తరళ యామెమనసును గరఁగింపఁ బ్రయత్నించెను. ఆమె సుందరియెదుటికి వచ్చి చెమ్మచెంత మోమునుఁ జేర్చి "అక్కయ్యా! ఓయామాధికాదేవీ? ఈపేదచెలిపై నింతయలుక యేటికమ్మా? బాగుగాఁ గూర్చుండుము! ఇటు తిరుగుము. నావంక నించుకంత మొగము త్రిప్పఁగూడదా? ఇదిగో! ఈసారి తప్పక నిజమైనసంగతిని దెలిపెదను. చూడుము! నావంకఁ జూడుము!" అనియెను.

ఆమాటలకు సుకుమారిణియగుయామాధికహృదయము ప్రసన్నమయ్యెను. అప్పు డామె యెప్పటివలెఁ దరళవైపునకుఁ దిరిగి కూర్చుండెను. అప్పుడు తరళ మధురస్వరముతో "చెలీ! నిజముగా నేనావసుమిత్రులను దర్శించితిని. ముందుగా నేను వారి తండ్రియొద్దకుఁ బోయి" శ్రీమద్వసుమిత్రులయొద్దఁ గొన్నిరత్నములను బరీక్షించుటకై బంపినారు—అవి యెట నున్నవో మీకుఁ దెలియునా?" అనియడిగితిని. ఈప్రశ్నకావృద్ధుఁ డాశ్చర్యపడి" నాకాసంగతి యేమియును దెలియదు. వసుమిత్రుఁడు నాతో నీవిషయముఁగూర్చి యేమియును జెప్పలేదు." అనియెను. చూడఁగా నావృద్ధుఁడు మంచివాఁడే—ఆతఁడు కాపట్యము నెఱింగినవాఁడు గాఁడు. ఆతనికి సహజముగనే నామాటలపై విశ్వాసము గలిగినది. అనుమానమించుకంతయును లేక తత్క్షణమే యాతఁడు నాకు వసుమిత్రుఁ డున్నప్రదేశమును దెలియఁజెప్పి యచ్చటికిఁ బోయి

తెలిసికొని రమ్మని నాకు సహాయముగా నొక సేవకు నిచ్చి పంపించెను. తలఁపనితలంపుగా నిదియొకవిఘ్నము తటస్థించినదని యనుకొనుచు నెట్లో యుక్తిచేసి తటాలున నాయింటినుండి తప్పించుకొని బయటఁ బడితిని. క్రమముగా నేను వసుమిత్రుఁ డున్న ప్రదేశమునకుఁ బోయితిని. నగరమునకు బాహ్యమునం దున్న యొక్క పాతవిహారమునం దాతఁ డుంపఁబడియెను. ఆతఁడు సంపూర్ణముగాఁ గారాబద్ధుఁడుగాఁడు; గాని యటనుండితప్పించుకొనిపోవుట కాతని కవకాశము లేదు. విహారమందలిభిక్షులలో నెవ్వరో యొక్క రెల్లప్పుడు నాతనిఁ గాచుకొని యుందురు. కావలయునని యే వారిట్టి కట్టుదిట్టముల నేర్పఱచి యున్నట్లు కనఁబడుచున్నది—" అనియెను.

ఇంతవఱకును దీర్ఘశ్వాసములను విడుచుచుఁ దలవంచుకొని కూరుచుండినయూధిక యప్పుడించుక తలయెత్తి "చెలీ! తరళా! ఆతఁడు నీతో నేమైన మాటలాడెనఁటే?" అనిప్రశ్నించెను.

తర.— నేను వసుమిత్రునితో నెన్నియో మాటలాడితిని.

యూధి—(ఆత్రముతో) ఏమేమిమాటలాడితివి?

తర—నీవు నాకుఁ జెప్పినసంగతులన్నియును దెలిపితిని. అంతే గాక యింకను నూఱుమాట లెక్కువగా నాతనితోఁ జెప్పి వచ్చితినమ్మా!

యూధి—ఆలాగఁటే! ఏమేమిమాటలాడితివో చెప్పవా?

తర—నేనంటినిగదా — సాగరదత్త శ్రేష్ఠితనయయగుయూధికాదేవికి నేను దూతికనై—అయ్యో! కోపపడకమ్మా!

యూధిక యప్పుడు తరళపైఁ దీవ్రదృష్టిప్రసారముం గావించుచుండెను.

తర— చెలీ! కోపింపకుము— "యూధికా దేవికి దూతికనై నేను మీదర్శనమునకు వచ్చియుంటిని. మీవియోగతాపముచే మా యూధిక దినదినమును శుష్కించిపోవుచున్నది! కొలఁదికాలములోనే యానవకోమలకుసుమము వాడి వరుగై నేలఁ గూలుననుటకు సందేహమేమున్నది?" అని చెప్పితిని— ఇంకను నేమంటినో నీకుఁ దెలియునా?

యూధి—ఏమంటివి? చెప్పుము!

తర—చెప్పెద నుండుము!" అమ్మృదుకుసుమము భూపతితము గాఁ గూడదని మీదయార్ద్రహృదయమునకుఁ దోఁచినచో — మీకిష్టమున్నచో — మాయూధిక వసంతర్తువునందలి వెన్నెలరాత్రివేళ సుందరపురుషరూపమును ధరించి—"

యూధికసుందరవదనమండల మారక్తమయ్యెను. ఆమె యించుక కోపమును నటించుచు "సరే! తరువాత నేమి జరిగినదో చెప్పుము!" అనియెను.

తర—(నవ్వుచు) ఇదిగో! అక్కా! నీరసికత్వమంతయు నిప్పుడేమైపోయినదమ్మా? కేవలము వెఱ్ఱిదానవై పోవుచున్నావేమి?

యూధి—(దీనస్వరముతో) చెలీ! నీపాదములకు నమస్కారము! పరిహాసముల నొకప్రక్క నుంచుము, ఆయన నీతో నేమి చెప్పిరో చక్కఁగా వినిపింపుము.

తర—వారితో నేనాడినమాటల నుగూర్చి ముందుగాఁ జెప్పనిచ్చెదవా? నేను వారిని దర్శించినంతనే ముందుగా "మహారాజా!"అని సంబోధించితిని. ఔను. వారిప్పుడు మఠమునందు భిక్షువులై యున్నారు. కావున వారి నట్లే పిలువవలయును. నేనప్పుడు "మహారాజా! మీజీవిత మంతయు మీరీవిధముగనే గడపఁ దలఁచితిరా?" అని ప్రశ్నించితిని. అందుల కాయన "అట్లే తోఁచుచున్నది. ఔను!" అని ప్రత్యుత్తరమిచ్చిరి.

యూధిక యోష్ఠాధరములు సంచలింపఁదొడంగెను.

తర.—చెలీ! చూచినతోడనే నేనాతని గుర్తింపఁజాలకపోయితిని సుమా; ఆతనియుత్తమాంగమున నళినీలంబు లగు నెఱికురులు లేవు. ఆతనివస్త్రంబులయందు నీటుగోటుల జాడయే లేదు. ఇట్టిస్థితిలో నాతని నెవ్వ రానవాలుపట్టఁగలరు? ఆతనిశిరస్సు ముండితమైయున్నది. ఉపవాసములచే నాతనిమొగము వాడి వెలవెలపోవుచున్నది. మలినంబు లగు కాషాయవసనంబులచే నాతనిసుకుమారదేహ మాచ్ఛాదింపఁబడియున్నది! మొదటినుండి తుదివఱకు నాతనియందు మార్పే యగపడుచున్నది. అక్కా! ఆతనియాకారమే మాఱిపోయినది. ఆతని మునుపటిపేరుఁగూడ మార్చివైచిరి. వసుమిత్రుఁ డనునామము నాధారముగఁ జేసికొని వెదకినచో నిప్పు డాతనిజాడ యెట్లు తెలియును? ఆతఁ డెవ్వఁడో తెలియుటకూడ నసాధ్యమైపోయినది. ఆతనినూతననామ మేమియో తెలిసినదా?

యూధిక యధోవదనయై యేమియు మాటాడక కూర్చుండియుండెను. తలను పైకెత్తి తరళవంక నొకసారి చూచుటకైనను నామెకు ధైర్యము కలుగదయ్యెను.

తర.—సోదరీ! ఆతనిక్రొత్తపేరు జినానందుఁడఁట! తెలిసినదా! సరిపడినదా! చెలీ! నీవూరక భయవిహ్వలవై పోవుచున్నావు! నీభయము నిరాధారమైనది. చారుమిత్రుఁడు తన యేకపుత్రుఁడగు వసుమిత్రుని దేశత్యాగునిం గావించుట యాతఁడు నిన్నుఁ బెండ్లియాడు నేమోయనుకోపముచేఁ గాదు! చారుమిత్రుని మరణానంతరమున నాతనియనంతసంపద యంతయు వసుమిత్రునకు లభింపఁగలదనియే బౌద్ధులు "నీపుత్రుని బౌద్ధభిక్షునిం గావింపుము!" అని చారుమిత్రునకుపదేశించిరి. ఆతఁడు భిక్షువైనచో బౌద్ధులకందఱకు నాయాస్తిపై సమానాధికారము గలుగును. ఆధనమంతయును బౌద్ధసంఘమునకుఁ జేరును.

ఇందుకొఱకే బుద్ధమతాభిమాని యగుచారుమిత్రుఁడు తన యేక పుత్రుని బౌద్ధభిక్షునిగాఁ జేసివైచినాఁడు.

యూధి—(వెక్కుచు) అయ్యో! చెలీ! ఇఁక నుపాయ మే మున్నదే!

తర—(దృఢస్వరముతో) ఉపాయ మింకేమున్నది? ఈశ్వర సాహాయ్యమొక్కటియే యుపాయము. ఇఁక నెట్టిగతియును లేకుండుటచే నేను భగవన్నామమును జపించుకొనుచు మఠమునుండి తిరిగి వచ్చుచుంటిని. ఆకారణముననే కాఁబోలును! ఎవరెఱుంగుదురు?—త్రోవలో నాకస్మికముగా నొకయుపాయము తోఁచినది. ఆమఠమునందు దుష్టభిక్షులు గొందఱున్నారు. అందుఁ బ్రౌఢవయస్కుఁ డగు భిక్షువొకఁడు వారి కాచార్యుఁడై యున్నాఁడు—తిరిగి వచ్చునప్పటికిఁ జీకటిపడుటచే నే నతిశీఘ్రగమనముతో వచ్చుచుంటిని. ఇంతలో నెవ్వరో వెంబడించి వచ్చుచున్నట్లు నాకుఁ దోఁచినది. అందుచే మొట్టమొదట నేనించుకభయపడితిని. తరువాత రెండుమూఁడుసారులు నేనాయంధకారమున దాఁగి నామనస్సుని దప్పించుకొనఁ బ్రయత్నించితిని. ఎంతచేసినను నాతఁడు నావెంటవచ్చుట మానఁడయ్యెను. రెండుమూఁడుగడియ లీవిధముగా దాఁగుడుమూతలైనపిమ్మటఁ దుదకు నాకాతని మొగము కానఁబడియెను. ఆనిమిషమునందే నేను మోహవిహ్వల నై పోయితిని. నాసర్వాంగకములును బులకితము లై పోయినవి. అక్కా! ఏమని చెప్పుదును! బ్రహ్మదేవుఁ డింతటిమహాసుఖానుభవము నానుదుట వ్రాసియుంచె నని భావించితిని. ఏమందువా? నన్నట్లు వెంబడించి వచ్చినవాఁ డామఠమునందలి యొకముసలికోఁతి!

యూధి—ఆలాగా! ఓరిపాడుముసలికోఁతీ!

తర—అక్కా! నీకు నిజము చెప్పుచున్నాను. నీవు వసుమిత్రుని మోహనరూపమువంక గడియలకొలఁది నొక్కటేచూపుగఁ జూచు

యుందువుగదా! అప్పుడు నీకొక్కసారియైనఁ గనుఱెప్పపాటుండదను గదా! దానికి గారణ మేమని నేను వితర్కించుకొనుచుండెడిదానను, కాని, యిప్పుడు నాకామర్మము చక్కఁగా బోధపడినదిసుమా!

అని చెప్పి తరళ యొక్కసిట్టూర్పు విడిచెను. యూధిక యా మాటల కేమియుఁ బ్రత్యుత్తరమీయలేదు; గాని తరళ కొకచిన్న చెంపపెట్టుమాత్రము బహుమానమిచ్చెను.

తర—అక్కా! నీకు నామాటలయందే విశ్వాసము లేదు. ఇఁక నీవంటి యరసికురాండ్రెదుట నీలనీరదనిభంబగు నా ప్రియుని కృష్ణరూపముం గూర్చి నేనేల వర్ణింపవలయును? నీమాటయే చెప్పెదను వినుము. అనంతరము నేను దాఁగియున్నచోటు వదలి వచ్చి నాశ్యామసుందరునిం గలసికొని చాలసేపు మాటలాడితిని. చెలీ! మానవు లొక్కసారి ప్రేమోన్మాదమునఁ బిచ్చివారైపోయినచో నిఁకఁ జావుకోఁగాని వారి కాపిచ్చి వదలదు సుమా! ఆసెట్టి బిడ్డతో మోమునమోముఁ జేర్చి కూర్చుండి నీవేవిధముగా దినములను గడపియుంటివో యాసంగతి యంతయు మఱచిపోయితివి కాఁబోలును! వసంతమాసమునఁ బండువెన్నెలవెలుంగుచే నతిమోహనంబగు యామినీసమయమున శ్యామసుందరుఁడు రాధ నెట్లు విడిచిపోఁగలఁడు? అగ్నికుండ మచ్చట లేదు—కాని వైశ్వానరునకు మాఱుగా జందమామనే సాక్షిగఁ జేసికొని మేమిరువురము నప్పుడు గాంధర్వవిధిని బెండ్లి చేసికొంటిమి. అక్కా! ఇంకేమి చెప్పవలయును ?

యూధి—(విసుఁగుతో) తరళా! నీవు కేవలమును దుష్టురాలవే! నీపరిహాసము లేమియు నాకు రుచించుట లేదు. నేను నీపాదములపైఁ బడి బ్రతిమాలుకొనియెదను. ఇఁక నేయున్నను నాతోడు! జరిగినసంగతి యంతయును సరళముగాఁ జెప్పవే! నిజము చెప్పవే!

తర—ఇదేమిసోదరీ! నీకు నీమాటయే గాని మఱియొకటి లేదు. ఉద్య వసంతనవమాలికవలె నభినవయౌవనవతివి. నేనో వయ

సుచెల్లిన ముసలిదానను. ఆహా! అయినను నేనుగూడ మానవినే గదా! నేనమాత్రము ప్రేమజాలమునం దెన్నటికిని జిక్కనే గూడదా ?

యూధిక కోపముతో లేచిపోవుటకుఁ బ్రయత్నించెను. కాని తరళ యామెచేయి పట్టుకొని కూర్చుండఁబెట్టి "అక్కా వినవమ్మా! అన్నియు వరుసగాఁ జెప్పెదను. ఇంతయాత్రపడియెద వేల? ఆపాడు మునుకఁడు నాకొఱకు నిశ్చయముగనే యున్మత్తుఁడై పోయెను. అందుచేతనే యాతఁడు నన్ను విడువక వెంబడించెను. నేనట్లు బయటికిఁ వచ్చినతరువాత నాతఁడు నాపాదములపైఁ బడఁబోయెను. నేనువానిని ప్రేమోన్మాదచేష్టితముల కుత్తేజనముం గల్పించి యాతఁ డాకసము నందలిజాబిల్లికై చేతులు సాచునట్లు చేసితిని. నేనెట్లయిన మిమ్ము విడిపించెద నని వసుమిత్రునికడ శపథము చేసి వచ్చితిని. కాని యే యుపాయముచే నా కార్యము సిద్ధించునని త్రోవపొడుగునను నేనాలోచించుకొనుచునే వచ్చుచుంటిని. అప్పుడు దయామయుఁడగు దేవుఁడు నాకుఁ దగినయుపాయముం జూపించినాఁడు! అప్పుడు నేనీవానరునిసాహాయ్యముచే నావసుమిత్రుని బంధముక్తునిం గావింపఁగలనని నిశ్చయించుకొంటిని. కాని యేమి చేయవలయునో యింకను దోఁచుట లేదు. ఇప్పుడావిషయమై నన్నేమియు నడుగవలదు. అమ్మగారు నన్ను, గూర్చి యడిగినచో నీకిష్టమువచ్చినమాట చెప్పివేయుము, తరళ తనపినతల్లికొమార్తె పెండ్లికి దూరదేశమునకుఁ బోయినదనియు నైదాఱుదినములలో రాఁగలదనియు సమాధానము చెప్పుము! నిజమే సోదరీ! నా చెల్లెలిపేరుగూడ యూధిక యే!

యూధి—నీమాటలు మండ! నోరుమూయుము.

తర—(పకపకనవ్వుచు) ఇప్పుడు నోటికగ్గిగాదక్కా!

యూధి—కాక, మఱియేమి?

తర—"ఇప్పుడు నీనోటఁ జక్కఁరపడఁగలదు" అని యూరింప వలసినసమయము!

అని పలికి, తరళ నవ్వుచునే వెడలిపోయెను.

పదునెనిమిదవ ప్రకరణము.

తరళ తనయజమానునియిల్లు వెలువడి రాజమార్గమునం బ్రవేశించి బజాఱువీథికిఁ బోయెను. ఆమె యచ్చట మూఁడంగడులలో మూఁడువిధములగు వస్త్రములు పురుషవేషోచిత వస్త్రములు, దోవతులు ఉత్తరీయములు, జోళ్ళు, తలగుడ్డలు మొదలగునవి కొనెను. తరువాత నామె యామూటను దనపయ్యెదచాటున నుంచుకొని తిన్నగాఁ దన యింటికిఁ బోయెను. నగరమునకుఁ జిట్టచివరఁ దరళపినతల్లికుటీర మొకటికలదు. తరళయిల్లుగూడ నదియే. ఆమె యెప్పుడు నేవేవో పనులకొఱకు రాత్రులయందుఁగూడఁ దనయజమానుని మందిరము నందే యుండుచుండును. కాని యప్పుడప్పుడు యజమానుని యనుమతిం బడసి పినతల్లియింటికి వచ్చి రెండుమూఁడు దినములుండి పోవుచుండును. తరళ పినతల్లి మిగులవాచాట—అందుచేఁ దరళ యామె యింటఁ దఱచుగా నుండదు. ఆమెపినతల్లికిఁ జాలగుణము లున్నవి. ఆమెకుఁ గన్నులు బాగుగా నగపడవు. అట్లే చెవులును వినఁబడవు. కాని యామె కలహములయందుమాత్రము గడిదేఱినదే! ఆమెముఖశక్తిని యెదుట సామాన్యముగా నెవ్వరును నిలువఁజాలరు.

తరళ యట్లు పినతల్లియింటికి వచ్చి యామూట నొకగదిలో దాచియుంచి భోజనము చేసినపిమ్మట హాయిగా నిదురించెను. మూఁడు జాములు గడచిన తరువాత నామె లేచి తలదువ్వుకొని, జడవైచికొని, తనకింపగునట్లు లతిజాగ్రత్తతో నలంకరించుకొని యాకుటీరమునుం

డి వెలువడి పోవునప్పుడు పినతల్లితో “ పిన్నీ! అమ్మగారియొద్ద సెలవు గైకొని నేనిందు రెండుదినము లుండవచ్చితిని. నేనిప్పు డొక్కపని కొఱకుఁ బోవుచున్నాను. మరల వచ్చుసరికిఁ జీకటిపడునేమో! నేను వచ్చునప్పుడు నాకుఁ దోడుగా నామిత్రురాలి నొకతెను దీసికొని వత్తును” అని చెప్పెను.

అనంతరము తరళ వెలుపలికి వచ్చి దక్షిణాభిముఖంబుగఁ బోవఁ దొడంగెను. అప్పుడు సూర్యాస్తమయ మగుట కెంతయో యవకాశము లేదు. అప్పుడు తరళ జనసంచారబహుళం బగురాజమార్గమును విడిచి మహానగరబాహ్య ప్రదేశమున నున్న యుపనగరమునకుఁ జేరుకొని యానాఁడు వచ్చినత్రోవనుబట్టి బౌద్ధమఠముకడకుఁ బోవుచుండెను. కాని, యామె కొంతదూరము పోవునప్పటి కాత్రోవ ప్రక్క నున్న తాళవనమధ్యమునందలి పుష్కరిణిచెంతఁ గూర్చుండి యామార్గమున వచ్చుచుఁబోవుచుండువారి నతిజాగరూకతతోఁ బరీక్షించుచున్న యొకపురుషుఁ డామెకుఁ గానవచ్చెను.

ఆవ్యక్తి కన్నులఁ బడినంతనే తరళ సరళమార్గమును వీడి మెల్లగా నాతాళవనమునఁ బ్రవేశించి యడుగులచప్పుడు వినఁబడకుండ నెట్లో యాతని వెనుకవైపునకుఁ బోయి చటాలున నాతని కన్నులను మూసెను.

ఆపురుషుఁ డప్పుడు తరళచేయి పట్టుకొని బాగుగాఁ దడవిచూచి బిగ్గఱగా నవ్వుచు “ఓహో! తెలిసినది! తెలిసినది! తరళా! నిన్ను గుర్తించితిని! ఇట్టి కోమలహస్తము లీపాటలీపుత్రనగరమున నీకుఁ గాక మఱి యెవ్వరికున్నవి?” అనియెను.

తరళయుఁ బకపకనవ్వుచుఁ జేతులను దీసివైచి “ఆచార్యా! మీ రిక్కడ నీపుష్కరిణీతీరమునం గూర్చుండి యేమి చేయుచున్నారు?” అని ప్రశ్నించెను.

దేశాచార్యుఁడు—(తరళమనోహరరూపము నేకాగ్రదృష్టిం గాంచుచు) తరళా! ఏమి చేయుచుంటివా? దప్పిగొన్నచకోరముంబోలి నీసుందరవదనచంద్రోదయమునకై ప్రతీక్షించుచుంటిని. కాని యెంత సేపటికిని జంద్రోదయము కానే కాదయ్యెను! తరళా! ఇఁక నడువుము! మనము శీఘ్రముగఁ బోవుదమురమ్ము!

తర—ఎక్కడకు?

దేశా—ఎక్కడ కనియెదవేమి? కుంజమునకు.

తర—(నవ్వుచు) మీరు కాషాయవసనధారులగు సన్యాసులుగదా! కుంజముతో మీకేమిపని?

దేశా—నీవు రసికశిరోరత్నమవుగావా ?

తర—నరే—ఆమాటకేమి? మీకుంజమెక్కడ నున్నది?

దేశా—(ఆనందోత్కంఠుఁడై) ఏమి! సంఘారామమునందు-

తర—ఏమంటిరి? మీ యేకాంతస్థలము సంఘారామమా? ఆనాఁడు నేనక్కడకు వచ్చినప్పు డచ్చట నెందఱోభిక్షులు నాకగపడిరి. ఆపాడు భిక్షులందఱును నిప్పుడు మిమ్ముఁ బట్టుకొని పరాభవింపకుందురా?

దేశా—తరళా! నీతో నసత్యము చెప్పుటవలన నాకేమిలాభమున్నది? సంఘారామమునఁ గూడ గావలసినన్ని యేకాంతస్థలములున్నవి. నీకాసంశయమేల? నాతో బయలుదేఱి రమ్ము! అక్కడనన్ని సంగతులు నీకే తెలియఁగలవు.

తర—అట్లయిన నడువుఁడు! కాని—మీరు నాకు ముందుగ దూరమున నుండి నడచిపోవలయును.

దేశా—(అనిష్టముగా) నరే—అట్లే కానిమ్ము.

దేశానందుఁడు ముందు నడవఁ దొడంగెను. ఆతని కనతిదూరమునఁ దరళ యాతని వెంబడించుచుండెను. అప్పటికి సాయంకాల

మయ్యెను. అంధకారము నలుదెసల మెల్లమెల్లగ నలముకొనుచుండెను. ఉపనగర రాజమార్గమప్పుడే నిర్జనమయ్యెను. దేశానందున కలవాటే గావున నాచీకటిలోఁ గూడ నాతఁడించుకంతయును దడఁబడక యాత్రోవను నడచుచుండెను. కాని తరళకుమాత్ర మడుగులు సరిగా జరగుట లేదు.

కొంతసేపటి కాయిరువురును శిథిలమందిరమును సమీపించిరి. అప్పుడాచార్యుఁడు తనయుత్తరీయపుఁ జెంగునఁ గట్టియున్న తాళపుఁ జేతులను దీసి యామందిర ద్వారమును దెఱచి "తరళా! లోనికి రమ్ము" అనియెను.

తరళ యిప్పుడు చిక్కులోఁ బడితినని శంకించెను. దేశానందుఁడు చెప్పినట్లు నిజముగా నది యేకాంతస్థలమే. ఇప్పుడేమిచేయఁగలదు? ఈనిర్జనస్థలమున నీమహామూర్ఖునితోఁ దరళ యిప్పుడు లోనికిఁ బోవలయునా? పోక యేమనఁగలదు? ఆమెయుద్దేశము సిద్ధించుటకై యిప్పుడుపాయమేమున్నది? ఆపిచ్చివానిని దనకార్యమునం దుపయోగించుకొనుటకు మార్గమేది? తనంతనయొదవిన యీయదను నుపయోగించుకొనుట యెట్లు? తరళహృదయ మిప్పుడాలోచనలతోఁ దడబడిపోవుచుండెను. ఇప్పుడీయున్మత్తుని బారినుండి తప్పించుకొనుట కుపాయమేమియని యామె యన్నిటికంటె ముఖ్యముగ నాలోచింపఁదొడంగెను.

తరళ లోపలికి వచ్చుట కాలస్యము చేయుచుండుటం గాంచి దేశానందునకు ధైర్యము నశించిపోవుచుండెను. అప్పుడాతఁ డించుక కోపముతో "ఇదేమితరళా! లోపలికి రావేమి? అక్కడ నూరక నిలువఁబడి యేమిచేయుచున్నావు? పిచ్చిదానివలె నగపడుచున్నావే! నిజమే! ఎంతతప్పు! ఎవ్వరైన వచ్చి నిన్నును, నన్ను నిట్టిస్థితిలోఁ గాంచినచో నేమగుననుకొన్నావు? రా! లోపలికి రా!" అనియెను.

ఇఁకఁ దరళ యేమిచేయఁగలదు? ఏయుపాయముం దోఁచకుండుటచే నామె మెట్లెక్కిపోయి గడపపైఁ గూర్చుండెను.

అందుచే దేశానందునకుఁ గోపము వచ్చెను. అతఁడు కనుబొమలు ముడివైచి "ఇదేమే! తరళా! ఇంతదూరమును నడచివచ్చి యీవెట్లు మీఁదికిఁ గూడ వచ్చి యిక్కడఁ గూలఁబడితి వేమి? లేచి లోపలికి రమ్ము! లే! తలుపు మూసెదను! " అనియెను.

తర—(గద్గదస్వరముతో) నా కేమీ గాసి భయముగా నున్నది.

దేశా—వెఱ్ఱిదానా? భయమెందులకు?

తర—ఈయంధకారము చాలభయంకరముగా నున్నది. ముందు లోపల నొకదీపమును వెలిగింపుఁడు!

దేశా—(కోపముతో) తరళా! నీకు మతిపోలేదుగద! దీపము వెలిఁగించినచో నిప్పుడే మనజాడ యందఱకును దెలిసిపోదా? సెబాసు! మంచిదానవే!

తర—జాడఁ దెలిసికొనుట కిచ్చటి కెవ్వరు వత్తురు? దీపము వెలిఁగించినఁగాని నేను లోపల నడుగుపెట్టఁజాలను. నాకుఁ జాలభయముగానున్నది.

ఇఁక నుపాయాంతరము లేకుంటచే దేశానందుఁ డెట్లయిన దీపము వెలిఁగింప నిశ్చయించుకొని యాయంధకారమున దీపపుబ్రిమిదకై వెదక నారంభించెను. తరళ చీకటిలోనే గడపయొద్ద నిలువఁబడియుండెను.

ఇంతలో దూరమునుండి యెవ్వరో మాటలాడుచున్న ధ్వని తరళకు స్పష్టముగా వినవచ్చెను. తోడనే యామె కళవళముతో దేశానందు నుద్దేశించి "ఆచార్యా! ఆచార్యా! త్వరగా రండు! ఎవ్వరో మనుష్యు లీత్రోవనే వచ్చుచున్నట్లున్నారు! " అనియెను.

తరళభయముతోఁ బలికినయీమాటల నాలకించి దేశానందుఁడు దీపపాత్రిను వెదకుపనిని మానివైచి చటాలున ద్వారము నొద్దకు వచ్చెను. అప్పు డాయిరువురును విస్ఫారితనయనములతోఁ దమ

చూపులను దూరమునకుఁ బ్రసరింపఁజేసిరి. ఔను, నిజముగా నిరువు రుమనుష్యు లప్పు డామందిరము నొద్దకే వచ్చుచుండుట వారికి దృగ్గో చరమయ్యెను. దేశానందుఁడు కిక్కురుమనకుండఁ దత్క్షణమే తరళఁజే యిపట్టుకొని బలవంతముగా నామెను లోని కీడ్చుకొనిపోయి యామం దిరమునందలివిశాలదేవమూర్తివెనుకను దాగియుండెను.

ఆవచ్చువా రిరువురును గొంచెసేపటిలోనే మందిరద్వారము చెంతకు వచ్చిరి. వారిలో నొకఁడు ద్వితీయునితో "ఆఁ! ఇదేమి? వ జ్రాచార్యా! మందిరద్వారములు తెఱవఁబడియేయున్నవి?" అనియెను.

వజ్రా—(మెల్లెక్కిపోయి చూచి) ఔను స్థవిరా! మందిరద్వా రము నిజముగనేవివృతమైయున్నది. బంధుగుప్తా! మీ దేశానందుఁ డు కేవలము నున్మత్తుఁడై పోవుచున్నాఁడు సుమీ! నేఁడే నీవీమందిర సంరక్షణముకొఱకు వానికి మాఱుగా మఱియొక్కని నియోగింపు ము! ఇంతకంటె నిఁక వేఱుమార్గము లేదు.

అంత నయ్యిరువురును లోపలఁ బ్రవేశించి తలుపులను మూసి కొనిరి. అప్పుడు బంధుగుప్తుఁడు దీపపాత్రమును వెదకి చూచి చటా లున దీపమును వెల్గించెను. అప్పు డాయిద్దరును లోపల నొక్క చోఁ గూర్చుండిరి. దేవమూర్తి వెనుకను దాగియున్నదేశానందుఁ డ ప్పుడు ప్రచండవాతాహతిం దూలుకదళీభూరుహముంబోలి వడఁకిపో వుచుండెను.

శత్రుసేనుఁడు—సంఘస్థవిరా! నేఁడు నీ మొగమింతగా వాఁడి పోయినదేమి?

బంధు—వజ్రాచార్యా! కారణమేమున్నది? కేవలమును య శోధవళుని వలనిభయముచేతనే—

శత్రు—నీవాయశోధవళునికొఱ కింతగా భయపడవలయునా?

బంధు—(కంపితకంఠముతో) వజ్రాచార్యా! అంతయును మఱచియేపోయితివా? ఆతఁడు మరణించె ననునుద్దేశముతోనే నేనింతవఱకును నిర్భయముగా నుంటిని.

శత్రు—పూర్వము నీవింతగా మరణమనిన భయపడెడివాఁడవు గావే!

బంధు—నేనిప్పుడైనను మృత్యువుకొఱకు జంకుట లేదు. ఎవ్వరివలన మరణము సంభవించినను నేను బెదరువాఁడను గాను. మఱి—ఏమని చెప్పుదును? యశోధవళుని పేరు విన్నంతనే నాయొడలు వడఁకిపోవుచున్నది! ఆతనిపుత్రునిమరణవార్త సర్వమును నాతని చెవులఁబడియుండు నేని నన్నాతఁ డతిదారుణంబులగు బాధలపాలుగావించి చంపక యూరక విడుచువాఁడు గాఁడు! సామాన్యమరణమనిన నాకెంతమాత్రమును భయమే లేదు. కాని, శరీరమునందలి ప్రత్యవయవమును దిలమాత్రంబులగుఖండములుగాఁ జేసివైచుచున్న యామరణమునకే నేనింత భయపడుచున్నాను.

శత్రు—బంధుగుప్తా! కీర్తిధవళుని నీవెట్లు చంపితివి?

బంధు—ఆసంగతి నీకేమియుఁ దెలియనే లేదా?

శత్రు—నాకెట్లు తెలియును? నీవెన్నఁడైన నాతో జెప్పితివా?

బంధు—లేదు—ఆసంగతు లింతవఱకు నేనెవ్వరికిని దెలుపనే లేదు. ఇప్పుడు నీకుఁ జెప్పెదను వినుము.

అని యాతఁ డొక్కింతసేపు చింతించి "వజ్రాచార్యా! వలదు. నేనావిషయముంగూర్చి చెప్పఁజాలను. నాకేమోగాని సర్వాంగకములును వడఁకిపోవుచున్నవి" అనియెను.

శత్రు—(బిగ్గఱగానవ్వుచు) బంధుగుప్తా! నీయున్మాదము దినదినాభ్యుదయముం గాంచుచున్నదిసుమా! నావృత్తాంతమును దెలిపినను, దెలుపకపోయినను నాకెట్టికష్టమును లేదు. కాని—ఈయే

కాంతస్థలమునఁ జెప్పుట కంతభయపడవలసినపని యేమున్నది? మందిరద్వారములను బంధించి యుంటిమిగదా! ఇక్కడనుండి మనమాటలు బయటివారి కెంతమాత్రమును వినఁబడవు. ఈమందిరమున దీపము వెలుఁగుచునే యున్నది. ఈవెలుఁగులో బాగుగఁ బరిశీలించి చూడుము! నీవు—నేను—ఈదేవమూర్తి—ఇంతకంటె నితరులెవ్వరైన నున్నారా? ఇఁక నీకు భయమేల?

బంధు—ఇటునటుఁజూచి 'నిజమే! నేనకారణముగనే బెదరుచున్నాను—సరే—ఇఁక వినుము! కీర్తిధవళుఁడు వంగదేశమునఁ దనపన్నులను గైకొనఁదలఁచి వచ్చినప్పుడు పూర్వదేశమునందలిసంఘములు మహాకష్టస్థితిలో నుండెను. ధవళవంశమువారెల్లరును, రాజనీతికుశలురును, రణకళావిశారదులు నై యుండిరి. ఇప్పటికినిగూడ వారట్లేయున్నారు. అనేకపర్యాయము లాహవరంగములఁ బరాజితులగుటచే నచ్చటివిప్లవకారులందఱును సంధికొడంబడుటకు సంసిద్ధులైయుండిరి. కీర్తిధవళుఁడుగూడ వారినెంతమాత్రమును శాసింపక మనఃపూర్వకముగా క్షమించి యందఱను వశపఱచుకొనియెను. అప్పుడు నేను వంగదేశమునందుంటిని. కాని సధర్ములగునచటిప్రజలను గీర్తిధవళునకు విరుద్ధముగా విజృంభింపఁజేయుట కెంతప్రయత్నించినను నాతరము గాకపోయెను. నేనెంతయో యాలోచించితిని. యశోధవళునితనయుఁడు వధింపఁబడిననేగాని సంఘకార్యములు నిష్కంటకముగా నిర్వహింపఁబడుట దుస్తరమని నాకుఁ దోఁచెను. ఎంతప్రయత్నించినను వంగదేశవాసులలో నొక్కఁడైనను గీర్తిధవళునిపైఁ జేయెత్త నంగీకరింపఁడయ్యెను. ఎల్లప్పుడు నంగరక్షకసేనాపరివృతుఁడై యుండుట యే గాని యాతఁ డొంటరిగా బయలు వెడలఁడయ్యెను. అందుచే నాకుఁ దగిన యదను దొరకలేదు. కీర్తిధవళుఁడు ప్రతిదినమును సాయంకాలమునఁ దారాదేవియాలయమునకుఁ బోవుచుండు ననుసంగతి నాకుఁగొంత కా

లములకుఁ దెలియవచ్చెను. అదిమొదలుగ నేనాతని ననుదినమును వెంటాడుట కారంభించితిని. కాని యొక్కవాఁడైన నాతని స్పృశించుటకుఁగూడ నాకు ధైర్యము గలుగదయ్యెను. ఒకనాఁడా దేవికి జరుగుచున్న మహోత్సవసమయమున మనసద్ధర్మ్మలకును, బ్రాహ్మణులకును గలహము సంభవించి యొండొరులఁ గొట్టుకొన నారంభించిరి. అప్పుడు నేనుచితసమయమును గనిపెట్టి దూరమునఁ బొంచి యుండి కీర్తిధవళునిపై గురిపెట్టి యొకవాఁడిబాణమును విసరితిని. ఆదెబ్బతో నాతఁడు గుభాలునఁ గ్రిందఁ బడిపోయెను. ఆసమ్మర్దసమయమునం దొక్కరును నన్నుఁ గాని, కీర్తిధవళునిగాని చూడనేలేదు. కీర్తిధవళుఁడు దేవీమందిరము నెదుటఁ బడిపోయెను. అంధకారమునం దనుచరు లాతని వెదకికొనుచుండిరి. నేనును వారిని దప్పించుకొనిపోయి యాతనిం జూచితిని. కీర్తిధవళుఁ డింకను సజీవుఁడై యుండెను. ఆతనికిఁ దగిలినదెబ్బ యంతయపాయకరమైనది గాదు. కాని యాతఁడు మూర్ఛితుఁ డయ్యెను. నేనప్పు డతివేగముగ దేవీగర్భగృహమునం బ్రవేశించి యామూర్తిహస్తమునందున్న ఖడ్గమును దీసికొని బయటికి వచ్చి యట్లు పడియున్న కీర్తిధవళుని కాలుసేతులను ఖండించివైచితిని. ఆ యాతనచే నాతని కొకింత తెలివి గలిగెను. శరీరమునందలి రక్తమంతయు గళితమై పోవుచుండుటవలనను, దారుణయాతనవలనను నాతఁ డధికతృష్ణార్తుఁడై క్షీణస్వరమునఁ బలుమాఱు జలముకొఱకుఁ బలవించెను. శాత్రవరుధిరసందర్శనానందోన్మత్తుఁడ నగునే నాతని మరణకాలదీనప్రార్థనమునించుకంతయు లక్ష్యము సేయలేదు. జలమొక్కచుక్కయైన నొసంగక చలము సాధించి బాధించి సంఘవైరి యగునాతని నీవిధముగా సంహరించి సంతుష్టినందితిని—"

దేవీవిగ్రహము వెనుక దాగియున్న తరళ కీర్తిధవళుని దారుణ వధావిధానము నాకర్ణించి భయముచే గడగడవడఁకఁదొడంగెను.

తత్క్షణమే యామె యొడలంతయుఁ గంటకితమై పోయెను. దేహమంతయును స్వేదసిక్తమై పోయెను.

శత్రుసేనుఁ డొక్కింతసేపటివఱకు నూరకుండి పిదప నొక్క వేఁడినిట్టూర్పు విడిచి " బంధుగుప్తా ! నీకీబౌద్ధసంఘమున భిక్షుదీక్ష యెవ్వ రొసంగిరో గాని నీవు నిశ్చయముగా మానవాకారముతో నున్న దానవుఁడవే సుమా ?" అనియెను.

బంధు—వజ్రాచార్యా ! ఇఁక నామాట యెత్తనేవలదు. ఆనాఁడు మొదలనుదినమునందును నేను భయంకరస్వప్నములను గాంచుచునే యున్నాను. ప్రాణపీడితుఁడగు కీర్తిధవళుఁడు దేవీమందిరము నెదుటఁ బడియున్నట్లును, కరుణరసాపూరితస్వరమున మృత్యుయాతన ననుభవించుచుఁ దృష్ణోపశాంతికై దీనత్వముతో నన్ను నీరడుగుచున్నట్లును, నేనాతని రక్తప్రవాహముం గాంచి యున్మత్తుఁడనై నృత్యము చేయుచున్నట్లును, కలలఁ గాంచుచునే యుంటిని. యశోధవళుఁ డీనగరమునకు వచ్చెనని వినినది మొదలు—నేనా దేవీమందిరముకడ దారుణ మరణయాతనల ననుభవించుచున్నట్లును, రుధిరకషాయవసనధారియై, భీషణకృపాణపాణియై యశోధవళుఁడు పరమానందాతిరేకమున నెడలు మఱచి తాండవమాడుచున్నట్లును దుస్స్వప్నములఁ గాంచుచున్నాను.

పిమ్మటఁ గొంతసేపటివఱకు నిద్దఱిలో నెవ్వరును మాటాడకుండఁ గూర్చుండి యుండిరి. అప్పుడు బంధుగుప్తుఁడు " శత్రుసేనా : లెమ్ము ! మనము సంఘారామమునకు మరలిపోవుదము. ఇచ్చటి యేకాంతవాస మిఁక నాకసహ్యముగా నున్నది !" అనియెను.

తరువాత దీపము నార్పివైచి యాయిరువురు నిఁక నేమియు మాటాడకుండ వెడలిపోయిరి. విగ్రహముచాటున నున్న దేశానందస్వామి యింకను వడఁకుచునే యుండెను. శత్రుసేనబంధుగుప్తులు వెడ

లిపోయినంతనే తరళ "స్వామీ! ఇఁక లెండు! మనము బయటికిఁ బోవుదము!" అనియెను.

దేశా—(శిరఃకంపము సేసి) తరళా! ఇప్పుడు నేను నిశ్చయముగాఁ జచ్చినవాఁడనే! నీప్రేమోన్మాదమునం బడి నాబుద్ధిశక్తియుం తయును నశించిపోయినది.

తర—ఇంకను నిచ్చట నిలిచియే యున్నచో నిశ్చయముగా మీతలయే యెగిరిపోఁగలదు. ముందిటనుండి తరలిపోవలయును. నడువుఁడు!

దేశా—(హతాశుఁడై) సరే—నడువుము! పోవుదము పద!

చటాలున నిరువురు నామందిరమును వదలి వెలుపలికి వచ్చిరి. ఆవృద్ధుఁడు భయాకులహృదయుఁడై సగముచచ్చియున్నాఁడని తరళ గ్రహించెను. ఆమె యాతని కించుక ధైర్యముం గూర్ప నెంచి "ఆచార్యా! మీరింతగా భయపడిపోవుచున్నారేమి! ఇప్పుడు వచ్చిపోయినవా రిచ్చటివారేగదా! వారు మిమ్మేమి చేయఁగలరు? మీరిక్కడనుండి పాఱిపోయినచో వారు మీశిరోజాగ్రమునైనను బాధింపఁగలరా? మీరు ధైర్యము వహించి నాతో రండు! నేను మిమ్మొక్కచో దాఁచెదను. ఏడుజన్మము లెత్తివెదకినను వారు మిమ్మింకఁ గనుఁగొనఁ జాలరు." అనియెను.

ఈమాటలు విని దేశానందునిభయమంతయు మాయమైపోయెను. అప్పు డాతని కెట్లయినఁ దప్పించుకొని బ్రదుక గలను గదా యని యించుక యాస కలిగెను. అందుచే నాతఁడు తరళం గాంచి "అట్లయినచో నింకను నిచ్చట నిలుచు టెందులకు? లెమ్ము! ఈక్షణముననే మనము పాఱిపోవుదము?" అనియెను.

తర—(మందహాసముతో) ఊరక యిట్లు భయపడవలదు. ఇక్కడ నాకింకను గొంచెముపని యున్నది. ముందాకార్యమును దీర్చుకొని మఱిపోవలయును.

దేశా—ఇచ్చట నీకేమిపని?

తర—భిక్షుజినానందు నొకసారి చూచిపోవలయును.

దేశా—(అనిష్టముతో) జినానందుఁడు నిన్నెట్లు చూడఁగలఁడు?

తర—ఏమి ?

దేశా—వాఁడు సంఘారామమున నిర్బంధితుఁడై—

తర—మఱి మీరున్న ప్రయోజన మేమి?

దేశా—నన్నేమి చేయుమనెదవు?

తర—నన్నక్కడకుఁ దీసికొని—

దేశా—అక్కఱలేదు—వాని నిక్కడకే తీసికొని వచ్చెదను.

తర—ఇంకేమి ? అట్లే చేయుఁడు ! మీరు త్వరగా రావలయునుజుఁడీ ! మీరాకకొఱ కిచ్చటనే యెదురు చూచుచుండెదను.

దేశానందుఁడు వెడలిపోయెను. ఈవృద్ధునిఁ జిక్కించుకొనుట కొంతవఱ కనుకూలమే యయ్యె నని తరళ యానందభరితహృదయ యయ్యెను. అప్పు డామె యాయంధకారమున నామందిరము చెంత నిలిచి యుండెను.

కొలఁదిసేపటిలోనే దేశానందుఁడు జినానందు నచ్చటికిఁ దీసికొని వచ్చి" తరళా ! నీపనియేదియో త్వరగాఁ గానిమ్ము ! ఇదిగో ! జినానందుఁడు ! ఆలస్యము చేయకుము. ఈతఁ డగపడకుండుటచే భిక్షువు లితని వెదకికొనుచు నీతోవనే వచ్చెద రేమో ! త్వరపడుము!" అనియెను.

తర—ఆచార్యా ! త్వరలోనే నాపనిముగించుకొందును. కాని మీరు కొంచెముసేపు మందిరములోనికిఁ బోయియుండెదరా ? నేను కొన్ని విషయములనుగూర్చి జినానందునితో రహస్యముగా మాటాడవలయును.

దేశానందుఁడుతరళయాజ్ఞను శిరసావహించి చటాలునఁ బోయి యామందిరమునఁ బ్రవేశించెను. తరళ యాయింటితలుపులను మూసి వైచి జినానందునింగాంచి మెల్లఁగా "మహారాజా ! నన్ను గుర్తించితిరా ? నేను తరళను. మిమ్మిప్పు డిటనుండి తప్పించి నావెంటఁ గొనిపోవుటకై వచ్చియున్నాను. నన్నిప్పు డేవిషయమునుగూర్చియు నడుగవలదు. ఇప్పుడు నేను మీకుఁ జెప్పినపనిని మీరు మౌనముతోఁ జేయవలయును. అంతే చాలును!" అనియెను.

జినానందుఁ డాశ్చర్యముచే స్తబ్ధుఁడైనిలువఁబడిపోయెను. తత్క్షణమే తరళ యామందిరద్వారముకడకుఁ బోయి " ఆచార్యా!" అని పిలిచెను.

ఆచార్యుఁడు లోపలినుండియే "ఏమి?" అని పలికెను.

తర___మీరు మీదుస్తులను విడిచి యొకసారి నాకిండు. నేను వానిని ధరింతును.

దేశా___అనఁగా ?

తర___అనఁగా నేమున్నది? నేను చెప్పినట్లు చేయుఁడు. మీరెప్పటివేషముతోనే నావెంట వచ్చుచున్నచో మిమ్ముఁగాంచి యెవ్వరైన నానవాలు పట్టకుందురా?

దేశా___ఔను ! నీవు చెప్పినమాట నిజమే___అట్లేచేసెదను.

అని దేశానందుఁడు తానుధరించిన వస్త్రముల నొక్కటొక్కటిగఁ దీసి మందిరద్వారమునుండి బయటికి విసరివైచెను. ఆతనివస్త్రములన్నియుఁ జేతఁ బడినపిమ్మట సంతోషముతోఁ దరళ వాని నన్నిటిని జినానందునకుఁ గట్టనిచ్చెను. వసుమిత్రుఁడును దేశానందునిదుస్తులను ధరియించి తనదుస్తులను దరళ కొసంగెను. తరళయు నాయంధకారమున భిక్షువేషముం దాల్చి తనదుస్తులను మందిరములోనికి విసరివైచి యావస్త్రముల నాచార్యుని ధరింపుమనియెను. వానినాచార్యుఁడుధరిం

చినపిమ్మట "ఆచార్యా! మీరిచ్చటఁ గూర్చుండి యుండుఁడు! నేనిప్పుడే పోయివచ్చెదను" అని చెప్పెను.

దేశానందుఁడు తరళయాజ్ఞానుసార మాజీర్ణమందిరమునఁ గూర్చుండి యుండెను. తరళ బయటికి వచ్చి యాతలుపులను మూసి తాళము వైచి వసుమిత్రునితోఁ గలసి యాయంధకారమునం దెచ్చటనో యదృశ్యయైపోయెను.

పందొమ్మిదవప్రకరణము.

నవీనరాజప్రాసాదము నొద్ద నిలిచి మహాప్రతీహారి వినయసేనుఁ డేదియో యాలోచనానిమగ్నుఁడై యుండెను. ఆప్రాసాదపటాంగణమునం దెల్లవైపులను శూన్యమై యుండెను. ద్వారపాలకు లొక్కరిద్దఱు మాత్రము ద్వారచ్ఛాయను నిలిచి యుండిరి. ద్వారమునకు లోపలివైపున ముగ్గురుదండధరు లిటునటుఁ దిరుగుచుండిరి. ఇంతలో నొకశిబిక యాయంగణపుమెట్లయొద్దకు వచ్చి యాఁగెను. వాహకు లాపల్లకి నట దింపిరి. అందుండి వృద్ధహృషీకేశశర్మ వెలుపలికి వచ్చెను. మహాప్రతీహారి వినయసేనుఁ డాతనిరాకకే యెదురు సూచుచుండెను గాఁబోలును! హృషీకేశశర్మ శిబికనుండి యీవలికి వచ్చినంతనే యాతఁ డతిత్వరితముగ నెదురువోయి యాతనికి నమస్కరించి "మహామంత్రిశేఖరా! మీకుఁ జాల నాలస్యమైనది. సార్వభౌములును యశోధవళదేవుఁడును జాలసేపటినుండి మీరాక కెదురుసూచుచుఁ గూర్చుండి యున్నారు." అని మనవిచేసెను.

హృషీకేశశర్మ యేమిప్రత్యుత్తరమిచ్చెనో గాని వినయసేనున కది వినఁబడలేదు. వినయసేనుఁ డాతనితోఁ గలసి ప్రాసాదాంతః

పురమునకుఁ బోయెను. వినయసేనుఁడు ద్వారమును విడిచినంతనే యచ్చట నొకదండధరుఁడు వచ్చి నిలువఁబడి యుండెను.

హృషీకేశశర్మ లోనికిఁ బోవుచు "వినయసేనా! తక్కినవా రందఱును వచ్చిరా?" అని ప్రశ్నించెను.

విన—మహాధర్మాధ్యక్షుని మహాబలాధ్యక్షునిదప్ప నితరుల నెవ్వరిని బిలిపింపనేలేదు.

హృషీ—ఏమి?

విన—చక్రవర్తియాజ్ఞ యట్లే యైనది.

కొలఁదిసేపటిలోనే యా యిరువురు నంతఃపురద్వారమును సమీపించిరి. అప్పుడు వినయసేనుఁ డొకపరిచారికను బిలిచి మహామంత్రిని సార్వభౌములకడకుఁ గొనిపొమ్మనిచెప్పి తాను మరల భవనముఖద్వారముకడకు వచ్చి నిలిచెను.

ఇంతలో నచ్చటి కొకశిబిక వచ్చెను. దానినుండి నారాయణశర్మ యప్పుడే దిగుచుండెను. తోడనే వినయసేనుఁ డాతనియొద్దకుఁ బోయి నమస్కరించెను.

నారా—ఏమివినయా! ఈయకాలమున సభాసమావేశమునకుఁ గారణ మేమి? అప్రతిహార్యం బగు కారణముచే నాకిప్పు డింత యాలస్యమైనది.

విన—(నవ్వి) మహారాజాధిరాజును, యశోధవళుఁడు నించుమించుగా రెండుజాములనుండి మీరాకకుఁ బ్రతీక్షించుచున్నారు.

నారా— అందఱును వచ్చిరా?

విన— లేదు—ఇంతకుముందే మహామంత్రి వచ్చెను. ఇప్పుడు మీరు వచ్చితిరి.

నారా—తక్కినవారో?

విన—ఇఁక రావలసినవారెవ్వరును లేరు. మహారాజుగారీ సభకు మంత్రులనందఱను బిలిపింపలేదు.

నారా—అట్లయినచో నిఁక రావలసినవారెవ్వరున్నారు?

విన—మహాబలాఢ్యుఁ డగు హరిగుప్తుఁడు మాత్రమే—

నారా—రామగుప్తుఁడుగూడ లేఁడా?

విన—లేరనియే తోఁచుచున్నది. ఏమో! నాకు నిశ్చయముగాఁ దెలియదు. వారి కాహ్వానము పోనిమాటమాత్రము నిజము.

నారా—సరే—పద.

విన—దయచేయుఁడు.

ఇద్దఱును ప్రాసాదాంతర్భాగమునఁ బ్రవేశించిరి. ఇంతలో నచ్చటికొకబిచ్చగాఁ డేతెంచి ద్వారపాలకునిం గాంచి "అన్నా! నేఁడు నగరున భిక్ష దొరకునా?" అని యడిగెను.

ద్వార—దొరకదు.

విన—మఱి యెచ్చట దొరకును?

ద్వార—(కోపముతో) నేఁడిచ్చట భిక్షమే దొరకదు.

ద్వారపాలకుని యీప్రత్యుత్తరమువలన బిచ్చగాఁ డించుకంతయును హతాశుఁడు గాలేదు. అతఁడు మెల్లమెల్లఁగా నా యంగణమును దాఁటిపోయెను. అరుఁగుకంబములమఱుఁగున నిలిచియుండిన దండధరుఁ డొకఁడాతనిం గాంచి ద్వారపాలకునికడకుఁ బోయి "ఇప్పుడులోనికిఁ బోవుచున్నవాఁడెవఁడు?" అని యడిగెను.

ద్వార—ఎవ్వఁడో బిచ్చగాఁడు.

దండ—వాఁడు వచ్చినపని యేమి?

ద్వార—ఏమున్నది? భిక్షమడుగుటయే—

దండ—వాఁడు నిన్నేమైననడిగినాఁడా?

ద్వార—లేదయ్యా!

దండ—వాఁడు నిజముగా ముష్టివాఁడేనా? అనుమాన మేమియు లేదుగద!

ద్వార—ఏమో! నేను వాని నంత బాగుగాఁ జూడలేదు.

దండ—సరే—ఎవ్వరైన నిన్నడిగినచో జాగ్రత్తగాఁ బ్రత్యుత్తర మీయవలెను.

ద్వారపాలకుఁ డంగీకారసూచకముగా శిరఃకంపము గావించెను. అంతలో నొకయశ్వారోహి యాయంగణముకడకు వచ్చి నిలిచెను. దండధరుఁ డాతనిం గాంచి వినయసేను నటకుఁ దీసికొని వచ్చెను. ద్వారపాలురును, దండధరులందఱును నాతనికి నమస్కరించిరి. వినయసేనుఁడుకూడ నాతనికిఁ బ్రణామము చేసి యాతని నంతఃపురమునకుఁ దీసికొనిపోయెను.

అప్పుడు మఱియొక ద్వారపాలకుఁడు మనకుఁ బరిచితుఁడైన బిచ్చగానిని బట్టుకొని బయటి కీడ్చుకొనిపోయి నిలువఁబెట్టి యటనున్న ద్వారరక్షకునిం గాంచి "ఓరీ! మహాప్రతీహారి యెక్కడ నున్నాఁడు?" అని ప్రశ్నించెను.

రెండవద్వార—మహాబలాధ్యక్షునితో లోపలికిఁబోయినాఁడు.

మొదటి—అట్లయినచో నిప్పు డొకదండధరుని బిలుచుకొని రమ్ము.

రెండవ—ఎందులకు?

మొదటి—వీఁడు లోపలఁ జాటున దాఁగి లోనికి వచ్చుపోవువారి నందఱ నొరకంటఁ జూచుచు వారిప్రవర్తనములను బరికించుచున్నాఁడు. అందుచేత నే వీనిని బట్టి తెచ్చితిని.

ఇంతలో నొకదండధరుఁ డచ్చటికి వచ్చి యాద్వారపాలకులం గాంచి "వీఁడు బిచ్చమడిగికొనుటకై వచ్చియుండెనుగదా!" అనియెను.

ద్వార—ఔను.

దండ—అట్లయినచో వీని నేల పట్టితెచ్చితివి?

ద్వార—వీఁడు లోపలికి వచ్చి యున్నిసంగతులను బరికించు

చున్నాఁడు. నా కనుమానము గలుగుటచే నిట్లు వెలుపలి కీడ్చుకొని వచ్చితిని.

దండ—మంచిపని చేసితివి. వీనిని గట్టిగ బంధించియుంచుము. నేనిప్పుడ పోయి మహాప్రతీహారిని బిలిచికొని వచ్చెదను.

ద్వితీయద్వారపాలకుఁ డాబిచ్చగానితలపై నున్నవస్త్రమును దీసి దానితోనే యాతని బంధింపఁదొడఁగెను. ఆవస్త్రమును దీసినంతనే యాభిక్షుకుని బోడితల యందఱకును గానవచ్చెను. అప్పుడు దండధరుఁడు "ఔరా! వీఁడెక్కడి బిచ్చగాఁడురా! వీఁడు కేవలమును బౌద్ధభిక్షునివలె నున్నాఁడు! నిజముగా నీతఁడు గూఢచారియే యై యుండును" అనియెను.

ఇంతలో దండధరునితోఁ గలసి వినయసేనుఁ డచ్చటికి వచ్చి యాభిక్షుని యాపాదమస్తకమును దిలకించి "నీవిచ్చటి కేల వచ్చితివి?" అని ప్రశ్నించెను.

బిచ్చ—భిక్ష మడిగికొనుటకు—

విన—మంచిది—వాడలోనికిఁ బోయి యడిగికొనవలయును—గాని యంతఃపురమున నెవ్వరికైన భిక్షము పెట్టుదురా?

బిచ్చ—నేనీనగరమునకుఁ గ్రొత్తవాఁడను—ఇక్కడిపద్ధతులు నాకేమియుఁ దెలియవు.

విన—అలాగా? నీతలయంతయు నిట్లు ముండితమై యున్న దేల?

బిచ్చ—నాకు వాతరోగ మున్నది. అందుచే నిట్లు చేయవలసి వచ్చినది.

అప్పుడు లోపలినుండి దండధరుఁడు వచ్చి వినయసేనుం గాంచి "సార్వభౌములవారు మిమ్ముఁ బిలుచుచున్నారు" అని చెప్పెను.

వినయసేనుఁ డొకద్వారరక్షకునిం బిలిచి "నీవీబిచ్చగానిం దీసికొనిపోయి నగరుచెఱసాలయందు నిర్బంధింపుము. నాయాజ్ఞ లేకుండ

సింహాసనపటాంగణమునకుఁగూడ నెవ్వరిని రానీయవలదు" అని కట్టడఁ జేసి యాదండధరునితో వెడలిపోయెను.

అంతఃపురమునందలి యొకచిన్నమహాలులో స్వర్ణపీఠమునఁ జక్రవర్తి యాసీనుఁడై యుండెను. ఆతని కనతిదూరమున నేలపైఁ బఱచిన వేఱువేఱాసనములపై హృషీకేశ, నారాయణశర్మలు కూర్చుండి యుండ హరిగుప్తుఁడు మహాలుతలుపునొద్ద నిలువఁబడి యుండెను. ఆకవాటమునకుఁ గొంతదూరమున దండధరులు కొందఱు నిలిచి యుండిరి.

అప్పుడు వినయసేనుఁడు వచ్చి "నాకు సార్వభౌములయాజ్ఞ యైనదఁట!" అనియెను.

హరి—ఔను, లోనికేరమ్ము!

వినయసేనుఁడు లోపలికిఁ బోయి సార్వభౌమునకుఁ బ్రణమిల్లెను. సార్వభౌముఁ డాతనిం జూచెను గాని యేమియు మాటాడ లేదు.

అప్పుడు యశోధవళుఁడు చక్రవర్తిం గాంచి "మహారాజాధిరాజా! వినయసేనుఁడు వచ్చియున్నాఁడు. యువరాజును దోడితే నాజ్ఞాపింపవలయును!" అనియెను.

ఇంతవఱకు నధోవదనుఁడై యున్నచక్రవర్తి తలపైకెత్తి మెల్లఁగా "యశోధవళా! జ్యౌతిష మెన్నటికిని నత్యదూరము కానేరదు. ఇప్పటినుండియే రాజకీయవ్యవహారములందు శశాంకుని ముంచివేయవలదు" అనియెను.

యశో—(గంభీరస్వరముతో) మహారాజాధిరాజా! యువరాజును రాజ్యవ్యాపారములందుఁ జేర్పకున్నచో నిఁక సామ్రాజ్యరక్షణమునకు వేఱుపాయము లేదు. హృషీకేశ, నారాయణశర్మలును, యుద్ధవ్యవసాయములందే పలితకేశుఁ డైపోయినమహాబలాధ్యక్షుఁ

డును నేనుగూడ మీచరణసన్నిధి నెన్నియోసారులు మనవి చేసికొని యున్నారము. ఇప్పుడు మనసామ్రాజ్య మెట్టిదుర్దశలపాలై యున్నదో తమరెఱుంగనిసంగతి గాదు. జ్యోతిశ్శాస్త్రముపై వెఱ్ఱినమ్మకముంచి తదనుసారముగా రాజకీయవ్యవహారములను జరిగించుట యెంతమాత్రమును న్యాయము గాదు. ఒకవేళఁ గుమారశశాంకునిచేతనే సామ్రాజ్యవినాశనముం గావింపవలయు నని యీశ్వరోద్దేశ మైనయెడల నట్టివిధివిధానమును దప్పించుట యెవ్వరిశక్యము? కాని వృథావిశ్వాసమునకు లోనై యాత్మరక్షణోపాయము నాలోచింపక యూరక కూర్చుండియుండుట ప్రాజ్ఞలక్షణము గానేరదు. కుమారునకు రాజకీయవిషయము లేవియుఁ దెలియకుండుటయే మీయనంతరమున సామ్రాజ్యవినాశనమునకుఁ గారణ మగును. మీరట్లు తెలియనీయకుండుటచేతనే దైవజ్ఞులపలుకులు నిక్కము లగుటకు సాహాయ్యము చేసినవారగుచున్నారు.

వృద్ధసార్వభౌముఁ డధోవదనుఁడై యూరకుండెను. ఆతఁ డేమియుఁ బలుకకుండుటం గాంచి హృషికేశశర్మ "మహారాజాధిరాజా! మహానాయకుఁ డిప్పుడు సూచించినయాలోచనయే సర్వోత్తమముగా నున్నది. మీరును, మేమందఱమునుగూడ వయోవృద్ధులమైపోయితిమి. మా కాలము నిండిపోవుచున్నది. మనయనంతరము యువరాజు కఠోరరాజనీతిచక్రమునం జిక్కి, పరిసరములయందలి యసహ్యపరిస్థితులం గాంచి మనలనందఱను బిచ్చివారినిగా భావించి దూషింపకుండ మున్నుగనే మనకర్తవ్యముల నుచితరీతిని నిర్వహింపవలసి యున్నది. యువరాజుమూలముననే యీసామ్రాజ్యనాశనము కావలయునని విధాతృనుద్దేశ మైనయెడల దానినిరక్షించుట కెవ్వరికిని శక్యము గానేరదు. కాని యిదియే విధాతృనుద్దేశమని యెవ్వరో చెప్పినమాటలను నమ్మి యూరకచూచుచుండినచో నిశ్చయముగనే—అతిశీఘ్రముగనే—యిది వినాశనము కాక మానదు" అని మనవి చేసెను.

చక్రవర్తి యేమియుమాటాడలేదు. కొంతసేపటివఱకును సభయంతయు నిశ్శబ్దముగా నుండెను. అనంతరము నారాయణశర్మ చక్రవర్తినుద్దేశించి "మహారాజాధిరాజా!—"అనియెను.

ఈసంబోధనముచేఁ జక్రవర్తికిఁ జింతాభంగ మయ్యెనుగాఁబోలును! ఆతఁ డించుక తలయెత్తి "యశోధవళా! అట్లే కానిండు! విధివిధానము నెవ్వరు తప్పింపఁగలరు? " అనియెను.

యశోధవళుఁ డానందముతో "మహాప్రభూ! వినయసేనుఁడు వేచియున్నాఁడు " అనియెను.

చక్ర—మహాప్రతీహారీ! యువరాజశశాంకు నతిగూఢముగా నిటకుఁ దోడ్కొని రమ్ము!

వినయసేనుఁడు చిత్తమని ప్రణామము చేసి వెడలిపోయెను.

చక్ర—(నిట్టూర్పు విడిచి) యశోధవళా! మే మేమి చేయవలయునని నీయభిప్రాయము?

యశో—నాలుగాలోచన లున్నవి. వాని నేలినవారిచరణసన్నిధి నిదివఱకే మనవిచేసియుంటిని. ఇప్పుడీసభలో నీయధికారుల యెదుటఁగూడఁ దెలుపవలయు నని నాకోరిక—

చక్ర—యశోధవళా! నీయాలోచన లన్నియును నేనే మంత్రులకుఁ దెలియఁజేయుదును. మంత్రివరులారా! మహానాయకుఁడు నాకు నాలుగువిధానములను సూచించి యున్నాఁడు. అందు మొదటిది:—ప్రాంత కోష్ఠప్రదేశములను జక్కఁగ సంరక్షించునట్టి యేర్పాటులు చేయుట- రెండవది:—పదాతిసేన, ఆశ్వికసేన నౌకాసేన వీనిని మరలఁ గ్రొత్తగా నేర్పరించుట. మూఁడవది:-రాజ్యాకర మగురాజస్వమును సరిగా రాఁబట్టుటకును, రాజకోశమును బూర్ణముగా నిండించుటకును దగినకట్టుదిట్టములను జేయుట—నాలుగవది:—వంగదేశమునందు సామ్రాజ్యాధికారమును యథారీతిగాఁ బ్రతిష్ఠించి సుస్థిర

మగునట్టివిధానమును జరుపుట—మహానాయకుఁడు సూచించిన యీనాల్గువిధానములవిషయమున నెవ్వరికి నెట్టి యాటంకము నుండ దనుకొనియెదను. కాని యట్టియధికారమును వహించుటకుఁ దగిన పురుషులును గావలసినంతధనమును లేకుండుటయే యిప్పుడు ముఖ్య లోపము లై యున్నవి. రాజ్యమునందలిధనాగారమిప్పుడు శూన్య మైయున్నదనియె చెప్పవచ్చును. ఎట్లో దినవెచ్చముమాత్రము గడచుచున్నది. ఇదియు నొకవిధమగునదృష్టమే—సామ్రాజ్యమునందలి నూతనోద్యోగులందఱును స్వకార్యనిర్వహణమున కసమర్థులై యున్నారు. వారికిఁ దమతమపనులు చక్కఁగఁ దెలియనే తెలియవు!

యశో—రాజచూడామణీ! నాసూచించినయీనాల్గుపద్ధతులు నతిశీఘ్రముగ నాచరణమునకుఁ దేకున్నచో సామ్రాజ్యరక్షణమున కవకాశ మేమియును లేదు. ప్రాంతకోష్ఠసంరక్షణమునకై సుశిక్షితమగుసేనయు, ధనాగారమున ధనాభివృద్ధియు నత్యంతావశ్యకములు. సేనాపునస్సంస్కరణమునకును, కోశాభివృద్ధికిని రాజస్వమును గ్రమము తప్పకుండ రాఁబట్టునట్టి యుత్తమవ్యవస్థలను గావింపవలయును.

చక్రి—ఔను నిజమే—కాని నీవు సూచించిన విధానములన్నియును నాకసాధ్యసమస్యలుగనే తోఁచుచున్నవి.

యశో—ఏలినవారికే యట్లు తోఁచుచున్నప్పుడు నేనే వానికిఁ దగినసమాధానము చెప్పవలసియుండును. యువరాజు వచ్చినతరువాత నేనన్నిటిని స్పష్టముగా మనవిచేసెదను. నేను చెప్పినవిధానములలో మూఁడుమాత్ర మీక్షణమునందే క్రియారూపముం గాంచవచ్చును. కాని దానికి విశేషధనసాహాయ్యము కావలయును!

హృషీ—యశోధవళా! ఈధనాభావమే సకలానర్థపరంపరలకును గారణ మైనది. ఈసకలకార్యములకును వలసినంతధనము నీవు డెక్కడనుండి తెచ్చెదవు ?

మహాలువాకిట నిలిచియున్న హరిగుప్తుఁ డప్పుడు లోనికి వచ్చి “కుమారుఁడు వచ్చుచున్నాఁడు” అని చెప్పెను.

అంతలో యువరాజసహితుఁడై విజయసేనుఁడు మహాలునఁ బ్రవేశించెను. యువరాజు ముందుగాఁ దండ్రికి నమస్కరించి పిమ్మట నచ్చటఁ గూడియుండినవృద్ధులకు నమస్కరించెను. చక్రవర్తి యప్పు డాతనిఁ గ్రిందఁ గూర్చుండుమని నియోగించెను. కాని యశోధవళుఁడు శశాంకుని దనతొడలపైఁ గూర్చుండఁ బెట్టుకొనెను.

చక్రి—యశోధవళా! నీవు చెప్పునదేదియో యిప్పుడు చెప్పుము!

యశో-—యువరాజా! సామ్రాజ్యమునకుఁ బ్రస్తుత మతిఘోరంబగుదుర్దశ సంభవించుటయు నీప్రాచీనసామ్రాజ్య మతిత్వరితముగ వినాశనాభిముఖం బగుచుండుటయు మీకుఁ దెలిసినవిషయమే. కావున నిప్పు డెల్లవిధముల నాత్మసంరక్షణము చేసికొనవలసి యున్నది. ఆవిషయమున నిప్పుడందఱు నౌదాసీన్యమును వహించియున్నారు. ఇప్పు డెల్లరయందును, నజాగ్రత్తయు, నసమర్థతయు నుత్పన్నములై యున్నవి. ఈప్రాచీనసామ్రాజ్యముతోఁ గోట్లకొలఁది ప్రజలప్రాణమాన ధనంబులు సంబంధించి యున్నవి, ఇది నాశనమయ్యెనా దేశమంతటను మహాప్రళయము తటస్థింపఁగలదు. అతిప్రాచీనం బగునీసామ్రాజ్యమున కిట్టిదుర్దశ యెన్నఁడును సంభవించియుండలేదు. శకజనులదండయాత్రలకాలపు ఘోరానర్థముల నిప్పటికిఁ బ్రజలు మఱచిపోయియేయుందురు. హూణుల దండయాత్రలలో మాత్రము పురుషపురము, కన్యాకుబ్జమును నాశనమయ్యెను. కాని వారు పాటలీపుత్రప్రాకారము నైనను స్పృశింపఁజాలకపోయిరి. ఇట్టిసామ్రాజ్యము నాశ మయ్యెనా దేశమంతయు నాశనమైనదనియే భావింపవలయును. యువరాజా! మీజనకులు వృద్ధులైయున్నారు. మీరిద్దఱును బసికూనలు. ఇప్పుడు

పూర్వదేశమున సుప్రతిష్ఠితవర్మయుఁ బశ్చిమమునఁ బ్రభాకరవర్ధనుఁ డును జక్రవర్తిమరణమునకొఱకుఁ బ్రతీక్షించుచున్నారు. సామ్రాజ్య రక్షణమున కిఁక నేయుపాయమును లేదని నిరాశుఁడై సార్వభౌముఁ డూరక కూర్చుండి యున్నాఁడు. కాని యిట్లూరక చూచుచుండుట న్యాయమా? ఎవ్వఁ డాత్మరక్షణవిషయమునఁ గ్రియాతత్పరుఁడు గాక యుండునో, ఎవ్వఁడు కేవల మదృష్టముపై భారమును వైచి యుదాసీనుఁడై భవిష్యము నెదురు చూచుచుండునో యాతనింబోలిన యాత్మఘాతుకుఁడు మఱియొకఁ డుండఁడు! కుమారా! ఎట్టిప్రయత్నమును లేకుండుటచే సామ్రాజ్యమున కెట్టిగతి పట్టినదో యాలోచింపుము! సీమలయందలి దుర్గము లొక్కప్పుడైనను బాగుచేయింపకుండుటచే నవి నిరుపయుక్తములై పోయినవి. సేనాభావమువలన వానిని రక్షించుట యసాధ్య మయ్యెను. రాజస్వము నియమానుసారముగాఁ గోశమునకుఁ జేరుచుండుట లేదు. పూర్వభూస్వాముల యధికారము లోపించిపోయినది. నూతనస్వాములు రాజకీయాధికారుల యాజ్ఞల నణుమాత్రమైనను పాలించుట లేదు. అందువలన సామ్రాజ్యకోశాగారము వట్టిదై యున్నది. అనేక సంవత్సరములనుండి నగరావరణములు కాలువలును బాగుచేయించుటయే లేదు. చుట్టునున్నకందకము వట్టిపోయినది. అచ్చటిద్వారమే క్రమముగా గడ్డిబీడుగానున్నది. ఇట్టిస్థితిలో మనపై నెవ్వరైన నెత్తివచ్చినచో మనకు సంపూర్ణముగా నపజయమే. అప్పుడు మనబాధలు కుక్కలకైన నుండవు. నేనిప్పుడు నామనుమరా లగులతిక కొకబట్టెఁడన్నముకొఱకు సార్వభౌముని యాచింప వచ్చియుంటిని. కాని బాగుగఁ బరీక్షింపఁగా నాయన్నదాతయింటనే యన్నాభావము తటస్థించినట్లు తోఁచుచున్నది. కుమారా! అనేకసంవత్సరములకుఁ బూర్వము—మాతండ్రిగారు క్రొత్తగా సింహాసనము నధిష్ఠించినప్పుడు—నేను గొంతవఱకు రాజకీయకార్యభారమును

వహించి యుంటిని. ఇప్పటి సామ్రాజ్యస్థితిగతులంగాంచి మరల నీవృద్ధావస్థలో నట్టిభారమును దలపై మోపుకొనఁ దలఁచి యున్నాఁడను. కాని మేమందఱమునుగూడ ముసలివారము—వందుటాకులము—మావలనఁ జాలకాలము పనులు జరగునట్లు తోఁచుట లేదు. యువరాజా! మీతండ్రిగారి తరువాత నీసింహాసనము నధిరోహించువారు మీరే—అప్పు డీసర్వకార్యభారమును మీపైఁ బడఁగలదు. కావున మీరు రాజకార్యనిర్వాహణమునం దిప్పటినుండియుఁ బ్రవీణులగుట యావశ్యకము! మీవంటివారి సాహాయ్యము లభించినచో మాభారము కొంతవఱకుఁ దగ్గఁగలదు, కుమారా! నేఁటినుండియు మీరు రాజకార్యములను జూచుకొనుచుండవలయును.

యువరాజ శశాంకుఁ డింకను మహానాయకునంకమునఁ గూర్చుండియే యుండెను. అప్పుడాతఁడు మృదుస్వరముతో "నాయనగారి యాజ్ఞ యెట్లో, యట్లే చేయుటకు సంసిద్ధుఁడనై యున్నాను." అని తండ్రి మొగము వంకఁ జూచెను.

చక్రి—(విషణ్ణుఁడై) శశాంకా! నీవు నేఁటినుండియు రాజకార్య నిర్వాహణదీక్షితుఁడవు కావలయు నని వీరందఱును గోరుచున్నారు. ఇంకను బాలకుఁడవె యైనను నీవీభారమును వహించి తీరవలయును. యశోధవళుఁడు నీకెల్లవిషయములను బోధింపఁగలఁడు. నీవెల్లప్పుడు నాతఁడు చెప్పినట్లు చేయుచుండినఁ జాలును.

మహానాయకుఁడగు యశోధవళుఁడు ప్రసన్నవదనముతో నప్పుడు తానుసూచించినవిధానములంగూర్చి యువరాజునకు విస్పష్టముగా నెఱిఁగించి ప్రస్తుత మన్నిపనులకు ధనమావశ్యకమనియు, రాజ్యమునందలి లక్షాధికారులయొద్దఁ గొంతధనమును ఋణముగాఁ గైకొనుటకుఁ బ్రయత్నింపవలయు ననియు సూచించెను.

హృషీ—(నిరాశతో) యశోధవళా! మనయిట్టిదుస్థితి నెఱింగి యుండియు మనకెవ్వరు ఋణమునిచ్చెదరు? ఈయవస్థలో ఋణము సంపాదించుట సులభమనియే నీకుఁ దోఁచుచున్నదా?

యశో—ఆ! అట్లే తోఁచుచున్నది. మనరాజ్యమునందలి ప్రజలు మనకు నిశ్చయముగా ధనము నీయఁగలరు. ఆలక్షాధికారులసంపదకంతకును హేతువైనది వారిబుద్ధియే—ఆబుద్ధిబలము వలననే వారుకోట్లకొలఁది ధనము నార్జించి యున్నారు. ఆధనసంరక్షణమునకై యందొక్క భాగమును మనకు బదులిచ్చుటకు వారెంతమాత్రమును వెనుదీయరు. సామ్రాజ్యరక్షణ మనిన వారి సంరక్షణమేగదా! ఈ సామ్రాజ్యమే నశించినచో వారికిని సర్వనాశనము కాకమానదు. ఈసంగతులను మాత్రము వారికిఁ జక్కఁగా బోధింపవలసి యుండును. ఇంతే—ఇట్లు చేసినచో మనకుఁ గావలసినంత ధనమును సంపాదింపఁ గలమని నాకు నిశ్చయముగాఁ దోఁచుచున్నది.

చక్రి—మంచిది. కాని యశోధవళా! సామ్రాజ్యకార్య నిర్వహణభారమును మీరువహించియున్నట్లు మనసామ్రాజ్యమునందలి సర్వాధికారులకును దెలియఁజేయుట యావశ్యకము గాదా?

యశో—కాదు—మహారాజా! అట్లుగావించినచో మనయుద్దేశముల కన్నిటికిని భంగము గలుగఁగలదు. నేనీ మహామంత్రులచాటుననుండి మౌనముతోఁ గార్యములను నిర్వహింపవలయు నని నిశ్చయించుకొన్నాను.

చక్రి—సరే—నీయిష్టము వచ్చినట్లు చేయుము.

ఇరువదియవప్రకరణము.

ఆరాత్రి తరళ వసుమిత్రిని వెంటఁబెట్టుకొని తనపినతల్లి యిల్లుచేరెను. ద్వారముకడ నిలిచి యామె యెంతయోసేపు బిగ్గఱగాఁ గేకలువైచి పిలిచెను. తలుపు గట్టిగాఁ దట్టెను. ఈసంస్కారము లన్నియు నైనపిమ్మటఁ గొంతసేపటి కావృద్ధురాలు మేల్కాంచి తనలో నేమేమియో గొణఁగుకొనుచు వచ్చి తలుపుదెఱచెను.

తరళ వసుమిత్రినితో లోపలఁ బ్రవేశించెను. ఆయంధకారములో వారివేషము లాముసలిదాని కగపడలేదు. తరళ యొకగదిలో వసుమిత్రకు శయనించుటకుఁ దగిన యేర్పాటు చేసి తాను తనపినతల్లి ప్రక్కలోఁ బరుండెను. ముసలిదానికి నిద్ర పట్టుట లేదు. వార్ధకమునందు నిద్దుర సరిగాఁ బట్టదు. అందునొకసారి నిద్రాభంగమైన పిమ్మట నిఁకఁ జెప్పవలయునా? వృద్ధురాలికిఁ గోపము హెచ్చిపోవుచుండెను.

వృద్ధు—(గొణఁగుకొనుచు) ఏమిపిల్లవే నీవు? ఇంతరాత్రివేళ నెవ్వరినో మిత్రురాలిని దీసికొని వచ్చుటే కాక యామె నొంటిగా నొకగదిలోఁ బరుండఁబెట్టి నీవిక్కడకు వచ్చితివి. ఇది నాకెంతకష్టముగా నున్నదనుకొన్నావు? నిన్నేమందునే. ఇంటికి వచ్చినవారి నీవిధముగా నవమానించుట యెవ్వరికైన మరియాద యగునఁటే !

తర—నేనుమాత్ర మేమి చేయుదునే పిన్నీ? అక్కడ నూరక దోమలు కుట్టుచున్నవి. ఆబాధచే నిద్రయే పట్టుటలేదు! అబ్బా!

వృద్ధు—(కోపముతో) ఓహో! నీవు పట్టపురాణివైతివి కాఁబోలు! దోమలమూలమున నిద్రవచ్చుటలేదా? ఎంతసుకుమారివి! ఇట్టి నీకొక్కరియింట దాసీతనముగూడ నెందులకే—కాలిపైఁ గాలు

వైచుకొని యానందముతోఁ గూర్చుండి మహావైభవ మనుభవించు చుండుటకు నీతల్లిదండ్రులు నీకొక్క చిన్నరాజ్యమైనను సంపాదించినారు కారు.

వృద్ధురా లింకను సణుఁగుచునే యుండెను. ఆమెనోరు తుపాకినాళమే యనిచెప్పవచ్చును. ఆమె యెన్నితిట్లు తిట్టినను మాఱుమాటాడక తరళ నెమ్మదిగా నామెప్రక్కను బరుండియుండెను. ముసలిదాని సణుఁగుమూలముననూ, దనయాలోచనముననూ దరళ కిఁక నారాత్రి కన్నులు మూఁతలువడనేలేదు.

ఉషఃకాలమున కొక్కించుకపూర్వము విహంగకలకలారావములారంభమైనసమయమునఁ దరళ శయ్యపైనుండి లేచెను. పిన్ని యింకను గురకపెట్టి నిద్రించుచునే యుండెను. అప్పుడు తరళ యడుగులచప్పుడు గాకుండ మెల్లగ నడచి బయటికి వెలువడియెను. రాత్రియంతయు నాలోచించి యామె యొకయుపాయమును నిశ్చయించుకొనియెను. సార్వభౌముని ప్రసన్నదృష్టిని వసుమిత్రునికడ కాకర్షించుట యుపాయమని యామెకుఁ దోఁచెను. పగటివేళ వసుమిత్రుఁడు కనఁబడినంతమాత్రమున భిక్షులాతని మరల మఠమునకుఁ దీసికొనిపోక మానరు. ఈపాటలీపుత్రమున భిక్షుల నెదిరించుటకుఁ గాని, వారి నాటంకపఱచుటకుఁ గాని యెవ్వరును సాహసింపరు. ఇవి యన్నియు బాగుగ నాలోచించుకొని తెల్లవాఱకుండఁగనే వసుమిత్రుని వెంటఁ బెట్టుకొని పోయి రాజభవనద్వారముకడఁ గూర్చుండవలయుననియు, నట్లు చేసినచోఁ దన్నుఁ గాని, వసుమిత్రునిగాని యెవ్వరును నిర్బంధించి తీసికొనిపోవఁజాల రనియు భావించుకొనియెను.

అప్పు డామె తన యెప్పటివేషముం దాల్చి తానదివఱకుఁ గొని తెచ్చినపురుషోచితవస్త్రములను వసుమిత్రునకుఁ గట్టనిచ్చి తమ యిరువురి బౌద్ధవేషవస్త్రములను దీసివైచి యొకమూలలో దాఁచెను.

ఇంకను చిన్నమ్మ నిదురించియే యుండెను. ఆసమయమున వారిరువురును జప్పుడు సేయకుండ నాయిల్లు విడిచి పోయిరి.

అప్పటికి ంకను మార్గమున జనసంచారము లేదు. పూర్వదిక్తటంబున సిందూరకాంతులు ప్రసరించుచుండెను గాని యింకను జీకటులు విరిసిపోలేదు. తరళావసుమిత్రు లతిత్వరితముగ నడుగులిడుచుం బోయి కొలఁదిసేపటిలోనే ప్రాసాదతోరణద్వారమును జేరుకొనిరి.

ద్వారముకడ నున్నదీప మింకను వెలుఁగుచునే యుండెను. అట నందందుఁ గొందఱు ప్రతీహారులు శయనించి యుండిరి. ఒక్క ప్రతీహారిమాత్రము చేతియందలిశూలముపైఁదనుభారమునువైచి కునుకుపాట్లు పడుచుండెను. తరళ మెల్లఁగ నడుగులవైచి యాతని దప్పించుకొని నిరాతంకముగా లోపలఁ బ్రవేశించెను. ప్రతీహారి యామెను గనుపెట్టనేలేదు.

తోరణమునొద్దఁ బరుండియున్నకుక్కలుమాత్రము వారిం గాంచినంతనే మొఱుఁగనారంభించెను. ఆయఱపులచేఁ బ్రతీహారి మేల్కాంచి యెదుటనున్నవసుమిత్రునిం గాంచి చటాలున లేచి యాతనిచేయి పట్టుకొని "ఎక్కడకుఁ బోవుచున్నావు" అని ప్రశ్నించెను.

ఆవిపరీతసంఘటనముం గాంచి తరళ వెనుకకుఁదిరిగివచ్చి యాప్రతీహారిపాదములపై వ్రాలి "అయ్యా! మేము గొప్పచిక్కులలోఁ బడియున్నారము. మాపైఁ గరుణింపవలయును. మమ్ము విడిచిపెట్టుము! నాయీసోదరుని ప్రాణభిక్షమును యాచించుటకై నేనీతనిని సార్వభౌమసన్నిధికిఁ గొనిపోవుచున్నాను. తెల్లవాఱినచో బౌద్ధభిక్షులీతనిం బట్టి తీసికొని పోవుదురు; చంపివేయుదురు— మేమేమియు నల్లరి చేయువారము గాము- అంతఃపురద్వారముకడ నిరీక్షించి యుండుము. సార్వభౌములదర్శన మైనంతనే వారిపాదముల కెఱగి ప్రాణభిక్షమును వేఁడుకొందము!' అని వేఁడుకొనియెను.

ఈగోల విని పరుండియున్న మఱికొందఱు ప్రతీహారులు కూడ మేల్కాంచిరి. వారిలో నొకఁడు తరళంగాంచి "నీవు వచ్చినపని యేమి?" అని యడిగెను.

తరళ జాలిగొలుపునట్లు బెదరుచూపులు చూచుచు నిదివఱకుఁ బ్రతీహారికిఁ దెలిపినవిషయమునే యతికరుణముగా మనవిచేసి లోనికిఁ బోనీయవలయు నని ప్రార్థించెను.

తరళ నిట్లుప్రశ్నించినవాఁ డొకదండధరుఁడు; ప్రతీహారి యాతనిం గాంచి "ఏమనియెదరు? వీరిని విడువవచ్చునా?" అనియెను.

దండధరుఁడు తరళం గాంచి "మీరిప్పుడు తిన్నఁగా నెక్కడకుఁ బోయెదరు?" అనియెను.

తర—(ఏడ్చుచు) అయ్యా! మేమెక్కడకును బోము. మేమేమియుఁ జేయము! అంతఃపురద్వారముకడ నిలిచియుందు మంతే—తెల్లవాఱి సార్వభౌములు వచ్చినతరువాత వారిపాదములపైఁ బడి ప్రార్థించెదము.

కరుణాపూర్ణం బగునబలలయశ్రుజలప్రసారమువలన—అందును సుందరు లగు తరుణులయుష్ణాశ్రుపాతమువలన—ఘనపాషాణములుగూడఁ గరఁగి నీరై పోవును! ఇట్టిస్థితిలోఁ దరళంబోలిన సుందరయువతిరోదనమువలన సామాన్యప్రతీహారులకును, దండధరులకును గరుణ గలిగె ననుటలో వింత యేమున్నది? వారిరువురు నొక్కింతయూరకుండుటం గాంచి తరళయుఁ దన రోదనప్రమాణము నొక్కించుకవృద్ధి నందించెను. అప్పుడు దండధరునిహృదయము ద్రవీభూత మయ్యెను. అప్పుడు వాఁడు "వీరు దుర్మార్గప్రవర్తకులు గారనియే నాకుఁ దోఁచుచున్నది. వీరిద్దఱిని విడిచిపెట్టవచ్చును" అనియెను.

ప్రతీహారి వారికిఁ ద్రోవ యొసఁగి ప్రక్కకొసరిల్లెను. అట్లు విజయముం గాంచినతరళ వసుమిత్రునితో నెట్టకేలకు వాడలోఁ బ్రవేశించెను.

ప్రథమతోరణమునంటి యతివిస్తీర్ణంబగు నొకతటాంగణముండెను. దాని యుత్తరభాగమున మఱియొకతోరణముండెను. తరళా వసుమిత్రులాతోరణద్వారమునుగూడఁ గడచి మఱియొకతోరణమును జేరుకొనునప్పటికిఁ జీకటిపోయి తెల్లవాఱుచుండెను. అక్కడనున్న ప్రతీహారులుగూడ నామెప్రార్థనమును మన్నించి యిరువురను లోనికిఁ బోనిచ్చిరి.

అటుపిమ్మటఁ దరళావసుమిత్రులు సభాగృహము, ధర్మాధికరణము, అస్త్రశాల మొదలగు ప్రదేశములను గడచి తృతీయతోరణముకడకుఁ బోయిరి, అచ్చటమాత్ర మెంతప్రయత్నించినను బ్రతీహారులు వారిని లోనికిఁ బోనీయలేదు. అటనుండి పోనిచ్చుటకు సార్వభౌమునియాజ్ఞ కావలయును. అందుచే నుపాయాంతరము లేక యిరువురు నాతోరణముకడనే కూర్చుండి యుండిరి.

క్రమముగా సంధకార మంతయుఁ దొలఁగిపోయెను. పటాంగణమున జనసముదాయము చేరుకొనియెను, అధికారు లొక్కరొక్కరుగా వచ్చుట కారంభ మయ్యెను. సూర్యోదయ మగుటకుఁ గొంతముందుగనే ద్వారరక్షకసైన్య మచ్చటికి వచ్చి యాద్వారమును వశపఱచుకొనియెను.

ఇఁకఁ దరళకు లోని కేఁగుట కనుజ్ఞ యయ్యెను. తృతీయతోరణములోపలివైపునఁ బురాతన నూతనరాజప్రాసాదము లున్నవి. పశ్చిమభాగమున నున్నపురాతన భవనమంతయుఁ బడిపోవుటకు సిద్ధముగా నుండెను. ఆప్రదేశమంతటను జిట్టడవిబలసి పోయెను. ఉత్తరమున గంగాతీరమునందు నూతనప్రాసాద మున్నది.

ఆనూతనప్రాసాదాంతఃపురద్వారము చెంతకుఁబోయి "అమ్మయ్యా" అని తరళ యొక్కనిట్టూర్పు విడిచెను. అప్పు డామెహృదయోద్వేగము చాలవఱకు శాంతించెను. ఇచ్చట నుండఁగా నిఁక నెవ్వరును

వసుమిత్రుని బలవంతముగాఁ బట్టి తీసికొని పోఁజాలరని యామెకు ధైర్యము గలిగెను. తరళ నిశ్చింతయై నిశ్చలచిత్తముతో సార్వభౌమునిరాక కెదురు చూచుచుండెను.

తృతీయతోరణబహిరంగణమున జనులు గుంపులుగూడునప్పటి కింకను నూతనపురాతనరాజభవనములు నిద్రాముద్రితములై యుండెను గాఁబోలును. నిశ్శబ్దముగ నతిజాగరూకులై యామికులు మెల్లగఁ బచరించుచుఁ బ్రజలామార్గమున సంచరించుచుండిరి. తరళ యచ్చటఁ గూర్చుండి యనేకవిషయములం గూర్చి యాలోచించుచుండెను. సార్వభౌముఁ డేవిధముగా దర్శించి ప్రార్థింపవలయు ననునాలోచనయే యామెహృదయమును బాధించుచుండెను. వసుమిత్రునకుఁ జక్రవర్తి యాశ్రయము నొసంగనని నిరాకరించినచో నేమి గావలయును! ఆతని నిఁక నెక్కడకుఁ దీసికొనిపోవలయును? తన చెలిమికత్తెను—తనస్వామి పుత్రికను—ఏరీతిగా నూరడింపవలయును? ఈవిషయములంగూర్చిన మహాత్త్రాలోచనలచేఁ దరళహృదయము చేపట్టి కలఁచివైచినట్లగుచుండెను. జరగినరాత్రియంతయు, నిద్దుర లేకుండుటచే నామె కునికిపాట్లకు లోనగుచుండెను. అట్లే కూర్చుండి కన్నులు మూసి యొక్కకునుకు దీయుచుండెను.

తరళ యట్లు మైకముతో నుండి యుండి యొకసారి కన్ను దెఱచి పరికించెను. పురాతనభవనము చెంత నున్నతకాయుఁ డగుపురుషుఁ డొకఁ డిటునటుఁ బ్రచారము చేయుచున్న ట్లామె కగపడియెను. అందుచేఁ దరళ యించుకతడఁబడి వసుమిత్రునిఁ గాంచి "సార్వభౌములు వచ్చినారా?" అని ప్రశ్నించెను.

వసు—లేదు.

తర—అదిగో చూడు! అక్కడఁ దిరుగుచున్నవా రెవ్వరు?

వసు—ఎవ్వరో నాకుఁ దెలియదు.

తరళ యేదేనొకవిషయమును గ్రహింపవలసినప్పు డూరక కూరుచుండుస్వభావము గలది గాదు. ఆమె తత్క్షణమే లేచి ధైర్యముతోఁ బోయి యాపురుషుని సమీపించి యాతనికిఁ బ్రణామముం గావించెను.

పురు—నీవెవ్వరమ్మా! నీకేమి కావలెను!

తరళ కిప్పుడు మాత్రము నిజముగానే యేడ్పు వచ్చెను. ఆమె యేడ్చుచునే "మహాప్రభూ! మీరెవ్వరో నేనెఱుంగను. ఎఱుంగకపోయినను మీరేదో యున్నతాధికారము గలసత్పురుషులవలె నాకగపడుచున్నారు. నేనిప్పు డతిదుస్సహంబగువిపత్తునం బడి యెట్లయిన సార్వభౌము నాశ్రయింపఁగోరి వచ్చియున్నాను. మహారాజా! యీవేళ నన్నే కారణముచేనైన రక్షింపక విడిచినచో నాకిఁక గత్యంతరము లేదు—నేనీనగరమునందలి యొక శ్రేష్ఠియింటి దాసిని. నాస్వామిపుత్రికకును—చారుమిత్రుని యేకపుత్రుఁ డగువసుమిత్రునకును వివాహము నిశ్చయింపఁబడియుండెను. చారుమిత్రుఁడు బౌద్ధధర్మావలంబి కావున నాతనికీవివాహ మిష్టముఁ గాదయ్యెను— మాస్వామి వైష్ణవమతావలంబి—చారుమిత్రుఁడు బౌద్ధభిక్షుల కపటబోధనములకు వశుఁడై యజ్ఞానముచే ధర్మద్వేషపాశములకుఁ జిక్కి తనయేకపుత్రుఁ డగువసుమిత్రుని బౌద్ధధర్మమునకు బలిచేసెను. ఆజన్మార్జితంబగు తనసర్వస్వమును బౌద్ధభిక్షుసంఘమునకు దానముచేయు నుద్దేశముతోఁ జారుమిత్రుఁడు తనపుత్రుని బౌద్ధభిక్షునిం జేసివైచుటకు సాహసించెను. భిక్షువైనయాతనికిఁ దనపెద్దలార్జించినధనముపై నెట్టియధికారము నుండదఁట! అందుచేతనే చారుమిత్రుఁ డట్లు చేసెను. వసుమిత్రుని విరహదుఃఖముచే నాప్రభుపుత్రిక మరణించునేమోయనుభయమున నేను వసుమిత్రుని వెదకుటకై బయలుదేఱితిని. అతఁడీయుపనగరమునందలి బౌద్ధ

విహారమునం దున్నాఁడని తెలిసికొని యెంతయో ప్రయత్నము చేసి నిన్నటిరాత్రి యీతని నెట్లో యటనుండి విడిపించి వెంటఁబెట్టుకొని వచ్చితిని, కాని యీతనికిఁదగినయాశ్రయ మెక్కడ నున్నది? ఆవిచారముచే నాకేమియుఁ దోఁచుట లేదు. మీరు సార్వభౌములో కారో నేనెఱుంగను. మీరెవ్వరైన నగుదురుగాక! మీయాకారముం గాంచినంతనే మీరు దయాస్వరూపులు, ప్రేమావతారులు, కృపామూర్తులునని నాహృదయమునకుఁ దోఁచుచున్నది. అనాథులము, ననపరాధులము నగుమామువ్వురకును మీచరణసన్నిధి నాశ్రయ మొసంగి రక్షింపవలయును. పట్టపగలు, బట్టబయటను మేము భిక్షులకంటఁ బడినచో వారు బలవంతముగా మఠమునకు మమ్మీడ్చుకొనిపోయి చంపక మానరు. ఈనగరమునం దింకను బౌద్ధులశక్తి యధికముగనేయున్నది. ఆబౌద్ధులబారినుండి మమ్ము రక్షింపఁ గలసమర్థుఁ డీరాజధానియం దొక్కఁడును లేఁడు! ఈసమయమున రక్షింపకున్నచో మాకిఁకఁ బ్రాణరక్షణము లేదు" అని ప్రార్థించుచు నేడ్చుచునే తరళ యాతనిపాదములపై వ్రాలెను. ఆపురుషుఁడు తరళ నూఱడించి "నీవిఁక నెంతమాత్రమును భయపడవలదు. ఆశ్రేష్ఠితనయుఁ డెక్కడ నున్నాఁడు" అనియెను.

తరళ యాతనికి వసుమిత్రుని వ్రేలితోఁ జూపించెను. ఆపురుషుఁడాతనిఁ దనచెంతకు రమ్మని సంజ్ఞ చేసెను. వసుమిత్రుఁడాతని సమీపించి ప్రణమిల్లుటయు నాపురుషుండు తరళం గాంచి "నీవీతని నాసంఘారామమునుండి యెట్లు తప్పించితివి?" అని ప్రశ్నించెను.

తరళ యాపురుషున కేదియో ప్రత్యుత్తరమిచ్చుట కుపక్ర

మించెను. అంతలో వెనుకనుండి యెవ్వరో యాతనితో "ఆర్యా! నా యనగారిప్పుడే మీమాట తలపెట్టినారు" అనిచెప్పెను.

ఆపురుషుఁడు చటాలున వెనుకకుఁ దిరిగిచూచెను. కుమారశశాంకుఁ డట నిలిచి యుండెను. పురుషుఁ డాతనిఁగాంచి మృదుస్వరముతో "వత్సా! సార్వభౌము డిప్పుడు నిన్నేల తలంచెనో నీకేమైనఁ దెలిసినదా?" అనిప్రశ్నించెను.

శశాం—నగరము బాగుచేయించువిషయమున మీతో నాలోచింపవలయునని యేమో!

పురు—నగరము బాగుచేయించుటకంటె మహత్తరకార్యమిప్పుడు నిర్వహింపవలసియున్నది. కుమారా! దండధరునొకని బిలిపింపుము !

కుమారుఁడు కనుసన్న చేసినంతనే తోరణద్వారముకడనుండి దండధరుఁ డొకఁ డటకేతెంచి యాతనిపార్శ్వమున నిలువఁబడియెను. ఆపురుషుఁ డాతనింగాంచి "నీవు మహారాజసన్నిధికిం బోయి నేనొకఘనకార్యమున నిమగ్నుఁడనై యుంటిననియు, ప్రభుసందర్శనముసేయుట కించుకయాలస్యము కావచ్చుననియు మనవి చేయుము" అని చెప్పెను.

దండధరుఁడు ప్రణామము చేసి యటనుండి వెడలిపోయెను.

అనంతర మాపురుషుఁడు యువరాజుంగాంచి "కుమారా! ఇప్పుడు నీయెదుట నున్నయీయువతియుఁ బురుషుండును నీప్రజలే సుమా! ఈయిరువురును దుర్బలులై యుండుటచేఁ గొందఱు ప్రబలులగుదుర్జనులయత్యాచారములకు లోనై మిగులఁగష్టపడి సార్వభౌమునియాశ్రయముం గాంక్షించి యిట్లు వచ్చియున్నారు" అనిచెప్పి తరళవంకఁ జూచి "ఈతఁడు యువరాజశశాంకుఁడు! నీవు

నాయొద్దఁ జెప్పినసంగతు లన్నియు నీతనికి విన్నవింపుము!" అని యెను.

ఆకుమారుఁ డెవ్వఁడో తెలిసినతోడనే తరళావసుమిత్రులా తనికి నమస్కరించి యెల్లసంగతులును స్పష్టముగా మనవిచేసికొనిరి.

అనంతర మాపురుషుఁడు తరళం గాంచి "నీవీవసుమిత్రుని సంఘారామమునుండి యెట్లు విడిపించుకొని వచ్చితివి?" అనియెను.

అప్పుడామె దేశానందుని ప్రథమసందర్శనము మొదలాతని స్త్రీవేషముతుదివఱకును జరిగినసంగతు లన్నియు స్పష్టముగాఁ దెలియఁ జెప్పెను. ఆసంగతులలోఁ గీర్తిధవళునిదారుణవధముంగూర్చి బంధుగుప్తుఁడు చెప్పినమాటలనుగ్గడించునప్పు డాపురుషుని శరీరమంతయు వర్ణనాతీతమగు వారుణ్యముం దాల్చెను.

ఆకథపూర్తియైనపిమ్మట నాపురుషుఁడు "ఆదారుణహత్యంగూర్చినసంగతి నింకొకసారి తెలుపుము." అనిప్రశ్నించెను.

ఆశిథిలదేవాలయమున విగ్రహముచాటున దాఁగియుండి. బంధుగుప్తునివలనఁ దానువినినవృత్తాంతమంతయుఁ దరళ యొక్కయక్కరమైనఁ బొల్లుపోనీయకుండ విన్నదివిన్నట్లుగా నాపురుషున కునివేదించెను. అంతయును విని యాపురుషుఁ డొక్కదీర్ఘనిశ్వాసమును విడిచి "వసుమిత్రా! ఈమెచెప్పినదంతయు నిక్కువమేనా?" అని యడిగెను.

వసు—ఔను ప్రభూ!

అనంతర మాపురుషుఁ డాయుభయులను గాంచి "మీ రికనెంతమాత్రమును భయపడవలదు. బౌద్ధభిక్షులు మీ కేశాగ్రమునకైన నపాయముం గల్పింపఁజాలరు. మీ రిద్దఱును నావెంట రండు. మీకు యోగ్యమైన యాశ్రయస్థానమునకు మిమ్ముఁ దీసికొని పోయెదను" అనియెను.

హృదయమంతయుఁ గృతజ్ఞతాపూర్ణమగుటయుఁ దరళ చటాలున నాపురుషునిపాదములపైఁ బడియెను. మితభాషియగువసుమిత్రుఁడును దనహృదయభావమును వెక్కుచు స్పష్టీకరించెను. పిమ్మట నాపురుషుఁడు కుమారునివంకఁ గనుంగొనియెను. కుమారుని రూపమునఁ గూడఁ దీవ్రవిచారచిహ్నము లాతనికిఁ గానవచ్చెను. ఆత్మసంయమన మశక్యమైపోవుటచే యువరాజప్పుడు క్రోధాతిరేకమునఁ బండ్లు పటపటగొఱుకుచుండెను!

అప్పుడు పురుషుఁడు "కుమారా!" అనిపిలిచెను.

శశాం—ఆర్య!

పుర—ఇది యాత్మసంయమనము చేసికొని యుండవలసిన సమయము! ఇప్పుడేమియు మాటాడవలదు.

శశాంకుఁడు తనహృదయావేగము నడంచుకొనఁ బ్రయత్నించెను గాని యాతని కది శక్యము గాకుండుటచేఁ దుద కేడువఁదొడంగెను. అప్పు డావృద్ధపురుషుఁ డాతనిం గౌఁగిటఁ జేర్చుకొని యూఱడించుచు" కుమారా! నేఁటియీసంగతి నీకు జ్ఞప్తియందుండునా? "అనిప్రశ్నించెను.

శశాం—(దృఢస్వరముతో) ఈనాదేహమునఁ బ్రాణమున్నంతవఱకు నేను మఱవఁజాలను.

అనంతరము ముందుగాఁ బురుషుఁడును, నాతని వెనుకఁ గ్రమముగా శశాంకుఁడును, వసుమిత్రుఁడును, దరళయు నంతఃపురమునకు వెడలిపోయిరి.

ఆస్థూలోన్నతశరీరి యగుపురుషుఁడు మహానాయక యశోధవళదేవుఁడే యని చతురపాఠకులకుఁ జెప్పవలయునా?

ఇరువదియొకటవ ప్రకరణము

వసుమిత్రుని ప్రాణసంరక్షణార్థమై తరళ రాజభవనాంతఃపుర ద్వారమునొద్దఁ గూర్చున్న సమయమునందే పాటలీపుత్రనగర బాహ్యమునందలి బౌద్ధమందిరమునం దొక చిన్న ప్రహసనము ప్రదర్శింపఁబడుచుండెను.

బౌద్ధభిక్షు లుదయముననే లేచి చూచునప్పటికి మందిరద్వారము మూయఁబడియేయున్నది. ఎప్పటివలెనే దానికిఁ దాళము వేయఁబడియుండెను. కాని లోపలనుండి యెవ్వరో యామందిరద్వారమును దెఱచుటకుఁ బ్రయత్నించుచున్నట్లగపడియెను. ఆయద్భుతవిషయముం గాంచుటకు భిక్షులొక్కొక్కరుగా వచ్చి యచ్చట గుంపు గూడుచుండిరి. వారు నూఱుమందికంటె యెక్కువగనేయుండిరి. కొలఁదిసేపటిలోనే సంఘస్థవిర, వజ్రాచార్యు లచ్చటికి వచ్చిరి. వారింగాంచి భిక్షులందఱు నధికసన్మానముతో వారికిఁ దోవ యొసంగిరి.

వజ్ర——ఏమి ! ఇట నిందఱు చేరినారు. విశేష మేమి?

అప్పు డొకతరుణభిక్షుఁడు "దేవా ! ఈద్వారము వెలుపలఁ దాళము వేయఁబడియేయున్నది. కాని లోపలనుండి యెవ్వరో తలుపు దెఱచుటకుఁ బ్రయత్నించుచున్నట్లున్నది !" అని చెప్పెను.

బంధుగుప్త శత్రుసేనులు ద్వారమునొద్దకుఁ బోయి పరిశీలించి "ఔను ! నిజమే——లోపలనుండి యెవ్వరో తలుపులను గదలించుచున్నారు. తాళము పగులఁగొట్టుఁడు; తలుపులు తీయుఁడు !" అనిరి.

శత్రుసేనుఁడు వెంటనే తాళము పగులఁ గొట్టి తలుపులను దెఱచెను. అందఱు నాశ్చర్యముతో లోపలివంకఁ జూచిరి. స్త్రీవేషధారి యగునాచార్యదేశానందుఁ డామందిరమునం దొకమూల నిలువఁబడియుండెను.

అప్పుడు శత్రుసేనుఁడు ముందటికిఁ బోయి "దేశానందా! ఇట్లుంటివేమి?" అని ప్రశ్నించెను. తలుపు తెఱచినంతనే సందుదొరకినచోఁ దప్పించుకొని పాఱిపోవలయునని దేశానందుఁడు ప్రయత్నించెను. కాని యందఱుభిక్షులయెదుటనుండి పాఱిపోవుట కాతనికి సాహసము గలుగదయ్యెను. ఆతఁడట్లే కొయ్యబొమ్మవలె నిలువఁబడి పోయెను.

దేశానందుఁ డేమియు మాటాడకుండుటం గాంచి బంధుగుప్తుఁ డెదుటికిఁ బోయి "ఏమియాచార్యా! పలుకవేమి? ఈయపూర్వవేషము నీ కెక్కడ సంభవించినది?" అని ప్రశ్నించెను.

అప్పటికిని దేశానందాచార్యుఁడు మాటాడలేదు. శత్రుసేనుఁ డాతని మరలఁ బలుకరించెను. ధిక్కరించెను. అప్పుడు దేశానందుఁడు పయ్యెదచెఱఁగుచే మొగము మూసికొని స్త్రీస్వభావకోమలస్వరమున మాటాడఁ బ్రయత్నించి యెట్టకేలకుఁ గంపితస్వరముతో "నేను—తరళను" అనియెను.

ఇంతవఱ కెవ్వరు నూహించియైననుండని యీప్రత్యుత్తరము నాలకించి శత్రుసేనుఁడు కోపోద్దీపితుఁడై యాతని మొగముపై నున్న ముసుఁగునులాగివైచి తీవ్రస్వరముతో "తరళయా? నీవదునాలుగుపురుషాంతరములలో నెక్కడ నున్నదిరా తరళ?" అని గద్దించెను.

దేశానందుఁ డిప్పు డతిదుఃఖితుఁడై పోయెను. ఆతఁడు వెక్కివెక్కి యేడ్చుచు "తరళ—నన్ను—ఇంతగా—పరాభవించినది!" అనియెను.

శత్రుసేనుఁడు మఱింతకోపోద్దీపితుఁడై "ఓరీ! నీ కాతరళ యెక్కడిదిరా? అది యెవరురా?" అనియెను.

దేశా.—(గద్గదస్వరముతో) తరళా! తరళా! నా—త—

శత్రు—ఎవ్వ రాతరళ యని యడుగుచున్నాను.

దేశా—తరళ నాసర్వస్వము—తరళా! తరళా! నాతరళా!

ఇంతలో వెనుకనుండి యొకభిక్షుఁడు వచ్చి "దేవా! నిన్న రాత్రి జినానందుఁడీదేశానందాచార్యునితో బయటికి వచ్చినాఁడు. కాని, మరలనాతఁడు సంఘారామమునకు వచ్చినట్లు లేదు—" అని చెప్పెను.

బంధు—(విస్మయముతో) అట్లయిన జినానందుఁడీమందిరమునందే యున్నాఁడేమో!

జినానందుని శోధించుటకై కొందఱుభిక్షులామందిరమునఁ బ్రవేశించి యెల్లెడలను వెదకి చూచి వెలుపలికి వచ్చి బంధుగుప్తునిం గాంచి "మందిరమున మూలమూలల వెదకి పరిశోధించితిమి. జినానందుఁ డెక్కడను గనఁబడలేదు" అని చెప్పిరి.

క్రోధసంక్షుభితహృదయుఁ డగుబంధుగుప్తునివదన మప్పు డతితరంబుగ నారక్తమైపోయెను. ఆతఁడు దేశానందునిమెడ గట్టిగఁ బట్టుకొని యూఁచుచుఁ గట్టిగా నదలించుచు "చెప్పుము! దురాత్మా! జినానందు నెచ్చట దాఁచితివి? చెప్పుము! త్వరగా చెప్పకున్నచో నిన్నిప్పుడే మెడనులిచి చంపి యిక్కడనే పాతివైచెదను" అని ధిక్కరించెను.

దేశానందుఁడు భయపరికంపితుఁడై ముక్తకంఠమున విలపింప నారంభించెను. అప్పుడువజ్రాచార్యుఁడు బంధుగుప్తుని వెనుకకు లాగి "సంఘస్థవిరా! నీకును వీనికినిగూడ మతిపోయినదా యేమి?" అని మెల్లఁగా "వీనినింతగా భయపెట్టినచో నిజము బయటం బడు ననుకొంటివా? కేవలమును నీకుఁ బిచ్చియెత్తినట్లున్నదే" అనియెను.

బంధుగుప్తుఁ డొకించుక శాంతుఁడై వెనుకకు వచ్చెను. అప్పుడు శత్రుసేనుఁడు తనయొద్దనున్నభిక్షులం గాంచి "మీరీతని సం

ఘారామమునకుఁ గొనిపొండు. మేమిద్దఱము నొక్కింతసేపటిలో వచ్చెదము!" అని చెప్పెను.

స్త్రీవేషధారియగు దేశానందాచార్యుని వెంటఁ బెట్టుకొని భిక్షులందఱు నామందిరమును వెలువడి వచ్చిరి. అప్పుడు వారయ్యాచార్యు నెన్ని విధములఁ బరిహాసించి యుందురో మాప్రియపాఠకులే యూహించుకొనవచ్చును. బంధుగుప్తశత్రుసేను లిద్దఱుమాత్రమే యిప్పుడామందిరమునొద్ద నాఁగిరి.

భిక్షులందఱును వెడలిపోయినపిమ్మట బంధుగుప్తుఁడు "వజ్రాచార్యా! ఈయద్భుతసంఘటనముంగూర్చి నీవేమైన నూహించితివా? జినానందుఁడు నిశ్చయముగనే పాఱిపోయెనా? ఎన్నియోప్రయత్నములు చేసి యెంతయోకష్టపడి చారుమిత్రుని వశపఱచుకొని నేనాతని పుత్త్రునకు భిక్షుదీక్షయొసంగి జినానందనామమును బ్రసాదించి సంఘారామమున కాతనిం దెచ్చియుంటిని. అయ్యో! ఈనాశ్రమయంతయు వ్యర్థమైపోవలసినదేనా?" అనియెను.

శత్రు—ఈచిక్కులన్నియు నేమో తెలియుట లేదు. కాని వసుమిత్రుఁ డొకవేళఁ బాఱిపోయినను స్థిరముగా మనచేతులనుండి తప్పించుకొనిపోఁగలఁడా? వాఁడు బౌద్ధదీక్షితుఁడైనసంగతిని విన్నచో నగరమునం దాతని కాశ్రయమిచ్చుట కెవ్వరును సాహసింపఁజాలరు. అయినను దేశానందుఁ డేమేమి చేసెనో, స్త్రీవేషమువైచి యాతని నెవ్వరీమందిరమున నిర్బంధించిరో మాత్రము తెలియుట లేదు. ఈసంగతులన్నియు నాతఁడే చెప్పవలయును. అంతకంటెఁ దెలిసికొనుట కుపాయాంతర మేదియును లేదు. బంధుగుప్తా! నీవిప్పుడు దేశానందునిపైఁ గోపము చూపింపవలదు. కోపగించితివా—నీకీవిషయమై తెలిసికొనుట కెట్టియవకాశమునుండదు. జినానందుఁడు మఠమునుండి యెట్లు తప్పించుకొనిపోయెనో, దేశానందునకు స్త్రీవేష మెవ్వరు

వైచిరో, తరళ యెవ్వరో, ఆమెకును దేశానందునకు నెట్టిసంబంధమో యీసంగతు లన్నియును యుక్తిచేసి దేశానందునివలననే తెలిసికొనవలయును.

బంధు—వజ్రాచార్యా ! నిన్నరాత్రి మనమిక్కడకు వచ్చినప్పటి కీతలుపులు తెఱవఁబడియేయున్నవి. అప్పుడు దేశానందుఁ డిట నెచ్చటను గానఁబడలేదు.

శత్రు—అవును. నీమాట నిజమే—నీవుకీర్తిధవళునిహత్యావృత్తాంతమును జెప్పినప్పటి కీమందిరమునం దెవ్వరును లేరు.

బంధు—సరేకాని—ఎవ్వరైనఁ బొంచి యుండి మనమాటలను వినలేదుగద!

శత్రు—ఎవ్వరును వినియుండరు.

బంధు—(చింతాక్రాంతుఁడై) నాకేమో మిక్కుటముగ భయమగుచున్నది. నేనిఁక నీప్రాంతమునం దుండఁజాలను. నీవిక్కడనుండి దేశానందునియుదంతమును బరిశీలింపుము. నేనిప్పుడు వంగదేశమునకుఁ బోయెదను. యశోధవళుఁ డప్పుడీనగరమునందే యున్నాఁడు. మనమాటల నెవ్వరైన విని యాతనికిఁ దెలిపినచో నాకిప్పుడే నూరేండ్లును నిండిపోవును.

శత్రు—(ఆలోచించి) నీవనినమాట నిజమే—మన మిప్పుడే యిటనుండి పాఱిపోవుట మంచిదని తోఁచుచున్నది. కీర్తిధవళుని వృత్తాంత మెట్లయిన యశోధవళునకుఁ దెలిసినచో భయంకరప్రతీకారము గావించువఱకు నాతఁ డూరకుండఁడు, కాని, నీవిప్పుడు వంగదేశమున కెట్లు పోయెదవు? నీవు లేకున్నచో నిచ్చటి సంఘకార్యములన్నియును భగ్నములైపోవా? కావున నిప్పుడు మనము దేశానందుని వెంటఁబెట్టుకొని కపోతికసంఘారామమునకుఁ బోయి యుందము. అచ్చట నిశ్చయముగా బుద్ధఘోషుఁడు మనలను రక్షింపఁగలఁడు.

బంధు—అట్లయినచో నడువుము; ఇప్పుడే పోవుదము.

శత్రు—సరే! పద! కాని యిప్పుడీమందిరము సంఘారామములవిషయమున దగినకట్టుదిట్టములను గావించి మఱిపోవలయును.

బంధు—భగవానునివ్యవస్థలు భగవానుఁడే చేసికొనును. మన మావిషయమునఁ జింతింపనక్కఱలేదు. అంతయావశ్యకమును లేదు. మన మిప్పుడే పోవుదము రమ్ము!

శత్రు—సంఘస్థవిరా! నీవు భయభ్రాంతుఁడవైనట్లున్నావే?

బంధు—ఆలాగా? నాశరీరమునుండి నాతలను ఖండించి యొక్కబల్లెమునకు గ్రుచ్చి నగరతోరణద్వారమునకుఁ గట్టినప్పుడు బుద్ధుఁడుగాని, బౌద్ధధర్మము గాని, బౌద్ధసంఘముగాని వచ్చి నన్నురక్షించుట కవకాశమున్నదా?

శత్రు—సరే—నడువుము! సంఘారామముననున్న దేశానందుని దోడ్కొనిపోవుదము.

తక్షణమే యాయిరువురును మందిరమునుండి వెడలి సంఘారామమునకుఁ బోయిరి. అప్పటికప్పుడే భిక్షులు దేశానందునిస్త్రీవేషమును మార్పించి యెప్పటివస్త్రములను గట్టించిరి. శత్రుసేనుఁడప్పుడు దేశానందునింగాంచి మెల్లగా "ఆచార్యా! మీరిప్పు డొకసారి కపోతికసంఘారామమునకు రావలసియున్నది." అనియెను.

దేశా—(ఏడ్చుచు) నేనక్కడ కేలరావలయును?

శత్రు—ఊరక భయపడియెదవేల? మహాస్థవిరుఁడు విందుశాలకు నీకాహ్వానమునంపించినాఁడు.

కాని, యీమాటయందు దేశానందునకు విశ్వాసమెట్లు కలుగును? అతఁడు బాలకునింబోలి యెలుఁగెత్తి యేడువఁదొడంగెను. తన్నుఁ జంపుటకే కపోతికసంఘారామమునకుఁ దీసికొనిపోఁదలఁచిరని దేశానందుఁడు మిగులభయపడెను.

శత్రుసేనుఁ డపు డొకభిక్షునిం బిలిచి "జినేంద్రబుద్ధీ! నీవీసంఘారామమును, మందిరమును సంరక్షించుచుండవలయును. ఈభారమంతయు నీపైఁ బెట్టుకొనుము. మేమిప్పు డత్యావశ్యకం బగుకార్యమునకై కపోతికసంఘారామమునకుఁ బోవుచున్నారము. ఇరువురుభిక్షులను దోడిచ్చి యాచార్యదేశానందు నక్కడకుఁ బంపుము." అనియాజ్ఞాపించెను.

అనంతరము బంధుగుప్తశత్రుసేనులు సంఘారామమును విడిపోయిరి. భిక్షులప్పుడు యథేచ్ఛముగా దేశానందుని బరిహాసము చేయ నారంభించిరి; గాని యాచార్యుఁ డెవ్వరికిని మాఱుమాట చెప్పక యొక్కపెట్టున నేడ్చుచుఁ గూర్చుండెను.

బంధుగుప్తశత్రుసేనులు బయలుదేఱిపోయి రెండుగడియ లైయుండును. ఇంతలోఁ బదిపం డ్రెండువందలమంది యాశ్వికులు వచ్చి యామందిరసంఘారామములనలువంకలను ముట్టడించిరి. వసుమిత్రుని వెంటఁ బెట్టుకొని, మహాబలాధ్యక్షుఁ డగు బంధుగుప్తుఁడును, యశోధవళదేవుఁడును బంధుగుప్తునికొఱకు వెదకసాగిరి. కాని వారి కాతఁ డగపడఁడయ్యెను. భిక్షులను బ్రశ్నించిరిగాని యేమియులాభము లేకపోయెను.

అప్పుడు వసుమిత్రుఁడు దేశానందుని వ్రేలితోఁ జూపుచు "ప్రభూ! నామంత్రి కీయాచార్యుఁడు చాలవఱకు సాయపడినాఁడు. వీరి నడిగినచో బంధుగుప్తునిజాడ తెలియఁగలదు." అనిచెప్పెను.

యశోధవళుఁడు దేశానందు నొకచోటికిఁ దీసికొనిపోయి నిన్నేమియు బాధించువారము గామని యాశపెట్టి మెల్లగా బుజ్జగించి యడిగెను. అప్పుడు దేశానందుఁడు "బంధుగుప్తుఁడుకపోతికసంఘారామమునకుఁ బోయినాఁడు" అనిచటాలునఁ జెప్పివైచెను.

తత్క్షణమే—ఇఁకనొకక్షణమైన నాలస్యము సేయక మహానాయకయశోధవళుఁడు సేనాసహితుఁడై కపోతికసంఘారామమునకు వాయువేగముతోఁ బరుగెత్తిపోయెను. అనంతరము హరిగుప్తునాజ్ఞచే నిరుపురాశ్వికులు దేశానందజినేంద్రబుద్ధులను నిర్బంధించి రాజగృహమునకుఁ గొనిపోయిరి.

ఇరువదిరెండవప్రకరణము

తరళవలనఁ గీర్తిధవళునిహత్యాచరిత్రము వినినదిమొదలు యశోధవళునిహృదయ మవర్ణనీయం బగుమహాసంక్షోభముం గాంచుచుండెను. అతఁ డతికష్టముతో నెట్టెట్టులో తనహృదయోద్వేగము నడఁగించుకొని తరళా వసుమిత్రులను వెంటఁబెట్టుకొని సార్వభౌముని సన్నిధికిఁ బోయెను. సార్వభౌముఁడు మహానాయకునివలనఁ గీర్తిధవళునిమరణవృత్తాంతమును విని బాలకునింబోలి ముక్తకంఠుఁడై యేడువఁదొడంగెను. మహాబలాధ్యక్షుఁడగు హరిగుప్తుఁడుగూడ నప్పుడచ్చటనే యుండెను. అతఁడును,యశోధవళుఁడును గలసి యతికష్టముతోఁ జక్రవర్తి నూఱడించిరి.

అనంతరము హరిగుప్తుఁడు "మహాప్రభూ! కీర్తిధవళునిమరణవృత్తాంత మింతలోనే మనకుఁదెలియఁగలదని బంధుగుప్తుఁ డనుమానించి యుండఁడు. కొంతయాశ్వికదళముతో మన మిప్పుడే పోయి యాపురాతనమందిరమును, సంఘారామమును ముట్టడించినచో నాదుర్మార్గుఁడు తప్పకుండ మనచేతులలోఁ బడఁగలఁడు. ఒకవేళ వాఁడీపాటికే పాఱిపోయి యుండినచో నింతలో నెంతదూరము పోఁగలఁడు? ఒక్కనిమిషములో వెదకి మన మాతని బట్టుకొనఁగలము.

హరిగుప్తునియీయాలోచనము నాలకించి సార్వభౌముం డుత్సాహముతో నట్లు చేయుమని యంగీకరించెను. మఱియు "మీ రీశ్రేష్ఠితనయుం డగువసుమిత్రునిగూడం దీసికొనిపొండు! అట్లయిన చో మీకక్కడిసంగతు లన్నియును సులభముగాం దెలియంగలవు" అని యాజ్ఞాపించెను.

అప్పుడు యశోధవళుండు వసుమిత్రునిం గాంచి "నీవశ్వారోహణముం గావింపంగలవా?" అని యడిగెను.

వసు—చిత్తము ప్రభూ! నాకుం జిన్నతనమునుండియు గుఱ్ఱపుస్వారి చేయునలవాటున్నది.

యశో—మఱి—సంఘారామమునకు వచ్చుటకు నీకేమియును భయము లేదుగద!

వసు—(చేతులు జోడించి) స్వామీ! అసహాయుండనై, యాయుధవిహీనుండనై, నిరుపాయుండనై యున్నయవస్థలోంగూడ నే నేకాకినై బౌద్ధభిక్షు సంఘమధ్యమున ధైర్యమువహించి యుండలేదా? మహాప్రభూ! అట్టి స్థితిలోంగూడ నేనించుకంతయును భయపడలేదు. మహానాయకసహాయుండ నైయున్న నాకిప్పుడేమిభయము?

యశో—మంచిది. నీకాయుధపరిచయ మేమైన నున్నదా?

వసు—ఉన్నది. ప్రభువులు నన్నుం బరీక్షింపవచ్చును.

యశో—(సంతుష్టుండై) సరే! నీవు నాతోరమ్ము! నీకు శస్త్రాస్త్రముల నొసంగెదను.

అప్పుడు యశోధవళుండు వసుమిత్రుని భవనాంతర్భాగమునకుం గొనిపోయెను. పాపము! తరళనేత్రము భయవ్యాకులహృదయముతో నిలిచినచోటనే నిలువంబడిపోయెను. ఆమెకనుదమ్ముల నుండి యశ్రుధారలు జాల్వారుచుండెను. సార్వభౌముం డామెం గాంచి కరుణార్ద్రస్వరముతో "బిడ్డా! నీవేమియును భయపడవలదు

వసుమిత్రునితోఁ బదిపండ్రెండువందలమంది యశ్వసైనికులు పోవుచున్నారు. ఇప్పు డాతని బలవంతముగాఁ దీసికొనిపోయి నిర్బంధించుట కెవ్వరికిని సాధ్యము గాదు. ఆతనికొఱకు నీవెంతమాత్రమును విచారింపవలదు "అని యూఱడించెను.

అటుపిమ్మటఁ జక్రవర్తి వినయసేనుం గాంచి "ఈమె నిప్పుడంతఃపురమునకుఁ దీసికొనిపోయి మహాదేవి కొప్పగించి రమ్ము." అని సెలవిచ్చెను.

సార్వభౌమునిదయాపూర్వక మగునాశ్వాసము లభించుటచేఁ దరళవిచారమంతయును దూరమైపోయెను. వినయసేనుఁ డామెను వెంటఁబెట్టుకొని యంతఃపురమునకుఁ బోయెను.

ద్వితీయతోరణమునకు వెలుపల నంగరక్షకాశ్వికదళ మొకటి వేచియుండి ప్రయాణమునకుఁ బ్రతీక్షించుచుండెను. సర్వసన్నద్ధములై మహోన్నతములైయున్నయుత్తమాశ్వములను మూఁడింటిని బట్టుకొని గుఱ్ఱపువాఁ డొకఁ డచ్చట నిలిచి యుండెను. ఈప్రయత్నమంతయు నేమిటో, యెందులకో యించుకంతయును దెలియకుండుటచేఁ దెలిసికొనవలయు ననుమాత్రముతో ననేకులు తోరణబహిర్భాగమున గుంపుగూడి మెడలు పైకెత్తి చూచుచు నిలిచియుండిరి.

ఇంతలో యువరాజశశాంకునితోడను, వసుమిత్రునితోడను గలసి యశోధవళదేవుఁడు తోరణద్వారమును దాఁటి వచ్చెను. వారిం జూచినంతనే యాశ్వికయోధబృందమును దమనియమానుసారముగా వారికభివాదనములం గావించి మరలఁ దురగముల నధిరోహించి తృతీయద్వారమువఱకును నడపించుకొని పోయిరి. వారివెనువెంటనే పదిపండ్రెండువందలమంది యాశ్వికసైనికులు బయలుదేఱి పోవుచుండిరి. మహాబలాఢ్యుఁ డగుహరిగుప్తుఁడే స్వయముగ నాసే

నను నడపించుచుండుటం గాంచి నగరవాసు లందఱును మహాశ్చర్య సంభ్రమయుక్తులై నిలిచినచోటనే నిలువఁబడిపోయిరి. ఆసేనయంతయు నల్లెల పోవుచున్నదో వారికిఁ దెలియనేలేదు.

ఈయాశ్వికదళమునంతను వెంటఁబెట్టుకొనిపోయి యశోధవళుఁడు బౌద్ధమందిరమునం దేమి గావించెనో వెనుకటిప్రకరణమునఁ దెలిపియే యున్నాము. అప్పుడు సంఘారామమునందలి భిక్షులలో నెవ్వరునుగూడ వసుమిత్రుని గుర్తింపలేదు. రాజగృహమునుండి బయలుదేఱునప్పుడే యశోధవళుఁడు వసుమిత్రున కాపాదమస్తకమును గవచ శిరస్త్రాణములను దొడిగించియుండెను. అందుచేనాతని నెవ్వరు నానవాలుపట్టఁజాలక పోయిరి.

ఆపురాతనమందిరమున బంధుగుప్తునిజాడ యగపడకుండుట చే యువరాజును, యశోధవళుఁడును దక్షణమే తమసేనతోఁ గపోతిక సంఘారామాభిముఖులై మహావేగముతో వెడలిపోయిరి. అంగరక్షకాశ్వికయోధులుఁ మాత్రము హరిగుప్తునాజ్ఞచే నగరాభిముఖులై పోయిరి. ఆయశ్వపదాఘాతములవలన రేఁగినధూళిచే నాయుపనగర రాజమార్గమంతయుఁ గొంతసేపటివఱకును నంధకారబంధురమై యుండెను.

బంధుగుప్తశత్రుసేనలు సంఘారామమును వదలి యింకను జాలదూరము పోలేదు. ఇంతలోనే చటాలున వారామార్గమధ్యమున నిలిచిపోయిరి. అప్పుడు శత్రుసేనుఁడదరిపడి "బంధుగుప్తా! మనవెనుక నుండి యనేకాశ్వపదాఘాతధ్వనులు వినవచ్చుచున్నవి." అనియెను.

బంధుగుప్తుఁడు తత్తరముతోఁ జెవియొగ్గి యాలకించెను. అనేకులగునశ్వసైనికులు తమవెనుకనుండియే వచ్చుచున్నారని వారికి నిశ్చయముగాఁ దెలియవచ్చెను. అందువలన బంధుగుప్తుఁడు భయ

భ్రాంతుఁడై గడగడ వడఁకుచు "వజ్రాచార్యా! నీవనినమాట నిజమే!" అనియెను.

శత్రు—ఔను. ఇట్టిస్థితిలోఁ జటాలున మన మెక్కడకైనఁ బోయి దాఁగియుండుట మంచిపని—మనసంఘారామమునుండి తప్పించుకొనిపోయినవసుమిత్రుఁడు మన కెన్నెన్నియనర్థములను దెచ్చి పెట్టునో యెవరికిఁ దెలియును?

బంధు—(కంపితకంఠముతో) వజ్రాచార్యా! నాకుఁ జావు నిశ్చయమైనది—నాజాడ యశోధవళునకుఁ దెలిసిపోయినది—ఆతఁడు నన్నుఁ బట్టుకొని బంధించి తీసికొనిపోవుటకే యిందఱాశ్వికయోధుల తో నిట్లు వచ్చుచున్నాఁడు! అయ్యో! ఇప్పు డేమిగతి! నా కేమియుఁ దోఁచుటలేదు.

శత్రుసేనుఁ డెన్నియోవిధముల నాతనికి ధైర్యము చెప్పి యూఱడించుచు "మిత్రమా! ఇట్లు భయవిహ్వలుఁడవై కాలుసేతులు వ్రేలవైచికొని యూరక చూచుచుండుటవలన నేమిలాభము? వలదు! భయపడవలదు! ఏదియో యతిభయంకరమగువిపత్తు మనకు సంభవింపనున్నమాట నిజమే! అందుల కించుకంతయు ననుమానము లేదు. కాని, యిప్పుడుమాత్రము నీవిట్లు భయపడి యూరకుంటివా నీకుఁ జావు నిశ్చయమే యని భావింపుము—నీకే గాదు—నీతోఁ గలసి యుండుటచే నాకును జావు రాక మానదు. అదిగో! మనయెదుట నతినిబిడంబగు తాళవన మగపడుచున్నది. అతివేగముగ మన మచ్చటికిఁ బాఱిపోయి యెందైన దాఁగియుందము రమ్ము! నడువుము! అడుగులు త్వరగా సాగనిమ్ము!" అని హెచ్చరించెను.

అచ్చటి కనతిదూరమునందే యున్నయొకపాతచెఱువునొద్ద రాజమార్గమున్నది. ఆమార్గమున కిరువంకలను జిన్నవియుఁ బెద్దవియు నగుతాటిచెట్లు దట్టముగాఁ బెరిగి యుండెను. శత్రుసేనబంధు

గుప్తులు వడిగాఁ బరుగెత్తుకొనిపోయి యాతాళవనమధ్యప్రదేశమునఁ బ్రవేశించి యెవ్వరికి నగపడకుండ నొదిగి యుండిరి.

చూచుచుండఁగనే వెనుకనుండి పరుగెత్తుకొని వచ్చుచున్న యాశ్వికదళ మచ్చోటికి వచ్చి చేరెను. అందఱికంటె ముందుగా మహోన్నతం బగుసింధుదేశపునీలాశ్వరాజము నధిరోహించి యువరాజు వచ్చుచుండెను! ఆతని సర్వాంగకములు నమూల్యమణిఖచితం బగుసువర్ణకవచముచే నాచ్ఛాదింపఁబడి యుండెను, రజతశ్వేతంబగు నాతనిశిరస్త్రాణమునుప్రక్కను బంగారుమెఱుంగులఁ దురంగలించు పింగళవర్ణంబులగు నెఱికురులు గాలికిఁ దూలియాడుచుండెను. ఆసూర్యకిరణప్రసారముచే నాతనిసువర్ణరత్నకవచ మగ్నిజ్వాలవలె దేదీప్యమాన మగుచుండెను. ఆయువరాజునకు వెనుకవైపుననే కవచోష్ణీషధారి యగుయశోధవళదేవుఁ డశ్వారూఢుఁడై యుండెను. ఆతని పొడుగుపాటి తెల్లనిశిరోజములు శిరస్త్రాణమునుండి వెలువడి నడుము వఱకును వ్రేలాడుచుండెను.

ఆయశోధవళునిభీకరమూర్తిఁ గన్నులఁ బడినంతనే భయముచే శత్రుసేనునిగుండె గుభిల్లుమనుటయుఁ బ్రకంపితము లగు నాతని సర్వాంగకములును గంటకితము లైపోయెను. ఆతనిదేహమంతయును స్వేదసిక్తమైపోయెను. అప్పుడు బంధుగుప్తుఁడు మెల్లఁగా "వజ్రాచార్యా! యశోధవళుఁ డాతఁడే కాఁబోలును!" అనియెను.

శత్రు—ఔను—ఆతఁడే—

బంధు—(భయకంపితస్వరముతో) నరే—మృత్యుదర్శన మైనది. ఉత్తరక్షణమేమగునో?

శత్రు—అదృష్ట మెట్లున్నదో యట్లు జరగును. భయపడినమాత్ర మేమిచేయుదుము! మాటాడకుము!

యశోధవళుని వెనుకనుండి కవచధారులగు నిరువురాశ్వికులు వచ్చుచుండిరి. బంధుగుప్తుఁడు గాని, శత్రుసేనుఁడు గాని వారిని గుర్తింపనే లేదు. ఆచెరువుగట్టునొద్దకు వచ్చునప్పటి కందులో నొక్కని శిరస్త్రాణ మూడి తటాలునఁ గ్రిందఁ బడిపోయెను. తొంటిచెట్లచాటున దాఁగియున్న శత్రుసేనబంధుగుప్తు లాతనిం గాంచి వసుమిత్రుఁడే యని యానవాలు పట్టిరి. ఆసమయమున వారికిఁ గలిగిన యాశ్చర్యమునకుఁ బారమే లేదు.

ఆయిద్దఱు రౌతులకును వెనుకనుండి వరుసగైదుగురుచొప్పున నెన్ని యోవరుసలుగఁదీరి తక్కినయాశ్విక యోధులు నడచుచుండిరి. వసుమిత్రుఁ డప్పుడు చటాలున నశ్వావతరణంబు చేసి, క్రిందఁబడిపోయినతనశిరస్త్రాణముం దీసికొని మరలఁ దురగారోహణంబుగావించి యొక్కపరుగునఁబోయి తక్కినవారిం గలిసికొనియెను.

ఆయాశ్వికసైన్యమంతయుఁ గొంతదూరము ముందటికిఁ బోయిన తరువాత బంధుగుప్తుఁ డెగయూపిరి విడుచుచు మెల్లగా "వజ్రాచార్యా! ఇప్పటి కీగండము గడచిపోయినది. కంఠగతములైన ప్రాణములు మరలఁ గుదుటఁ బడినవి. ఇఁక ననంతరకర్తవ్యమేమో చెప్పుము." అనియెను.

శత్రు—నీవిక్షణమునందే వంగదేశమునకుఁ బరుగెత్తుము! అంతకంటె నిఁక నేయుపాయమును లేదు. ఒక్క నిమిషము సైతమైనను నీపాటలీపుత్రమునం దుండఁగూడదు. ఇచ్చటి ప్రతినిమిషమును నీకు గండమే.

బంధు—(నిట్టూర్పు విడుచుచు) సరే! నేనిప్పుడే బయలుదేఱి పోయెదను; నీవేమి చేయఁదలఁచితివి?

శత్రు—నేనీనగరమునందే యుండెదను.

బంధు—ఆలాగా? అట్లయినచో నేనుగూడ నిక్కడనేయుండి చచ్చిపోయెదను.

శత్రు—(ఆశ్చర్యముతో నదరి పడి) అదియేమి? నీమాట కర్థమేమో నాకు సరిగా బోధపడుట లేదు.

బంధు—(గద్గదస్వరముతో) నాప్రాణములు పోయెనను సరే! నేనొక్కఁడనుమాత్ర మెక్కడకును బోఁదలఁచుకొన లేదు.

శత్రుసేనుఁడు బంధుగుప్తునిముఖలక్షణమును దదేకదృష్టిం బరీక్షించెను. బంధుగుప్తుఁడు భయవిహ్వలహృదయముతోఁ దెలతెలపోవుచు వెఱ్ఱివానివలె నుండెను. ఇఁక నెన్నివిధములఁ బ్రయత్నించి యెంతధైర్యము చెప్పినను బంధుగుప్తు నూఱడించుట యసాధ్యమని భావించి శత్రుసేనుఁడు మృదుస్వరముతోఁ "అట్లయినచో శీఘ్రముగ లెమ్ము! నేనుగూడ నీవెంటనే వచ్చెదను!" అనియెను.

అనంతర మాయిరువురు నతిజాగరూకతతో నలుదెసలను బరికించి యాతాళవనమునుండి వెలువడి గంగాతీరమార్గాభిముఖులై శీఘ్రగమనంబున బయలుదేఱి పోయిరి.

ప్రాతఃకాలమునఁ గపోతికసంఘారామాంగణమునందుఁ గూర్చుండి మహాస్థవిరుఁ డగుబుద్ధఘోషుఁడు తనగూఢచారులు గొని తెచ్చినసందేశముల నాకర్ణించుచుండెను. ఆచారులందఱును బౌద్ధభిక్షువులే. ఒకయాచార్యుఁడు మహాస్థవిరునిసమ్ముఖమునందు నిలువఁబడి యాతని కావచ్చినచారులను బరిచితులం గావించుచుండెను. బుద్ధఘోషుఁడు సావధానముగానుండి చారులసందేశములను వినుచుండెను.

నిన్నటిదినమున రాజభవనమునందు జరగినవిశేషములను దెలిసికొని వచ్చినచారుఁడొకఁ డప్పుడు వినయముతో "స్వామీ! నిన్న మధ్యాహ్నసమయమునందు సార్వభౌముఁడు గంగాతీరమునందలి ఘట్టముపైఁ గూర్చుండి యుండఁగా యశోధవళదేవుఁ డచ్చటికివచ్చి తానింతటినుండి సామ్రాజ్యకార్యనిర్వహణభారమును వహింపఁదలఁ

చియున్నట్లు మనవి చేసికొన్నాఁడు. నేనప్పుడు దాపుననున్న యొకచెట్టుచాటున దాఁగియుండి వారిసంభాషణమంతయును వినియుంటిని—"

అని యిఁక నేమేమియో విశేషించి చెప్పఁ దొడంగెను. కాని యింతలో సంఘారామముఖద్వారముకడనుండి యొకభిక్షుఁ డతిత్వరితముగ నచ్చటికి వచ్చి వగర్చుకొనుచు "దేవా! లెక్కలేనంత మంది యాశ్వికసైనికులు తమతురంగములను వాయువేగమునఁ బరుగెత్తించుకొనుచు మనసంఘారామమువైపుననే వచ్చుచున్నారు!" అని చెప్పెను.

బుద్ధఘోషుఁడామాట విన్నంతనే యదరిపడి "ఈక్షణముననందే మనసంఘారామద్వారములనుబంధింపుఁడు!" అని యాజ్ఞాపించెను.

భిక్షులతిత్వరితముగాఁ దోరణద్వారము కడకుఁ బరుగెత్తిరి. మహాస్థవిరుఁడును జటాలున లేచి ద్వారమువైపునకుఁ బోవఁదొడంగెను.

పాటలీపుత్రనగరమునందలి యీకపోతికసంఘారామభవనమతిప్రాచీనమైనది. దీనిని బూర్వకాలమునం దశోకచక్రవర్తి నిర్మించియుండెనని జనప్రవాదము విశేషించియున్నది. ఈభవనమంతయు నడుగునుండి పైవఱకును గఠినశిలావినిర్మితమే. దీనికి నలువంకలను గఠినశిలామయంబగునున్నతప్రాకారము గలదు. అలంఘ్యమును, నతివిశాలమును నగునీసంఘారామమునందు బౌద్ధభిక్షులకొఱకై మువేలకంటె నింక నెక్కుడుగనే సుఖాసనము లమర్పఁబడియున్నవి. మనకథాకాలమునాఁటికా సంఘారామమునఁ బదిపండ్రెండువందలమందిభిక్షువు లున్నారు. ఆరామమునకు నాలుగువైపులను నాలుగు సింహద్వారము లున్నవి. అవి రేయుంబవ లెల్లప్పుడును దెఱవఁబడియే యుండును. రాజక్రాంతికాలములయందును, విప్లవసమయములయం

దును ననేకపర్యాయములు పాటలీపుత్రప్రజ లీయారామమును విధ్వస్తముం గావించియుండుటచే మరల నెన్నటికి నట్టిమహానర్థము కలుగకుండుటకై దానికిఁ జతుర్దిశలయందును దిట్టముగా నయోమయంబు లగుద్వారములు నిర్మింపఁబడియుండెను. ఎంతయో భయంకరమగువిపత్తు సంభవించునని తోఁచిననే గాని యాతలుపులను మూయించుట కుత్తరువు లేదు. ఏమనిన — దేవతాసందర్శనమునకై యెల్లప్పుడును నాగరికు లయ్యారామమునకు వచ్చుచుందురు. కావున వారి కనుకూలముగా నుండుటకై తలుపు లెప్పుడును దెఱవఁబడియే యుండును.

మహాస్థవిరుఁ డగు బుద్ధఘోషుఁ డప్పుడు తోరణద్వారము కడకు వచ్చి చూచెను. ఆయుధపాణు లగునాశ్వికు లనేకు లాసంఘారామము నాలుగువైపులను ముట్టడించి యుండిరి. కవచధారులగు ముగ్గురుపురుషు లాతోరణద్వారమున కెదురుగ నిలిచి యాసైనికుల కాజ్ఞల నొసంగుచుండిరి. వారిగుఱ్ఱములను మూఁడింటిని బట్టుకొని యొకరౌతు వారిసమీపమునందే నిలిచియుండెను.

ఇదియంతయుం గాంచి బుద్ధఘోషుఁ డాశ్చర్యభయవిభ్రాంతుఁడై పోయెను. అతఁ డప్పుడు మెల్లగాఁ దోరణద్వారముపై కెక్కి కవచధారులగు పురుషుల నుద్దేశించి "అయ్యా! మీరెవ్వరు? ఈదేవతామందిరము నిట్లవమానించుటకుఁ గారణ మేమి? సాయుధు లగునింతమంది సైనికులతో వచ్చి నిరాయుధులును, నిరపరాధులు నగుబౌద్ధభిక్షులమఠమును మీరిప్పు డెవ్వరియాజ్ఞచే నిట్లు ముట్టడించితిరి?" అని ప్రశ్నించెను.

అప్పు డాపురుషులలో నొకఁడు తలఁ బైకెత్తి చూచి "మీరెవ్వరు?" అని యడిగెను.

బుద్ధ—నేను భగవానుఁడగు బుద్ధదేవుని యాదేశముచే నీసంఘారామమునందుండి యిందలి సమస్తవ్యవహారములను బరీక్షించుచుందును. నన్ను బుద్ధఘోషుఁడందురు.

పుర—ఆలాగా? మీరు నన్ను గుర్తించియే యుందురనుకొనియెదను. తెలియకున్నచో నాపేరు యశోధవళుఁడని యెఱుంగుఁడు. నేను రోహితాశ్వదుర్గమున కధినాథుఁడను. సామ్రాజ్యమున మహానాయకుఁడను. ఇప్పుడు నేను నాపుత్రుని వధియించిన హంతకుని వెదకి పట్టుకొనుటకై యిచ్చటికి వచ్చి యుంటిని. శీఘ్రముగా నీబంధిత ద్వారములను దీయింపుఁడు! మేమీ సంఘారామమునఁ బ్రవేశించి నరరూప రాక్షసుఁడును, హంతకుఁడు నగు బంధుగుప్తుని వెదకిపట్టుకొని బంధించి తీసికొనిపోయెదము.

తోరణద్వారముపై నున్న మహాస్థవిరుఁ డప్పుడు యశోధవళుని పేరు విన్నంతమాత్రముననే భయప్రకంపితుఁడైపోయెను. ఆతని దేహమంతయును గగుర్పొడిచెను. కాని యాతఁ డెట్లో యాత్మసంయమనముం గావించుకొని వినయపూర్వకంబగు మృదుస్వరముతో "మహానాయకా! అమృతసాగరధవళం బగు మీయశశ్చరిత్రమీ పాటలీపుత్రనగరమున నివసించియుండు ప్రతివ్యక్తికిని గంఠపాఠమైనదియే—ఎట్టిదుర్బోధనల నాలకించుటచేతనో, యెట్టియనుమానము హృదయమును బాధించుటచేతనో మీపుత్రఘాతుకుఁ డిందుండు నని నిశ్చయించి యాతని నిర్బంధించి కొనిపోవుటకై మీరిచ్చటికింత సంరంభముతో వచ్చియుంటిరి. కాని యీసంఘారామమున నిరపరాధులును నిష్కల్మషులును, నిరీహులును, నిరుపేదలు నగుభిక్షులుమాత్రమే నివసించియుందురు. నరఘాతుకపిశాచములకు నరకమునందేగాని యీపవిత్ర దివ్యస్థలంబున నాశ్రయమెట్లు లభించును? మీపుత్రహంతకునిగా మీరెవ్వని నిశ్చయించి యుంటిరో యాతఁ డుత్తరదేశమునందలి యొకబౌ

ద్ధసంఘమునకు స్థవిరుఁడై యున్నాఁడు. ఈయార్యావర్తదేశమునం దెవ్వరునుగూడ నాబంధుగుప్తుని పేరైనను వినియుండరు, అయినను బుద్ధదేవుని ప్రశాంతనిర్మలధర్మము నవలంబించి భిక్షుదీక్షాపేక్షులై వచ్చు నుత్తమశిష్యులకుఁ బ్రత్యక్షబుద్ధభగవానుఁడై సంఘస్థవిరుఁడై యున్న యాతనిచే దారుణనరహత్యవంటిమహాపాతకము గావింపఁబడు ననుట యేమైనను విశ్వాసార్హముగా నున్నదా?

యశో—(గంభీరస్వరముతో) మహాస్థవిరా! మీరీవృద్ధునిపలితకేశములపై నించుకవిశ్వాసముం జూపవలయును. ఆదురాత్ముఁడు ఘోరహంతకుఁ డని నిరూపించుటకుఁ దగినన్ని మహత్తరకారణములును, సంపూర్ణనిదర్శనములును లేకయే యున్నచోఁ బరమపవిత్రంబగునీదేవతామందిరమున సంక్షోభముం గల్పించుట కీయశోధవళుఁడెంతమాత్రమును సాహసించువాఁడు గాఁడు—వినుఁడు! ఆపాపాత్ముఁడగు బంధుగుప్తుఁ డీసంఘారామమునం దెందైన దాఁగియున్నచో నిప్పుడే యాతనిం బట్టి మాకొప్పగింపుఁడు! మేము వానిని బంధించి సార్వభౌముని సన్నిధానమునకుఁ దీసికొనిపోవుదుము. అట్లయినచోఁ దురగఖురఘట్టనంబులచే మీపవిత్రక్షేత్రము ధూళిదూషితముగాకయే యుండఁగలదు! శస్త్రాస్త్రనిర్ఘోషంబులచే మీశాంతారామము సంక్షోభముం గాంచకయే యుండఁగలదు—దారుణవీరాట్టహాసంబులచే మీధర్మభిక్షులకు ధ్యానభంగము గలుగకయే యుండఁగలదు! ఏమనియెదరు? త్వరగా నేదియో యొకమాట చెప్పుఁడు!

బుద్ధ—(వినయముతో) మహానాయకా! ఏమని చెప్పుదును? నేఁడుగాని, నిన్నగాని, సంఘస్థవిరుఁ డగునాబంధుగుప్తుఁ డీసంఘారామమునం దనుగువెట్టియైన నుండలేదు. నేను సత్యమే చెప్పుచున్నాఁడను. నామాట నమ్ముఁడు! ఇచ్చటనే బంధుగుప్తుని వెదకి పట్టుకొనవ

లయు నను నుద్దేశముతో వచ్చినయెడల మీరు నిశ్చయముగాఁ దప్పో దోవను బట్టితి రని చెప్పుచున్నాను. మీరిప్పుడు మీ సేనలతో మ ఱియొకచోటికి—ఆతఁడున్నచోటికిఁ బోయి యన్వేషించినచో బా గుగ నుండును. ఇచ్చటమాత్రము బంధుగుప్తుఁడు లేఁడు!

యశో—ఆలాగా? అట్లయినచో—అభయమే లేకయున్నచో మీరీద్వారముల నేలమూయించివైచితిరి?

బుద్ధ—ఆయుధహస్తులగునింతమంది యాశ్వికయోధులం గాంచి మేము భయపడిపోయితిమి.

యశో—సరే-ఈసమాధానములతో మాకేమియును బని లేదు. సార్వభౌముని యాజ్ఞానుసారముగా హంతకుఁ డగుబంధుగు ప్తు నన్వేషించి తీసికొనిపోవుటకై మేమీసంఘారామమునకు వచ్చియు న్నారము. మమ్ము లోపలికి రానిచ్చుటకిప్పుడు మీయాటంక మేమైన నున్నదా? చెప్పుఁడు!

బుద్ధ—లేదు— మాయాటంక మెంతమాత్రమును లేదు. మీరువచ్చి చూచుకొనవచ్చును.

యశో—మంచిది. అట్లయినచో వేగముగాఁ దలుపులను దీ యుట కాజ్ఞాపింపుఁడు.

తత్క్షణమునందే బుద్ధఘోషునియాజ్ఞానుసారముగా సంఘారామద్వా రములు తెఱవఁబడియెను. తోడనే యశోధవళుఁడును, యువరాజశ శాంకుఁడును, హరిగుప్తప్రముఖులును,నైదువందలమందియాశ్వికయో ధులతోఁగలసి యాసంఘారామమునఁ బ్రవేశించిరి.తక్కిన సైనికులందఱు నెప్పటివలెనే నలుదెసలను ముట్టడించి యుండిరి. యశోధవళాదు ల తిజాగరూకులై సంఘారామమం దంతటను మూలలఁగూడఁ బరిశోధిం చిచూచిరి. కాని బంధుగుప్తునిజాడమాత్రము వారి కెక్కడను గనఁ బడలేదు.

ఇంతటిప్రబలప్రయత్నమును నిష్ఫలమైపోయెను. యశోధవళుఁడు తుదకు హతాశుఁడై సేనలను వెంటఁబెట్టుకొని మరల రాజగృహాభిముఖుఁడై వెడలిపోయెను.

ఈసమయమునందే గంగాప్రవాహమధ్యమునుండి యొకచిన్న నౌక యతిత్వరితగమనంబునఁ బూర్వదిశాభిముఖంబుగాఁ దేలిపోవుచుండెను. అందు శత్రుసేనబంధుగుప్తు లిరువురుమాత్రమే కూర్చుండియుండిరి.

బంధుగుప్తుఁడు నిట్టూర్పు విడిచి "మిత్రమా! శత్రుసేనా! మనల నీదినమున నతిభీకరుండగుయశోధవళునిబారినుండి తప్పించినది మనయనేకజన్మార్జితం బగుపుణ్యబలమేసుమీ!" అనియెను.

ఇది

ప్రభాతనామకంబైన

ప్రథమఖండము.

ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయము.

(1911 వ సంవత్సరములో స్థాపింపఁబడినది.)

పిఠాపురము (తూర్పు) గోదావరిజిల్లా.

నవలలు—నవరసభరితములగు నవలలు—పుణ్యచరిత్రములు-పురాణములు—ముచ్చటైన బొమ్మలతో—ముద్దులొలుకు క్యాలికో బైండుతో 250 పుటలకుఁ దక్కువ గాకుండ—రెండుమాసముల కొక్కటిగా వెలువడును.

—* నిబంధనలు *—

1. ఇందుఁ జందాదారుగఁ జేరువారు ప్రవేశరుసుము క్రింద ముందుగా రు 0—8—0 లు చెల్లింపవలయును.

2. ఇందు రెండేసిమాసముల కొక్కటిగ వెలువడుచుండు క్యాలికోబైండుగల ప్రతిగ్రంథమును రు 1—0—0 వెలకుఁ జందాదారులకుఁ బంపుచుందుము.

3. గ్రంథములఁ బంపుటకగు పోస్టేజి మొదలగు ఖర్చులన్నియును జందాదారులే భరింపవలయును.

4. చందాదారు లగువారు వెనుకటి గ్రంథము లన్నియును గొనవలయునను నియమము లేదు. కాని వారు కోరినచో వెనుకటి పుస్తకములుకూడఁ జందాదారుల వెలకే పంపుచుందుము. క్రొత్తగ వెలువడుచుండు గ్రంథములు మాత్రము చందాదారులు తప్పక పుచ్చుకొనుచుండవలెను.

5. ఇందుఁ బ్రకటింపఁబడు ననుబంధములు చందాదారులు తప్పక పుచ్చుకొనవలయునను నియమములేదు. కోరినవారికే పంపుచుందుము.

6. సంవత్సరము చందా అనఁగా ముందు బ్రకటింపఁబడు ఆఱుపుస్తకములకు రు 7—2—0 లు ముందుగఁ బంపువారికి ఆఱు పుస్తకములవఱకు ప్రతిపుస్తకమును అన్‌రిజిస్టర్డుపార్శిలుగా బంపుచుందుము. అట్లు పంపినవారికి ప్రతిపుస్తకమునకు చెల్లింపవలసినమనిఆర్డరు కమీషను 0—12—0 లును, రిజిష్టరుఖర్చు 0—12—0 లును 1—8—0 లు కూడివచ్చును.

ఇందుఁ బ్రకటింపఁబడి వెలకు సిద్ధముగ నున్న

గ్రంథములు.

		చందాదారుల వెల.	ఇతరుల వెల.
1.	దుర్గేశనందని.	రు 1-0-0	1-5-0
2.	వసుమతీవసంతము.	1-0-0	1-8-0
3.	సీతారామ.	1-0-0	1-8-0
4.	నూర్జహాను.	1-0-0	1-8-0
5.	మనోరమ.	1-0-0	1-8-0
6.	మాతృమందిరము.	1-0-0	1-8-0
7.	నీలాంబరి.	1-0-0	1-8-0
8.	వీరపూజ.	1-0-0	1-8-0
9.	మాయావి.	1-0-0	1-8-0
10.	అపరాజిత.	1-0-0	1-8-0
11.	పూర్ణానందము.	1-0-0	1-8-0
12.	శివపురాణము ౧.	1-0-0	1-8-0
13.	శివపురాణము ౨.	1-0-0	1-8-0
14.	జీవన్మృతరహస్యము.	1-0-0	1-8-0
15.	రహస్యవిప్లవము.	1-0-0	1-8-0
16.	గోరా ౧.	1-0-0	1-8-0
17.	గోరా ౨.	1-0-0	1-8-0
18.	జయాపజయములు.	1-0-0	1-8-0
19.	శ్రీకృష్ణచరిత్రము ౧.	1-0-0	1-8-0
20.	శ్రీకృష్ణచరిత్రము ౨.	1-0-0	1-8-0
21.	విషవృక్షము.	1-0-0	1-8-0
22.	విశ్వప్రియత్నము.	1-0-0	1-8-0
23.	భారతీభాస్కరము.	1-0-0	1-8-0
24.	నరేంద్రగుప్తుఁడు. ౧.	1-0-0	1-8-0
25.	నరేంద్రగుప్తుఁడు. ౨.	1-0-0	1-8-0

26. కావ్యకుసుమావళి ౧. (పద్యములు.)	1-0-0	1-12-0
27. కావ్యకుసుమావళి ౨. (పద్యములు.)	1-0-0	1-12-0

—* అ ను బం ధ ము లు.*—

28. రాధారాణి.	0- 4-0	0- 6-0
29. సాధన.	0-10-0	0-12-0
30. పరిమళ.	0-12-0	1- 0-0
31. నీరద.	0-10-0	0-12-0
32. ఆరణ్యిక.	0-10-0	0-12-0
33. మాయావిని.	0- 8-0	0-12-0
34. రజని.	0-12-0	1- 0-0
35. భారతవీరుఁడు.	0-10-0	0-12-0
36. నీతిముక్తావళి. ౧.	0- 4-0	0- 6-0
37. నీతికథాముక్తావళి. ౧.	0- 6-0	0- 8-0
38. ప్రణయప్రతిమ.	0-10-0	0-12-0
39. శకుంతల.	0-10-0	0-12-0
40. అఘోరుఁడు.	0-12-0	1- 0-0
41. వీరమహిమ.	0- 8-0	0-10-0
42. ఏకాంతసేవ.	0- 6-0	0- 8-0
43. సీతావనవాసము.	0-10-0	0-12-0
44. హారావళి. ౨.	0- 3-0	0- 4-0
45. సమస్య.	0- 2-0	0- 3-0
46. సన్న్యాసిని.	0- 2-0	0- 3-0
47. బాలుని వీరత్వము.	0- 1-0	0- 1-0
48. జాతీయగీతము.	0- 1-0	0- 1-0
49. సంజీవనము.	0- 2-0	0- 2-6
50. సురస. (నవల)	0-12-0	1- 0-0

51.	బాలవిజ్ఞానమంజరి ౧.	0- 2-0	0- 3-0
52.	డిటో. ౨.	0- 3-0	0- 4-0
53.	ప్రభావతి.	0- 1-0	0- 1-0
54.	ఇదియొకచిత్రము.	0- 1-0	0- 1-0
55.	అనాధప్రేతము.	0- 1-0	0- 1-0
56.	బ్యారిష్టరు.	0- 1-0	0- 1-0
57.	కాకము	0- 1-0	0- 1-0
58.	ప్రేమాంజలి.	0- 1-0	0- 1-0
59.	తులసీమాహాత్మ్యము.	0- 4-0	0 6-0
60.	శ్రీరామ రాజనీతి.	0- 3-0	0- 4-0
61.	చంద్రసేనవిజయము.	0- 1-6	0- 2-0
62.	పీఠికాపురసంస్థానము.	0- 1-0	0- 1-0
63.	వీరపత్ని.	0- 1-0	0- 1-0
64.	విజయదశమి.	0- 1-0	0- 1-0
65.	సుశీల.	0- 1-0	0- 1-0
66.	ట్రోజను యుద్ధము.	0- 4-0	0- 6-0
67.	అహాల్యాబాయి.	0- 8-0	0-10-0
68.	భ్రాంతివిలాసము.	0-10-0	0-12-0
69.	సీతాదేవి.	0- 8-0	0-10-0

మేనేజరు,

ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయము,

పీఠాపురము, (తూర్పు) గోదావరిజిల్లా.

BOOK DEPOT,
HYDERABAD-DN.

హిందూముసల్మానులఐకమత్యము! మహమ్మదీయులమతగ్రంథము! జాతీయఔన్నత్యము!

నవలకాదు, నాటకము కాదు। **కురానుషరీఫు** శాశ్వతవాఙ్మయము!

కర్త: చిలుకూరి నారాయణరావు, ఎమ్. ఏ. ఎల్. టి.

(రాజమహేంద్రవరకళాశాలయందు సంస్కృతాంధ్రభాషాధ్యాపకులు.)

800 పుటల గ్రంథము; వెల సాధారణప్రతి రూ 3 లు;

ఉత్తమప్రతి రూ 4 లు.

దయచేసి ఒకపుస్తకమునుకొనండి! ఆంధ్రవాఙ్మయమునుపోషించండి!

వలయువారు:—మేనేజరు,

ప్రపంచమతగ్రంథమాలాకార్యస్థానము,

ఇన్నీసుపేట, రాజమహేంద్రవరము.

మార్కండేయ నాటకము.

భక్తిరసపూరితములగు పద్యములు—ఇంపైనపాటలు— ఇందు నారదుని కథాభాగమతిమనోహరముగనుండును. ఇందలి సత్యాసత్యములు చదువరులకే బోధపడగలదు.

దీని వెల మూచందాదారులకు పోస్టేజిగాక రు 0—8—0లు.

ఇతరులకు పోస్టేజిగాక రు 0—12—0లు.

మేనేజరు

ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయము.

పీఠాపురము.

ఆంధ్ర నైషధ సారము.

శ్రీనాథకవివరేణ్యునిచే రచింపఁబడి జగద్విఖ్యాతిగాంచిన శృంగార నైషధమను పద్యకావ్యము ననుసరించి మనోహరమగు శైలియందు వచనమున వ్రాయఁబడి ముద్రింపఁబడినది. ఈగ్రంథమునందు హంసరాయబారము, నలదూత్యము, దమయంతీ సఖీలత, కలిరాజాగమనము, రాజచేటికల చాతుర్యసంభాషణములు, దంపతులవిహారములు వర్ణనములు, వేయేల! అన్నియు సమంజసముగ వర్ణింపఁబడియున్నవి. ప్రతివారును ముఖ్యముగాఁ జూచి యానందింపఁదగిన గ్రంథరాజము. వెల రు 0 12 0

సుగుణమణి.

అద్భుతమగు నవల. కథావిధాన మద్భుతము. పండితులు పత్రికాధిపతులీగ్రంథమును జాలగ బొగడియున్నారు. చాలవ్యాపకమునంది యున్నది వెల రు 0 8 0

పౌండరీక మాహాత్మ్యము.

తెనాలిరామలింగకవిచే రచింపబడిన పాండురంగమాహాత్మ్యమునందలి ముఖ్య కథాభాగంబు ననుసరించి హృదయానందముగూర్చు శైలిని వచనమున వ్రాయబడి ముద్రితమై యున్నది.

వెల రు 0 6 0

చిత్తరంజనదాసుజీవితము 0 8-0; చెఱసాలఅనుభవము మహాత్మాగాంధికృత మునకనువాదము 0-12-0; స్వప్నవాసవదత్త చిలకమర్తిలక్ష్మీనరసింహముగారిచే రచియింపఁబడినది 0-8-0.

ఈగ్రంథములసెట్టు రు 3-0-0.

నైజామునివాసులు గ్రంథమూల్యమును పోష్టుచార్జీలు ముందుగా మనియార్డరుద్వారా పంపవలయును. పైగ్రంథమూల్యములందు తపాలువ్యయములు చేరలేదు.

అత్తలూరి సూర్యనారాయణ.

తెనాలి, గుంటూరుజిల్లా.